# అన్నమాచార్య సంకీర్తనలు

## ఆలయ స్ఫూర్తి



డా॥ యన్.సి.లత

49/269

# అన్నమాచార్య సంకీర్తనలు : ఆలయస్ఫూర్తి

**డా. ఎన్. సి. లత**

పర్యవేక్షకులు :

**డా. శ్రీమతి టి. సుశీల**

పి.హెచ్.డి. డిగ్రీ కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం

ఆధునిక భారతీయ భాషల విభాగం

ఢిల్లీ విశ్వవిద్యాలయము

ఢిల్లీ.

**2000**

© Author
Copies : 1000

For Copies
Contact Address :
97-b, Pocket, B-3, Lawrence Road
Delhi-35

This book is published with the
Financial grant given by
the Tirmuluma Tirupathi Devestanam
Under the scheme
"Aid to Authors Scheme of T.T.D."

Price : Rs. 125/-

Design & Printed at :
**Yadu graphics**
Chikkadpally,
Hyderabad.

## ACKNOWLEDGEMENT

First of all, it is my bounder duty ot express my sincere gratitude to the Head of the Department of Modern Indian Languages of Delhi University, Prof. Jayanti chatopadhaya and her predecessors, Prof. N.D. Mirajkar and Prof. Indira Goswami, for permission given to me for undertaking research on the subject, "Annamacharya Sankirtans: temple and poetry". Next I have ot express my heart-felt and immense gratitude to my guide, Dr. (Smt.) T. Susheela, Professor of Telugu for her unsparing efforts in guiding my research work in all its stages. Her insight into the subject has helped me in a large measure to achieve this goal. I am no less grateful to the staff members of M.I.L.L.S. Department, for their valuable suggestions and co-operation. I am also indebted to my father in law, Shri N.C. Jagadachary and mother in law Dr. (Smt.) N.C. Indira Devi for inducting me into this Project and supplying the background on the subject matter. Discussions with them on the various aspects of the project have been a constant source of inspiration to me. I am equally inducted to Shri S.L. Seem Sharma, husband of Prof. (Mrs.) T. Susheela, who gave constant encouragement to me in my research persuits. My sincere thanks are also due to Shri, Murthy of Delhi University Library and Shri C.S.S.P. Shastry of the Sahitya Academy Library, Delhi for all possible assistance provided. I also thank my teachers in school and college at Chennai, Smt. Malladi mangatayaru and Smt. Jayalakshmi respectively for helping me in procuring some of the rare texts required in connection with my research work. I have also to express heart-felt thanks to my father Dr. P.B. Sreenivos and my mother P.B. Janaki and also to my aunt Smt. S.C. Saileela and my brothers and sisters and my uncle Shri. S.. Raghunath for full support in my research endeavours in all possible ways.

I will be failing in my duty if I do not offer my deep gratitude to Dr. Medasani Mohan, Director, T.T.D's Annamacharya project for the financial support provided to me in paying visits to Tirupati for on the spot studies and procuring source materials for my project. I will be failing in my duty if I donot mention about the financial assistance given by T.T.D. for the publication of my thesis. My respectful thanks are also due to Smt. S. Anuradha my research work colleague in guidance in all publication formalities. My thanks are also due to Smt. S. Anuradha's brother Shri. Yadu Mohan in getting printed the work in an attractive manner.

Lastly, I have to mention that the completion of my project would not have been possible but for the co-operation and help of my husband Dr. N.C.Krishnamani in various ways in my research pursuits.

**N.C. Latha**

# ఆశీస్సు

సంకీర్తనా సార్వభౌముడైన అన్నమాచార్యులకి అక్షరార్చన చేయగల్గడం చి॥ సౌ॥ లత పురాకృత శుభాధిక్యమే. అన్నమాచార్యులు రచించిన సంకీర్తనలు వేలకు వేలు. అవి అనేక విషయాలకి సంబంధించినవి. అయినా వాటన్నిటికి కేంద్ర బిందువు వేంకటాద్రి, శ్రీ వేంకటేశ్వరుడు, వేంకటేశ్వరాలయం. అలాగే ఆలయమే వేంకటాద్రి, శ్రీ వేంకటేశ్వరుడు. ఇవి పరస్పరం భిన్నములు కావు. ఈ భావాన్ని అన్నమాచార్యులు

'కొండలనెక్కు డైన గురుతు శ్రీ వేంకటాద్రి
కొండరూపు దానే పో కోరిన మా దైవము" అని వ్యక్త పరచారు. తన జీవితాన్నే శ్రీ వేంకటేశ్వర ఆరాధన కంకితమిచ్చిన భక్త శిఖామణి అన్నమయ్యకు సంకీర్తనల రచనకు ఆలయం ఎటువంటి స్ఫూర్తిని, ప్రేరణను ఇచ్చిందో సవివరంగా పరిశోధన చేసి, చి॥ సౌ॥ లత సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించింది. శ్రీమతి లత తనకున్న తమిళ భాష జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని అన్నమాచార్యుల సంకీర్తనలని తమిళ, భక్తి సాహిత్యం ఆళ్వారుల రచనలతో పోల్చి తులనాత్మక అధ్యయనం చేసి వివేచించడం ఈ సిద్ధాంత గ్రంథ విశిష్టత, ప్రత్యేకత. ఆళ్వారులలో మొదటి ముప్వురు కేవలం వేంకటాద్రిని పేర్కొన్నారు గాని అక్కడి ఆలయాన్ని గూర్చి ప్రస్తావించలేదని మొట్టమొదటిసారిగా తిరుమళిశై ఆళ్వారు గుడిని, గుడి దేవరను గురించి విషయాన్ని వివరించి, భక్తులక్కడికి సంగముముగ చేరుటకు మార్గమున్నదని కూడా తన పాశురములలో వివరించారు. ఇందు వల్ల మొదటి ముగ్గురు ఆళ్వారుల కాలము వరకు వేంకటాద్రియే పరదైవముగా కొలువ బడిందనే నిష్కర్షకు వచ్చారు శ్రీమతి లత. చిట్టచివరగా పురందరదాసు, క్షేత్రయ్య, భక్త రామదాసు, త్యాగరాజు, స్వాతి తిరునాళ్ చక్రవర్తి, ముత్తుస్వామి దీక్షితులు మొదలైన వారి రచనలకు కూడా ఆలయములెట్లు స్ఫూర్తి నిచ్చాయో రేఖామాత్రంగా స్పృశించారు. విజయవంతంగా సాగించిన ఈమె కృషిని అభినందిస్తున్నాను. ఈ గ్రంథం శ్రీమతి లత పరిశోధనా ప్రవీణతకి నిదర్శనంగా వుంది. ఈమె ఇంకా కృషి చేసి అన్నమాచార్యుల సంకీర్తనలను విభిన్న దృక్కోణాల నుండి పరిశీలించి మరిన్ని గ్రంథాలు రాయాలని వృద్ధిలోకి రావాలని కోరుతున్నాను, ఆశిస్తున్నాను. శ్రీమతి లతకి అనేక మంగళా శాసనములు.

కొత్త ఢిల్లీ

2-11-05

ఆచార్య సుశీల

# ముందుమాట

శ్రీ అన్నమాచార్యులు మహాపురుషులు, యోగీశ్వరులు, తత్వజ్ఞులు, వేద వేదాంతవేత్తలు. లోకాతీత లోకానుభవ బహుముఖ ప్రజ్ఞాశాలిగ అందరికి సుపరిచితులే. అన్నమాచార్యులు భూతంనరశ్చ మహదాహ్వాయ భట్టనాథ శ్రీ భక్తి సారకుల శేఖరాది భక్తాగ్రగణ్యులతోను, "ప్రహ్లాద నారద పరాశరాది భాగవతోత్తములతోను నిత్యము స్మరించదగిన పరమ భాగవత శిఖామణి. ఇక అన్నమాచార్య రచనలు వేదోపనిషత్సారముల సారభరితమైనవి. అంతయే కాక వారి సంకీర్తనలు భక్తి, వేదాంత, తత్వార్థ పరిమళముతో కూడిన, వాడని పుష్పమాలికలు శ్రీ స్వామివారి కత్యంత ప్రియమైనవి. భోగ్యమైనవి. వేంకటాద్రి ప్రతి కోన, స్వామివారు, తిరుమల ఆలయ పరిసర ప్రాంతములు అన్నమాచార్య సంకీర్తన యాగమున కుపయుక్త మైనవనుటలో అతిశయోక్తి లేదు. అన్నమాచార్యులే స్వయముగా "సకల గంగా తీర్థస్నాన ఫలములివి స్వామి పుష్కరిణి జలమే నాకు.

"సకల పుణ్యక్షేత్రవాస యాత్రలివి సరి వేంకటాచల విహార మిదియే
ఉపవాసములివి యితని ప్రసాదంబు లొగి భుజింపుటే నాకు దినంబు
ఉపమింపఁబుణ్య పురషుల దర్శనమునకు నొగి నిచటి బహు వృక్ష దర్శనంబు
యెపుడుఁబుణ్య కథాశ్రవణంబు లిచ్చోటియెన్నంగల బహుపక్షి కలకలంబు
వెలయు నిండు మహోత్సవంబులిన్నియు నితని విభవంబు లెసఁగు తిరునాళ్ళు
చెలగి యటు దేవతా ప్రార్థనింతయు నాకు శ్రీ వేంకటేశ్వరుని శరణాగతి
అలరారు నా సంపదలు యితని పట్టపురాణి యలమేలు మంగలకడగంటి చూపు."

(2-132) అని విన్నవించిరి. ఈ విధముగా అన్నమాచార్యులు మనసా, వాచా, కర్మణా, శరీర ధనములను శ్రీ వేంకటేశ్వరునికే సమర్పించి జీవించిన భక్త సమ్రాట్టు. శ్రీ వేంకటేశ్వరుడు కలియుగ ప్రత్యక్ష దైవముగా తిరుమలపై నిత్య కల్యాణ పచ్చ తోరణములతో విరాజిల్లుచున్నాడు.

"శ్రీ వేంకటేశుడే శేఖరపుదైవమని, సావధానుఁడితనికి శరణుచొచ్చి
భావము లోపలఁపాప బంధముల బాసి తావునాతని కృపదండ చేరరాదా"

183 రేకు 7-181

అని స్వామి యొక్క అనుగ్రహమును బడయుమని మానవకోటికి ఉద్బోదించుచు తిరుమల ఆలయమున స్వామి సేవయే పరమధ్యేయముగ గొని కంకణబద్ధుడై నేటికిని నిలిచియున్నారు శ్రీ అన్నమాచార్యులు. వీరొనరించిన వాఙ్మయ సేవనెందరో మహాను భావులు ఎన్నో రీతుల వేనోళ్ళ కీర్తించిరి.

"ఈవల శ్రీ వేంకటేశ నీవిచ్చిన విజ్ఞానమున భావించి నిన్నుఁబొగడే భాగ్యమే చాలదా?" అని స్వామివారే అన్నమయ్యకు ప్రేరణనీయగా ఆ ప్రేరణను నేను స్ఫూర్తిగా గొని ఉడతా భక్తిగ "అన్నమయ్య సంకీర్తనలు : ఆలయస్ఫూర్తి విషయమై నా ఈ పరిశోధనను కొనసాగించితిని. ఈ పరిశోధనను 'ఐదు' అధ్యాయములుగా విభజించితిని. స్ఫూర్తిని కల్గించిన విధానమును వివరించితిని. మొదటి అధ్యాయమున ఆలయము, కళల యొక్క ఆవిర్భావమును గూర్చియు, రెండవ అధ్యాయమున తిరుమల ఆలయమును స్ఫూర్తిగాగొని రచించిన వర్ణనలను, మూడవ అధ్యాయమున అన్నమయ్య వైష్ణవును, నాల్గవ అధ్యాయమున సంగీత నాట్యాది కళలు ప్రేరణ కల్గించిన విషయమును ఐదవ అధ్యాయమున ఆలయ ఆరాధనోత్సవములు స్ఫూర్తిని కల్గించిన విధానమును వివరించిని.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆలయము, కళలు - ఆవిర్భావము | 1-31 |
| 2. | అన్నమయ్య - తిరుమల ఆలయస్ఫూర్తి | 37-101 |
| 3. | అన్నమయ్య - వైష్ణవము | 106-160 |
| 4. | అన్నమయ్య - లలిత కళలు | 166-189 |
| 5. | ఆలయము - ఆరాధనోత్సవములు | 192-238 |
| 6 | ఉపయుక్తగ్రంథసూచిక | 240-249 |

మొదటి అధ్యాయము

# ఆలయము, కళలు - ఆవిర్భావము

"సప్తప్రాకార మధ్యేసరసిజముకులోద్భా సమానే విమానే
కావేరీ మధ్య దేశీ మృదుతర ఫణిరాట్ భోగ పర్యంకభాగే
నిద్రాముద్రాభిరామం కటినికల శిరఃపాన్యస్తర్వ్య ర్వ్యవిన్యస్త హస్తం
పద్మాధాత్రీ కరాభ్యాం పరిచిత చరణం రంగ రాజం భజేఽహం
శ్రీరంగం కరిశైలమంజనగిరిం తార్క్ష్యాద్రి సింహాచలౌ
శ్రీ కూర్మం పురుషోత్తమంచ బదరీ నారాయణం నైమిశం
శ్రీమద్వారవతీ ప్రయాగ మధురాయోధ్యాగయాః పుష్కరం
సాలగ్రామగిరిం నిషేవ్యరమతే రామానుజోఽయం మునిః"

పరాశర భట్టరుచే రచించబడిన ఈ శ్లోకము "శ్రీరంగనాథ స్త్రోత్రము" లోనిది శ్రీ వైష్ణవులు నిత్యాను సంధానములో ఇది ఒక భాగము. శ్రీరంగాది దివ్య దేశములను శ్రీ వైష్ణవులు అనునిత్యము స్మరించెదరు. శ్రీరంగం, కరిశైలం, (కంచి) అంజనగిరి (వేంకటాచలము) తప్పక దర్శించవలసిన "దర్శనత్రయము" అని శ్రీ వైష్ణవుల విశ్వాసము.

తిరుమంగై ఆళ్వారులు బదరికాశ్రమముతో ప్రారంభించి 'ఎనుబది ఆరు' దివ్యదేశములకు మంగళాశాసనములు గావించిరి. శ్రీరంగనాధునికే జీవిత పర్యంతము సేవచేసి వన్నె కెక్కిన వారు శ్రీ తొండరడిపాడి ఆళ్వారులు. ఈ తమిళ పదమునకు అర్థము సేవకపాద రజము. ఇది వినయ స్ఫోరకము. కులశేఖరాళ్వారులు "ఘుష్యతే యస్య నగరే రంగ యాత్రా దినేదినే తమహం శిరసావన్దే రాజానం కులశేఖరం" అని రంగనాథుని యాత్రా వైశిష్ట్యమును నోరారా కీర్తించిరి. [3] అదే విధముగా శ్రీ వేంకటేశ్వర స్వామికే తన సర్వస్వమును సమర్పించి, సంకీర్తన కైంకర్యము చేసి వాసికెక్కినవారు మన "అన్నమాచార్యులు"

తమిళమున ద్రావిడాగమ సార్వభౌములైన ఆళ్వారులు అనేక దేవాలయములలోని అర్చామూర్తులను అభివర్ణించుచు శరణాగతి మహత్త్వమును ప్రతిపాదించి "నాలాయిర దివ్య ప్రబంధము"లను రచించిరి [4] అదే రీతిగ శ్రీ అన్నమాచార్యు లొక్కరే దివ్య ప్రబంధముల ననువర్తించి శ్రీ వేంకటాచలాధీశుని ప్రధానముగాను, తదితర పుణ్యస్థలములలోని ఆలయ 'అర్చామూర్తుల'ను గౌణముగను మీదను మొత్తము ముప్పది

రెండు వేల సంకీర్తనలతో అర్చనచేసి 'ద్రావిడాగమ సార్వభౌమ' బిరుదాంకితులైరి.

భగవంతుడర్చా రూపమున వెలయుటకు తగిన ప్రదేశము, భక్తుల పూజలను గ్రహించుట కనువుగా నుండుటకై ఆలయ నిర్మాణ పద్ధతులనేక రీతులలో 'ఆగమము' లలో వివరించబడినవి.

భగవదారాధనకు పుణ్యతీర్థము, పుణ్యక్షేత్రము, పుణ్యస్థలము పాత్రమైనవని వేదములలో వచింపబడెను.

వరాహమిహిరుని 'బృహత్ సంహిత'లో దేవుని ప్రతిష్ఠ పుణ్యనదులు, పర్వత సహిత ప్రాకృతిక రమణీయ ప్రదేశమున జరుగవలెనని కలదు.(5) పరమాత్మతో ఏకమగుటకు అనువైన స్థానము 'ఆలయమే'నని కూడా కలదు.

ఋగ్వేదములోని ఋక్కు ఒకటి, ఒక దేశపు సరిహద్దును 'వికటగిరి'యని సంబోధించినది. పారమాత్మికోపనిషత్తు, బ్రహ్మపురాణములందును ఈ శబ్దము ప్రయుక్త మైనది. అందుచే నాడు కూడా సువర్ణముఖి వేంకటాద్రి, 'ప్రాంతీయ సరిహద్దు'గా గుర్తింపబడినట్లు తోచుచున్నది. (5)

ప్రాచీన కాలము నుండి భక్తకవుల ఆరాధనకు ప్రేరణను కల్గించిన 'ఆలయములు' పల్లె జీవితములకు కేంద్ర బిందువులుగా నిలిచెను. ప్రజలు తమ జీవనమును గడుపుటకు ఆలయము లేని ప్రదేశము తమ కనువైనది కాదని భావించుచుండిరి. ఆలయములు సంఘ జీవన సంస్కృతికి 'ఆలవాలములు'

ఆలయములు సూక్ష్మముగా నగర, ద్రావిడ, వేసరములని మూడు విధములుగా నుడువవచ్చును. దక్షిణాదిని 'ద్రావిడ' ఆలయములు ఉత్తరమున 'నగర' ఆలయములు, పశ్చిమ, దక్కను, ఇంకను కొంచెము దక్షిణాదిన 'వేసర' ఆలయములును గానవచ్చును. ఆలయ, నిర్మాణ పద్ధతి నిర్దిష్ట సిద్ధాంతములను కల్గియుండుటచే భారతదేశము మొత్తమున ఆలయ నిర్మాణమున గొప్ప భేదములు కాన్పించుటలేదు. అందులకు కారణము వాస్త్వాగమశాస్త్ర రీతి ననుసరించి నిర్మించబడుటయేనని భావము(6).

పాణిని 'విగ్రహ'మను భావమును బోధించుటకు తన గ్రంథమున 'ప్రతికృతి' పదము నుపయోగించెనని పండితులు తెలుపుతున్నారు. పతంజలి మహా భాష్యములో 'అర్చా' అను పదమును వాడెననియు, విగ్రహమునకు బేర, తను రూప పదములు పర్యాయ పదములుగా నుపయోగించెననియు తెలియుచున్నది. తమిళ శాసనములలో 'అర్చా' మూర్తిని 'తిరుమేని' అని వాడిరి. (7)

క్రీ.పూ. 4వ శతాబ్దమున 'శ్రీకృష్ణ' ఆరాధనకు మెగస్తనీస్ గ్రీకు రాయబారి వ్రాతలు ప్రమాణముగా గ్రహించబడినవి.

శిలాశాసనములు మనకు ఆలయ నిర్మాణ చరిత్ర విషయములను గూర్చి అవగాహన చేసికొనుట కెంతో సహాయపడుచున్నవి.

క్రీ.పూ. 2వ శతాబ్దమున 'విదిశ' ప్రదేశమున గ్రీకు రాయబారి వాసుదేవ ఆరాధనకు గుర్తుగా గరుడ ధ్వజమును స్థాపించెనని ఆ ధ్వజములోని శాసనము పేర్కొనుచున్నది. కాని నేడు ఆ గరుడ సంకేతము కానవచ్చుట లేదు. "వాసుదేవు"డే విష్ణువుగా పేర్కొన బడుటకిది ప్రమాణముగా చరిత్ర కారులు చూపుచున్నారు. [(9)]

క్రీ.పూ. మొదటి శతాబ్దపు ఉత్తర భాగమున 'గోషండీ' నేటి ఉదయపూర్‌లో ఒక నూయి గోడపై 'నారాయణ వాటికా' నిర్మాణ విషయము చెక్కబడియున్నది. ఆ నిర్మాణము సంకర్షణ, వాసుదేవ ఆలయ ప్రాకారమేమోనని ఊహింప వీలగుచున్నది. క్రీస్తు పూర్వమే 'విష్ణువు'నకు ఆలయ నిర్మాణము జరిగిన దనుటకు ప్రమాణముగా ఈ శాసనములోని విషయము చాటబడినది [(10)]

వేయి మిలియన్ల సంవత్సరముల క్రితము ఏర్పడిన శిలా తోరణములు ప్రపంచ ములో ముచ్చటగా మూడు కలవు. అందు చక్రతీర్థ సమీపముననున్న తిరుమల శిలాతోరణము ఒకటిగా భావించబడుచున్నది. తొలుత స్వామి ఇచట వ్యక్తమాయెనని కొందరి విశ్వాసము. వేంకటాద్రి కొన్ని లక్షల సంవత్సరముల నాటిదనుటకు ప్రమాణముగా ఈ 'శిలాతోరణము'ను భూగర్భ శాస్త్రజ్ఞులు సూచించుచున్నారు.[(11)]

ఈ విధముగా ఆలయ నిర్మాణము కాలానుగుణముగా క్రమాభివృద్ధి పొందినట్లు తెలియుచున్నది. మొహంజొదారో, హరప్పా కాలమున పెద్ద ప్రవేశ ద్వారము ఎత్తుగా మంట పమువలె నుండి ఎత్తైన ప్రదేశమునకు దారితీయుచున్నట్లున్న వేదికయే నాటి ఆలయ రూపమని ఊహింప వీలుగానున్నదని 'సర్‌మోర్ టైమర్ వీలర్' అభిప్రాయపడిరి.[(12)]

వైదిక కాలము నాటికి ఆలయము, పూజలు గూర్చిన వివరణలు తెలియరానప్పటికిని, సామూహికారాధన నాడు కలదని ఊహించుటకవకాశము కలుగుచున్నది. [(12)]

వాల్మీకి రామాయణమున విగ్రహారాధన గూర్చిన భావమును తెలిపెడి శ్లోకములుగా 'అరణ్య కాండ' సర్గ-12లో కొన్ని పంక్తులు చెప్పబడినవనియు, అగస్త్యాశ్రమ వర్ణన సందర్భమున దేవతామూర్తుల వర్ణనలు గలవని, లంకలో 'నికుంబళా' దేవి ఆలయము పర్ణింపబడినదని, తెలియుచున్నది. [(13)]

ఆంజనేయుడు లంకాధి దేవాలయము యొక్క స్తంభమును పెకలించి అగ్నికి ఆహుతి చేసేనని వర్ణింపబడినది[14]

మహాభారతములో మట్టితో కూడిన విగ్రహము పేర్కొనబడినది. [15]

పాలీ సాహిత్యమున శిల్పకళ, వాస్తు కళను గూర్చిన వివరములు, వలయములతో కూడిన ఆలయ పైకప్పు వివరణలు తెలియవచ్చుచున్నవి.

ఆలయ నిర్మాణ ప్రారంభ దశయందు వేదిక, పైకప్పు, విగ్రహము మాత్రమే ఉండియుండవచ్చని విజ్ఞుల అభిప్రాయము. తరువాతి దశలో చుట్టును ప్రాకారముతో కూడిన వేదిక ఏర్పడినది. నగరి లేక నాగరిలో పెద్ద ఎత్తున నలుప్రక్కల తాళ్ళతో పురాతనమైన చదరపు వేదిక కానవచ్చుచున్నది. నాటి వేదికయే నేటి గర్భగృహమునకు పునాదిగా నిలిచినదని విజ్ఞులు భావించుచున్నారు. అటు పిమ్మట నేడు కానవచ్చు గోపుర శిఖరములు, మంటపములు ఆలయకట్టడములలో రూపుదిద్దుకొనినవి. ఇక్ష్వాకు యుగములో క్రీ.శ. 270 ప్రాంతము నుండి శైవ, వైష్ణవ, శాక్తేయ ఆలయ నిర్మాణము ప్రారంభమైనది. దేవి, శివ, విష్ణు దేవతా మూర్తులకే కాక విష్ణు అవతారములుగా కొనియాడబడు 'దశావతారములు' ప్రాధాన్యముగా ఆలయము అద్భుతముగా నిర్మింప బడినది. మరియు గుప్తుల నాటికి ఆలయ నిర్మాణము వృద్ధి పొందినదనుటకీ ఆలయము తార్కాణముగా నిలిచియున్నది [16].

తమిళ, 'సంగ' సాహిత్యము క్రీ.శ. 6వ శతాబ్దపు పూర్వ చరిత్రను గూర్చిన అంశములను మనకు తెలుపుచున్నవి. ఈ కాలము మూడవ శతాబ్దము నాటిదని విజ్ఞుల అభిప్రాయము. 'సంగ' కాలపు రచనలలో ప్రాచీనమైన 'తొల్‌కాప్పియమ్' అనబడు లక్షణ గ్రంథములో తమిళులచే ఆరాధింపబడు భూభాగముల గురించియును, వాని దేవతలను గురించియును వివరణలు కలవు. [17]

ఈ విధమైన "భూభాగములు-అధి దేవతల నిర్ణయము" వైదిక వాఙ్మయమైన కృష్ణ యజుర్వేద సంహిత' లోను కానవచ్చును. [18]

వేంగి చిత్రరథస్వామి ఆలయము, పాలూరు విష్ణ్వాలయము ఉదాహరణలుగా నుడవవచ్చును. [19]

వరుణునకు, దేవేంద్రునకు తంజావూరులో ఆలయము లుండెడివని శాసనములు చాటుచున్నవి. [20]

క్రీ.శ. ఏడవ శతాబ్దము నుండి పదమూడు శతాబ్దముల మధ్యకాలమున ఆలయ నిర్మాణము చక్కగా వ్యాప్తిచెంది నగర, ఇండో ఆర్యన్ పద్ధతులకును శిఖర, ధ్వజ స్తంభ

నిర్మాణమునకును దారి తీసినది. ఈ కాలముననే విగ్రహమునకు ప్రాణ ప్రతిష్ఠ గావించి పరమాత్మగా భావించి ఆలయ నిర్మాణమున త్రిమూర్తులకు, గణేశునికి సూర్యునికి మరియు దేవీ విగ్రహములకును అష్ట దిక్పాలకులకును వారి వారికి ఉచిత స్థానములను కల్పించిరి.

ప్రాచీన యుగములో దారు నిర్మితములు గాను, గుహాలయములు మంటపములు గాను నిర్మింపబడిన దేవాలయములు మధ్యయుగము నాటికి గర్భగృహము, అంతరాళము విమానము, శిఖరము మున్నగు ప్రధాన భాగములతో కూడుకొని సంపూర్ణ శిలా నిర్మాణముగా రూపొంది ప్రజల సంఘ జీవనమునకు ప్రధాన కేంద్రములైనవి.

ఆలయములు నియమ ప్రవర్తనకనేక విధముల తోడ్పడి ఆలంబనములైనవి. దైవ దండనకు ప్రజలు వెరచెడివారు. ఈ విధమైన నమ్మకములకు ఆలయములాశ్రయముగా నిలిచినవి. భగవంతునికై ఏర్పరచిన ఉత్సవాదులచే వారి మధ్య సమైక్యత కలుగుటకు అవకాశమేర్పడినది. [21]

భగవంతునకు అఖండ దీపదానమునకై భక్తులిచ్చెడి పశు సంపద, ఆ దీపములకు కావలసిన నూనె, గొల్లవారికి వృత్తుల నొనగూర్చినది. ఈ విధముగా అనేక వృత్తుల వారికి కళాకారులకు దేవాలయములు పోషణను కల్పించినవి. ఈ విషయములు శైవ, వైష్ణవ ప్రముఖ దేవాలయములలోని శాసనముల వలన మనకు బోధపడుచున్నవి. 'తిరుమల' ఆలయము పైని వివరించిన రీతిలో అనేక విధములుగా వృద్ధిపొంది ప్రజలకు ఉపయోగ పడిన విధము మనకు" టి.టి.డి. శాసనములచే వ్యక్తమగుచున్నది. [22]

వర్ణ వ్యవస్థలోని తరతమ భేదములను మరచి స్త్రీ శూద్రులతో ప్రజలందరకును దేవాలయములు సాంఘిక ప్రయోజనములను సమష్టిగా సాధించుటకు సమావేశ కేంద్ర ములైనవి. శిల్పులకు, చిత్రకారులకు కళాప్రదర్శన కేంద్రములైనవి. కార్మికులకు జీవనో పాధిని సమకూర్చినవి. ప్రవచనములు, హరి కథల మూలముగా మన సంస్కృతిని బోధించు విద్యా కేంద్రములుగా రూపొందినవి. ప్రసాద వినియోగముచే పేదల పాలిట అన్నదాన కేంద్రములైనవి. ధర్మ సంస్థాపనకై వెలసిన ఆలయములు ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అభ్యున్నతికి ప్రాపకములైనవి. [23]

దక్షిణ దేశమున ఆలయ నిర్మాణమును గావించిన సామ్రాజ్యములు ముఖ్యముగా ఐదు. అవి పల్లవ సామ్రాజ్యము, చోళ సామ్రాజ్యము పాండ్య సామ్రాజ్యము, విజయ నగర సామ్రాజ్యము మధుర నాయక సామ్రాజ్యములు. (24) ఈ సామ్రాజ్య చక్రవర్తులం దరును తిరుమల ఆలయ నిర్మాణమునను తదితర వైష్ణవ ఆలయములకును గణనీయ

మైన తమ తమ సేవల నందించిరి. "దక్షిణాదిన గల ఆలయ విగ్రహములను గూర్చిన వివరణలును అధిక భాగము 'అత్రి సంహిత'లో కలవు. [25]

ఆళ్వారుల, నాయనమార్ల భక్తి గీతములు భగవంతుడొక్కడే యెల్లరకు 'అధిపతి' అనెడి భావమును వ్యాపింజేయుటకు తోడ్పడినవి. తమిళ సాహిత్యము దేవాలయముల దిశకు మరలి కొత్త మలుపునకు దారితీసినది. ప్రజలు పాడుట కనువుగను, దేవాలయ ప్రదక్షిణములు చేసి పూజించు రీతిని సంగీతయుక్తమగు రచనలు అందు రూపొందినవి.

అంతఃపుర వాచిగా వాడుకలో నున్న 'కోయిల్' శబ్దము దేవాలయ అర్థమున రూఢియైనది. అంతకుపూర్వము రాజుల వద్దకుపోయి కళాకారులు చేసిన మేల్కొలుపు సేవలు దేవాలయములలో స్వామికి 'సుప్రభాత' కొలువు సేవలుగా మార్పుచెంది రాజులే స్వయముగా భగవంతుని సేవలో పాల్గొను పద్ధతి ఏర్పడినది.

ఆలయములు కేవలము కట్టడములు కావనియు, అవి భగవద్వాస యోగ్యతచే మహిమాన్వితమని భక్తుల విశ్వాసము.

"యే యెడ గుడి గొంచెమయిన గుడిలో దేవుని
కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా (198 రేకు సం. 9273)

మానవ శరీరమును ఆలయముతో సాధారణముగా పోల్చి చెప్పెదరు. ఉపనిషత్తు 'మానవ దేహమే' ఆలయముగా పేర్కొనెను.

తనువేగుడియట తలయే శిఖరమట
పెను హృదయమే హరి పీఠమట
కనుగొన చూపులే ఘన దీపములట
తన లోపలి అంతర్యామికిని
పలుకే మంత్రమట పొదైన నాలికే
కలకలమను పిడిఘంట యట
నలువైన రుచులే నైవేద్యములట
తలపు లోపల నున్న దైవమునకు" (అధ్యాత్మ రేకు 114 సం.2)

అని అన్నమాచార్యులు తనువును గుడిగా భావించి సంకీర్తన చేసిరి.

దేవాలయ ప్రాంగణము పరుండిన పరమాత్మతో పోల్చబడినది. 'శిఖరం శిర ఇత్యాహుః గర్భగేహం గళం తథా" పురుషుని శిరస్సు ఆలయ గోపురముగను, మానవుని శరీరాంగ ములు ఆలయ భాగములతోను పోల్చి చెప్పబడినవి. కడుపు అంతఃప్రాకారముగను, బహిరంగ

ప్రాకారములు, కాళ్ళుగను, గోపురము పాదములుగను, గర్భగృహములోని దేవుడు దేహములోని ఆత్మగను చెప్పబడినది. అనంతకోటి బ్రహ్మాండమునకు ఆలయములే ప్రతిబింబములు. స్వామి దేహములోని భాగములే విశ్వములోని వివిధ లోకములు.

పెద్ద గోపుర ద్వారము చూచు వారి దృష్టిని ఆకర్షించును. "గోపుర దర్శనం పాప విమోచనం" అని పెద్దల వచనము.

"ఇంచుకైనను వేంకటేశు గిరిశిఖరంబు
కాంచుటే కలుగ వలెఁగాక
అంచితంబైన నిత్యానందపదవులను
మించి............................................"(33వరేకు సం. 3)

"త్వద్గోపురాగ్ర శిఖరాణి నిరీక్షమాణాః
స్వర్గాపవర్గ పదవీం పమాం శ్రయంతః
మర్త్యామనుష్య భువనే మతిమాశ్రయంతే
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతం" (27)

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం-20

"గోపుర ద్వారము డాంబిక ఆకర్షణలకు ప్రతీక. శిల్పములు, చిత్రములు, పురాణ గాథలు మానవ జీవన ప్రతీకలుగా ప్రతిబింబములైనవి. రాజ గోపురమును దాటితి మేని ఆకర్షణలను దాటితిమి" అని అర్థము. భగవంతుని చేరుటకిది ప్రథమ దశ. బహిర్గత ఆకర్షణలను దాటి ఆలయములోనికి ప్రవేశించినంతనే బలిపీఠము కానవచ్చును. భక్తుడు బలిపీఠమునకు సాష్టాంగ దండ ప్రణామ మాచరించినచో అహంకారమును భగవంతునికి బలి ఈయబడినదని భావము. అనంతరము ధ్వజ స్తంభము, దానిపై గల పతాకమును గర్భాలయము దిశకు దారిచూపినట్లుండును. అహంకారమును త్యజించినంతనే గర్భాలయమునకు దారి గోచరించునని అంతరార్థము. ఆ వెనుక వాహనమూర్తి దర్శనమగును. భగవంతుని ప్రార్థించుచు మానవుడు జీవితమును మోయుచుండవలెనని సూచింపబడినది. అంతర్ముఖుడైన భక్తుని హృదయము అజ్ఞానాంధకారము అలుముకొనును. అటులనే గర్భ గృహమును చీకటిగా నుండును. ప్రశాంత చిత్తముతో సాధనచేసిన అజ్ఞానపు తెర తొలగి జ్ఞానమనెడి వెలుగు ప్రకాశించును. అదే విధముగా గర్భాలయమున భక్తుని సాధన ఫలించినంతనే భగద్దర్శనా నందము కలుగును. ఆలయములు ఆధ్యాత్మ వాతావరణమును కలుగజేసి భగవత్సంబంధమును ప్రాప్తింపజేయుచున్నవి. (28)

ఆలయమున నిర్వహించు పూజా విధానము మానవుని పంచేంద్రియములకొక గొప్ప అనుభూతిని కల్పించు రీతిని యున్నది. "యిరవై నా నోటికి యెన్నెన్ని చదివిన హరియనే యంత రుచి అందులేదు. గరిమ నెన్ని రూపులు కన్నులనే జూచినా పురుషోత్తముని జూచిన పూర్తి యందు లేదు. యెచ్చోటనుండినను యిందిరేశు మందిరము చొచ్చి యుండే సుఖమంత చొప్పడదందు కచ్చు పెట్టి వీనులకు గత లెన్ని విన్నను అచ్చుత కీర్తన వినేయందు సరిరాదు." (సం 10-250)

ఆలయమున గంటలు మ్రోగునపుడు నామస్మరణచే వీనులకు పవిత్రత కలుగును. ప్రసాదముచే నాలుక పావనమగుచున్నది. స్వామి కర్పించిన పూజా కుసుమముల తులసీ మాలల పరిమళము చేతను నాసిక ధన్యతను చెందుచున్నది. ఈ విధముగా పంచేంద్రియములు మనోహర దివ్య స్థితిని పొందుచున్నవి. ఈ రీతిని మానవ జీవిత మునకు ఇహ, పరలోక సంబంధము నేర్పరచు విధమున ఆలయములు సూత్రములై నిలిచినవని తోచుచున్నది. [29]

శ్రీరంగమున రంగనాథస్వామి ఆలయము, మన్నార్ గుడి, రాజగోపాలస్వామి అలయము సప్త ప్రాకార నిర్మితమై శోభిల్లుచున్నవి. [30] తిరుమల స్వామికి సప్తగిరులే సప్త ప్రాకారములై మెరయుచున్నవి. తిరుమలపై నున్న స్వామి స్వయం వ్యక్తుడై, భక్తుల పాలిటి కల్పవృక్షముగా, పేదలపాలిట పెన్నిధిగా, నిత్య కల్యాణ పచ్చ తోరణము లతో భక్తుల హృదయముల నలరింపజేసి శ్రీ అన్నమాచార్యుల సంకీర్తనలకు నాయకుడు కాగా ఆ ఆలయము దేవాలయ సంస్కృతికే శిరోమానికము కాగా స్వామి కలియుగ ప్రత్యక్ష దైవమై పూజల నందుకొనుచున్నాడు.

"ఎంత పుణ్యమో యిటు మాఁకుఁగలిగె
చెంతనే నీ కృప సిద్ధించఁబోలు"
"శ్రీపతి మీ కథ చెవులను వింటిమి
పాపములణఁగెను భయముడిగె
తీపుగ దులసి తీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ
గోవింద మిముఁగనుఁగొంటిమిప్పుడే
పావనమైతిమి బ్రతికితిమి
తావుల మీ పాదములకు మొక్కితి

వేవేలుఁగలిగెను వేడుకలాయ,
శ్రీ వేంకటేశ్వర సేవించితి మిము
ధావతి దీరెను తనిసితిమి
వావిరి ముమ్మారు వలగొని వచ్చితి
నీ వారమైతిమి నిలిచితిమిపుడు" (2-322)

అన్నమయ్య ఆలయమున కేగిన యెడల అందు జరిగెడి పురాణ పఠనమును చెవులను విని పాపములణగెనని తులసీ తీర్థము గొని శాపములు తీరి జీవితము సఫల మాయెనని, గోవిందుని కనుగొని పావనమైతినని, పాదములకు మ్రొక్కి వేడుక కలిగెనని శ్రీ వేంకటేశ్వరుని సేవచే దప్పితీరినదని ప్రదక్షిణము ముమ్మారులు చేసి స్వామి వారమైతిమని ఆలయమెంతో ఫలదాయకమని ఎంత పుణ్యమో యిటు మాకు గలిగెనని వివరించెను.

## సాహిత్యము

సాహిత్యము మేలు చేకూర్చునదై, హితబోధకమై, ప్రీతికరమై, ధర్మప్రతిపాదకమై యుండవలెను. "హితేన సహితమ్ సాహిత్యమ్"[31] మన భారతీయ సాహిత్యము భారతీయ సంస్కృతికి దర్పణము వంటిది. కావున మన సంస్కృతి అవగాహనకు సాహిత్య వివేచన మత్యావశ్యకము. సాహిత్య చరిత్రకు శాసనములు, కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు, లక్షణ గ్రంథములు, గ్రంథ సూచికలు, చరిత్ర, జనశ్రుతి ముఖ్యాధారములు. దేవాలయములలో నున్న అనేక శాసనములు ప్రాంతీయ చరిత్రకు ప్రధాన ఆధారమైనవి. లిపి వాడుకకు పూర్వ వృత్తాంతమును పూర్వ చారిత్రాక యుగమని, లిపి చరిత్ర ప్రారంభమును (అశోకుని కాలము) భారతదేశ చరిత్రలో చారిత్రక యుగముగాను, చరిత్రకారులు విభజించియున్నారు. ప్రాచీన శాసనములు చారిత్రక విషయ అవగాహన కెంతో తోడ్పడుచున్నవి. నన్నయ్యకు పూర్వము ఆంధ్ర వాఙ్మయ స్వరూపమునకు శాసనములు తప్ప లిఖితమైన ఆధారములు లేవు. దివ్యకవితాప్రయోగ స్థానముగా దేవాలయములు గోచరించుచున్నవి.[32]

దేవాలయములు సాహిత్యమున కెంతో దోహదకారులుగా నుండినట్లు భావించ వచ్చును. భక్తి సాహిత్యమునకు ఆలయములు, అర్చామూర్తులు ఆలంబనలుగా నిలిచినవి. ఈ భక్తి సాహిత్యమునకు ప్రాచీన ద్రావిడ సంగ కాలము నాటి సాహిత్యములో బీజములు నాటబడి పునాది వేయబడినది. తొల్ కాప్పియనార్ లక్షణకర్త 'తొల్ కాప్పియ' లక్షణ గ్రంథమున "ఉత్తరమున వేంగడము నుండి దక్షిణమున కన్యాకుమారి" వరకు తమిళము

వెలసి యుండినదని వెల్లడించెను. ప్రసిద్ధ చరిత్రకారులెవ్వరును చివరి సంగ కాలమును క్రీ.శ. 2వ శతాబ్దమునకు పిమ్మటగ చెప్పలేదు, [33]

సంగ సాహిత్యమున దేవతలందరును సమానముగా కొనియాడబడిరి. 'అహనానూర్'లో సుబ్రహ్మణ్యుని గూర్చిన ప్రశంస లనేకములు కలవు. 'పుఱనానూర్'లో ఇంద్రుడు, విష్ణువు, బలదేవుడు, శివుడు మున్నగు దేవతల వివరణలు కానవచ్చుచున్నవి.

"తొల్ కాప్పియ"మున "సేవికలార్"అను కవి ఇతర దేవతలకంటెను విష్ణు మహిమలను విస్తారముగా వివరించారు. అరణ్య ప్రాంతమున కథిదేవతగాను వర్ణించెను.[34]

ఆనాటి ప్రజలు విష్ణు మహిమలను కథల రూపమున తరచుగా కీర్తించుచుండెడి వారని 'నట్రినై' కావ్యము వలన విశదముగుచున్నది.

ప్రకృతి యందే "తిరుమాల్" (విష్ణువు)ను దర్శించినట్టు తోచుచున్నది. కపిలర్, ఉల్లోచనర్ కవులు శ్యామల వర్ణముగల పర్వతమును, పర్వత పంక్తులను అందు ప్రవహించు నిర్మల నిర్ఝరిని చూచి, విష్ణువు జ్ఞప్తికి వచ్చినట్లు వర్ణించిరి.

"పదిట్టు పాత్తు"లో నొక కవి "నారముడిచేరర్" అను చేర రాజును విష్ణు భక్తునిగాను తిరువనంతపుర ఆలయమున పూజలు జరుగుచుండినట్లుగను 'కపిలర్' అనుకవి 'ఓమన్దూర్' అను గ్రామమును విష్ణువునకు శాశ్వత కైంకర్యమునకు సమర్పించినట్లును తెలియజేసెను.

పురనానూర్ (54)లో స్త్రీలు విష్ణువు పంచాయుధములతో కూడిన సూత్రమును ధరించెడివారని, కార్తీక దీపోత్సవము చేసేడివారని తేటతెల్లమగుచున్నది. [35]

'కలితొగై'లో గోపిక పాలుపోయుటకై ఆలయమునకు పోయెనని (109) 'కడవుళ్ కడినగర్' అని ఆలయమును సంబోధించెడి వారనియు (84) వర్ణనము గోచరించుచున్నవి. కాంచీ సమీపమున శయన విష్ణు ఆలయ వర్ణన కలదు.[36]

విష్ణువు యొక్క పరతత్త్వము 'పరిపాడల్'లో కలదు. 'తిరుమాలిరుం శోలై' ఆలయ ప్రసక్తి కలదు. [37]

'నప్పిణ్ణై'లో కృష్ణబలరామాలయము 'మదురై'లో 'వెళ్ళై నగర కొట్టం' అని వ్యవహరించబడినట్టు తెలియవచ్చుచున్నది.

శ్రీరంగం, తిరుపతి, తిరువనంతపుర ఆలయముల ప్రసక్తి 'శిలప్పదిగారం'లో కలదు. ఈ గ్రంథమున సుబ్రహ్మణ్యుడు, కృష్ణుడు, విష్ణువు, శివుడు మ్నుగు దేవతలు కీర్తింపబడిరి. [38] సంగ కాలమున నాటిన భక్తి బీజములు క్రమముగా పెరిగి భక్తి సాహిత్య వృక్షమును

పెంపొందింప చేసినవి.

క్రీ.శ. ఆరవ శతాబ్దమున 'సిద్ధర్'లనెడి వారు శైవ మత వ్యాప్తికి తోడ్పడిరి. క్రీ.శ. 7, 8 శతాబ్దములలో 'తిరుమందిరం' తిరుమూలర్ గ్రంథములు వెలువడినవి. 'కార్‌నార్పదు' పాటలు విష్ణువు గొప్పతనమును చాటినవి. క్రీ.శ. 6వ శతాబ్దమున 'అప్పర్' అను శివభక్తుడు తనకు పూర్వముననున్న మరియు ఆనాటి వివిధ రకముల ఆలయ నిర్మాణ ములను గూర్చి తన సాహిత్యమున వివరించెను. 'తేవారం' ఆ నాటి ముఖ్య సాహిత్యము., 'అప్పర్' 'సంబంధర్' కవులిరువును సింహ విష్ణువు కట్టించిన ఆలయముల గూర్చి పాడిరి. ఈ పాటల ననుసరించి చోళులు ఆ కట్టడములను రాతి ఆలయములుగా నిర్మించి తిరుమురై పఠించు ఆచారము నేర్పరచిరి. ఈ శతాబ్దముననే 'ఉలా' సాహిత్యము ప్రారంభమైనది.

ఈ శతాబ్దముననే ఆళ్వారుల కాలము ప్రారంభమైనది. వీరు క్రీ.శ. 7వ శతాబ్దమునకు పూర్వము నివసించిరనుటకు నిదర్శనములు కలవట. వీరి కాల నిర్ణయము భిన్నాభిప్రా యములతో కూడియున్నది. వీరి రచనలే నాలాయిర దివ్య ప్రబంధములుగా క్రోడీకరించబడినవి. [39]

క్రీ.శ. ఏడవ శతాబ్దమునకు చెందిన 'పురప్పొరుల్ వెణ్‌పామాలై [40]) రచనలలో వేంగడం. పాశూర్, కచ్చి స్థలములలో నున్న దేవతల వర్ణనలు పేర్కొనబడినవి. ఈ విధముగా ఆలయములు, సాహిత్యము విడదీయరాని బంధమును కలిగియుండినవి.

"పెరియ పురాణ"మను గ్రంథము 'చిదంబర' ఆలయము, 'స్కాందపురాణ' గ్రంథము కంచియందు గల 'కుమార కొట్టం'నను, 'కంబరామాయణ' గ్రంథము 'శ్రీరంగ ఆలయముననను, 'తిరువిళయాడల్ గ్రంథము 'గురువాయూర్' ఆలయమునను ఆవిష్కరింప బడినవి. 'చిదంబర' ఆలయమున 'తేవారం' పాటలు తాటియాకులలో భద్రపరచబడినవి. [41]

ద్రావిడ సాహిత్యమున భక్తి సాహిత్యము క్రీ.శ. 6, 7, 8, 9 శతాబ్దములలో చక్కగా పుష్పించి ఫలించినది. ఆళ్వారుల, నాయనమార్ల పాటలు హైందవ మత విప్లవమును రేపినవి. నాటి నుండి సాహిత్యము కొత్త మలుపు తిరిగినది. నరస్తుతి చేయుట మాని భగవత్కీర్తిని గానము చేయుచూ భక్తి వ్యాప్తికై సాహిత్యమును భక్తవులోక సాధనముగా చేపట్టిరి. ఈ భక్తి సాహిత్య పరిమళములు తెలుగు సాహిత్యమునను వెదజల్లినవి. క్రీ.శ. పదునొకొండవ శతాబ్దమునకు పూర్వము తెలుగు రాజులు తమ దిగ్విజయ యాత్రా

విశేషములను శిలాశాసనములుగా వేయించిరి. అందు యుద్ధమల్లుని బెజవాడ శాసనమున

"జననుత చేబ్రోల నుండి బెజవాడ జాత్రకు వచ్చి
త్రినయన సుతుండును సోటు మెచ్చక తివిరి యిన్నెలవ
యనఘుండ సేకొని యందు ప్రత్యక్షమైయున్న నిచ్చ
రని మల్ల డెత్తించె గుడియు, మఠమును గార్తికేయునకు"(42)

ఈ శాసనముచే మొదటి మల్లుడు కార్తికేయునకు గుడియు, మఠమును కట్టించెనని విశదమగుచున్నది.

రెండవ శాసనమున అతని మనుమడు "గ్రమమున దానికి కలశబడునట్లుగా మొగమాడు నమరంగ శ్రీ యుద్ధమల్లుడెత్తించె నమిత తేజుండు" అనియు

"రమణతో బెజవాడకెల్ల బెడంగును రక్షయుంగాను
దమ తాత మల్లనరాజు వేఁటియు దాను గట్టించె"

అనెడి విషయములు తెల్లమగుచున్నవి.

నన్నయ్యఆంధ్ర మహాభారతమున

"శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషుయే
లోకానాం స్థితి మావహన్త్య విహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తేవేదత్రయ మూర్తయ స్త్రి పురుషాస్సం పూజితావస్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజ భవశ్రీకన్ధరాశ్శ్రేయసే"(43)

అని మంగళ ప్రయోజనమై ఆశీస్సు రూపముగా త్రిమూర్తి స్తవమును రచించెను. సామాన్య తెలుగు ప్రజానీకమునకు వైదిక మతౌన్నత్యమును, ఆర్ష విజ్ఞానమును పరిచయము చేయ సంకల్పించి రాజరాజ నరేంద్రుడు నన్నయ్యచే పంచమ వేదమగు భారతము నాంధ్రీకరింప జేసెను. తెలుగు కావ్యములందు భగవత్ స్తుత్యాదులతో దండకములు రచింపబడినవి.

భీమకవి "వేములవాడను వెలసిన భీమేశ్వరు కరుణగల్గు భీమసుకవి నీ మహి గవులెన్న చందమెలమి రచింతున్" అని వేములవాడ భీమేశ్వరుని కరుణను నుడివెను.

నన్నెచోడుని కుమార సంభవ రచనతో తెలుగు సాహిత్య చరిత్రమున శైవ మత ప్రచార ప్రధాన రచనలు వ్యాప్తికి వచ్చినవి. ఇందు సతి జన్మము, గజానన జన్మ వృత్తాంతము, దక్షాధ్వర ధ్వంసము, చివరి రెండు ఆశ్వాసములలో కుమార విజయము రచింపబడినది.(44)

పాల్కురికి సోమన చేపట్టిన ద్విపద, శతకము, ఉదాహరణ మున్నగు కవితా శాఖలు తెలుగున భక్తి సాహిత్యమునకు విశిష్ట స్థానమును కల్పించినవి.

పాల్కురికి సోమన కృతులను పిడుపర్తి సోమన తన పద్య పురాణావతారికలో (పీఠిక 27లో) "బసవ పురాణంబు, పండితారాధ్యుల చరితంబు ననుభవ సారము, చతుర్వేద సార సూక్తులు, సోమనాథ భాష్యంబు, రుద్రభాష్యంబు, బసవ రగడ, గంగోత్పత్తి రగడ, శ్రీ బసవారాధ్య రగడలు, చెన్నమల్లు సీనములు, నమస్కార గద్య, వృషాధిప శతకంబు నక్షరాంక గద్య పద్యముల్, పంచప్రకారగద్య, అష్టకము పంచకము, నుదాహరణయు నాదియగు కృతుల్ భక్తి హితార్థ బుద్ధిఁజెప్పెనని భక్త సభలలో జెల్లుచుండు."

"అనుభవసారము"న భక్తి స్వరూపము, భక్తి లక్షణము, శివపూజా పద్ధతి, ఇష్ట లింగార్చన విధి, జంగమసేవ, షట్‌స్థల వివరణము మున్నగు వీరశైవ ధర్మములు ప్రతిపాదించబడినవి.[45]

"వృషాధిప శతకము"న అనేక భక్తుల చరిత్ర సంగ్రహముగ కలదు. విశిష్టాద్వైతులు జీవేశ్వరులకు కల్పించిన శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య మధురావస్థలను నాయికా నాయక భావమును "నా యొడయుండ, నావిభుండ, నా హృదయేశ్వర, నా మనోరమా.... నా యిలవేల్పు, నా వరద నాగురు లింగము, నాదు జంగమా నాయదినాథ నా పరుడ నన్నుఁగృపామతి బ్రోవుమయ్యా" యని భక్తి రసాస్వాదులకు మార్గదర్శకమగు రీతిలో వర్ణించెను. శైవమునకు సంబంధించిన ముఖ్య విషయములు చతుర్వేద సారమున వివరించబడినవి,. [46]

చెన్నమల్లు మకుటముతో వీరశైవ విహితములగు భక్తి, మహేశ్వర, ప్రసాద, ప్రాణ లింగ, శరణ, ఐక్య అనెడి 'షట్ స్థల' విజ్ఞానమును గూర్చిన ముప్పది రెండు సీన పద్యములు శ్రీశైల మల్లికార్జున స్వామి పేర విరచించెను.

ఉదాహరణ కేవలము స్తుతి రూపకమైనది. బసవ పురాణము, వీరశైవ పురాణము ఉరవడిచేసి భక్తి ఉద్రేకములను పరమార్థ......పలికితినని విన్నవించెను. [47]

'పండితారాధ్య చరిత్ర'లో శివభక్తులు ఆజ్ఞాపించగా ఈ గ్రంథమును రచించితినని సోమన నుడివెను.

కరుణాకరాయ, శ్రీ కంఠాయ కర్మహరణాయ, శ్రీ మల్లికార్జునాయ నమో
అంబకత్రితయాయ, హరశంకరాయ, సాంబాయ
శుభకర శ్రీశైల చూడకరాయ, అభవాయ శ్రీ మల్లికార్జునాయనమో"

(పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణము 48)

"ఇంక శ్రీ గిరిచేరనేగందునని కంటి
శంకరుని కృపపడయ సమయ మిదియని కంటి

నికను నా యెత్తు కృతు లిత్తుగని పొడగంటి" అని

చక్రపాణి రంగన తన నయన రగడలో విన్నవించెను.

యథావాక్కుల అన్నమయ్య పల్నాడు ప్రాంతములోని చిట్టపాలెము దగ్గర కృష్ణా తీరమున నున్న విశ్వామిత్రాశ్రమ మనబడు 'సత్రశాల' అనుచోట మల్లేశ్వర స్వామిని సేవించుచు కొంత కాలముండి "సర్వేశ్వర శతకము"ను రచించెను.

సోమన పిమ్మట, ద్విపదలో గోనబుద్ధ భూపతి రంగనాథ రామాయణమును రచించెను. పాల్కురికి సోమనకు శ్రీ అన్నమాచార్యుల కాలమునకు మధ్య కాలమున ఇరువది నాలుగు ద్విపద కావ్యములు వెలువడినవి.[49] వానిలో శైవమత బోధక గ్రంథములే అధికముగా కలవు.

తిక్కన తన నిర్వచనోత్తర రామాయణమును నరాంకితము చేసెను కాని పంచమ వేదముగా ప్రసిద్ధి చెంది జనుల కారాధ్య గ్రంథమైన మహాభారతమును రచించి గణపతి దేవుని ఆస్థానములో చదివి, హరిహరనాధుని కంకితమిచ్చెను.

"శ్రీయన గౌరి నాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయత మూర్తియై హరిహరింబగు రూపముదాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయతకిచ్చమెచ్చు పరతత్త్వముగొల్చెద నిష్టసిద్ధికిన్"
"హరిహర నాథ సర్వ భువనార్చిత"నన్ దయ చూడు మెప్పుడున్[50]

అని హరిహరనాథ తత్త్వ ప్రతిపాదనముతో సాహిత్య లోకమునకే కాక ఆధ్యాత్మిక జగత్తునను నూతన మార్గమును చూపెను. శైవ వైష్ణవ మత స్పర్థలను పారద్రోలుటకు తిక్కన ఎన్నుకొనిన మార్గము హరిహరాద్వైతము. మత వైషమ్యమనెడి విషమునకు తిక్కన కనుగొన్న సంజీవనియే హరిహరాద్వైతము.

"కరుణారసము వొంగి తొరఁగెడు చాడ్పున శశిరేఖ నమృతంబు జాలువార
హరినీల పాత్రిక సురభి చందనమున్న గతి నాభి ధవళ పంకజము మెరయ
నా మనంబు నానందమగ్నముగఁజేయు నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు"[51] అని హరిహరనాథుని కన్నులకు కట్టినటులు వర్ణించెను. తిక్కన భారత రచనకును, అధ్యాత్మ చింతనకు 'ఓరుగల్లు'లోని ఆలయము పీఠమై నిలిచినది.

తిక్కన కాలము నాటి మార్కండేయ పురాణము ప్రథమాంధ్ర మహా పురాణముగా ప్రసిద్ధి చెందినది.

ఇక స్తుతి వచనములు వ్రాయుటలో కృష్ణమాచార్యు లగ్రగణ్యులు. "అనాథపతీ, స్వామీ సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ" అనెడి మకుటములతో కూడియున్న సింహగిరి వచనములకు సంకీర్తనములని, తాళగంధి చూర్ణికలని నామములు కలవు.

సింహగిరి స్వామి కృపారసదృష్టి ఫలితమే కాబోలు కృష్ణమాచార్యుల వారి "సింహగిరి వచన" సృష్టికి హేతువైనది. "చాతుర్లక్ష వచనముల"ను వీరు రచించిరని ప్రతీతి. స్తుతి వచన కర్తలకు భక్తియే ప్రధాన విషయము. భక్తి ప్రధానమై స్తోత్ర రూపముగను సంకీర్తనాత్మకముగను రచించిన రచనలలో కృష్ణమాచార్యుల వచనములు మొట్ట మొదటివి.

నృసింహస్వామి స్వప్నమున వరాహ రూపముతో కృష్ణమాచార్యులకు సాక్షాత్కరించి తనకు "చతుర్లక్ష పూజలు గావింపు"మని ఆజ్ఞాపించగా రచించితినని వారు తెలిపిరి. స్వామి నట్లు కీర్తించి భక్తి సాహితీ లోకమున చిరస్థాయినిగన్న భక్త శిఖామణి శ్రీ కృష్ణమాచార్యులు.

"శేషాచలమున వేంకట నామ ధేయుండవైతివి

పరమభాగవతోత్తముల పాలికి సింహాచలమున నిలిచితివి

భూలోకంబున వైకుంఠంబగు నుభయ కావేరీ మధ్యంబున విభీషణ వరదుడవై

శ్రీరంగసాయి వైతివి."[52] నూట యెనుబది తిరుపతులును మీ దివ్య లీలా వినోదములు అని స్వామి యొక్క మహిమను, ఆలయ అర్చా రూపములను వినుతించెను. శ్రీఅహోబిలము, శ్రీరంగము, వేంకటాచలంబును, కాశీ క్షేత్రంబును, ద్వారకంబును, నయోధ్యయును, శ్రీ పురుషోత్తమును జూచి, దేవా, మీ గృహంబున కరుదెంచినఁ గవాటంబులు మూయ మీకుఁదగునా? "నీవే తప్ప నితఃపరం బెరుఁగనననఁగవాటంబు దెరచిన, స్వామి సన్నిధికింజని స్తోత్రంబు సేయందొడగిన, స్వామి ప్రత్యక్షమై "నీవు నా సన్నిధిని దాసుఁడవలె గాక పాడగనవాయని యానతిచ్చిన "దేవా నీవే జననియు జనకుండ"ని స్వామిని ప్రార్థించెను. [52]

బ్రహ్మాండాది పురాణోక్తమైన నరసింహవతార కథ ననుసరించి అహోబిలక్షేత్ర మాహాత్మ్యమును వర్ణించు "నృసింహ పురాణము"ను ప్రబంధ పరమేశ్వరుడు రచించెను.

నారాయణుని అంగవర్ణన వచనము, స్తంభోద్భవ వచనము, శబ్దానుకరణముగా ప్రత్యక్షము చేయుచున్నవి. అహోబిల క్షేత్ర సంస్థాపనము మాహాత్మ్యము కొంత గ్రంథాంతమున గూడ చెప్పబడినది. స్వామిని ఎఱ్ఱన దండకముతో స్తుతించెను. [53]

శ్రీకృష్ణుని నాయకునిగా నాచన సోమన ఉత్తర హరివంశము రచించెను. భాస్కర రామాయణము తెలుగు రామాయణములలో మొదటి చంపూ కావ్యముగ వెలసినది.

త్రిపురాంతకుడు శ్రీశైల తూర్పు వాకిలియైన త్రిపురాంతకమున కుమారగిరిపై వెలసి యున్న శివుని గురించి చేసిన స్తోత్రమే "త్రిపురాంతకోదాహరణము." ఒక్కొక్క రగడ పాదమున ఒక్కొక్క శివకథను సూచించి పారాయణకు ఉపయుక్తమగు రీతిని రచించెను.

శ్రీనాథుని శివభక్తికి, 'హరవిలాసము' ముఖ్య ఉదాహరణము. పురాణాంధ్రీకరణ మునకు శ్రీనాథుడు మూల పురుషుడు.

భీమేశ్వర పురాణము ద్రాక్షా రామ భీమేశ్వరుని లీలలను వర్ణించు ఆరు ఆశ్వాసముల ప్రబంధము. ద్రాక్షా రామ క్షేత్ర మాహత్మ్య మందు వర్ణితము. ద్రాక్షారామమున అచటి సస్య సంపద, గోదావరీ మండలము నందలి నదులు, కొండలు, గుడులు, గోపురములు, క్షేత్రములు, ఆరామములు తీర్థములతిరమణీయముగా వర్ణింపబడినవి. క్షేత్రముల వర్ణన రెండధ్యాయములతో విరివిగా చేయబడియుండగ, శ్రీనాథుడా వివరణలను ఒక్క పద్యమున సంక్షిప్త పరచెను.

శృంగార నైషధమున సరస్వతీ స్తుతి రూపక దండకము రచించెను. 'కాశీ ఖండము'న విశ్వేశ్వరుడు విశాలాక్షికిక్షేత్ర తీర్థకదంబ వర్ణనలుచేయు సమయమున దండకమును,హర విలాసమున వినాయకునిపై 'న'గణ ద్వయముపై 'ర'గణ దండకమును రచించెను.(54)

'నారాయణ శతక' రచనకు దేశమునందు ఆనాడు ప్రబలముగానున్న వైష్ణవ మతము ప్రేరణ నొసగినదేమో! కృష్ణ భక్తికి, భాగవత తత్త్వమునకు పోతన హృదయమున బీజము నాటినదీ నారాయణ శతకమే. నారాయణా మకుటముతో నూటమూడు పద్యములు గల శతకమిది. (55)

భాగవతమున విష్ణువు యొక్క లీలా విశేషములు, విష్ణు భక్తుల దివ్య చరిత్రములు ప్రధానముగా వర్ణించబడినవి. భక్తి మార్గ బోధకమగు విష్ణుభక్తి ప్రతిపాదక విశిష్ట గ్రంథమే భాగవతము. పరమ భాగవతోత్తముడైన పోతన భాగవతమును "నిను ఆకటికింగొనిపోయి కిరాత కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ"యని నరాంకితము చేయక శ్రీరామునికే అంకితమిచ్చెను. శ్రీకృష్ణావతార మహిమల కథనమే భాగవతమునకు మూలము. ఆ కృష్ణుడే సాక్షాత్పరబ్రహ్మ స్వరూపమైన విష్ణువు.(56)

ఈ విధముగా క్రీస్తు శకారంభముననే సంగకాలమున భక్తి సాహిత్యమునకు విత్తనములు వెదజల్లబడినవి. నాడు జల్లిన విత్తనములు కొంత కాలమునకు మొలకెత్తి క్రీ.శ. 5-9

శతాబ్దముల మధ్య కాలమున నాయనమార్లు, ఆళ్వారులు భక్తుల యొక్క భక్తి భావ సంపదచే భక్తి సాహిత్యము పెరిగి పెద్దదై 'మహావృక్ష'మైనది. తదుపరి భారతదేశమంతటను శాఖోపశాఖలుగా విస్తరించి వ్యాప్తి పొంది భారతదేశ సాహితీ చరిత్రకు పుష్టిని చేకూర్చి పదునాల్గవ శతాబ్దము నాటికి భక్తి సాహిత్యము సువర్ణ యుగముగా పరిణమించి భాసిల్లినది. ఆ శతాబ్దముననే ఆంధ్రదేశమున వేంకటనాథుని సన్నిధానమున అన్నమయ్య నామక భక్తి పుష్పము వికసించెను. ఆ భక్తి సుమము ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలుగా రూపొంది పరిమళించసాగినది. పుష్ప ప్రియుడైన స్వామిని, అన్నమయ్య సంకీర్తన సుమములచే పూజించి శాశ్వతమైన పరమపద స్థానమును చేరుకొనెను. శ్రీహరి భక్తి అనెడి కల్పలత ఎటు పరిణతి చెందినదో అన్నమయ్య స్వయముగా, ఇటుల సంకీర్తన చేసెను.

"వేదములలో మొలచె వేదాంతాలఁ గొనసాగె గాదిలి శ్రీహరి భక్తికల్పలత
పోది యెక్కెవైరాగ్య బోధలచేఁబలుమారు
పాదుకొని వేరు వారె పంచ సంస్కారాలను
అల్లుకొనె మునులలో నంటెను బురాణాల
చెల్లుబడి శాస్త్రాలఁ జిగిరించెను.
చల్లగా బూవులు పూచె సత్కర్మ విధులను
మెల్లనే నీడలు నిండె మించి సుజ్ఞానమున
పరమయోగములఁబూపలుఁబిందెలు పుట్టె
పరగె సురలనే పందిటి యందు
యిరవై శ్రీవేంకటేశుఁడిందుకు ఫలమైనాఁడు
గురు సేవలు దొరకును వివేకులకు" (2-222)

## సంగీతము

భారతీయ దేవాలయములు మతమునకు గొప్ప స్థానముగాను, తత్త్వ జిజ్ఞాసకు దోహదములుగా నుండటయే కాక మనసునకు ఆనందము, వినోదమును కూడా కలుగ జేసినవి. దేవాలయము - సౌందర్యము, గానము, శిల్పము, కవిత మున్నగువానికి సమావేశ స్థానముగాను గోచరించుచున్నది.

సాహిత్యములో భగవంతుని సౌందర్యమును ప్రధానాంశముగ గ్రహించుట కవకాశ మును జేకూర్చినది. శ్రీరంగము, శ్రీవిల్లిపుత్తూరు దేవాలయములు వైష్ణవ సాంప్రదాయ మును చక్కగ వర్ధిల్లజేసినవి. ఇంకను శ్రీ విష్ణు చిత్తుల, కులశేఖరాళ్వారుల ఖ్యాతిని

ఇనుమడింపజేసినవి.

ప్రఖ్యాత గాయకులు తమ కౌశలమును దేవాలయములలో ప్రదర్శించి పవిత్రపరచి నట్లు "తతః ప్రవిశతి వాదయిన్తి. వీణ వాయించుచు ప్రవేశించుచున్నది" అనెడి పంక్తులలో మలయవతి మలయ పర్వత మందలి దేవాలయములో గానము చేయు చుండెడిదని హర్షుడు తెలిపెను.

గోకర్ణ నిలయుడైన శివుడిని వీణాగానముతో నారదుడు సేవించుటకు పోవుచుండి నట్లు చెప్పుటచే దేవాలయములు దివ్య సంగీతమునకు స్థానముగా గోచరించుచున్నవని స్పష్టమగుచున్నది.[57]

మన సంగీతము అనేక శతాబ్దముల అమూల్య చరిత్రను కలిగి యున్నది. మన సంగీతమున కాధారము ఆధార షడ్జమము. ఈ పద్ధతి పాశ్చాత్య సంగీతమున కానరాదు. అనాదిగా నున్న సప్త స్వరములు స్థాయి విశిష్టతను మెల్లిగా వృద్ధి పొంది ఒక రూపమును పొంది అనేక మార్పులతో మూడు పువ్వులు ఆరు కాయలుగా రూపొందినది. ఈ సంగీతాభివృద్ధిని గూర్చిన వివరణలను ఆచార్య సాంబమూర్తి గారు "హిస్టరీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్" అను గ్రంథమున వివరించిరి.

క్రీస్తు పూర్వపు సంగీత చరిత్రను గూర్చిన అవగాహనకు సాహిత్యము కొంత తోడ్పడు చున్నది. కాని వారెట్లు గానము చేసెడివారో, వారిది నేడు పాడుతున్న విధము ననుసరించి నదో లేదో చెప్పనలవి కాదు.[58]

వేదములలో సంగీతమును గాంధర్వము, మార్గమనియు, వివిధ ప్రాంతములలో పాడుకొను సంగీతమును గానము, దేశి సంగీతమనియు నుడివిరి. మొట్టమొదట సామవేదమున సంగీతమును గూర్చిన ప్రస్తావన కన్పించుచున్నది. ఋషులు వచించిన "సామవేదాత్ సంగీతం" అనెడి నానుడి ఆనాటి నుండి వినవచ్చుచున్నది. వారు గావించిన సామన ఋక్కులే మన సంగీతోద్భవమున కాధారమైనవి.

భరత, సారంగ దేవుల లక్షణ గ్రంథములలో ఆనాటి రచనల వివరణ కొంత కలదు. తదుపరి ఇతిహాసములైన రామాయణ, మహాభారతముల యుగము ప్రారంభమైనది. ఆ ఇతిహాసములలో సంగీతము మరియు సంగీత వాద్యములను గురించి అనేక వివరణలు కలవు. రామాయణము "పాఠ్యే గేయేచ" మధురమైనది. తరువాత సంగీత చరిత్రలో "ధ్రువ యుగము" ప్రారంభమైనది. భరతుని నాట్య శాస్త్రమున ధ్రువా గాన పద్ధతులు చోటుచేసుకొనినవి. ఇది దేశి పద్ధతి.

జయదేవుని "గీత గోవిందము" సంస్కృత రచనలో మొట్టమొదటి భారతీయుల జానపద గేయరచన. ఈ గీత గోవిందము గోపికల కృష్ణ భక్తి, అధ్యాత్మ చింతన గల్గిన గొప్ప రచనగా ప్రపంచ ప్రఖ్యాతి పొందినది.

వాగ్గేయకారుల మూలమున సంగీత స్వరూప పరిణామము కొంత గ్రహించవచ్చును. పదునొకొండవ శతాబ్దములో ఆంధ్ర భారత రచయిత నన్నయ్య భట్టు సమకాలికుడుగ వంగ, ఉత్కళ దేశముల సరిహద్దు ప్రాంతమున మహాకవి జయదేవుడు జన్మించెను. ఆయన సంస్కృతములో రచించిన "గీత గోవిందం" శ్లోక, గేయములతో కూడిన మొదటి సంగీత నృత్య ప్రబంధము, రాధా మాధవుల శృంగార గాధతో నున్న శ్రవ్యశ్రావ్య కావ్యము. భారతదేశమున అన్ని రాష్ట్రముల వారికి తొలి ప్రబంధముగా ఆరాధ్యమైనది.

మధ్వాచార్య శిష్యుడైన "నరహరి తీర్థ" పదమూడవ శతాబ్దమున కన్నడమున పద సాహిత్య రచనకు పూనుకొని ప్రఖ్యాతిని గాంచెను. సంగీత చరిత్రలో 13వ శతాబ్దము మరపురానిది. ఈ యుగముననే సంగీతము కర్ణాటక సంగీతమనియు హిందూస్థాని సంగీతమనియు రెండు విధములుగా రూపొందిందినది. దీనికి కారణము మహమ్మదీయులు మనదేశము నేలుటయే. రెండు పద్ధతుల కాధార మొక్కటైనప్పటికిని గాన పద్ధతులలో భేద మేర్పడసాగినది.

సంగీతమునకు సంబంధించిన సాహిత్య వివరణలు దక్షిణ దేశమున తమిళ సాహిత్యము నందు అనేకములు కలవు. వారి పురాతన గ్రంథముల నుండి స్వరములతో రాగముల నేర్పరచు విధములను తెలిసికొని పంద్రెండు వేల రాగములను ప్రాచీన సంగీతజ్ఞులు గానము చేసెడివారని విదితమగుచున్నది.[59]

"తొల్ కాప్పియము"న సంగీతమునకు సంబంధించిన వివరణలు సూత్రములుగా వర్ణించ బడినవి. ఈ వర్ణనలచే నాడు సంగీత ప్రాధాన్యమెంతగ నున్నదో గ్రహింప వీలగుచున్నది. 'పాణర్" అనబడు వారు పాటలు పాడుటలో దిట్టలు. వీరు "యాళ్" అనెడి సంగీత వాద్య సహాయముతో పాటలు పాడుటలో ప్రజ్ఞాశాలురు. "పొరునర్" అనెడివారు ఉత్సవములలో తమ కౌశలమును చూపెడివారు. వీరు వాయించు 'పాలై పణ్ణె' విని హృదయము ద్రవించి దొంగలు తమ వృత్తిని మరచిరని వీరి సంగీతము యొక్క గొప్పతనమును వెల్లడించిరి. వీరు "యాళ్ పాణర్" ఇశై పాణర్" మణ్డై పాణర్" అని మూడు విధములుగా పరిగణింపబడిరి. వీరు పాడు "దేవబాణి" గూర్చి సూ. 132లో చెప్పబడినది. స్త్రీలు కూడా సంగీతజ్ఞులే.[60]

సంగీత ప్రాధాన్యము గల వాటిని 'పణ్ణతి' అని పేర్కొనిరి. చక్కని నడకతో కూడినవి

'అత్తగు' అనియు ధర్మార్థ కామ మోక్షముల గూర్చిన వాటిని 'అమ్మై' అనియు సంభాషణ రీతిలోనున్న వానిని 'తౌణ్'యని సాహిత్యములో అనేక రీతుల వర్ణింపబడినవి.

"కలిత్తొగై, పరిపాడల్" వంటి సంగీతాధారమైన పాటలు "ఇయైబు" రకమునకు చెందినవి.

'కురుంతొగై' మూడు వందల తొంబై పాటలు గల గ్రంథము. సంగీత, నాట్య కళలలో ప్రసిద్ధులైన ఉరయూర్, కూత్తన్, కుళల్ తత్తన్ మున్నగు పండితులను గూర్చి పేర్కొనినది. రాజులచే బిరుదులందుకొన్న పండితులలో సంగీత విద్వాంసులుండెడి వారని నాటి పాటలచే ద్యోతకమగుచున్నది. [61]

"శిలప్పదిగారము" అనెడి గ్రంథములో కోవలన్, మాధవి పాడిన పాటలు 'కానల్‌వరి' భాగము సంగీత కళను గూర్చిన వివరణలతో విశిష్ట స్థానమును కలిగియున్నది. (62)

"పరిపాడల్" అనునది "ఇశైపా" సంగీతముతో కూడినది. కలిత్తొగై రచనయు ఈ విధమునకు చెందినదే. కాని నేడు ఆనాటి స్వరము (పణ్) తాళము బోధపడుట లేదు. కాని నాటి సంగీత జ్ఞానమునకీ రచనలు ప్రమాణములుగా చూపబడుచున్నవి.

తమిళ సాహిత్యమున పంచ కావ్యముల నాటికి " సంగీత"మును "గీత" మనిరి. "సంగీత కథ" అనెడి గ్రంథములో మొట్టమొదట తమిళ సంగీతము 'కర్ణాటక' సంగీతముగా పేర్కొనబడినది. పణ్ అనగా స్వరము, బాణి అనగా రాగం, ఆళత్తి అనగా ఆలాపన, ఆడల్ అనగా నాట్యమని ఆ గ్రంథమున వర్ణింపబడినవి.

తమిళదేశమున సంగీతము, నాట్యము ఆలయములలో బహుధా వ్యాప్తి చెందినవి. పురాతన కాలము నుండి భక్తి పాటలు పాడుటకై భజనల కొరకు నిత్య ప్రబంధ గాయకులు ఆలయములలలో ఉద్యోగస్థులుగా నియమింపబడెడి వారనుటకు వరద రాజాలయములోని శాసనము ప్రమాణముగా కలదు. [63]

"పాణర్" భక్తి పాటలు ఆలయములలో పాడెడివారని రెండవ రాజరాజుని శాసనము చాటుచున్నది. [64]

"తిరువామాత్తూర్" ఆలయములో ఉదయ సంధ్య వేళలలో గానము చేయుటకై బ్రాహ్మణులు పదునారు మంది నియమింపబడిరి. వారికి, వారిని పరివేష్టించు వారికి, సహాయపడు వారికి, భూమి మాన్యములుగా ఈయబడినవి. చక్రవర్తులు ఆలయములకు విచ్చేసినప్పుడు పూజా కార్యక్రమములు జరుపుటకు, బృందగానము చేయుటకు వలసిన ఏర్పాట్లు జరిపించుటకు "తేవార నాయిగమ్" అనెడు అధికారులుండిరి. మొదటి కులోంగుత్తుని కాలమున ఆలయమున భక్తి పాటలను పాడు అధికారమును గొప్పగా

భావించెడివారట.

"తేవార" పాటలు పాడుటకు "ఓదువార్‌గళ్, స్థానికర్, కట్టళైయర్" అని మూడు రకముల గాయకులుండిరి. "సారంగి" అనెడి వాద్యమును మీటుచూ భక్తి పాటలు పాడుటయు గుంపులుగా వచ్చి ఆ పాటల ననుసరించుటయును నిత్య వ్యవహారములో నుండెడిది. దీని పర్యవసానవే నేటి సామూహికారాధన. సారంగి, విల్‌యాత్తి వాద్యములు పరంపరానుగతముగా వచ్చిన కళాకారులకు భూదానము లిచ్చినట్లు శాసనములు చాటు చున్నవి. తంజావూరు బృహదీశ్వర ఆలయమున గల మొదటి రాజ రాజు 29వ సంవత్సరం శాసనములో "ఆర్య సంగీతమును, తమిళ సంగీతమును పాడిన వారికి చక్రవర్తి బహు మతులిచ్చిన వివరణ కలదు.

పల్లవరాజైన మహేంద్రవర్మని క్రీ.శ. 7వ శతాబ్దము నాటి శాసనమున "సంకీర్ణ జాతి ప్రకరణ ప్రవృత్తి మాత్ర" మనెడి విషయము కలదు. మహేంద్ర వర్మ స్వయముగా గొప్ప సంగీత విద్వాంసుడు. నందికేశ్వరుడు నుడివిన తిశ్ర, చతురస్ర, ఖండం, మిశ్ర అనెడి నాల్గు తాళ లక్షణములే కాక ఈ మహారాజు "సంకీర్ణ" జాతిని వాటితో ప్రత్యేకముగా జోడించెను. ఇంకను రెండవ శతాబ్దమునకు చెందిన కొంగునాడు శాసనములోను తాళగతులు వర్ణింపబడినవి [66]

"తిరువణ్ణామలై" అరుణాచల ఆలయమున ఉమాదేవి పాడగా శివుడు నాట్యమాడె నని, "రెండవ కొప్పెరుంశింగన్" కాలము నాటి శాసనమువలన తెలియుచున్నది.[67]

"చంద్రగిరి", "తిరుమల" ఆలయమున "పురట్టాసి" నెలలో తిరుప్పావై ప్రబంధ గానము తదుపరి స్వామి వారికి నివేదన జరుగవలెనని శాసనము కలదు. మహాభారత పఠనము జరుగుచుండెనని కూడా తెలియుచున్నది.

"భిల్ల మంగళం" ననున్న ఈశ్వర ఆలయమున పాశురమును పాడు సంప్రదాయ ముండెడిదని శాసనముచే విశదమగుచున్నది.

స్త్రీలు గంధర్వ గానము చేసెడివారని మరొక శాసనము నుడువుచున్నది. [68].

రాతి స్తంభముల నుండి పుట్టిన సంగీతము నాధారముగా గొని "తేవారం" పాడుచుండెడి వారను విషయము గమనించదగినది.

పర్వత వాసులకు సంగీత పరిజ్ఞానము సహజముగా నుండెడిది. వీరిలో ముఖ్యులు "పులయర్" అనెడి వారు. వీరు తమ పాటలను "తాళము"లనెడి వారట. ఈ తాళముల పేర్లు వారు పూజించు దేవతల నామములతో నుండెడివట. ఉదా : కున్దనాద తాళం,

మంగళనాద తాళం.

బృందావన సారంగం, శుద్ధ సావేరి, సరస్వతి, శంకరాభరణము మున్నగు రాగముల ఛాయలు ఈ పాటలలో కానవచ్చును. వీరి బృంద వాద్యమునకు "సింగారం" అని పేరు. నాట్యమాడుచూ పాటలు పాడుట వారి ఆచారము.

"కురవంజి" అనెడిది సంగీత నాటకముల సమ్మేళనము. ఇది పూర్వ కాలపు నాట్య నాటకము. చక్రవర్తుల దయతో తమిళనాడు ఆలయ ఉత్సవములలో ఇది ప్రదర్శింప బడెడిది. భక్తితో కూడిన శృంగార దృశ్యములు ప్రదర్శింపబడు చుండెడివి.

తంజావూరు పెద్ద ఆలయ గోపురములోని ప్రాకారమున "కురవంజి" మేడై అని కలదు. రాజరాజ చోళుడు ఈ కళను చక్కగా ఆదరించెను. ఇవి యక్షగానములన బడును.

మార్గశిర మాసములో శ్రీరంగము, ఇతర వైష్ణవ ఆలయములలో ప్రసిద్ధ సంగీత బృందము, ఒక నాట్యాచార్యులు తిరువాయ్‌మొళి పాడి నాట్యమాడెదరు. ప్రబంధము పఠించే సమయమున వారు ప్రత్యేక వేషమును ధరించెదరు. తలపై కిరీటము వలె టోపీ ధరించెదరు. వారే 'జాలరా'ను వేయుచు పాడుట వారి ఆచారము. నాట్యమున ముఖ్యముగా అనేకములైన "కృష్ణలీలలు" పేర్కొనబడును. ఈ విధముగా పాడు వారిని "అరయర్" అనెదరు. "ఈయర్పా" అనబడు వ్యాఖ్య రచనలలో వీరిని గూర్చిన వివరణలు కలవు. నేటికిని శ్రీరంగం, శ్రీవిల్లిపుత్తూరు, ఆళ్‌వార్ తిరునగరి ఆలయములలో వీరి సేవ కొనియాడబడుచున్నది. ఆళ్వారుల పాశురములను "పణ్"తో పాడుట, ఆ పాశురమునకు "అభినయము" చేయుట, భావము చెప్పుట, కొండాట్టం తో వారి సేవ కూడుకొని యుండును. "పాశురము" అనగా భగవంతునిపై భక్తుడు కావించే కవితా గానము. "కొండాట్టం" అనగా "భగవత్కీర్తిని కీర్తించుట" యని అర్థము.

పెరియాళ్వార్లు "తిరువాయ్‌మొళి" ప్రబంధమున శ్రీరాముల వారిని "అరయర్" అని కీర్తించెను. ఈ కళను తిరుమంగై ఆళ్వార్లు ప్రారంభించినారని కోయిల్ చరిత్ర తెలుపుచున్నది. తిరునారాయణ స్వామి "మేల్ కొట్టై" ఆలయమున ఆచార్య స్వాములు కొందరు కొన్ని పాశురములు పాడగా వాటిని విని మొత్తము ప్రబంధమునకై "నాథమునులు" తపస్సు చేసి తాను పొందిన పాశురములను క్రోడీకరించిరి. ఆ పాశురములకు వారు పణ్-స్వరము నేర్పరచి తాళములను కూర్చి ప్రబంధములను ప్రచారములోనికి తీసికొని వచ్చిరి. నాథమునులు తమ జామాతకు నేర్పించి శ్రీరంగ ఆలయమున 'అరయర్' సేవను

కొనసాగించిరి. పాడ్యమి మొదలు పది దినములు పగటివేళ ఈ సేవను చేయదొడిగిరి. మార్గశిర ఏకాదశి మొదలు పది దినములు రాత్రి వేళ ఈ సేవలను ఏర్పరచిరి. పగటివేళ చేయు ఉత్సవమును "పగల్ పత్తు" అనియు, రాత్రివేళ చేయు ఉత్సవము "రావత్తు" అనియు ఆలయములలో ఉత్సవములు జరుగును. దీనినే కొందరు 'అధ్యయన ఉత్సవ'మని పేర్కొనెదరు. వేదము, పురాణము, ఆగమము, నాట్యశాస్త్రము మున్నగువాని ననుసరించి ఈ కళ ఏర్పడినదని ఈ కళ గొప్పగా పొగడబడినది. మైసూర్ మేల్ కోట్టలో అరయర్‌లు పాడెదరు. కాని అభిన యించరు.

వైష్ణవ గ్రంథములలో 'అరయర్'లను గురించిన వివరణలతో తిరునగరి అరయర్, విల్లి పుత్తూర్ అరయర్, తిరువేంగడత్తు అరయర్, తిరుమలై కునియనిన్ద అరయర్ అని వర్ణనలుండుటచే అనేక విష్ణ్వాలయములలో ఈసేవ జరిగెడిదని మనకు విశదమగు చున్నది.

అరయర్‌లు పాడు పణ్ (స్వరము) పురాతనమైనది. దీనిని రెండు విధములుగా పేర్కొనుచున్నారు. (1) గోష్ఠిపాడు విధము. అనగా సాధారణముగా ఆలయములలో జరిగెడి ప్రబంధ గానము. (2) అరయర్‌లు "పణ్"లతో పాడు ప్రబంధ గానము. శ్రీవిల్లి పుత్తూర్ ఆలయములో నేటికిని ఈ సేవ జరుగుచున్నది.

"అరయర్"ల గూర్చి "మొదటి కులోత్తుంగ" చోళుని కాలము నాటి శాసనము కలదు. తిరువాయ్‌మొళి పాశురములను తెల్లవారు జామున మేల్కొలుపు సేవలో పాడెడి వారని కలదు. కంచి వరద రాజాలయమున ఇరువది రెండు మంది "అరయర్" లుండెడివారని ఆ గుడి శాసనము తెలుపుచున్నది. ఆలయములలోనే ప్రత్యేకముగా ఈ కళాసేవ జరుగుచెండెడిది. (క్రీ.శ. 1242)

"పళ్ళు పాడల్‌గళ్" అనెడి పాటలను వీరు గానము చేయుదురు. భగవంతుని కీర్తించు పాటలివి. ఇవి పదమూడు పాటలతో కూడినవి. ఉత్సవ సమయములలో ఈ పాటలను మృదంగ వాద్యముతో గానము చేయుదురట.

అరయర్ సేవలో "ప్రణయ కలహము" విశేష భాగము. "అధ్యయన ఉత్సవము"లో పదవ రోజు జరపబడును. నమ్మాళ్వారులు స్వామికిని దేవేరికిని మధ్య ఏర్పడు చిన్న ప్రణయ కలహమును పోగొట్టుటయే అందలి విషయము. ఈ విధముగా "అరయర్"లు విష్ణ్వాలయ ఆరాధనలో, ఉత్సవ వేళలలో ముఖ్యపాత్రను వహించి యున్నారు. (69)

భాగవతమేళము క్రీ.శ. నాల్గవ శతాబ్దమున ఏర్పడినది. తంజావూరు జిల్లాలో ప్రసిద్ధి చెందినది. రాజరాజ చోళుని కాలమున బాలీ, జావా వంటి ఇండోనేషియా దీవులకు

వ్యాప్తి చెందినది. ఈ కళలకు పుట్టినిల్లు తంజావూరు నుండి 15 కి.మీ. దూరమునగల మేలట్టూర్ అనెడి చిన్న గ్రామము.

ఈ కళ తెప్పెరుమాన్ నల్లూరు, శూల మంగళ ఓరత్తనాడు, ఊత్తకాడు, కాడు మంగళం ఊరులలో వ్రేళ్ళతో పాదుకొని పోయినది. "మేలట్టూరు"లో నేటికిని శ్రీ వరదరాజస్వామి కోవెలలో లక్ష్మీనరసింహస్వామి జయంతి భాగవత మేళ ఉత్సవము ప్రతి సంవత్సరము తమిళ పంచాంగము ననుసరించి చిత్ర మాసమున కొనియాడ బడుచున్నది. తెల్లవారు ఝామ వరకు ఈ ప్రదర్శన జరుగును.

ఈ సంగీత నాటకములో ప్రహ్లాద కథ ఎక్కువ ప్రాముఖ్యమును కలిగియున్నది. నాటక మధ్యమున నటులు పాటలు పాడెదరు. ఆ పాటలకు ద్విపద, తరువోజలనెడి పేర్లు కలవు.

యుద్ధము, సంహార సన్నివేశములు నటించక ఆ సన్నివేశములను శ్రావ్యముగా పాడి వినిపించెదరు. ఈ విధముగా తమిళ దేశమున ఆలయములలో సంగీత కళః వృద్ధి చెందినట్లు మనకు విశదమగుచున్నది. [70]

ఏ భాషా సాహిత్యమున గాని గేయమే ప్రథమ దశయనుట నిర్వివాదము. పిమ్మట పరిణామము చెంది ప్రాథమిక దశ నుండి వృద్ధియగుచు పద్య కావ్య రూపమును దాల్చును. ప్రాచీన తెలుగు భాషతో గోండు, కోదు భాషలకు సంబంధము కలదు. కోదు భాషలో చాల ప్రాచీన కాలము నుండి పాటలు కలవనియు, తమ వేల్పుల కొలువులలో కోదులు తంతు నంతయు పాటల తోడనే జరిపింతురని ఈ భాషా వ్యాకరణము వ్రాసిన లింగం లక్ష్మీజీ పంతులు గారు తెలియజేసిరి. ఆదిమ సమాజములో ప్రప్రథమ ముగా పాటలు పిమ్మట వచన రచన లేర్పడుట సహజము. తమిళ భాషలో ఆ పాత పాటల సంకలనములే "పత్తుపాట్టు, ఎట్టుతొగై" గ్రంథములుగ వెలువడినవి. అదే విధముగా హాలుని గాథాసప్తశతి'లో పురాతన ప్రాకృత గాథలు సేకరించబడినవి.

ఆది కవి నన్నయ్య భారతమున తన కాలమున వ్యాప్తిలోనున్న "నాగీ" గీతములను పేర్కొనెను. [71]

నన్నె చోడుడు "కుమార సంభవ'మున ఊయల పాటలను, అంకమాలికలను రాగయుక్తమైన గేయములను అభినయముతో కూడిన 'అలతు'లను పేర్కొనెను. [72]

పాల్కురికి సోమన 'పండితారాధ్య' చరిత్రమున తుమ్మెద పదములు, నివాళి పదములు, వాలేశు పదములు, గొబ్బి పదములు వెన్నెల పదములు పాడుచు వెలనాటి చోడుని సభ

కరిగె"నని కలదు. [73]

శివరాత్రి జాగరణ సమయము నందలి విషయములను వర్ణించుచు నాటి నాటక ప్రదర్శనములను, ఆటలను, పాటలను సూచించెను.

ఈ పాటలు ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పదులలో సామాన్య జనుల వాడుకలో నున్నట్లు తెలియుచున్నది.

'రంగనాథ రామాయణము'లోని 'సౌమిత్రి హాసము' ఆంధ్ర స్త్రీలు నిరంతరము పాడుకొను గేయములలో ప్రశస్తమైన 'లక్ష్మణదేవర నవ్వు' అను దానికి ఛాయా రూపమేమో!

ఆంధ్ర దేశమును పాలించిన కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని కాలమున గజసేనాధి పతి జాయప 'నృత్త రత్నావళి' 'గీత రత్నావళుల' గ్రంథములలో ఎక్కువగా దేశి సంగీత రీతులను, దేశీ నృత్తరీతులను వివరించినట్లు తక్కిన వారు చేయలేదు. [74]

పదమూడవ శతాబ్దమున సింహాచలములో కృష్ణమాచార్యుల 'సింహగిరి' నరహరి వచనముల ద్వారా తెలుగు పాట ఆలయ మంటపములలో అడుగులు వేయుట నేర్చుకొన ప్రారంభించినది. [75]

పదునాల్గవ శతాబ్దమున విజయనగర సామ్రాజ్యము కళలకు నిలయమై విలసిల్లినది. విజయనగర స్థాపకుడైన విద్యారణ్యుని కాలమున సంగీతముతోపాటు సంగీత విద్వాంసులు విశిష్ట స్థానమును పొందిరి.

మధ్య కాలమున అన్నమయ్య కాలము నాటికి సంగీతమును గురించిన లక్షణ గ్రంథములు, ప్రబంధ పద్ధతిని గురించిన వివరణలు కానవచ్చుచున్నవి. రాణాకుంభ 'సంగీత రాజ' గ్రంథము మధ్య కాలము నాటిది. రసరత్న కోశము (గీత గోవింద వ్యాఖ్య) గాన పద్ధతిని గురించిన గ్రంథము.

శ్రీ వేంకటేశ్వరుని ఆలయమైన 'తిరుమల' భక్తి రచనలకు స్ఫూర్తిగా నిలిచి, సంగీత సాహిత్య విద్వాంసులైన తాళ్ళపాక వారికి పీఠమైనది. తాళ్ళపాక వారి సంకీర్తనలు, కర్ణాటక దాస రచనలు 15, 16, శతాబ్దములో ప్రఖ్యాతి పొందినవి. ఈ రెండు శతాబ్దములు 'సంకీర్తన' చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినవి. మొట్టమొదటిసారిగా పల్లవి అనుపల్లవి, చరణములని మూడు భాగములతో సంకీర్తన రూపొందినది.

ఉత్తర దేశమున కబీరు, సూర్‌దాసు, తులసీదాసు, మీరా, వల్లభాచారి, చైతన్య మహా ప్రభువు, గురునానక్ మున్నగువారు భక్త సమాజమును నిర్మించి సంగీత సాహిత్య సరస్వతికి

తమ భక్తి నివాళులర్పించి ధన్య జీవులైరి.

భజన పద్ధతి వీరి సంకీర్తనల మూలముగా ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. వీరి శైలి సులభగ్రాహ్యమై సరళ వ్యావహారిక భాషతో కూడి తరువాతి వారికి మార్గదర్శక మైనది.

ఆంధ్ర దేశమున "ద్రావిడాగమ సార్వభౌము"డైన అన్నమయ్య రచించిన శృంగార వైరాగ్య సంకీర్తనలకు ఆంధ్ర వేదమని పేరు కలిగినది. 'మేలుకొలుపు'తో ప్రారంభించి ఏకాంత సేవ వరకు ముప్పది రెండు వేళల నిత్యము స్వామిని సేవించుచు సంకీర్తనా చార్యుడైన అన్నమాచార్యుడు సంకీర్తన పద్ధతికి ప్రారంభకుడాయెను. "చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు జాలెల్ల నణంచు సంకీర్తనం" అని సంకీర్తన మాహాత్మ్యమును లోకమునకు చాటి చెప్పిన మహిమాన్వితుడు అన్నమయ్య.

### నాట్యము

ఆలయములు సంగీత సాహిత్యములకే కాక నాట్యమున కాలవాలమై నిలిచినవి. మార్కండేయ పురాణములోని "దైవ లోకమున నాట్యోదయమును" గురించి ప్రాచీన గాథల వలన మనకు తెలియవచ్చుచున్నది. చతుర్ముఖ బ్రహ్మ వేద విజ్ఞానమును చిలకరించి ఋగ్వేదము నుండి పాఠ్యమును, సామవేదము నుండి గానమును యజుర్వేదము నుండి అభినయమును అధర్వణ వేదము నుండి రసమును గ్రహించి నాట్యశాస్త్రమును సృజించెనని వర్ణింపబడినది. అందుచే నాట్యమునకు పంచమ వేదమని, నాట్యవేదమని ప్రసిద్ధి కలిగినదని తోచుచున్నది.

నాట్యమును భారతి, సాత్త్వతి, ఆరభటి, కైశికి అను వృత్తులుగా విభజించి బ్రహ్మ, భరతమునికి తెలిపెనని చెప్పబడుచున్నది.

భరతాదులు గావించు నాట్యము అంగ హారములతో కూడిన పురుష నాట్యము. శృంగారరస ప్రధానమైనది. కైశికీ నాట్యము సుకుమార విలాసయుతమగు స్త్రీ నాట్యము. శివుని ఆజ్ఞ పొంది ఆయన శిష్యుడగు తండు భరతునకు తాండవ లక్షణమును, పార్వతి స్త్రీ జనోచితమగు కోమల లాస్యమును భరతునకు ఉపదేశించిరని పూర్వగాథల వలన విశదమగుచున్నది.

సదాశివుడు, పార్వతి, బ్రహ్మ, విష్ణువు నందికేశ్వరుడు, కోహలుడు, యాజ్ఞవల్క్యుడు, నారదుడు, ఆంజనేయుడు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు, బృహస్పతి, అర్జునుడు, రావణుడు మున్నగువారు నాట్యశాస్త్రమునకు ప్రామాణికులని ప్రమాణ శ్లోకములు

నుడువుచున్నవి. కాలక్రమానుగతిని ఈ విధముగా దేవలోకము నుండి నాట్యము మానవ ప్రపంచమున వ్యాపించినదని తుమ్మలపల్లి సీతారామారావుగారు వివరించిరి. (76)

వేద యుగము నందు యజ్ఞ యాగాది క్రతువులతో జరుగు ఉత్సవాదికములలో నాట్యములు జరిపి వినోదించుట ఆ కాలమునాటి ఆచారముగా నుడవబడినది. ఋగ్వేదము నాటికి, వీర బృంద, గాథా నృత్యములున్నట్లు తెలియుచున్నది. నాట్యము విభజన చెంది యజుర్వేదము నాటికి వైణికులు, మార్దంగికులు నటకులుగా వ్యవహరింప బడెడివారు. సభల నియమములు, శాస్త్ర విశేషములు, నవీన వాద్య విశేషములు, నిర్మాణ రీతులు అథర్వణమున వివరించబడినవి. క్రీ.పూ. రెండు వందల నాటికి భరత నాట్య శాస్త్రము వెలువడినది. సంస్కృత వాఙ్మయము' వేద సాహిత్యము నాట్యమును ఆరాధనీయముగా వర్ణించెను. భరతముని నాట్య శాస్త్రమున పేర్కొనిన నాట్యశాలా నిర్మాణాది నియమములు కాళిదాసు "శర్మిష్ఠ విజయము"న పేర్కొబడినవి.(77)

భరత మతము ననుసరించి నాట్యములు నృత్తము, నృత్యము, నాట్యము, తాండవము, లాస్యము అని ఐదు భాగములుగా విభజించబడినవి. రాగ తాళములతో కూడినది నృత్తము. రాగ, భావములతో కూడినది నృత్యము. పౌరాణిక గాథలను, నృత్త, నృత్య అభినయములతో కూడినది నాట్యము. సదా శివునికి ప్రీతికరమైనది తాండవము. కోమలమైన స్త్రీ నాట్యము లాస్యములని వివరింపబడినవి.

దాక్షిణాత్యుల నాట్య పద్ధతిని దేశినాట్యమనియు, ఆర్యుల నాట్య పద్ధతిని మార్గదేశి పద్ధతి యనియు విభజింపబడినది.

దేశి నాట్యము పరంపరాగతమై, ప్రజారంజకమైనది. రాజప్రాసాదములందు దైవోత్సవములందు భగవత్పరముగ జరుగుచుండెడిది. ఈ ప్రదర్శనము ఉత్తమ జాతి వారి సమక్షముననే జరుగవలెనని నిర్దేశించబడినది.

నటరాజగు శివుడు దాక్షిణాత్యుల ముఖ్య దైవము. ఆయన తిల్లై ఆరణ్యములందు అసురులను వధించి ప్రప్రథమముగా చిదంబరము నందు ఆనంద నృత్యము చేసెనని ప్రసిద్ధి గలదు. నాట్య కళ ప్రాచీన కాలము నుండి అభివృద్ధిగాంచినది. 'తిల్లై' యందు గల నటరాజ ఆలయముననే నాట్యకళ ప్రారంభమైనట్లు విజ్ఞులు భావించుచున్నారు.

నటరాజు విగ్రహమునకు ఎదుట నున్న నలుబదియారు స్తంభముల మండపము సభామండపమై యొప్పెనని చరిత్రకారులచే వివరింపబడినది. ఈ ఆలయము లోపలి ఆవరణలో నున్న శివకామసుందరి అమ్మవారి ఆలయములో నటన రీతులు, 'నూట

యెనిమిది' తాండవ రీతులు మిక్కిలి వివరములతోను, సూక్ష్మముగను చెక్కబడియున్నవి. ఒక్కొక్క దానిపై ఒక కరణము చూపబడియున్నది.

నాట్యమును గురించియు, అభినయమును గురించియు తెలుపునది నాట్య శాస్త్రము. భరతముని నాట్యశాస్త్రము, నందికేశుని అభినయ దర్పణము, భరతార్ణవము నాట్యశాస్త్ర వివరణలకు ప్రమాణ గ్రంథములు.

దక్షిణ దేశమున 'సంగ' సాహిత్యము నాట్య పద్ధతులను కొంత వరకు వర్ణించినది. 'కలిత్తొగై' అను గ్రంథము నందు 'శివతాండవ' లక్షణములు తెలుపబడినవి. తాండవ మును మూడు దశలలో వివరించిరి. మొదటి దశ 'కొడుకట్టి', రెండవ దశ "పండరంగం" మూడవ దశ 'కాపాలి'. ఈ నాట్య పద్ధతులకు నిర్దేశమైన నృత్త గీత తాళముల పరిజ్ఞాన మావశ్యకము. 'కూత్' అను శబ్దమునకు తమిళమున 'నాట్య'మని అర్థము. ఆ కాలమున విరివిగా ప్రచారముననున్న నాట్య పద్ధతులు 'పదునొకండు' విధములని తెలియు చున్నది.

వవై, వారి సంతి, వినోదం, ఆర్య ఇయల్బు, దేశి అనునవి ఆనాటి నాట్య పద్ధతులు. 'పాదు వియల్' సామాన్య జనులకై నిర్దేశింపబడినది. ఇవిగాక 'నూట యెనిమిది' మార్గదేశి నాట్య పద్ధతులు 'చొక్కం' పేరున వర్ణింపబడినవి.

వాచికముగ తెలిపిన భావమును అంగములతో ప్రకటించు విధము 'అభినయ' మనబడును. 'కురవై' నాట్య పద్ధతి ఈ రీతికి చెందినది. ప్రేమ కథ వస్తువుగా ఇందు గ్రహించబడును. శిరస్సుపై నీటి కుండల నింపుకొని చేయు నాట్యము "కుడం" శృంగార రసపూరితమగు స్త్రీ నాట్యము. 'నొకు' అనునది మరొక దేశి నాట్యము ఇట్లు దేశి నాట్య పద్ధతులనేకములుండినవి.

'శిలప్పదిగార' గ్రంథమున 'కూత్తు' నాట్య పద్ధతి విశేషముగా ఆదరించి ప్రోత్సహింప బడినది. "త్రిపుర-సంహార" నాట్య ప్రయోగమును 'సేరన్‌శెంగుట్టువన్' అను చేరరాజు 'అంబర్ కాడు' అను గ్రామమును నటుల కౌశలమును మెచ్చి శాశ్వతముగా దానము చేసెనని తెలియుచున్నది. 'కొరవంజి'లకు మూలమగు దేశి నాట్య సంప్రదాయములు, నాట్యకృతులు ఇందు వివరించబడినవి.

శివాలయములో శివార్చనయందు నాట్యమొక ప్రధాన భాగమైనది. పూజాది సమయములందు గీతాది గాన సంకీర్తనములు, నృత్త నాట్యములు జరిపిరి. దేవతల కొలువులు, ఉత్సవములు, తిరునాళ్ళు అనేక జానపద నాట్యములకు దోహదములైనవి.

పేరిణి. కుండలి, బిందు మున్నగు దేశి నాట్య పద్ధతులు సామాన్య ప్రజలకు వినోదమును కలిగించినవి.

మదుర, కావేరి, కంచి మున్నగు స్థలములు దేవవాలయములకు నెలవైనవి. ఇవి దైవ ఊలకే కాక నృత్త నాట్య ప్రయోగములకు రంగస్థలములైనవి. తమిళభాషలో 'తిరు మందిర' మనెడి గ్రంథములో దేవాలయముల వ్యాప్తిని గురించిన విశేషములనేకములు వివరింపబడినవి. ఇట్లు నృత్త. నృత్య గీతాది కళలు అభివృద్ధి చెందినవి. నిత్య పూజా విధుల కడ్డములేని వేళలలో ఆలయములలో నాట్య ప్రదర్శనలేర్పరచెడి వారు.

రాజరాజ చోళుడు ప్రతి ఒక్క ఆలయమున నాట్యమంటపములను కట్టించెను. నాట్య కళాప్రదర్శనకు, తక్కిన ఆలయములను నిర్వహించుటకు, తంజావూరు పెద్ద ఆలయమున "నాల్గువందల" దేవదాసీలుండెడివారని, ఇంకను నాట్యకళతో ఆలయ ములలో భగవదారాధన చేసెడివారని తెలియుచున్నవి.[78]

దక్షిణ దేశమున దేవాలయ సేవలలో నాట్యమొక విశిష్టాంగమైనది. నాట్యము కొరకు కొందరు స్త్రీలు గుడిసేవకై నియమింపబడిరి. వీరిని "దేవదాసీ"లని, గుడిసానులని వ్యవహరించెడివారు. తూర్పుగోదావరి జిల్లా యందలి ద్రాక్షారామమను గ్రామమున దేవదాసీలుండెడివారని తెలియుచున్నది. 'గుడిసేవ' అని ఇంటిపేరుగల వారు కూడ నాడు ఉండెడివారనియు, కొన్ని ప్రాంతముల వారు పెదమున్నూరు, మరికొంతమంది చిన్న మున్నూరు సానులని రెండు శాఖల భేదములుండినవేమోనని ఊహించుటకు వీలుగా నున్నది. బహు ప్రాచీన కాలము నుండియు నృత్యగానాభినయ కళలు వర్ధిల్లినవి. నాట్య కళా పోషణము వీరి ప్రధాన వృత్తి. దైవ పూజా మందిరములు దేవదాసీల నృత్య గీతగానముల కాలవాలములైనవి. క్రీ.శ. పదమూడవ శతాబ్ది మధ్య కాలము నుండి వీరు కళావంతులని ప్రత్యేక శాఖగా ఏర్పడిరి. నామ సంకీర్తనకై నట్టువసానులు కొందరు నియుక్తులగుచుంటయు వారు ఆలయ ప్రాంగణములందాడి పాడుచుండుటయు సింహాచల ప్రాంతపు శాసనములచే తెలియుచున్నది. ఇది ఆగమోక్తమగు సంప్రదాయము. కేశవస్వామి ఆలయమునకు ప్రక్కగా అన్నమయ్యకై నరసింగరాయడొక పెద్ద భవనము నేర్పాటు చేసెనట. తిరువీథి సానులలో 'ఆనైమోడి' అను నామె కూతురు ప్రశంస కానవచ్చుచున్నది. దేవదాసీలు కళలను వంశపారంపర్యముగా ననుసరించిరి. మహానవమి నాడు రథోత్సవము లందు ప్రతి శనివారము నాడాలయములందు నాట్య ప్రయోగములు గావించుట వారి ఆచారముగా నుండెడిదట. పూర్వ కాలము నాటి నాట్య ప్రయోగములను, వాటి స్వరూపములను గ్రహించుటకు

విఠలస్వామి ఆలయము, అచటి 'విజయ భవన' మందలి శిల్పము ప్రమాణములుగా నిలిచినవి.

హజారా రామాలయము, విజయ భవనము లందలి శిల్పములలో కోలాటము మున్నగు నాట్యములు చెక్కబడియున్నవి. అజంతా శిల్పములు నాటి కళా వైభవమును లాసికా భంగిమలను నాట్యశాస్త్ర విజ్ఞానమును స్పష్టీకరించుచున్నవి.

దేవాలయములందు నిత్య దీప ధూప నైవేద్యము జరుపుటకు, ఉత్సవ కల్యాణములు నిర్వహించుటకు, అర్చకత్వము చేయుటకు ప్రతి దేవస్థానమునకు ఆలయ మాన్యము లుండెను. వీటిన ఈనాములని, వృత్తులని వ్యవహరించెడివారు. దేవదాసీలు, అర్చకులు భాగవతులు, రజకులు మున్నగు వారి సేవకు ప్రతిఫలముగా వారికి దేవాలయ మాన్యములు వార్షికములు నొసగెడివారు.

పండితారాధ్య చరిత్రలో నాట్యాంగములు విపులముగా వర్ణించబడెను. భరత ముని అనంతరము నాట్యకళ పొందిన భిన్న పరిణామ దశలు, సంప్రదాయములగు దేశి పద్ధతులు పరిష్కృతము గావింపబడి పొందుపరచబడినవి. అభినవ గుప్తాచార్యుడు భరతముని నాట్యశాస్త్రమునకు వ్యాఖ్య రచించెను. సారఙ్గ దేవుడు 'సంగీత రత్నాకరము'న భిన్నదేశి నాట్య సంప్రదాయములలోని విశిష్టతను వర్ణించెను.

కాకతీయ కాలమున శివతాండవము విశేష ఆదరమును పొందినది. రామప్ప దేవా లయములోని శిల్పములు అనేక అంగహారములను, అభినయ పరిజ్ఞానమును, స్ఫురింప జేయుచున్నవి. కోటలోని స్వయంభు లింగేశ్వరాలయము నందు గూడ నాట్యకళా పరిజ్ఞానము వెల్లడించెడి శిల్పములు గోచరించుచున్నవి.

జాయప్ప సేనాని 'నృత్త రత్నావళి' అను నాట్య లక్షణ గ్రంథమును వ్రాసెను. మార్గ, దేశి పద్ధతులు రెండును ప్రసిద్ధ ప్రజా వినోదములుగా అందు పరిగణించబడినవి. 'షోడశ కుమార చరిత్ర' రచించిన సూరామాత్యునకు 'అభినవ భరతాచార్యు'డని ప్రసిద్ధి కలిగెనని తెలియుచున్నది. కాటయ వేమ, పెద కోమటి వేమ, రేచర్ల సింగ భూపాలుడు, నాట్యశాస్త్ర ప్రజ్ఞావంతులుగా పరిగణింప బడిరి. కుమారగిరి ప్రభువు 'వసంత రాజీయము' అను నాట్యశాస్త్రమును రచించెను.

శైవ, వైష్ణవ క్షేత్రములలోని దేవాలయములందు శివ విష్ణు లీలలు చెక్కబడినవి. నాట్య మంటపము లుండినట్లు తెలియుచున్నది. శ్రీశైల క్షేత్రమున అరువది నాల్గు నాట్య కూటము లుండినట్లు ప్రసిద్ధి యున్నది. దేవతల కొలువులు, ఉత్సవములు అనేక నూతన నాట్య

పద్ధతులు రూపొందుటకు దోహదములైనవి. కావడి చిందు, కోలాటము ప్రచారములో నున్నట్లు దేవాలయ శిల్పములు నిదర్శనములుగా నిలిచినవి.

చిదంబరంలోని నటరాజాలయము నందు తూర్పు గోపురమున శివతాండవమునకు సంబంధించిన తొంబది మూడు భంగిమలు గల విగ్రహములు చెక్కబడియున్నవి. ఆలయములోని శిల్పములు భక్త కవుల భక్తిరస స్ఫోరకాలుగా నుండినవి.

జయదేవుని 'గీత గోవిందం' భక్తి శృంగారరస ప్రధానమైనది. 'అష్టపదులు' గాన యోగ్యముగానే కాక అభినయ ప్రధానముగా రచింపబడినవి. అభినయమునకు, నాట్య, లాస్యములకు అష్టపదులె లక్ష్యములు, ప్రామాణికములు. తెలుగు తమిళ భాగవతులు ఆనాటి నుండి అష్టపదులను అభినయించుచుండిరి. కేరళ దేశమున వీనిని లక్ష్యముగా గొని నృత్త రూపకములను ప్రదర్శించిరి. వల్లభాచార్యుని అవతారముతో కృష్ణభక్తి 'మధుర' భక్తి సంప్రదాయములో ప్రచారములోనికి వచ్చి రాధా మాధవ లీలలు, విరహ వియోగ ములు ఖండ కావ్యములుగా రచనలు చేయబడి అభినయించబడినవి.

అన్నమయ్య, క్షేత్రయ్య, అటుపై వచ్చిన సభాపతయ్య, సారఙ్గపాణి, సీనయ్య మున్నగు పద రచయితలు, జావళీ రచయితలు అభినయ కళకు పుష్టిని చేకూర్చిరి.

## మొదటి అధ్యాయము - అధస్సూచికలు


1. శ్రీరామానుజవాణి - 1997 శ్రీరామానుజ వాణి సీరీస్-34, శ్రీపతి స్తుతిమాల
2. వేంకట లక్ష్మీ నృసింహాచార్యులు, పాలవంచ తిరుమల గుదిమెళ్ళ. ప్రథమ ముద్రణం 1993. పెరియ తిరుమొళి, మచిలీపట్టణము, శ్రీమాన్ పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకటలక్ష్మీ నరసింహాచార్యులు 23/329, బచ్చుపేట-521001.
3. శ్రీకులశేఖరాళ్వార్, ముకుందమాల, మొదటి శ్లోకము.
4. వేంకట లక్ష్మీ నృసింహాచార్యులు, పాలవంచ తిరుమల గుదిమెళ్ళ, ప్రథమ ముద్రణము, 1993, పెరియతిరుమొళి, మచిలీపట్టణము
5. శ్రీ గోపీకృష్ణ, 1980 శ్రీనివాస మంగాపురము. మన ఆలయముల చరిత్ర, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానము.
6. Rustana, J. Mehta, 1974, Master Pieces of Indian temples. Tarapore vala, sons co. Pvt. Ltd.
7. Champaka Lakshmi, R. 1981 Vainsava iconography in the Tamil Country, Delhi : Orient Longman Ltd.

8. Ed. Haridass Bhattacharya 1975. The cultural Heritage of India IV The religions. Calcutta : Swami Lokes warananda, Ramakrishna Mission Institute
9. Ibid
10. Ibid.
11. వేదవ్యాస, డా : 1997 ప్రథమ ముద్రణ. శ్రీ వేంకటేశ్వర వైభవం, మొదటి భాగము హైదరాబాద్ : వేద విశ్వవిద్యాలయము
12. Rustana J. Mehta - 1974 Master Pieces of Indian Temples Tarapore vala sons co. pvt. Ltd.
13. Padmanabhan, S. 1977. South Indian Temples, Nagarcoil Pub. by P. Leela
14. Ibid.
15. Champaka Lakshmi, R. 1981 - Vainsava Iconography in the Tamil country, Delhi : Orient Longman Ltd.
16. Rustana J. Mehta, 1974 - Master Pieces of Indian Temples Tarapore vala sons co. pvt. Ltd.
17. అను. తిమ్మావజ్ఝల కోదండ రామయ్య, 1982, తమిళ వాఙ్మయ చరిత్రము, న్యూఢిల్లీ, సాహిత్య అకాడమి.
18. వరదాచార్యులు, ధనకుధరం, తమిళ సంఘ సాహిత్యము - వైష్ణవ ధర్మ దర్శనము వ్యాసం. గుంటూరు శ్రీరామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల.
19. లక్ష్మీరంజనం, ఖండవల్లి, 1996, 8వ ముద్రణ, ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి, మద్రాసు, బాల సరస్వతి బుక్ డిపో.
20. వరదాచార్యులు, ధనకుదరం, తమిళ సంగ సాహిత్యము, వైష్ణవ ధర్మ ధర్శనము (వ్యాసం) గుంటూరు, శ్రీరామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల.
21. Rustana J. Mehta, 1974 - Master Pieces of Indian Temples Tarapore vala sons co. pvt. Ltd.
22. రెడ్డి, డి.సి. జూన్ 1994, టి.టి.డి. శాసనాల్లో తిరుపతి. తిరుపతి. తిరుమల తిరుపతి దేవస్థానము.
23. లక్ష్మీరంజనం, ఖండవల్లి, 1996 8వ ముద్రణ, ఆంధ్రుల చరిత్ర సంస్కృతి.
24. Rustana J. Mehta, 1974 Master Pieces of Indian Temples, Tarapore vala sons. co. pvt. Ltd.
25. Champaka Lakshmi R. 1981 Vainsava iconography in the Tamil

Country, Delhi : Orient Longman Ltd.

26. కోదండరామయ్య తిమ్మావజ్ఝల 1982 తమిళ వాఙ్మయ చరిత్ర (అనువాదం) న్యూఢిల్లీ : సాహిత్య అకాడమి.
27. Sethu Rameswara Datta, K. 1980 Sri Venkateswara Sachitra Suprabhatam, Tirupati. Tirumala Tirupati Devastanam
28. Ramesh, M.S. 1992, 1st Edition. 108 Vaisnavite divya desams vol. I Tirupati : M.V.S. Prasad.
29. Ibid.
30. Muralidharan T.D. 1999 Dakshina Dwaraka, Temple of Mannargudi (article) from Bhavan's Journal Sep. 30, Mumbai : Bharatiya Vidya Bahavan.
31. నాగయ్య జి. 1990 2వ కూర్పు, తెలుగు సాహిత్య సమీక్ష తిరుపతి : నవ్య పరిశోధక ప్రచురణలు.
32. ఉమాకాన్త విద్యా శేఖరులు : 1955, శ్రీనాథ భట్టాకృతి పల్నాటి వీర చరిత్ర.
33. గోవిందసామి 1960 ఇలక్కియ తోట్రమ్ A history of Tamil Literature చెన్నై, పారీస్
34. పృథ్వి ఇళంపూరణర్ 1977 తొల్ కాప్పియ పొరుళతిగారమ్, తిరునల్వేలి : తెన్ ఇందియ శైవ సిద్ధాంతనూడ్‌పదిప్పు కల్పగమ్.
35. వయ్యాపురి పిళ్లెము 1967 సంగ ఇలక్కియముం ఇరుప్పది గళుమ్, చెన్నై : పారి నిలయమ్
36. రాఘవ అయ్యంగార్ 1958, పెరుంపానాట్రుపడై అణ్ణామలై : పల్‌గళైకలగమ్
37. సామినాథైయర్, ఉ.వే. 1980 ఎట్టుతొగైయిల్ 5వ దాగియ పరిపాడల్ మూలము. (పరిమేలళగర్ ఉరై) చెన్నై పబ్లిషర్
38. ఇళంగో అడిగల్ Photocopyed 1985 శిలప్పదిగారమ్ Tanjore : Republished by Tamil University.
39. గోవిందసామి, ము. 1960. ఇలక్కియ తోట్రమ్ (A history of Tamil literature) చెన్నై.
40. రాధాకృష్ణ పిళ్లై, ఎస్. తమిళ్ వళర్త్త కోయిల్‌గళ్ చెన్నై : మంగళ నూలకుమ్
41. గోవిందసామి ము, 1960 ఇలక్కియ తోట్రమ్ చెన్నై.
42. నాగయ్య జి. 1990 2వ కూర్పు, తెలుగు సాహిత్య సమీక్ష, తిరుపతి. నవ్య పరిశోదక ప్రచురణలు.

43. సం॥ సూర్యనారాయణ తీర్థులు, 1946, శ్రీమదాంధ్ర మహాభారతము ఆది, సభాపర్వములు రామ్ అండ్ కో పబ్లిషర్స్
44. రాధాకృష్ణశర్మ చల్లా 1993 తులనాత్మక సాహిత్యం, వ్యాససంకలనము, న్యూఢిల్లీ : సాహిత్య అకాడమీ.
45. నాగయ్య జి. 1990 2వ కూర్పు. తెలుగు సాహిత్య సమీక్ష
46.. Ibid.
47.. Ibid.
48. చిలుకూరి నారాయణరావు "పండితారాధ్య చరిత్ర" సోమన 1990 హైదరాబాద్
49. చూ. 42.
50. సం॥ సూర్యనారాయణ తీర్థులు 1954, తిక్కన విరాటోద్యోగ పర్వములు, ప్రకాశకులు : రామ్ అండ్ కో.
51. Ibid.
52. కృష్ణమాచార్య ప్రణీతము పరిష్కర్త కులశేఖరరావు, ఎమ్. 1980, సింహగిరి వచనములు, హైదరాబాద్ : సాహిత్య అకాడమీ.
53. శివరామశాస్త్రి, వేటూరి, ఎఱ్ఱన నృసింహ పురాణము 53 మద్రాసు.
54. నాగయ్య జి. 1990 2వ కూర్పు, తెలుగు సాహిత్య సమీక్ష.
55. పోతన.
56. అనంతకృష్ణ శర్మ, రాళ్ళపల్లి. సంపాదకులు శ్రీమదాంధ్ర భాగవతము. లఘుటీక సంహితలు. 1954, కడప : రాయలు అండ్ కో.
57. ఉమాకాన్త విద్యా శేఖరులు, 1955, శ్రీనాథ భట్టాకృతి, పల్నాటి వీరచరిత్ర.
58. ఇందిరాదేవి ఎన్.సి. 1981, From Tallapaka composers to Purandaradasa: studies in the music of th period.
59. ఉషాలక్ష్మి కృష్ణమూర్తి : 1995 A comparison of the Music, lyric, Philosophy of Annamacharya and Purandara dasa.
60. పెరుమాళ్, ఏ.ఎన్. 1984 తమిళర్ ఇశై మద్రాసు : ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తమిళ్ స్టడీస్.
61. రాజ మాణిక్కం ఎమ్. తమిళ్ మొళియుం ఇలక్కియ వరలారు.
62. ఇళంగో అడిగళ్. Photocopy 1985 శిలప్పదిగారమ్. Tanjore : Republished by Tamil University.

63. సోమలె, 1974, తమిళ్ మక్కళుం మరబుం పణ్పాడు ఇండియా : నేషనల్ బుక్‌ట్రస్ట్.
64. Ibid.
65. పెరుమాళ్, ఏ.ఎన్. 1984 తమిళర్ ఇశై. మద్రాసు ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తమిళ్ స్టడీస్.
66. Ibid.
67. Ibid.
68. Ibid.
69. వెంకటరామన్, ఎస్. 1985, అరయర్ సేవై, తిరుపతి. తిరుమల తిరుపతి దేవస్థానం.
70. Sambamurthy P. 1960 History of Indian Music
71. Sambamurthy P. 1982 South Indian Music.Book IV The Indian Music Publishing House, Madras.
72. నాగయ్య, జి. 1990 తెలుగు సాహిత్య సమీక్ష తిరుపతి : నవ్య పరిశోధన ప్రచురణలు.
73. Ibid.
74. Ibid.
75. Ibid.
76. సీతారామారావు, తుమ్మలపల్లి - దక్షిణ దేశములు - నాట్యము, విజయవాడ : ఉమా పబ్లిషర్స్.
77. శారదాపూర్ణ, శొంఠి - శరన్నిక్వాణం.
78. పెరుమాళ్ ఏ.ఎన్. తమిళ్ ఇశై : 1984 మద్రాస్ ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తమిళ్ స్టడీస్.

రెండవ అధ్యాయము

# విషయ సూచిక


| | |
|---|---|
| విష్ణువు ఎనిమిది స్వయం వ్యక్త స్థలములు | 38-40 |
| వేదములలో వేంకటాద్రి | 41 |
| పురాణములలో వేంకటాద్రి | 41-43 |
| ద్రావిడ భాషలో వేంకటాద్రి | 43-44 |
| శాసనములలో వేంకటాద్రి | 44-45 |
| సంగసాహిత్యములో వేంకటాద్రి | 45-46 |
| శిలప్పదిగారంలో వేంకటాద్రి | 47 |
| ఆళ్వారులు - వేంకటాద్రి | 48-55 |
| ఆచార్యులు - వేంకటాద్రి | 55-58 |
| ఆంధ్రవాఙ్మయములో వేంకటాద్రి | 58-59 |
| అన్నమయ్య - తిరుమల యాత్ర | 59-68 |
| అన్నమయ్య - తిరుమల ఆలయము | 68-83 |
| అన్నమయ్య - సప్తగిరులు | 83-86 |
| పురాణములలో వేంకటేశ్వరుడు | 87-92 |
| అన్నమయ్య - వేంకటాచల మాహత్మ్యము | 92-95 |
| అన్నమయ్య - ఆలయమూర్తులు | 96-101 |

రెండవ అధ్యాయము

# అన్నమయ్య తిరుమల స్ఫూర్తి

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర కరుణావరప్రసాదలబ్ధనందకాంశోద్భవుడు. కారణ జన్ముడు. ఈ మహానుభావుడు జీవన పర్యంతము శ్రీ వేంకటేశ్వర దాస్యానురక్తుడై స్వామికి సేవలొనర్చి తరించిన భక్త శిఖామణి. ఆయన స్వామిపై అల్లిన సంకీర్తన మాలికలు, ఆ స్వామి కొలువు తీరిన అనేక ఆలయములను దర్శించి లిఖించిన సంకీర్తనలు, మనకు లభించిన అమూల్య రత్నములు. "పుట్టుకయు నిజము, పోవుటయు నిజము, నానాటి బతుకు నాటకము" అని తత్త్వ బోధన చేసి తత్త్వజ్ఞానియైన అన్నమయ్య చిరంజీవులై మనకందరకు చిరస్మరణీయులైరి.

నారాయణ సూరి లక్కమాంబ దంపతుల సంతాన రాహిత్య క్లేశమును పోగొట్టుటకు స్వామి ప్రసాదించిన వరప్రసాదుడు, పదకవితా పితామహుడైన అన్నమయ్య. స్వామి అనుగ్రహ ఫలమైన పుత్రుడు. నారాయణ సూరి ఆగమోక్త ప్రకారమున జాతకర్మము చేసి జలజోదరునకు నామమైన "అన్నమయ్యాహ్వయం బతనికి నొసగె"నని చిన్నన్న తన తాత చరిత్రను మనకు తెలియజేసెను. "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అనెడి శ్రుతి ననుసరించి ఆ నామమును పెట్టెనని చిన్నన్న వివరించెను.

మహాభారతము ఆనుశాసనికపర్వములోని 'శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రము'న వ్యాస భగవానుడు "యజ్ఞాన్తకృత్ యజ్ఞ గుహ్యం అన్నమన్నాద ఏవచ" అని స్తోత్రము చేసెను. చిన్నన్న వివరించిన వివరణకు పై శ్లోకము ప్రమాణముగా గ్రహించవచ్చును. [1] అన్నమయ్య "శ్రీపతివి నాలోని శ్రీ వేంకటేశుండ నీపేరి వాఁడ నాకు నిండు మాయలేఁటికే అని (10-204 335 రేకు) శ్రీపతి నామమే తన నామమని వెల్లడించెను.

అన్నమయ్య ఒకనాడు పశువులకై కసువు కోయుచుండగా వ్రేలు తెగెను. వ్రేలు తెగినంతనే కారుతున్న రక్తధారను చూచి విరక్తి చెందెను. జీవితముపై హఠాత్తుగా రోత కలిగి భగవదిచ్ఛానుసారము తిరుమల యాత్ర పోవు పరుసవారి గుంపుతో వేంకటాద్రిని దర్శించుటకు పయనమయ్యెను. అన్నమయ్య తిరుమల యాత్రా వైభవమును తెలిసి కొనుటకు పూర్వము ఆళ్వారులు, ఆచార్యులు వేంకటాద్రి మాహత్మ్యమును, స్వామి అపురూప సౌందర్యమును, ఏ విధముగా కీర్తించి కీర్తికెక్కిరో తెలిసికొనుట అనావశ్యకము కాజాలదేమో! అన్నమయ్యకు పూర్వము ఈ వేంకటాద్రి సాహిత్య చరిత్రలో ఎంతటి ఘనతను గడించినదో, ఏ విధముగా

వర్ణింపబడినదో ఈ కొండకు గల ప్రముఖాంశము లెట్టివో పరిశీలనార్హములు.

మన పూర్వీకులు ప్రకృతి శక్తులకు దైవత్వము నాపాదించి పూజించుచుండిరి. ఆ పద్ధతి ననుసరించి శివుడు పంచభూతముల ప్రతీకగా ఈ క్రింది క్షేత్రములలో ఆరాధింప బడినాడు. శివుడు కంచిలో భూమికి, తిరువేక్కలో నీటికి, కాళహస్తిలో అగ్నికి, తిరువణ్ణా మలైలో గాలికి, చిదంబరంలో ఆకాశమునకు ప్రతీకగా పూజలు గ్రహించుచున్నాడు.

అదే విధముగా వైష్ణవులు కూడా భక్తి భావములతో మహా విష్ణువును పూజింప దొడిగిరి. ఆ పూజా స్థలములు స్వయం వ్యక్త క్షేత్రములుగా కొనియాడబడుచున్నవి. వాటికి ప్రత్యేక గౌరవమును, విశిష్టతను కల్పించిరి. ఆ స్థలములు దివ్య స్థలములుగా పరిగణింపబడి పురాణేతి·హాసములలో వన్నెకెక్కినవి.

"జీవుడీరేడే కొఱకు శ్రీరంగ వేంకటాద్రి

దేవ భూములందు నీ దివ్యమూర్తులు చూపి" 3 సం.

ఈ పుణ్య స్థలములను కోరికలు తీర్చు కామధేనువు గాను, వ్యాధులను నిర్మూ లించు సంజీవిని గాను ప్రజలు విశ్వసించుచున్నారు. ఈ పుణ్య స్థలములలో గల నీటిని వారు పుణ్య తీర్థములుగను, స్వామిని దివ్యశక్తి స్వరూపుడుగాను స్తుతించి తరించుచున్నారు. భారతదేశ ఉత్తర, దక్షిణమున ఈ విధమైన స్వయం వ్యక్తమూర్తులున్న విష్ణువు యొక్క ఆలయములున్న ఎనిమిది స్థలములు ప్రాముఖ్యమును కలిగియున్నవి.

## విష్ణువు-ఎనిమిది స్వయంవ్యక్త స్థలములు

ఉత్తరమున గల బదరికాశ్రమము మొట్టమొదటిది. ఇది హిమవత్పర్వతమున కలదు. అలకనంద అందుగల పుణ్యతీర్థము. ఆ నదికి ఉత్తరమున ఆలయము కలదు. ఇచట మహావిష్ణువు చల్లని వాతావరణమున ఉష్ణమును కల్గించుచు తప్తరూపుడుగ పూజలందుకొనుచున్నాడు. ఉత్తర ప్రదేశమున గల సీతాపూర్‌నకు సమీపముననున్న నైమిశారణ్యము రెండవది. ఇచట విష్ణువు అరణ్య రూపమున కొలువబడుచున్నాడు. శ్రీ మహాభారత భాగవతాది పుణ్య కథా శ్రవణములకు ఈ నైమిశారణ్యము పుట్టినిల్లు. ఇచట మహిమాన్వితులైన ఋషులు తపశ్శీలురు. ఆశీర్వాదముల నొసగెదరు. ఈ అరణ్యము శౌనకాది మహర్షులు యజ్ఞ యాగ ములు చేసిన యజ్ఞభూమిగ, పవిత్రమైనదిగ ప్రశస్తినందినది. ఇచట వ్యాసభగవానుడు ప్రతి వత్సరము శీతాకాలము ఆరు నెలలు వసించి, అప్పటి వరకు తాను రచించిన వైదిక వాఙ్మయమును శిష్యులకు బోధించి తిరిగి జ్యోతి దర్శనము బదరిలో జరుగు వేళకు చేరెడివాడట. ఆ గాథలన్నింటిని సూతాది మహర్షులకు తెలిపెడి

వారని ప్రమాణము. అందుచే ఈ క్షేత్రము పవిత్రమైనది. ఈ అరణ్యము వనరూపములో నుండు ఈ భగవత్సౌందర్యమును పచ్చని రంగులో ప్రదర్శించుచున్నది.

అజ్మీరునకు ఏడు మైళ్ళ దూరమున నున్న పుష్కర్ మూడవది. ఇచ్చట విష్ణువు తీర్థ స్వరూపుడుగా నెలకొనియున్నాడు. అచట పుష్కరిణి అని పిలువబడు తటాకమును భగవత్స్వరూపముగ నెంచి భక్తులు స్నానాదులాచరించి ఆరాధించి తరించుచున్నారు.

దక్షిణ ఆర్కాటు మండలములోని చిదంబరమునకు సమీపమున గల శ్రీ ముష్ణం నాలుగవది. ఇచట భూవరాహమూర్తి వాయు రూపుడుగ విరాజిల్లుచున్నాడు. ఈ స్థలము పురాణములలో అసురవధ జరిగిన స్థలముగా చెప్పబడినది.

భూలోక వైకుంఠమని ప్రసిద్ధి చెందిన శ్రీరంగము అతి ముఖ్యమైనది. ఇచట విష్ణువు ప్రణవాకారుడుగ ఆరాధ్యుడు. ఇచట ఆలయ విమానము ప్రణవాకార విమానముగా గణుతి కెక్కినది.

దక్షిణ భారతమున గల తిరునల్వేలికి దక్షిణమున ముప్పది కిలోమీటర్లును, కన్యాకుమారికి ఉత్తరమున ఏబది కిలోమీటర్ల దూరమునను వానమామలై కలదు. ఈ స్థలమున విష్ణువు తైలరూపుడుగా నివేదనలందుకొనుచున్నాడు. ఈతైలము 'వ్యాధి నివారిణి'యని ప్రజల విశ్వాసము. కావున భక్తితో ఈ తైలమును భక్తులు గ్రహించుచున్నారు.

నేపాల్ రాజధానిమైన ఖాట్మండునకు ఉత్తర భాగమున గల హిమవత్పర్వతమున విష్ణువు శీతల రూపుడుగా (జలరూపుడుగా) ప్రార్థనల నాలకించుచున్నాడు [2]

దక్షిణ భారతమున ప్రసిద్ధిచెందినదియు ప్రపంచ ప్రఖ్యాతిగాంచినదియునైన వెంకటాద్రి యందు మహావిష్ణువు పర్వత రూపుడుగా సేవలందుకొనుచున్నాడు.

"కొండలనెక్కుడైన గురుతు శ్రీవేంకటాద్రి
కొండరూపుదానే పో కోరిన మా దైవము" అధ్యా సం. 319 రేకు

అని స్వామిని పర్వతరూపునిగా తన సంకీర్తనలో కీర్తించెను. ఇంకను స్వామిని పంచభూతాత్మల ప్రతీకగ, రక్షకునిగ వర్ణించి ఆనందించెను. 309 రరేకు సం. 4

"భూమిదేవి పతియైన పురుషోత్తముడే మాకు
భూమిపై నేడ నుండినా భూమి రక్ష
ఆమని జలధిశాయి అయిన దేవుఁడే మాకు
సామీప్యమందున్న జలరక్ష
మ్రోయుచున్న నగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుఁడే

ఆయములు దాకకుండా నగ్నిరక్ష

వాయుసుతు నేలినట్టి వనజ నాభుండే మాకు

వాయునందుఁగందకుండా వాయురక్ష

పాదమాకసమునకుఁ చొరజూచే విష్ణుడే

గాదిలియై మాకు నాకాశరక్ష"

"నా పూజలెల్ల నీకు నెక్కెనయ్యా" (308 రేకు)

అనెడి మరొక సంకీర్తనలో స్వామివారికి ప్రకృతి సహజ రీతిలో జరుగు పూజలను వివరించెను.

"నేము సేసేయందు మారు నీవే చేకొంటివి

నేమపు నాపూజలెల్లా నీకు నెక్కేనయ్యా

పాలజలధిలోనఁ బవ్వళించినదియెపో

వాలిన నీకు జలాధి వాసము

కోలుముందై బ్రహ్మయజ్ఞకుండము లాహుతిగొని

నోలినుండే అదె నీకు హోమము

అదన నాపోనారయణుఁడ వయిన నీకు

అదియె పో మంత్ర కలశాభిషేకము

మొదల నంతర్యామి మూర్తివయిన నీకు

పదవి మీర నదియే ప్రాణ ప్రతిష్ఠ

అక్కున శ్రీ వేంకటాద్రి నలమేలు మంగఁగూడి

వొక్కటై వుండినిదే నిత్యోత్సవము. 308 రేకు

ఈ వేంకటాద్రి అసాధారణ మహిమను కలిగియున్నది. సామాన్య రీతిలో కాక పురాణములలో ఉపనిషత్స్వరూపముగ ఘనతను పొందియున్నది. వేంకటాద్రి, స్వామికి నివాసయోగ్యమై పూజార్హమైనది.

"కరుణానిధిం గదాధరం

శరణాగత వత్సలం భజే

వేంకటేశం వేదనిలయం" సం. 3. 130 66 రేకు

అని అన్నమయ్య వేంకటాద్రిని వేదములకు నిలయముగా సన్నుతించెను.

# వేదములలో వేంకటాద్రి

వేదములలో కొండలకు గల ప్రత్యేకతను, గొప్పతనమును లోకోపకార ప్రవృత్తిని తెలుపు మంత్రములు కలవు. "శిలింబిర భరద్వాజులు" అనెడి ఋషి పేరునగల ఒక మంత్రము ఈ కొండను గూర్చి పేర్కొనబడినదిగా పండితులు మనకు చూపుచున్నారు. (3)

"అరాయి కాణే వికటే గిరిం గచ్ఛాసదాన్వే

శిలింబిరస్య సత్వభిః తేభిష్ట్వా చాతయామసి"

సంస్కృత విద్వాంసులు ఋగ్వేదములో చెప్పబడిన ఈ మంత్రమును 'వేంకట' శబ్దమునకు మూలముగా భావించుచున్నారు. ఇంకను ఈ శబ్దము 'పాప సంహరణ' మను భావార్థ ప్రయోగముగ 'తైత్తిరీయ సంహిత' యందు సూచింపబడుచున్నది.

కృష్ణ యజుర్వేద సంహితలో (తైత్తిరీయ) ఆరవ కాండములో, రెండవ అధ్యాయ (ద్వితీయ ప్రశ్న) నాల్గవ అనువాక మనబడు "సువర్గం వాయేతే లోకం యాని" అను భాగమున రెండవ భాగమును పరిశీలించినచో (2వ పనస) శ్రీనివాసులు తొలుత దేవలోకమున దేవతలు యజ్ఞమొనర్చునప్పుడు వారి నుండి అంతర్థానుడై భూ లోకమున అరణ్యములు దుర్గమలైన సప్తపర్వత శ్రేణులలో వచ్చి వసించినట్లు వెల్లడియగు చున్నది"యని శ్రీ షడ్దర్శనం సోమ సుందరశర్మగారు 'వేద పురాణములలో వేంకటే శ్వరుడు' అను వ్యాసమున వెల్లడించిరి. ఈ వేద భాగమునకు సాయణ మాధవులు వివరాణాత్మక వేద భాష్యము వ్రాయుచూ సవిరముగా తెలిపిరని వివరించిరి. (యజ్ఞోవై విష్ణుః) వేద వచనానుసారము యజ్ఞ పురుషుడు విష్ణువు (3)

"వికటే" అను పదము "వేంకట" పదమునకు ప్రాచీన రూపమని వివిధ అభిప్రాయములున్నవి. ఈ మంత్రమునకు దేవత "అ లక్ష్మీఘ్న" అనగా అమంగళమును దూరముగా పారద్రోలునని భావము చెప్పబడినది. మరియు 'సర్వ పాపాని వేం ప్రాహుః 'కపటస్తద్దామ ఉచ్యతే' అనగా సర్వపాపములను దహించునది అని భావమున అర్థము. చెప్పబడినది.

# పురాణములలో వేంకటాద్రి

బ్రహ్మాండ పురాణమునందును సర్వ పాపములను కాల్చివేయును కనుక ఇది వెంకటగిరి అని వివరణ కలదు. వైకుంఠమునకు వేంకటమునకు పదసాదృశ్యము కలదని కల్పనల సంబంధమును కల్పించెదమేని పై భావము స్థిరపడునని విజ్ఞుల

అభిప్రాయము. (3) స్వామి "పాపనాశుడు" అన్న అదే భావమును నమ్మాళ్వార్, అన్నమయ్య తమ సంకీర్తనలలో నుడివిరి.

"వేంగడంగళ్ మెయ్ మేల్ వినై ముట్రవుమ్
తాంగల్ తంగళ్టుక్కు నల్లనవే శెయ్‌వార్
వేంగడతురై వార్‌క్కు నమ వెణ్ణ
లామ్ కడమై అదు శుమందార్ కట్కే" (4)

పూర్వ జన్మ పాపములు వేంగడ దేవునికి 'నమ'యని చెప్పినంతనే దహించిపోవు నని అర్థము. 'వేమ్' అనగా దహించునని 'కడంగల్ అనగా పాప సమూహ'మని అర్థము చెప్పబడినది.

వేంకటేశ్వరుని గొలిచినను బ్రదుకు గలుగును
భవము ప్రాణములకు లేదు
కందువ శ్రీ వేంకటకటకేశ నీవద్ద
నెందు గటకేశ భయమిఁక లేదు

అని అన్నమయ్య కీర్తించెను.

మాయావి అయిన విష్ణువు ఉత్తమము, పరమానందమును అయిన వైకుంఠమును వదలి స్వామి పుష్కరిణి కొలను వద్ద గల వెంకటాద్రి కొండ మీద మహావైభవముగా లక్ష్మీ దేవితో ఘనత వహించియున్నాడని బ్రహ్మాండ పురాణములో చెప్పబడినది.

"మాయావీ పరమానందం త్యక్త్వా వైకుంఠ ముత్తమమ్
స్వామి పుష్కరిణీ తీరే రమయా సహమోదతే"

అనియు, ఈ కొండ గొప్పతనమును

"వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమోదేవో
నభూతో న భవిష్యతి

అనియు వర్ణించబడినది. అన్నమయ్య

"పాలజలధిలోనఁ బవళించి హరివచ్చి
భూలోకమంతయుఁజూచి పొగుడు నాఁడు
పాలించి నేలయు మిన్ను బహుదివ్య దేశాలు

గాలించి కోనేటి దరి గైకొంటినాఁడు"

అని పురాణ వివరణలను పై విధముగా తన సంకీర్తనలో వెల్లడించెను.

వరాహపురాణము "వేం" అనగా పాపము 'కటతి' అనగా దహతీతి 'వేంకట' అనగా 'పాపనాశని' అన్న భావమునే వ్యక్తపరచినది.

'వేం' అనగా 'అమృత బీజము - కట అనగా ఐశ్వర్య వాచకమని అమృతైశ్వర్య సమూహమనెడి అర్థములో ఈ శబ్దము ప్రయోగింపబడినదని వెల్లడించినది. ఈ భావ మును

"వడి వేంకటేశుఁగొలువదు గాక కొలిచినను
బడిబడినె చెడని సంపదలిట్లు రావా" సం. 3 107

"సిరుల నీయర్థమే చింతించి చింతించి
నరలోకమెల్ల నీ నగమె యెక్కితిమి" 84 (4-379)రేకు 364)

"సిరులొసఁగేటి యీ శ్రీ వేంకటేశుడు" 2. అని వర్ణించిరి.

వామన పురాణమున వేంకటాచల క్షేత్ర మాహాత్మ్య వర్ణనకు ఉపోద్ఘాతముగా చెప్ప బడిన నారద వాల్మీకి సంవాదమున విష్ణు క్షేత్రముగా వర్ణింపబడినది.

గరుడ పురాణమున అరుంధతీ వశిష్ఠ సంవాదము నందు వేంకటాచలమను పేరు గల మహీధర మున్నదను విషయము తెలియుచున్నది.

ఈ విధముగా పలు రీతుల వేంకటాద్రి మాహాత్మ్యము పురాణములలో వర్ణింపబడి నది. మరియు 'వేంకట' శబ్దము భిన్నార్థములలో వివరింపబడినది. [5]

## ద్రావిడ భాషలో వేంకటాద్రి

తెలుగు భాష, భాషాపరముగా తమిళమునకును, సాహిత్య పరముగా సంస్కృతము నకు సన్నిహితమైనది. అయినను ప్రాచీనాంధ్ర కవుల రచనలలో మనకు తమిళుల భాషతోనే కాక వారి సాహిత్యాంశములతోను సాన్నిహిత్యము కానవచ్చుచున్నది. ఉదా : నన్నయ్య ఆంధ్ర మహాభారతములో ఆదిపర్వ ప్రథమాశ్వాసమున చాళుక్య నృపుల కాలమునాటి 'సత్సభ'లను గురించి చేసిన ప్రశంస పాండ్యరాజుల పండిత పరి షత్తులైన 'సంగం'ను పోలినవి. 'కుమార సంభవ' గ్రంథమున నన్నెచోడుడు వర్ణించిన గణపతి వృత్తాంతము తమిళ సాహిత్యమునకు సన్నిహితమైనది. పాల్కురికి సోమన తమిళ శివభక్తులైన 'అరువత్తిమువ్వర్' అరువది ముగ్గురు నాయనమార్ల కథలు తెలుగు భాషలో రచించుటను గమనించినచో తమిళ సాహిత్య సాన్నిహిత్యము మనకు బోధపడును. అటులనే ధూర్జటి

'కాళహస్తీశ్వర మాహత్మ్యము'లోని 'నత్కీరుని కథ తమిళ సాహిత్యము నుండి గ్రహించిన విషయమే [6]

దక్షిణ భారతదేశములో క్రీ.శ. ఐదు తొమ్మిది శతాబ్దముల మధ్య కాలమున భక్తి ఉద్యమములు జాతి సమైక్యతను సాధించినదని చెప్పవచ్చును. ఆళ్వారుల భక్తి పాటలు వైష్ణవ సంప్రదాయజ్ఞులకు నేటికిని వేదవాక్కులే. ద్రావిడ భాషలలో తమిళమతి ప్రాచీనమైనది. ప్రాచీన కాలము నుండి అభివృద్ధి చెందుచూ వచ్చినది. తమిళ భాషా సాహిత్యమున సంగ కాలమునాటి సాహిత్యము పురాతనమైనది. అనేక కవుల యొక్క కవితల సంపుటియే సంగ సాహిత్యము. నాటి సాహిత్యమున మన వేంకటాద్రిని గూర్చిన ప్రశస్తి గలదు.

క్రీ.పూ. 5వ శతాబ్దము నుండి క్రీ.శ. 200 వరకు సంగ సాహిత్య కాలము. ఆనాటి సాహిత్యమున తెలుగు కన్నడ ప్రస్తావనలు కానరావు.

వేంకటాద్రికి సంబంధించిన గ్రంథస్థ ఆధారములలో మొట్టమొదటిది పనంపరనార్ వ్రాసిన 'శిరప్పాయిరమ్'. తొల్ కాప్పియ లక్షణ గ్రంథమునకు వ్రాయబడిన మున్నుడియే 'శిరప్పాయిరమ్' [7]

"వడ వేంగడ తెన్ కుమరియాయిడై తమిళ్ కూరు నల్లులగమ్"

"This good land of the Tamil which lies between the Northern Vengadam and the Southern Kumari" [8]

ఆంధ్రులకు దక్షిణ భాగమున గల తమిళులు ఆంధ్రులను 'వడుగర్'లని అనెడివారట. అనగా ఉత్తరాదివారని పేర్కొనిరి. ఈ విషయ వివరణలను శాసనములలోను మనము గానవచ్చును.

## శాసనములలో వేంకటాద్రి

వడ వేంగడ మన 'ఉత్తర దిక్కున గల కొండ'యని ప్రాచీన శాసనములలో పేర్కొనబడినది. తంజావూరు ఓబళనాధుడు అను యాదవకుల రాజు వేయించిన శాసనములో 'వడవేంగడ ఒణక్కు' ఉత్తర కొండ దేవరకు చెల్లించిన కైంకర్యముగను తెలుపుచున్నది.

ఈ ప్రదేశము "తొండమండలము" (జయన్ కొండ చోళ మండలము) అని పల్లవ చోళుల పాలనకాలమునందు విభజింపబడినది. ఈ వైపు పర్వతము పర్వత పరిసర గ్రామములు 'తిరువేంగడ కొట్టమ'ని పేర్కొనబడినవి. కుడవూరు నాడు = (తిరుపతి చుట్టపక్కల) వైకుంతవలనాడు = చంద్రగిరి చుట్టుపక్కల తొండమాన్ లేక ఆట్రూర్ =

కాళహస్తి పరిసర ప్రాంతములు అనియు విభాగముల నొనరించిరి. తిరుపతి ప్రసిద్ధి చెందునాటికి తిరుచానూర్, కుడవూర్‌నాడులో చేరినది. పది, పండ్రెండు శతాబ్దముల వరకు కొండకు సామగ్రి తిరుచొక్కనూరు నుండి కొనిపోవుచుండిరి. నాడు జనులు నివసించిన ప్రదేశము తిరుచ్చానూర్. దానికి ఉత్తర దిక్కున గల ఈ కొండ "వడ వేంగడం" అయినది.

తిరుమల కొండలకు 'వెలిగొండలు' అని పేరు కలదనియు ఇదియే తమిళమున 'వెళ్‌కడం' పిదప వెన్‌కడం, వెంగడంగా మారినదనియు వెలిగొండ పరిసర కొట్టం 'వెంగడ కొట్టం' అయినదనియు, ఆలయము లనేకములుండటచే 'తిరు'రూపము చేరి 'తిరు వెంగడ కొట్టం' అయినదని భిన్నాభిప్రాయములు కలవు.[9]

# సంగ సాహిత్యములో వేంకటాద్రి

2వ శతాబ్దమునకు చెందిన 'సంగం' కవి 'కల్లాడనర్' రచించిన అహనానూర్ 83వ పాటలో 'వియంతలై నల్‌నాట్టు వేంగడం' అని వర్ణింపబడినది. అనగా చక్కగా విశాలముగా పరచబడిన వేంగడము మంచి స్థలమని భావము. 209వ పాటలో 'నెడువత్తై వేంగడం' వెదురులతో కూడిన గొప్ప శిఖరములు గల వేంకటమని 29వ పాటలో ఏనుగు లధికముగా నుండుటచే పాండ్య రాజులకు ఏనుగులను ఈ ప్రదేశ ముఖ్యాధికారి బహూకరించెడి వాడని వివరింపబడినది. 'మాములనార్' 311 పాటలో 'పుల్లినన్నొట్టు వేంగడం' అనగా పుల్లి అను ముఖ్యాధికారి యొక్క ప్రదేశముగను, వేంగడం నుండి ఎడారి ప్రాంతము ప్రారంభమగుచున్నట్లు వర్ణించెను. 325 పాటలో 'పాణన్' (గొప్ప విలుకాడు) 'నల్లనాడు' అనగా మంచి ప్రదేశమని దారి దుర్గమమని, ఎండ భరింప రానిదని, మదించిన ఏనుగులుండెడివని విశదీకరించెను. 331వ పాటలో మరల 'అరుంశుఱమ్' అనగా ఎడారి ప్రాంతమని ఉన్నది. 'నెడుమఱ మఱుంగిన్ మలై' ఎత్తైన చెట్లతో కూడిన గొప్ప శిఖరములు గల దారియని చెప్పబడినది. 349 పాటలో 'ఏళీర్‌కున్నం' అనగా ఏడు కొండలతో కూడియున్నదని వర్ణింపబడినది. 359 పాటలో అరణ్యములో తీర్థములు కలవని ఇంకను తనంత తానుగా పండు ధాన్యమును కోసి పొయ్యిలో కాల్చి అచటి ప్రజలు ఆహారమును గ్రహించెడివారని వర్ణనలు కలవు. 393 పాటలో 'ఉయర్ వత్తై నన్నాట్టు ఉంబర్ వేంగడం' అనగా వేడి అరణ్య ప్రాంతమైనను సెలయేరు లతో కూడి పంటలు కొన్ని పండెడివని, గొల్లవారు ఈ ప్రదేశములలో నుండెడివారని వేంగడ పర్వతమును, ఆ ప్రాంత పరిసరములను గురించియు 'సంగం' సాహిత్యమున కవులు వివరించిరి. [10]

"వేంగడ శబ్దము మొదటి 'పాలై' అనెడి భూభాగమును సూచించునదిగా

ప్రయోగించబడినది. పిమ్మట కారణ సూచకముగా అనగా పాపములను దహించునను అర్థమున ప్రయోగింపబడినది. ఈ మార్పు అళ్వారుల కాలము నాటికి స్థిరపడినది" అని తమిళ పండితుల అభిప్రాయము.(11)

'సంగం' సాహిత్యమున వేంగడమనెడి పర్వతమును గురించిన వర్ణనలు కలవు. కాని పర్వతాధిరోహణ సాధ్యముగా కానరాదు. దారులు దుర్గమమని వర్ణింప బడినది. కావున ఆ కొండపై గల భగవద్విగ్రహ వర్ణన కాని ఆలయ వర్ణన గాని వీలుకాదు. ఆ ప్రాంతము నేలిన పూర్వ రాజులను గురించి పేర్కొనునపుడు 'తొండమాన్' రాజు వంశమును గురించిన విషయ వివరణ కొంత తెలుపబడినది. తొండైమాన్ చక్రవర్తికిని వేంగడమునకు విడదీయరాని బంధమున్నదని "ఎట్టుతొగై, నట్రినై, కుఱున్దొగై అగనానూర్, పురనానూర్" పాటల వర్ణనల వలన కొంతవరకు ఊహింప వీలుగా నున్నవి. ఈ చక్రవర్తి చివరి సంగ కాలము నాటివాడు. కరికాలుని సమకాలికుడుగా చెప్పబడినాడు. తొండైమాన్ కంచిని రాజధానిగను, మామల్లపురమును ముఖ్య పట్టణముగను తిరువేం గడమును పరిపాలన భాగమున ఒకటిగా కలిగి తొండైనాడును పాలించెను. ఈ తొండైయర్ వంశస్థులు 'వడుగర్'ను అనగా ఆంధ్రులను తమిళదేశమున అడుగిడక అరికట్టారని వర్ణింపబడినది.

ఈ రాజు పాలనలో వేంకటము, కంచిని గురించిన వర్ణనలు కలవు. కరికాలుని కాలమునుండి పల్లవులు జయించిన కాలము వరకు 'తొండైనాడు' చోళుల నాడుగ వ్యవహరింపబడినది.

దక్షణాపథమున పురాతన స్థలములలో 'తొండైమాన్ కట్టళై" పేరున అనేక మాన్య ములు కలవు.

తొండైనాడు ఎల్లలను గురించిన వర్ణనలలో 'మేర్కుపవళమలై, వేంగడం నేర్ వడక్కామ్' అని పాటలో పశ్చిమమున పగడపు కొండ ఎల్లగాను 'వేంగడం' ఉత్తర దిక్కు కొండగాను కలిగి యుండిరని వర్ణించిరి. ఈ వంశస్థులు మూడవ శతాబ్దపు మొదటి పాదము వరకు తొండైనాడును పరిపాలించిరి.

తొండైనాడు భాగములైన నెల్లూరు మండలమున 'తిరువేంగడకొట్టం' భాగమును ఆంధ్ర రాజ్యమునకు దక్షిణమున నున్న పల్లవులు ఆక్రమించిరనిన విషయములు శాసనములచే ద్యోతకమగుచున్నవి. తొండైయర్, తిరయార్, వళవర్, చెన్ని, కళ్ళి, కళడప్పాలర్ (కళభ) కాలక్రమమున చోళులకేర్పడిన నామములుగా చరిత్ర కారుల అభిప్రాయము.

# శిలప్పదిగారంలో - వేంకటాద్రి

ఇళంగో అడిగళ్ రచించిన "శిలప్పదిగార" గ్రంథ కాలము నాటికి వేంగడమే కాక భగవంతుని గురించిన వర్ణన కూడా మొట్టమొదటిసారిగా మనకు గోచరించుచున్నది. ఈ కావ్యమున వేంకటాద్రి యందు వెలసిన దైవము శ్యామల వర్ణుడైన శ్రీ మహా విష్ణువని కలదు. పురాణములలో వర్ణించిన తీరున స్వామి ఈ కావ్యమున వర్ణింపబడెను.

"తిరువరంగత్తిల్ కిడంద తిరుక్కోలముమ్ వేంగడత్తిల్ నిన్ద తిరుక్కోలముమ్" అనగా స్వామివారు ఆదిశేషునిపై శయనరూపులై శ్రీరంగమున పరుండిరనియు వేంకటాద్రిపై ఆ స్వామి నిలుచున్న రూపుతో నున్నారని స్వామిని గురించిన వర్ణన కలదు. "శ్రీరంగం, వేంకటాద్రి, తిరుమాల్ కున్ఱం" అను మూడు దివ్య దేశములు ఈ కావ్యమున చోటు చేసికొనినవి. స్వామి ఆయుధ వర్ణన ఇందు కానవచ్చును.

"వీఙ్గు నీఅరువి వేంగడ మెన్ను
మొంగుయర్ మలైయ తుచ్చి మీమిసై
విరికదిల్ జ్ఞాయిరుం తింగళుం విళంగి
ఇరుమరుం గొంగియ విడైనిలై దానత్తు
మిన్ను కొడియుడుత్తు విళంగు వీర్పూణ్ణు
నణ్ణిరమేగ నిన్దదు పోల
పగై యణం కాళియుం పాల్ వెణ్శెంగమున్
తుగై పెరు తామరై కైయినేన్ది
నలం కిళరార్మార్ పిర్ పూణ్ణు
పోలంపూ వాడైయిల్ పొలిన్దు తోన్రియు
శెంగనెడియో నిన్దవణ్ణమ్... (కాడుకొన్ కదై 41-5) (13)

పై వర్ణనలకు సన్నిహితముగా అన్నమయ్య స్వామిని సన్నుతించిన సంకీర్తనలు.

"పొనుఁగని మహిమల పొడవుకుఁబొడవైన
దినకరకోటి కోటి తేజమవు నీవు" (68 రేకు సం. 7)

"దేవ నీ ఒక్కఁడవే నిలిచిన దేవుడఁవు
యే వేళ నీకంటే నెక్కుడెవ్వరున్నారింకను " (333 రేకు సం. 10)
శ్రీ వేంకటేశ్వరుడు చేరి నిలుచున్నవాఁడు
సేవించినయంతలోనే చేకొని యేలునితండు." 324 రేకు సం. 10

# ఆళ్వారులు - వేంకటాద్రి

పన్నిద్దరాళ్వారులు భక్తి పారవశ్యమున 'పాశురము'లనబడు పాటలను భగవంతుని పై అల్లి శ్రావ్యముగా గానము చేయుచు నిరంతరము విష్ణ్వాలయములను దర్శించి స్వామిని సేవించుకొనుచు తమ కాలమును గడుపుచుండిరి. వారు పాడిన పుణ్య స్థలములను 'పాడల్ పెట్రపడిగళ్' అని వ్యవహరించెదరు. ఆళ్వారులందరును ఒకే కాలమునకు చెందిన వారు కారు. ఒకే దేశమునకు చెందిన వారు కారు. వీరి తిథి జన్మ నక్షత్రముల గురించి, వీరి కాలమును గురించి వేదాంత దేశికాచార్యుల వారు 'ప్రబంధసారము' నందు చర్చించిరి. వీరి కాలమును గురించి అభిప్రాయ భేదములు కలవు. కొందరు ఐదవ శతాబ్దము నుండి ఎనిమిదవ శతాబ్దమని కొందరు పదవ శతాబ్దము వరకని, అభిప్రాయపడుచున్నారు. వీరు తమ ప్రబంధములందు దక్షిణదేశము నందలి వివిధ పుణ్య క్షేత్రములను, అందున్న అర్చామూర్తులను గూర్చి సొగసుగ స్తోత్రములు చేసిరి. అనేక క్షేత్రములను పరిచయమొనర్చుటయే ఈ దివ్యసూరుల యొక్క ఉద్దేశ్యముగా తోచును. ఈ విధముగా వీరి పాశురముల రచనలకనేక క్షేత్రములు, ఆలయములు, అర్చామూర్తులు స్ఫూర్తి నొసగినవి. ఆ మహాత్ముల రచనలచే ఆలయ ములు ప్రాముఖ్యము పొందినవి.

శ్రీ వైష్ణవ సాంప్రదాయమున నూట ఎనిమిది దివ్య క్షేత్రములను "తిరుపతు"లుగా కొలిచెదరు.

"తడయక నీవే తిరుపతుల దేవతల
మూర్తులై పొడచూపుదువు" (సం.8-240)

అందు రెండు మాత్రము మన లోకమునకు సంబంధించినవి కావు. అవి (1) క్షీరసాగరము (2) పరమపదము. వాటిలో ఉత్తర భారతమున పదునొకండు కలవు. అయోధ్య సాలగ్రామము, దేవప్రయాగ, నంద ప్రయాగ, ద్వారక, గోకులము మున్నగునవి. ఆళ్వారులు వీటిని దర్శించినట్లు కానరాదు.

దక్షణ దేశమును ఆనాటి రాజులు వివిధ భాగములుగా విభజించి పాలించిరి. అవి

(1) కావేరి : క్రింది సముద్రమున్న ప్రదేశము పాండ్యదేశముగను
(2) కావేరి - దక్షిణ పెన్నా - చోళ దేశముగను
(3) దక్షిణ పెన్నా - స్వర్ణముఖీనది వరకు తొండైనాడు పల్లవుల ఏలుబడిలోను

(4) తొండైనాడు -చోళదేశమునకు నడుమనున్నది నడునాడుగను (మధ్య దేశము)

(5) తొండైనాడునకు ఉత్తర దిగ్భాగమునందలిది వడనాఁడు లేకవడుగర్‌నాఁడుగ విభాగము లుండినవి.

ఒక్కొక్క దేశము నందు అనేక దివ్య క్షేత్రములు చోటు చేసికొనినవి. పాండ్యదేశము నందు తిరుమాలిరుంశోలై మున్నగునవి పదునెనిమిది దివ్యస్థలములుగా పేరొందినవి.

చోళదేశము నందు తిరువరంగము మున్నగు నలుబది క్షేత్రములు, వడునాఁడు మధ్య దేశమున కాంచి ఆది ఇరువది రెండు స్థలములు, వడనాఁడు నందు వేంగడం, అహోబిలం (సింగవేల్ కున్రమ్) అను రెండు దివ్యస్థలములు దక్షిణ దేశమునందున్నవి. ఈ దివ్యక్షేత్రములను మొత్త మన్నింటిని దర్శించిన వారు తిరుమంగై ఆళ్వారొక్కరే.[14] దివ్య స్థలములలో క్రమానుగతిని ఆలయముల యొక్క నిర్మాణము జరిగి ప్రాముఖ్యమును పొంది, భక్త కవులకు స్ఫూర్తి నిచ్చినవి.

మొదటి ఆళ్వారుల కాలము నాటికి ప్రసిద్ధి నొందినవి అయిదు క్షేత్రములని తోచుచున్నది.

భూదత్తాళ్వారు పంద్రెండింటిని దర్శించిరి.

తిరుమళిశై కాలమునాటికి ఇరువది మూడుగ పెరిగినది. ఇట్లు దివ్య క్షేత్రముల సంఖ్య పెరుగుచూ వచ్చినవి. ఆళ్వారులలో పదిమంది ఆళ్వారులు సందర్శించిన దివ్య క్షేత్రములలో అతిముఖ్యమైన రెండు క్షేత్రములలో ఒకటి శ్రీరంగం రెండవది వేంకటాచలముగా ప్రాధాన్యత నొందెను.[15]

ఆళ్వారులను దివ్యసూరులని వైష్ణవులు కీర్తింతురు. వీరు ఈ క్షేత్రములను సందర్శించిన తరుణమున వారచట గాంచిన ప్రకృతి సౌందర్యమును అచటి అర్చామూర్తులను తమ పాశురములలో వర్ణించిరి. భగవంతుని, ఆయన వాసమైన ఆలయపు పరిసరములను గని పారవశ్యులై భావోద్రేకముతో పాశురములతో స్వామిని అర్చించిరి. ఈ విధముగా వారి రచనలకు ఆలయ అర్చామూర్తులు ఎంతో ప్రేరణ నివ్వగా వారిచే రచించబడిన పాశురములు 'నాలాయిర దివ్య ప్రబంధములై' వాసికెక్కినవి.

నాలాయిర దివ్య ప్రబంధమున వేంకటాద్రిని గూర్చిన వర్ణనలిట్లున్నవి.

నాలుగువేల పాశురములలో శ్రీరంగ విభుని గూర్చినవి 247 పాశురములు. శ్రీ వేంకటేశుని కీర్తించిన పాశురములు 195 కలవు. పొయ్‌గై-10, భూతత్తాళ్వార్-9, పేయాళ్వార్-10, తిరుమళిశై-14, నమ్మాళ్వార్-44, కులశేఖరులు-11, పెరియాళువార్

ఆండాళ్-16, తిరుప్పాణి-2, తిరుమంగై-63, పాశురములు రచించిరని పెద్దలు కొంత విభాగము నొనరించిరి. 182 ఒకే గ్రంథమున పేర్కొనబడినవి. (16)

ఆళ్వారుల కాలము నాటికి కొండ సుప్రసిద్ధమై 'పవిత్ర వేంగడముగ' ఉన్నత స్థాయిని గొనినట్లు తెలియుచున్నది. వెంకటాద్రి నిత్య సూరులచే నోరార కీర్తింపబడుటచే 'వేంగడము' 'విష్ణుక్షేత్రమే'నని రూఢియైనది.

ఆళ్వారులు దట్టములై ఉన్నతములై అడవులతో నిండిన ఏడుకొండలను దాటిన పిమ్మట స్వామివారి దర్శనము లభ్యమగుననిరి. ఆళ్వారులు ఈ గిరిని 'వేంగడ'మని పేర్కొనిరి. పేయాళ్వార్ "తాళ్‌శడైయుమ్...తిరుమలై మేల్ ఎన్దైక్కు ఇరణ్ణురువుం ఒన్దాయ్ యిశైన్దు"(17) అని వర్ణించిరి. వ్రేలు జడయు దీర్ఘ కిరీటము, అందమగు గొడ్డలి, చక్రము, చుట్టిన పాము బంగారు మొలత్రాడును తోచు నోహో చుట్టును వ్యాపించిన సెలయేళ్ళు ప్రవహించు తిరుమలపై నా స్వామికి రెండు రూపములు ఏకమయ్యెనని 'తిరుమల' శబ్దమును వాడిరి. లభించిన శాసనములలో సుమారు 1013 సంవత్సరము నాటికి మొట్ట మొదటిసారి "తిరుమల" పేరు కనబడినది. చోళ వంశపు రాజు కొప్పాత్ర కేసరి పన్నార్ అనగా రాజేంద్ర చోళుడు వ్రాయించిన శాసనములో 'తిరుమల' శబ్దము కానవచ్చును. భండారమును గూర్చిన ప్రశంశయు కానవచ్చుచున్నది.

క్రీ.శ. 8, 9 శతాబ్దముల వరకును ఈ పర్వతము 'వేంగడ'మని ప్రసిద్ధిచెంది యుండినది. వీర నరసింహదేవ యాదవరాయ శాసనములో "తిరువేంగడ దేవర్" అని, సామవై వేయించిన శాసనములో "శ్రీ వేంగడత్తు ఎరుందరుళి నిన్ద పెరుమా నడిగలుక్కు" అని స్వామిని తిరువేంగడ దేవరగాను, కొండపై "అరుదెంచి నిలుచున్న స్వామి పాదములకు" అని పేర్కొనిరి. టి.టి.డి. శాసనములలో మొదటి శాసనములో "తిరు వేంకటముడైయన్" అనునది కానవచ్చుచున్నది.(18)

శ్రీ వైష్ణవుల సాంప్రదాయమునందు "నూట ఎనిమిది తిరుపతులు" ఉన్నను ఈ తిరుపతినే తిరుపతిగ కొనియాడుదురు. పెక్కు కోవెలలు ఉన్నను శ్రీరంగం నందలి కోవెలయే కోవెలగాను వినుతించెదరు. పదునారు తిరుమలలు (దొడ్డ కొండలు) ఉన్నను ఈ కొండనే తిరుమలగా ప్రశంసింతురు.

పొయ్‌గై ఆళ్వార్ రచించిన "ఎళువార్ విడై కొళ్వార్, "వకైయఱునున్ కేళ్వ" పాశురములచే "వేంకటాచలమును దర్శించినంతనే మోక్షలబ్ధి కాగలదని, నిత్య సూరులు దివి నుండి భువికి వచ్చి శ్రీ స్వామిని సేవించుచుందురని, నిత్యము ధూప, దీప, పుష్పములు,

జలమును ధరించి దిక్కులన్నిటను వేదార్థ జ్ఞానులు ఆశ్రయించెడు వెంక టాద్రి తెల్లని శంఖమూదిన నోరుగల స్వామి అభిమాన దేశమనియు భూమిని కొల్చిన కళ్యాణ గుణుడు వెంకటాద్రి యందు వైకుంఠమిచ్చునని, పూర్వమొకప్పుడు లేడి చచ్చినటులు కొట్టిన వాని కొండయనియు వేంకటాద్రి గురించియు స్వామిని గురించియు వర్ణించెను.

భూదతాళ్‌వార్ వెదుళ్ళు పెరిగినట్లు పెరిగిన చల్లని చరియల వేంకటాద్రియని, రావణుని చంపిన పిమ్మట వచ్చి నిలిచెనని కేశినోటిని చీల్చిన బిడ్డడు అనియు తులసి మాలను ధరించిన వాని పేరు వేంకటాద్రి స్వామి యనియు, కోతులు పూలవాగుల చేరి అచట విరిసిన పూలను కోసికొని స్తుతించుచున్నాయని వివరించెను.[20]

పేయాళ్వార్ స్వామి వేద వేద్యుడు అనియు, తులసిమాల గల స్వామి రాజధానులు కుంభకోణము, వేంకటాద్రి మున్నగునవి యనియు, పొంగు సెలయేరుల వేంకటపతి భూమిని కొల్చిన స్వామియనియు, తెల్లదంతముల ముత్యములరాల్చు వేంకట మనియు, హరిహర రూపమును స్వామి దాల్చియున్నాడని, పూర్వము చిన్న దూడ నెత్తి విసిరిన వాని కొండయనియు, కొరవ స్త్రీలు వేంకటాద్రియే ప్రాప్యముగా గల వారని నిత్య సూరి నిర్వాహకుని స్థానమే వేంకటమనియు, వేణువు నోట నుంచిన వాని పర్వతమనియు, సర్వస్వామియై, భూమియై, అష్టదిక్కులు తానై, వేదమై, వేద ప్రతిపాద్యుడైన వేంకటపతి యనియు కీర్తించెను.[21]

కొండమీది వేల్పును "వేంగడత్తాన్, వేంగడవా, తిరువేంగడముడైయన్" యని సంబోధించిరి. ఈ పదములు వేంగడ పర్వతనివాసి" యనెడి అర్థమును కలిగియున్నవి. నారాయణాద్రి, వృషభాద్రి మున్నగు యితర నామములను వీరు పేర్కొనినట్లు కానరాదు. ఈ కొండ యొక్క అధిదేవత 'విష్ణువు' అను అర్థమున మాత్రము ఆళ్వారులందరును ఏకాభిప్రాయముగలవారుగా వర్ణనలు గలవు. వేంకటాద్రి అధిదేవత విష్ణుమూర్తి అని మనసార నమ్మి స్తోత్రగానము చేసినవారే ఈ ఆళ్వారులు. ఆనాడు "శ్రీరంగం" పిమ్మట 'వేంగడమే' సుప్రసిద్ధ విష్ణుక్షేత్రముగ వన్నెకెక్కినదనుటకు పై వివరణలు ప్రమాణముగా చూపబడు చున్నవి. భక్తులను భావుకులను ఉద్ధరించు నిమిత్తమే భగవంతుడు స్వయంభువు, స్వయం వ్యక్తగా ప్రత్యక్షమయ్యెనని వెల్లడించిరి. ఆ దేవుని ఆయుధములైన శంఖ చక్రములను ఉల్లేఖించిరి. స్వామి ధరించిన తులసీమాలను గురించియు వర్ణించిరి. వేంకటాద్రి వేల్పును రాముడుగాను, దామోదరుడుగాను, వామనుడుగా అనేక రూపములలో దర్శించిరి. సముద్రమున పవళించిన నారాయణుడే వేంకటాద్రిపై నిలిచె నని విశ్వసించి పాడి, ఆడి

పరమానందభరితులైరి. ఈ రూపములలో అన్నమయ్య కూడ అదేవిధముగా స్వామి రావణుని కూల్చిన రాముడుగాను, త్రిలోకముల నాక్రమించిన త్రివిక్రములుగాను, ప్రహ్లాద భక్త రక్షకుడైన నరసింహుడుగాను 'విష్ణువు' వేంకటాద్రిపై స్వామిగ నిలిచెనని కీర్తించెను.

వేంకటనాథుని మానవులచే చెక్కిన శిల్పముగా భావించక స్వయం వ్యక్త భగవానుడుగా వర్ణించిన సంకీర్తనలు కలవు.

"యితండె బ్రహ్మ స్వరూపమితండె పరతత్త్వము
యితండె స్వయం వ్యక్త మితనిం తలచండె
వేద విచారాలు వద్దు విష్ణుండితండె
యెడయని వరములిచ్చి నీ దేవుండె
చదువులలోఁ జెప్పి స్వయం వ్యక్తమైనాడు." 76 రేకు (15-436)

తొండైనాడు తొండమండలము ఆళ్వారుల మాతృభూమి. అక్కడ నుండి నడునాడునకు అనగా మధ్యదేశము, దానిని దాటి వడనాడునకు అనగా ఉత్తర దిక్కుకు, వచ్చి వెంకటాద్రిని చేరవలెను. అది వారికి సుకరము కాదు. నాటి వేంకటాద్రి మహోన్నత మైన దుష్కరమైన కొండయై కొనదేలి వాడియైన గొప్పదైన పర్వత పంక్తులతో కూడి యుండెను. దట్టమైన అడవులతోను, వెదుళ్ళపై నడచుచు అడ్డుపడు ఏనుగుల గుంపుతో అటూ నిటూ పరుగిడు ఆటవిక జనముతోను, క్రూర మృగములతో నిండి దుర్గమముగా నుండినది. పెక్కుమైళ్ళ దూరము నడచి శైలపంక్తి నెక్కినగాని దైవదర్శనము లభించెడిది కాదు.

అందముగ, చక్కగా నిలిచిన ఉన్నతమైన వేంకటపతి నల్లని మేను ఆ మేనుపై పొంకముగా దాచిన గంధపు పూత, పూర్తిగా శరీరము నిండుగనున్న పూలదండలు కంఠము నలంకరించెడి తులసి మాలలు, చక్కని పచ్చని పట్టు వస్త్రమును మేనిపైనను పాదములపై పూల రాసులు సమర్పించుచుండెడివారని ఆళ్వారుల వర్ణనలచే మనకు గోచరమగుచున్నది. మరియు అడవి ద్రుమానులపై తిరుగుచూ పూవులను కాయలను చిందరవందరగా చేయు వానరములు, దూరమునున్న గ్రామముల నుండి అచటికి వచ్చి సేవలు చేయు భక్తులు ముక్కోటి ద్వాదశినాడు శ్రవణా నక్షత్రము నాడు సాష్టాంగ దండప్రణామము లాచరించుచుండిరని నాటి పాటలచే విశదమగుచున్నది. మొదటి ముప్వురు ఆళ్వారులు చేసిన రచనలలో ఆలయ విషయ వర్ణనలు కానరావు [22]

తిరుమళిశై ఆళ్వారు గుడి, గుడి దేవరను గురించిన విషయమును వివరించెను. చుట్టును దట్టమైన అడవి కలదని, భగవంతుడు నిలిచియున్న స్థలమునందు మాత్రము

అడవిని నరికి నడిచిపోవుటకనువైన మార్గము ఏర్పరచబడినదని, ఆ దారిని భగవంతుడే స్వయముగా చేసి మనకు మార్గమును చూపి మార్గదర్శకుడై మనలను కరుణించిరని తెలిపిరి.

"పురిందు మలరిట్టుప్పుండరీక పాదం
పరిందు పడుకాడు నిఱ్ఱ-తెఱిందు ఎంగుమ్
తానోంగి నిర్కిన్ద్రాన్ తణ్ణరువి వేంగడమే
వానోర్క్కుం మణ్ణోర్క్కు వైప్పు"

ఎవరైనను, ఎక్కడి వారైనను, ఏ సమయముననైనను దైవమును దర్శించి స్వామి పాదములకు పూలనర్పించి మ్రొక్కి సంతోషముగా పోవు మార్గము తిరుమళిశై ఆళ్వారు కాలము నాటికి ఏర్పడినదనుటకు పై పాశురము ప్రమాణముగా పెద్దలచే నుడవబడు చున్నది. [23]

"ఎంగుమ్ తానోంగి నిర్కిన్ద్రాన్" అని చెప్పుటచే నలువైపుల ఏ దిశనుండియైనను స్వామిని వీక్షించ వచ్చునని గోచరమగుచున్నది.

కులశేఖరాళ్వార్ "పెరుమాళ్ తిరుమొళి" యందు వేంగడమున "నీళ్ వాశల్" అనెడి పెద్ద వాకిలిని గురించి ప్రస్తావించిరి. (678)

నెడియానే వేంగడవా
నిన్‌కోయిలిన్ వాశల్
అడియారుం వానవరుం
అరంబయరుం కిడందయంగుం
పడియామ్ క్కిడందు
ఉన్ పవళవాయ్ కాన్బేనే" (685) [26]

గుడికి (దేహళిగ) పడి-కడపమానుగయై స్వామిని దర్శింతునని కోరికను వెల్లడించిరి. అందుచే నేడును గుడివాకిట కడపమానును "కులశేఖరుల పడి" యనియే వ్యవహరించె దరు. ఈయన కాలము నాటికి 'ఆలయ నిర్మాణము' జరిగిన దనుటకుపై పాశురమే ప్రమాణముగా గ్రహించబడినది.

నమ్మాళ్వారు మానవ జీవితము ముగియుటకు పూర్వము వేంకటాద్రిని తప్పక దర్శించవలయునని విన్నవించిరి. వక్షఃస్థలమున లక్ష్మీ వాసమును, దివ్యచరణారవింద ముల సొబగును, శరణాగతియే' తత్త్వమనియు తెలియజెప్పిరి. త్రిమూర్తి స్వరూపము ఏకమై ఒక్కమూర్తిగ గోచరించుచున్నాడనియు, లక్ష్మీదేవి అతనినే ఆశ్రయించి యున్న దని వర్ణించిరి. "ఆదిమూర్తి" యనియు, "అలర్‌మేల్ మంగై మాత్వా" యనియు (ఉరమున అలమేలు మంగ కలిగియున్నవాడా) మామోన్ అనియు, "వానోర్ పెరుమాళ్" (దేవతల స్వామి)

యనియు కీర్తించిరి. "సెత్త పాంబు అణెయామ్" అను పాశురముచే శేషుని పాన్పుగా నున్న కొండల చాలును శేషాచలము" అని పిలిచెడి వాడుక యుండిన దని వ్యక్తపరచిరి. అన్నమయ్య "అలమేలు మంగ నుర మందిడుకొన్న దేవుడు"గా స్వామిని కీర్తించెను.

"భవ కమల భవ మాధవ రూప శేషాద్రి
భువన వేంకటనాథ
శ్రీ వల్లభునకు నశేష కైంకర్యముల
శ్రీ వేంకటాద్రివైన శేషమూరితీ" సం-11 135 సంకీర్తనం

సుందరమైన శైల పంక్తి, చల్లగ వీచుగాలి, దట్టమైన వృక్షములు, గుంపులు క్రమ్ముకొని వచ్చు నల్లమబ్బులు, సువాసనలు వెదజల్లు పుష్ప పరిమళములు, అందముగా నాట్యమాడుచూ పారెడు సెలయేరులతో నాడు వెంకటాద్రి బహు రమ్యముగా నుండినట్లు ఆళ్వారుల పాశురములలో వర్ణింపబడినది. అదే వేంకటాద్రిని అన్నమయ్య

"ఆటలుఁదిరుపులు నందపు టురుపులు
పాటలు వనవైభవమెల్లా
కూటవనెమిళ్ళ కోవిల గుంపులు
పేటలఁదేటల పెనుఁగూటములును
కోరిన పండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురు జంపములు" 20 రేకు.

అనియు ఇంకను

అదె చూడు తిరు వెంకటాద్రి నాలుగు యుగము
లందు వెలుగొంది ప్రభమీఱఁగాను 37 రేకు

అని తిరు వెంకటాద్రి నాలుగు యుగములలో ప్రతిభ కలిగియున్నదని తిరుమల ప్రాశస్త్య మును చాటెను.

"కృతేవృషాద్రిం వక్ష్యాన్ని
త్రేతాయా మంజనాచలమ్
ద్వాపరే శేషశైలే
కలౌశ్రీ వేంకటాచలమ్"

అదే రీతిలో వేంకటాద్రి వేల్పును దర్శించిన అన్నమయ్య సంకీర్తనలు : రాముడు - వేంకటేశుడు.

"లావున రావణుఁజంపె లంక విభీషణుకిచ్చె
చేవలనో సీత నిన్నుఁ జేకొనెను
భావించి శ్రీ వేంకటాద్రిఁబట్టముదాఁగట్టుకొనె" -191 రేకు. 7-228
కృష్ణుడు-వేంకటేశుఁడు
ఇదివో వసుదేవుని ఇంటి చెరలెల్లఁబాసె
ఇదివో దేవకి తపమిట్టె ఫలించె
చెదరక తానిలిచె శ్రీ వేంకటాద్రిపైనిదె -193 రేకు 7-244
యెదనలమేలు మంగ యెక్కి వున్న దిదివో
వామనుడు - వేంకటేశుఁడు
త్రివిక్రమ : శ్రీ తిరువేంకటగిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమలమసృణ కబళ ప్రియామే
దివా నిశాయాం ధియం పాతు. 117 రేకు (11-2-72)

## ఆచార్యులు - వేంకటాద్రి

శ్రీ తిరుమల తిరుపతి క్షేత్రము శ్రీ వైష్ణవ క్షేత్రముగా అగమోక్త విధ్యనుసారము పూజా పునస్కారములతో వైభవోపేతముగా మహోన్నత స్థానమును కలిగి యుండుటకు కారకులు ఆచార్య త్రిమూర్తులైన శ్రీశైలపూర్ణులు (తిరుమలనంబి) శ్రీ భగవద్రామానుజా చార్యులు, శ్రీ అనంతాచార్యులు. శ్రీ అనంతాచార్యుల కాలము క్రీ.శ. 11వ శతాబ్ద ఉత్తరార్థమని, 12వ శతాబ్దపు పూర్వార్థమని స్థూలముగా చెప్పవచ్చును. శ్రీశైల పూర్ణులు, అనంతాచార్యులు వీరిరువురు తిరుమల స్వామికి కైంకర్యము చేసిన వారిలో అతి ముఖ్యులు.

శ్రీ రామానుజాచార్యులు శ్రీ కేశవయజ్వ శ్రీ కాంతిమతి తాయారు దంపతులకు శాలివాహన శకము 939 (1017 A.D. ) కాలమున అవతరించిరని పెద్దల అభి ప్రాయము. వీరి మేనమామ శ్రీశైల పూర్ణులు, వీరికి తిరుమల నంబిగారని నామాంతరము.

తిరుమల నంబిగారు క్రింది తిరుపతిలోనే వాసముండి నిత్యము స్నాన సంధ్యా తిరువారాధనాది కృత్యములను పూర్తి గావించుకొని తిరుమలపైకి వేంచేసి పాతాళగంగ నుండి తీర్థమును తెచ్చి శ్రీశ్రీనివాసుల తిరుమంజమునకు సమర్పించుచుండిరి. వీరట్లు చేయు చుండగా ఒకనాడు శ్రీశ్రీనివాసుడు కిరాత వేషముతో ''తాతా-తాతా'' నాకుదాహమగుచున్న దని, కొంచెము నీరు కావలెనని అడిగెను. నంబిగారు ఆ నీరు

స్వామి తిరుమంజనమునకైకొని పోవు తీర్థమనియు ఆ నీటిని త్రాగుట అపరాధమని వివరించిరి. కాని శ్రీనివాసుడు బాణముతో బిందెకి కన్నము గావించి నీటిని త్రాగుచు నంబిగారిని వెంబడించెను. నంబిగారు శ్రీ స్వామి నీరు గ్రహించుటను పరికించి, ఆ నీరు స్వామి తిరుంజనమునకిక పనికిరాదని విచారించి, మరల అంత దూరము పోయి నీరెట్లు తేగలనని దిగులు చెందగా స్వామి "అదిగో ఆకాశగంగ" యని వాడియైన బాణముతో కొండను ఛేదించి నీటి ధారను ప్రవహింపజేసిరి. అప్పటి నుండి నేటి వరకు ఆ తీర్థమే స్వామి కైంకర్యమునకు వినియోగమగుచున్నది. ఈ "తాతా" పిలుపును అన్నమయ్యయో వారి వంశస్థులో సంకీర్తనగ చేసిరి.

తిరుమల ఆదిశేషుల అవతారమనియు దానిని కాళ్ళతో త్రొక్కరాదని శ్రీ రామానుజులవారు కాళ్ళకు గుడ్డలను చుట్టుకొని మోకాళ్ళతో శ్రమకోర్చి కొండనెక్కి స్వామిని దర్శించిరి. పిమ్మట స్వామి మూర్తి శైవ విగ్రహమని భావించి వాదించిన శైవ సిద్ధాంత ప్రముఖులకు అనేక ప్రమాణములను చూపించి ఆ మూర్తి విష్ణుమూర్తియని నిరూ పించిరి. ఇంకను వైఖానసాగమానుసారము అనేక విధులను ఏర్పరచి తిరుమలపై స్వామివారి ఆలయ నిర్వాహకమున అనేక కట్టుదిట్టములు చేసి స్వామికి పరమ ప్రీతి పాత్రులైరి.

అనంతాచార్యులు శ్రీరామానుజుల వారికి ప్రియతమ శిష్యులు. వీరు సంస్కృత భాషలో రచించిన 'వేంకటాచలేతిహాసమాల' శ్రీ వేంకటనాథుని గురించి పెద్దలు, మహానుభావులు జరిపిన చర్చలకు ప్రమాణ గ్రంథముగా తరువాతి వారిచే గ్రహించ బడినది. ఈ గ్రంథమును తెలుగున అనువదించనవారు ఎన్.సి. నరసింహాచార్యుల వారు. [25]

శ్రీరామానుజుల వారి కోరికపై అనంతాచార్యులు పత్నీ సమేతుడై శ్రీ వేంకటాద్రికి చేరి అనుదినము భగవంతుని సేవించుచు అచట విశాలమైన ఒక నందన వనమును దానికాధారమైన పెద్ద తటాకమును, నందనవనమునకు మధ్య నొక బావిని నిర్మించి, దానికి "రామానుజ మతము" అని ఆచార్య నామధేయము గావించి పుష్ప కైంకర్యము సేయుచుండిరి. అనంతాచారి పూర్ణ గర్భిణియైన పత్నితోను, కుమారునితోను 'శ్రీ రామానుజ తటాకము' నిర్మించుటకు త్రవ్వుచుండెను. ఆ త్రవ్విన మట్టిని మోయుచున్న అనంతాచారి పత్నికి సహాయపడవలెనని భక్తవత్సలుడు శ్రీనివాసుడు తలచి వటు వేష మున వచ్చి ఆ మట్టిని మోయు చుండెను. ఈ సంగతి తెలియని అనంతాచార్యుడు వటు రూపిలో నున్న భగవంతుని తరుముకొనిపోయి గునపముతో గడ్డముపై కొట్టెను. నెత్తుటి ధారలు కట్టుచుండగా స్వామి తన ఆనంద నిలయ విమానమును చేరెను. అతనిని అనుసరించుచు

పోయిన అనంతాచార్యుడు ఆలయములో స్వామి చుబుకము నుండి ప్రవహించు రక్తధారను చూచి దాని నిలుపుటకై పచ్చ కర్పూరమును చుబుకమున నుంచెను. నాటి నుండి అనంతాచార్యుని మహిమను చాటుటకై స్వామి చుబుకమున పచ్చకర్పూర చూర్ణమును ధరించుచున్నారు. ఆ గడ్డపారను సందర్శనయోగ్య స్థానమున నుంచి వస్త్ర మాల్య భూషణాదులచే స్వామి ఆయనను సత్కరించెను. ఈ సంఘటనను అన్నమయ్య శ్రీ స్వామి మహిమలను కీర్తించుచూ ఆచార్యులవారి సేవా నిరతిని, స్వామి కరుణా హృదయమును తమ సంకీర్తనలో పొందుపరిచిరి.

"ఎటువంటి వాడవో నీ మహిమ
లెట్టు దెలియవచ్చును
నిటల లోచనుడు అజుఁడు తెలియలేరు
నిన్నెట్లు దెలిసేరు మానవులు
తిరుమల నంబి తాతాతయన్న నాఁడె
తెలిసేఁబో మీ పెద్దతనములు
మరియు ననంతాళు వారి చెరువుగట్ట
మన్ను మోయగా దెలిసెమీ నటనలు (అ.చా.చ.)

(పితామహుడు బ్రహ్మ పితామహ పితః శ్రీనివాసుడు ఆయనకు పిత పితామహ పితకు పిత = తిరుమల నంబిగారైరి. తాత తాత)

శ్రీ రామానుజాచార్యులు శ్రీ స్వామి మూర్తిని గురించిన వివిధ వాదములను ఖండించి వేంకటాద్రిపై నున్న స్వామి విష్ణుమూర్తి యని అనేక ప్రమాణములను చూపిరి. ఆ వాద ప్రతివాదనలను ఆలకించిన యాదవరాజు రామానుజుల వారితో "నీవు పండిత పామర సాధారణముగా దేవ సమ్మతి ప్రదర్శించెడి తీరును పరిపూర్ణ తృప్తి కలిగించెడి సమాధానో పాయమును ఏర్పరుప సమర్థుడవేని ఆ విధముగా చేయు"మనగ రామాను జులవారు "ఇపుడు ప్రసక్తమైన దేవతాంతరత్వారోప రూపమైన మహానర్థ ప్రసంగమును పరిహరింప శంఖ చక్రములు భగవంతుని ధరింపజేసెదె"నని దేవ సమ్మతిని సూచించు నట్టి అందరికిని నమ్మకమును కలిగించునట్టియు యాశంఖచక్రధారణము ప్రదర్శింతము గాత' యని తలచి "నేను భగవంతుని అసాధారణ చిహ్నములగు శ్రీ సుదర్శన పాంచ జన్యాది దివ్యాయుధములు చేయించి, భగవత్సన్నిధానమున నుంచెదను. వారు దేవతాంతర చిహ్నములను పాశాంకుశాద్యాయుధములు నిర్మించి యుంచెదరు గాక" యని యాదవ రాజుతో చెప్పెను.[26]

యడుగులు దలఁచి శ్రీహరి హరీయనుచు
..........................................చీ రోఁతయనుచు
హరి చరాచర దేహియని పెద్దలనఁగ
నిరవొంద నెరిఁగియు నిటు సేయదగునె
చిడిముడి నేమి చేసెదనంచు చేతి
కొడవలి నేల గ్రక్కునఁబారవైచె" (29)
పిదప మదిలో వైరాగ్యము చెలరేగ
"ఎన్నటి చుట్టంబు రిటువంటి వార
లెన్నటి బంధుండ నేను వారలకు
నీ వట్టి వెట్టి నాకేల కావింప....." అనియు
తల్లియుఁదండ్రియు దైవంబు గురువు
....................................శేషాద్రి నాథునిఁ (30)

గొలిచి మనియెద ననుచు విచారించె. అంతలో సర్వుల మది నెఱిగిన స్వామి కృపచే తిరుమలకు పోవు పరుస గుంపుతో భగవదిచ్ఛానుసారము వారితో తిరుమల యాత్రకు ప్రయాణమాయెను. చిన్నన్న

"ముక్తిదాయక పురములు నేడు చూడ
యుక్తి వెంకటగిరి యొద్ద నున్నట్టి
పల్లెలో..................గ్రామంపు శక్తి (30)
గనుఁగొని బహు నమస్కారముల్ జేసి"

అని వర్ణించెను. కావున ఆనాడు దిగువ తిరుపతి పొలిమేరలో 'తాళ్ళపాక గంగమ్మ' దేవతను యాత్రీకులు ఆ క్షేత్ర దేవతగా వర్ణించి క్షేత్ర ప్రవేశము చేసెడివారను విషయము విదితమగుచున్నది. అన్నమయ్య

"మున్ను నీ నగరిత్రోవ మొగమైన యప్పుడే
ఘన యామ్య మార్గము గట్టు వడియె
నొనర నీ తిరుపతి నొక రాత్రి వున్నప్పుడే
కనలు కాలసూత్రాది ఘాతలెల్లఁబూడె" సం. 8 202 రేకు.

అని తిరుపతి క్షేత్ర మాహాత్మ్యమును విశద పరచెను. అన్నమయ్య దిగువ తిరుపతి నుండి వేకువ జామున బయలుదేరి

పొదలి యరయోజనము పొడవుననుఁబొలు పొంది
పదినొండు యోజనంబుల పరపుననుఁబరగి
చెదరకే వంక జూచిన మహా భూజములు
సింహ శార్దూలములును
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు విదితమై విహరించు విశ్రాంత దేశముల
వేడుకలు దైవాఱఁగాను
ఎక్కువకెక్కువై యొసగి వెలసిన పెద్ద
యెక్కుడతిశయముగ నెక్కినంతటమీఁద
అక్కజంబైన పల్లవరాయని మటము
అలయేట్ల పేడ గడవన్.
చక్కనేఁగుచు నవ్వచఱి గడచి హరిఁదలచి
మ్రొక్కుచును మోకాళ్ళ ముడుగు గడచిన మీద
నక్కడక్కడ వేంకటాద్రీశు సంపదలు
అంతంతఁగానరాఁగాను

పై వర్ణనలను బట్టి సుప్రసిద్ధమగు సోపాన మార్గమును యాత్రీకులుపయోగించుచుండి రని స్పష్టమగుచున్నది. ఈ సంకీర్తనలో వర్ణింపబడిన దాని వివరములు :

**పెద్ద యెక్కుడు** : ఇచట మెట్లు నిట్టనిలువుగా యెత్తుగా నుండుటచే ఆ పేరేర్పడి యుండవచ్చును. తిరుమల నధిరోహించుటలో నెక్కువ శ్రమకరమైన యెక్కుడిదిగా తోచును.

**పల్లవరాయని మటము** : ఈ సోపానము మట్ల కుమార అనంతరాజుచే నిర్మించబడినది. రెండు శాసనములు పశ్చిమ, ఉత్తర కుడ్యములపై పాతాళ మంటపమున చెక్కబడినవి. ఈ సోపాన మార్గము 'అగ్రగోపురము'నకు దారిని నిర్మించెను. క్రీ.శ. 1287 ప్రాంతములో దిగువ తిరుమలలోని అళ్వార్ తీర్థమున నమ్మాళ్వారు తిరుమాళిగను, మంటప ప్రాకారాదులతో నిర్మించిన 'వానెడుత్త కైయలగర్' అను నాతడే పల్లవ రాయడు. అతని నిర్మాణములలో ఈ మట మొక్కటై యుండునని కొందరి అభిప్రాయము.

**అవ్వచఱి** : ఇది మోకాళ్ళ ముడుపునకు ముందునున్న లోయ. పరుసల మొరలు ప్రతిధ్వనించి తిరుమల మొత్తము మారుమ్రోగుచుండును.

తిరు వేంకటగిరి సోపాన మార్గమును
"తోరణములే త్రోవెల్లా
మూరట బారట ముంచిన లతల
కూరిమి మటములు గోపురంబులును
తేరు గడపలే తెరువెల్లా
కోరిన పండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురు జొంపములు"

అని వర్ణించిరి. ఈ విధముగా కొండనెక్కుచు బడలి మోకాళ్ళ ముడుపువద్ద వెదురు పొద క్రింద ఒక బండపై నిద్రించెను. అంతట అతని ఆకలిని జగదంబ యెరిగి ఆతనికి ప్రసాదమునిచ్చి "యీ మహాపర్వతేంద్రంబు సాలగ్రామమయమని పాదరక్షలతో నెక్కరాదని అవి విడిచి కనుగొనిన కన్నుల గనవచ్చు"నని అనుగ్రహించినది. అన్నమయ్య ఆమె ఆజ్ఞానువర్తియై పాదరక్షలను విడిచి ఆ కొండ అద్భుతమును గాంచి విస్మయము నొంది ప్రణతులర్పించెనని చిన్నన్న వివరించెను. అన్నమయ్య కొండను చూచి :

**(రామక్రియ)**

"కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ
వేదములే శిలలై వెలసినది కొండ
యే దెసఁబుణ్యరాసులే యేఱులైనది కొండ
గాదిలిబ్రహ్మాది లోకముల కొనలకొండ
శ్రీదేవుఁడుండేటి శేషాద్రి యీ కొండ
సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
పుర్విఁదపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ
వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ
పరుగు లక్ష్మీకాంతు సోబనపుఁగొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీ వేంకటపుఁగొండ" 282 రేకు

పాల్కురికి సోమన శ్రీశైలమును గురించి 'పండితారాధ్య చరిత్ర'లో పర్వత ప్రకరణమున పండితయ్య చూడ్కులకు నంగద శ్రీశైలమంతయు దివ్యలింగ స్వరూపమై వెలుగొందె" నని వర్ణించెను.

చిన్నన్న 'అన్నమాచార్య' చరిత్రలో అన్నమయ్య కొండను గాంచి ప్రణతులొనర్చి ఆశుమార్గమున ఒక్క శతకమును చెప్పె'నని వర్ణించెను. అన్నమయ్య రచించిన శతకములోని ఒక పద్యము.

"యోగ్యతలేని కష్టుఁడనయోగ్యుడనన్నిటిఁజూడ గర్భని
ర్భాగ్యుఁడ నీ కృపామతికిఁబ్రాప్తుఁడ నోయలమేలుమంగ నా
భాగ్యము నీ కృపాగరిమఁబ్రాప్యముగా కావు మటంచు సారెనీ
భాగ్యవతీ శిరోమణిని బ్రస్తుతి చేసెద వెంకటేశ్వరా"

"అమ్మకుఁదాళ్ళపాక ఘనుఁడన్నఁడు పద్యశతంబు సెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనములఁగూరిమితో నలమేలు మంగకున్"

చిన్నన్న "నానావిధావనోన్నతమైన యట్టి కోనేరు గడతెంచి ఆ తీర్థవిభుని సేవించి కృతస్నానుడై పుష్కరిణి సోయగమును గాంచె" నని వివరించెను.

అన్నమయ్య ఒక్క శతకము చెప్పి ఆనందోద్వేగముతో

"అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగలమయము
అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్య నివాసమఖిల మునులకు
నదె చూడుఁడదె మ్రొక్కుడానందమయము
చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము
కైవల్య పదము వేంకటనగమదివో
శ్రీ వేంకటపతికి సిరులయినది
భావింప సకల సంపదల రూపమదివో

"ప్రాకటితంబైన పాపవినాశము లోనభరితమగు దురితము పగిలిపారుచునుండ

ఆకాశగంగ తోయములు సోకిన భవములంతంత వీడి పారఁగను" అని తిరుమలపై గల తీర్థ మహిమను నోరారా పొగిడెను. వరాహ, స్కాంద పురాణములలోను ఈ తీర్థముల మాహాత్మ్యము వివరించబడినది. ఇట్టు ఆలయ ప్రాంత పరిసర ప్రాంతములు పరిశీలించుచు "ఆనంద నిలయుని" "జగదాకార చతుర్భుజ, గగన నీలమేఘశ్యామ ఘనవేదాంతైగణన వుదార, కనకశంఖ చక్రకరాంకా దినమణి శశాంక దివ్యవిలోచన అనుపమ రవి బింబాధరా శ్రీ వేంకటగిరి శిఖర విహార పావన గుణగణ భావా"యని ఆనంద "విమాన వేంకటేశ్వరు"ని కీర్తించెను. రేకు 176 7-143

## అన్నమయ్య-తిరుమల ఆలయము

తిరుమల దేవాలయము యొక్క ప్రధాన ప్రవేశ ద్వారమును "పడికావలి" అని, ముఖ ద్వారమని, సింహద్వారమని నిత్య వ్యవహారమున పలురీతులుగా వ్యవహరించెదరు. ఈ మహాద్వారమునకు అనుసంధింపబడియున్న ప్రాకారము మహాప్రాకారము. ఆ మహా ద్వారమున కిరువైపుల శంఖనిధి, పద్మనిధి దేవతల విగ్రహములు కలవు. ఆగమశాస్త్రాను గుణముగా ఈ నిధి దేవతలు మూడవ ప్రాకార ప్రవేశద్వారము వద్ద ఏర్పాటు చేయబడుట సంప్రదాయము. ఈ ఆలయము ఈ "నిధి దేవతల" ప్రతిష్ఠచే మూడు ప్రాకారములు కలిగియున్నదని స్పష్టమగుచున్నది. (36)

ఆలయమున ప్రవేశించినంతనే మొదటి ప్రదక్షిణ మార్గమే సంపంగి ప్రదక్షిణ మార్గము. పూర్వము ఈ ప్రదక్షిణ మార్గములో స్వామి వారికి ఉపయోగపడు సంపంగి పూల వృక్షములు ఉండెడివట. కనుకనే దీనికి చంపకావరణమని చంపక ప్రదక్షిణమని, సంపంగి ప్రదక్షిణమని ప్రసిద్ధి ఏర్పడినది. నడిమిపడి కావలి గోపుర ప్రాకారమునకు మధ్యగల వెడల్పుగా నున్న ప్రదక్షిణ మార్గమున 'సంపంగి ప్రదక్షిణ'మార్గమందురు.

చాలా కాలమునకు పూర్వము ఈ సంపెంగ ఆవరణ మార్గములో పడికావలి (మహాద్వారము) సమీపమున ఒక పెద్ద చింతచెట్టు ఉండెడిదట. దానికి కొమ్మలు, రెమ్మలు శాఖోపశాఖలుగా పెరిగి అతి విశాలముగా వ్యాపించి ఆ చెట్టునీడ ఎటువైపు ననూ తిరుగక ఆ వృక్షమూలముతో స్థిరముగా నుండెదిది. కనుక నీడ తిరుగని చింత చెట్టుగ ప్రసిద్ధి చెందినది. అది నిదురపోని చింత చెట్టుగను పేర్కొనబడినది. దాని శాఖలు కొన్ని చిగురించగా మరికొన్ని శాఖలు పుష్పించగా, మరికొన్ని శాఖలు పండ్లు కాయుచుండెడివట.

ఆ చెట్టుక్రింద పుట్టలో శ్రీనివాసుడు కొంత కాలము దాగి ఉండెనట. ఆ నీడ తిరుగని, నిదుర ఎరుగని చింతచెట్టు సాక్షాత్తు వాసుదేవుడు అని పురాణములు పేర్కొనుచున్నవి. ఈ విషయ వివరణలు 'వేంకటాచల మాహాత్మ్యం' అను గ్రంథము నుండి తెలుయుచున్నది.

ఈ పుట్టను గూర్చి పాయ్గై ఆళ్వారు 'ముదల్ తిరువందాది ఊరుమ్ వరి అరవన్' పాటలో 'పుత్తడయమ్ వేంగడమే'నని వర్ణించిరి (39). The idol is stated to have lain buried inside an anthill or a round of earth" (37) ఇంకను చిన్నన్న 'అన్నమాచార్య చరిత్ర'లో తరగని ఫలపుష్ప తతి తోడ నీడ తిరుగని చింతవర్తిల నమ్రుడగుచు' అని మహాద్వారము లోపల నున్న నీడ తిరుగని చింతచెట్టును దర్శించినట్లు వర్ణించెను. అన్నమయ్య

"వడి వేంకటపతి వరముల రాయఁడు
నుడుగఁగాళ్ళుఁగనులు సుతులు
బడిబడి నొసఁగుచు బ్రాణాచారులకు
కడిమి నీడ తిరుగని చింతాడ" (11-3-108 రేకు) అని చింతచెట్టు గూర్చి వర్ణించెను.

ఈ సంపంగి ప్రదక్షిణ మార్గమునందు దక్షిణము వైపున 'కల్యాణ మండపము' కలదు. ఈ మార్గమున వాయువ్య దిశలో 'ఉగ్రాణము' అనబడు కొట్టడి ఉన్నది. ఉత్తర దిశలో 'పడిపోటు' వంటశాల ఉన్నది. పడిపోటుకు తూర్పున 'యమునాత్తురై' అనబడు 'పూల అర' ఉన్నది. ప్రసాదాల తయారీ, స్వామికై వినియెగించు కర్పూరము, చందనము, జీడిపప్పు, ద్రాక్ష నెయ్యి మున్నగు వాటిని ఇచట అనగా 'ఉగ్రాణము'న పంపిణీ చేయుదురు. 'విరజానది' అనెడి తీర్థము ఉగ్రాణమునకు ముందున్నది. 'పూల అర'కు ఆనుకొనియున్న తూర్పు దిక్కున 'వగపడి అర' కలదు.

సంపంగి ప్రదక్షిణ మార్గములో నున్న 'కల్యాణ మంటపములో నిత్యము కళ్యాణోత్సవము' జరుగుచున్నది. పూర్వకాలమున విమాన ప్రదక్షిణములో నున్న రంగనాయక మంటపములోనే వివాహ మహోత్సవము జరిగెడిదట. కాని నేడు సంపంగి ప్రదక్షిణ మార్గములో నిర్మించబడిన కళ్యాణ మంటపములో జరుగుచున్నది. ఆలయ మహాప్రాకారము నిర్మించుటకు పూర్వము ఈ సంపంగి ప్రదక్షిణ మార్గము నుండి నేరుగా పుష్కరిణికి మార్గముండెదిదని తెలియుచున్నది.

ముఖ ద్వారమున ప్రవేశించినంతనే ఎడమప్రక్క రంగనాయక మంటపము నిర్మింప బడినది. క్రీ.శ. 1320-60 సంవత్సరముల మధ్య మహమ్మదీయ దండయాత్రలచే

పెట్టిరి గొల్లెతలెల్ల పెరుగు నెయ్యి వుట్ల
కొట్టరో కొట్టరో మీరు కోలల వారు
తిట్టేరు తిట్టేరు వారల్లదివో తెగి దగ్గరక తొల్లె
పట్టరో వారలు మీరు పైఁగారే పాలు
తక్కక యడుకు లెల్లా దాఁచిరి తమ సొమ్మంటా
చిక్కెఁజిక్కెఁదీసుకోరో సేన వున్నవి
యెక్కెను శ్రీ వేంకటాద్రి ఇదివో మన కృష్ణుడు
చక్కనాయఁబనులెల్లా జాలించి రారో 25.534

అని జన్మ దినోత్సవము, ఉట్ల పండుగను వీక్షించుటకు భక్తులను ఆహ్వానించుచున్నారు.

ప్రవేశ ద్వారమునానుకొని ఎడమవైపు లోపలివైపు ఎత్తైన మండపము నిర్మింప బడియున్నది. క్రీ.శ. 1517 సంవత్సరంలో జనవరి 2వ తేదీన శ్రీకృష్ణ దేవరాయలవారు స్వయముగా తమ విగ్రహములను ప్రతిష్టించుకొనిరి. ఆనాటి నుండి ఇది కృష్ణరాయ మంటపమని ప్రశస్తి పొందినది.

ద్వారమునకు ఎడమ ప్రక్క క్రీ.శ. 1570న చంద్రగిరి రాజైన వేంకటపతి రాయల వారి ప్రతిమ నమస్కార భంగిమతో ప్రతిష్టింపబడియున్నది.

ఈ విగ్రహమునకు దక్షిణము వైపున అచ్యుత రాయలు, వరదాజి అమ్మా, రాజ దంపతుల నిలువెత్తు నల్లరాతి ప్రతిమలు ప్రతిష్ఠింపబడినవి. శ్రీ స్వామివారి శంఖముతో పోయబడిన పవిత్ర జలముతో విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా పట్టాభిషేకము చేసి కొనెనని చరిత్ర చాటుచున్నది. క్రీ.శ. 1530లో బ్రహ్మోత్సవము తన పేరిట ఏర్పాటు చేసేను. క్రీ.శ. 16వ శతాబ్దము పూర్వార్థములో ఈ మండపము నిర్మింపబడినది. (41) శ్రీ స్వామివారు ఊరేగి వచ్చిన పిమ్మట ఆలయ ప్రవేశము చేసినంతనే ఈ ప్రతిమా మంటపమున కొంతసేపు నిలుపగా, ఆచార్య పురుషులు 'దివ్య ప్రబంధగానము' చేయుచు స్వామిని కీర్తించెదరు. పిదప హారతి, అటు పిమ్మట స్వామివారు ధ్వజస్తంభ మునకు ప్రదక్షిణముగా ఆలయము లోనికి ప్రవేశించెదరు.

ప్రతిమా మంటపము దక్షిణము వైపు ఒక తులాదండము కలదు. ఈ తులా దండము 1987వ సంవత్సరమున ఈ మంటపమున ఏర్పాటు చేయబడినది. పూర్వము లోపల హుండీకి సమీపమున నుండెడిది. "తాసువలెఁ దులఁదూగి దయిలు వారేవు" అని అన్నమయ్య ఈ తులాభారమును తలచెనేమో?

ప్రతిమా మంటమునకు ఉత్తరము వైపు ఎత్తైన అధిష్ఠానము మీద విశాలమైన మంటపమని పిలువబడు ఐనమహల్ (అయినామహల్) గలదు. ఈ అద్దాల మండపములో మధ్యాహ్నము 2 గంటల ప్రాంతమున డోలోత్సవము శ్రీ స్వామి వారికి జరుగును. అర్జితసేవగాన నిర్ణీత రుసుము చెల్లించిన గృహస్థులు మా ామే పాల్గొనెదరు. ఉత్తర భారతము నుండి వచ్చిన సేవా విధానమిదియని తోచును.

పైని చెప్పిబడిన ప్రతిమా మంటపమునకు, అద్దాల మండపమునకు, రంగానాయక మండపమునకు మధ్యన చతురస్రముగానున్న స్థలమున నిలిచి చూడగా శ్రీవారి ధ్వజ స్తంభము గాంచవచ్చును.

"వదలక వలసిన వారికి వరములు యెదురెదురై తానిచ్చునను
నిదురలేక పెను నిధానమై కదలఁడదె గరుడగంభము కాడ" 62 రేకు

అని అన్నమయ్య సంకీర్తనలో 'గరుడస్తంభ' ప్రసక్తి గానవచ్చును. చిన్నన్న "అన్నమాచార్య చరిత్ర"లో లక్కమాంబా నారాయణ లిరువురు వేంకటస్వామి సన్నిధికి దండియై గారుడ స్తంభము దండ 'సంతానంబు వేడ వరదుడై వేంకటేశుడు కరుణించి వారి క్లేశములను పోగొట్టెనని వర్ణించెను.

ఈ ధ్వజ స్తంభమునకు ఎదురుగానున్న ప్రవేశద్వారమే వెండి వాకిలి. దీనినే 'నడిమి పడి కావలి' అని కూడా వ్యవహరించెదరు.

"కోరిన వారికిఁగోరిన వరములు
ఓరంత ప్రొద్దు నొసఁగుచును
చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమి గోపురమాడ"-62 రేకు (11.3.108)

ఈ రెండవ ప్రవేశ ద్వారము, గోపురము ప్రాకార కుడ్యములు క్రీ.శ. 12వ శతాబ్దము ప్రారంభింపబడి క్రమేణా అంచెలంచెలుగా నిర్మింపబడి 13వ శతాబ్దమున పూర్తి అయినదని చారిత్రక పరిశోధకులు పేర్కొనుచున్నారు.

వెండి వాకిలికి ముందు తూర్పు భాగమున "బంగారు ధ్వజ స్తంభము" దానిని అనుకొని తూర్పున 'బలిపీఠము', ఈశాన్యమున 'క్షేత్రపాలక శిల' ప్రతిష్ఠింపబడియున్నవి.

పూర్వము ఈ ధ్వజ స్తంభము, బలిపీఠం, వెండివాకిలి లోపల విమాన ప్రదక్షిణ మార్గమున గరుడుని మంటపము వెనుక వుండెడిదని, క్రీ.శ. 1417లో బంగారు వాకిలి ముందు ముఖ మండపమును నిర్మింపబడుటచేత, ఆ మార్గము చిన్నదగుటచే ఇచటికి

మార్చబడినదని పరిశోధకుల అభిప్రాయము. క్రీ.శ. 1982న నూతన ధ్వజ స్తంభము ప్రతిష్ఠించబడినది.

ధ్వజస్తంభ మండపములో మనకు ముందుగా కానవచ్చునది ఈ బలిపీఠమే. విమాన ప్రదక్షిణమున ఆయా దిక్కులలో బల్యన్నమును సమర్పించి చివరకు వెండి వాకిలి బయటికి వచ్చి బలిపీఠమునకు అన్నమును ఆహారముగా సమర్పించెదరు.

ఈ బలిపీఠముపై వేసిన అన్నమును రాత్రింబవళ్ళు సంచరించు భూత, యక్ష, పిశాచాది గణములు ఆహారముగా స్వీకరించెదరని ప్రతీతి. ఇంతటితో నైవేద్యము పూర్తి యగును.

బలిపీఠమునకు ఈశాన్యము వైపు సుమారు 1 1/2 అడుగుల ఎత్తుగల చిన్న శిలా పీఠము కలదు. దీనిని 'క్షేత్ర పాలక శిల' అని పిలిచెదరు.

"తారక బ్రహ్మమని తగంగాశిలో శివుండు<br>
యేరుపరచి ప్రాణులకిప్పుడుఁజెప్పుచున్నాడు<br>
యీ రీతి శ్రీ వేంకటేశ యిందుకు సాక్షులునీ వారలు<br>
ఆ రూఢి గరుడ గంభమండ నేడున్నవి." 72 రేకు. 15-416

తిరుమల పుణ్య క్షేత్రమునకు పరిపాలకుడు రుద్రుడు (శివుడు) ప్రస్తుతము ఈ క్షేత్ర పాలకశిల పూర్వ స్వరూపముతో అటు గోగర్భతీర్థము నందు, అంశా స్వరూపముతో ఆలయములోను వెలుగొందుచున్నదట. ప్రస్తుతము ప్రతిదినము తెల్లవారు జామున శ్రీ స్వామివారి కైంకర్యమునకు వచ్చు అర్చకులు తమ తాళవు గుత్తిని 'కుంచె కోల'ను క్షేత్రపాలక శిలకు తాకించి నమస్కరించి ధ్వజ స్తంభమునకు ప్రదక్షిణచేసి ఆలయ ప్రవేశము చేసెదరు. ఏకాంతసేవానంతరం ఇచటనే కుంచెకోలను తాకించి నమస్కరించి ఇంటికి పోవుదురు. ఇది నేటివరకు సాగుచున్న సాంప్రదాయముగా గానవచ్చును.

వెండి వాకిలి దాటి లోనికి ప్రవేశించినంతనే కనిపించు మార్గమే విమాన ప్రదక్షిణ పథం. ఇది రెండవ గోపుర ప్రాకారమునకు నడుమ నెలకొన్న మార్గము. ఇది స్వామివారి ప్రధాన గోపురమగు ఆనంద నిలయ విమాన ప్రదక్షిణమునకు ప్రదక్షిణానుగుణ మార్గమే కానీ విమాన ప్రదక్షిణ'గా పేరొందినది. ఈ మార్గమున భక్తులు భక్తి ప్రపత్తులతో 'పొర్లు దండాలు' చేయుచుందరు.

"తమితోఁబ్రదక్షిణాలు దండములు నివిగో" తడి వస్త్రములతో చేయు ప్రదక్షిణమే 'పొర్లు దండాలు' అంగప్రదక్షిణ మనియు పేర్కొనెదరు. 'పరుండి' చేయుటచే 'పొర్లు దండాల'ని వాడుకలో వచ్చినది. అన్నమయ్య 'తమితో ప్రదక్షిణా'లని నుడివెను.

ఈ మార్గమున అడుగిడినంతనే మన కెదురుగ శేషశాయియైన రంగనాథుడు, పైగాభాగమున శ్రీ వరదరాజస్వామి, క్రింది భాగమున శ్రీ వేంకటేశ్వర మూర్తులు కలిగి ప్రధాన వైష్ణవ క్షేత్రముల ప్రాధాన్యమును తెలియజేయుచున్నవి. పూర్వమిచట గరుడ కంభము లుండెడివట. పిదప క్రమముగా ధ్వజస్తంభము ముందునకు ఆ పిమ్మట మహాద్వారమున కెదురుగా బయట గొల్లభామ మండపము వద్దకు మరలించబడినవి. అన్నమయ్య 'కావేటి రంగమున కాంతపై పాదాలు చాచి రావుపో నెక్కడికిని రంగనాథ శ్రీ వేంకటాద్రి మీద చేకొని నిల్చితివి" అని కీర్తించెను.

వెండి వాకిలికి దక్షిణముగా శ్రీ వరదరాజస్వామి ఆలయము కలదు. శంఖ చక్ర ములతో అభయ కటి హస్త ముద్రలతో స్వామిని దర్శించవచ్చును. ప్రతి సంవత్సరము వరదరాజ స్వామి జయంతి నాడు అభిషేకాదులు నైవేద్యము ఘనముగా జరుపబడు చున్నవి.

"ధృవవరదా సంస్తుత వరదానవమైన యార్తుని నన్నుఁగావవే
కరిరాజ వరదా కాకాసుర వరదా
శరణాగత విభీషణ వరదా
సర్వ శాస్త్రములలో సనకాదులలో
సర్వదా మెలఁగుచు జనవరదుడవై
వుర్వి శ్రీ వేంకటాద్రి నున్న దేవుఁడవు" 113 రేకు అని అన్నమయ్య శ్రీ రంగనాథుడు, వరదుడు, వేంకటేశ్వరులను కీర్తించెను.

విమాన ప్రదక్షిణ మార్గములో వెండి వాకిలికి దక్షిణ దిశలో పోటు, బంగారు బావి, అంకురార్పణ మంటపము, యాగశాల, నాణెముల పరకామణి మంటపము చందనపు అర, వేదపారాయణ సభ, తాళ్ళపాక వారి అర కానవచ్చును.

విమాన ప్రదక్షిణమనకు ఉత్తరదిశ సన్నిధి భాష్యకారులు, శ్రీ యోగ నరసింహస్వామి, పరిమళపు అర, శ్రీవారి హుండీ, శ్రీ విష్వక్సేనుల వారి సన్నిధి కలవు. శ్రీ రామానుజుల వారి విగ్రహము క్రీ.శ. 12వ శతాబ్దమున ప్రతిష్ఠించబడినదని శ్రీ యోగ నరసింహస్వామి వారి ప్రతిష్ఠ క్రీ.శ. 14వ శతాబ్దమునకు పూర్వము జరిగియుండునని చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు.

"యిదిగో శ్రీ వేంకటేశ్వరుఁడు యీడై
పొదలుచు నున్నాడు భవినుడయవరు' (2-229)

"పంకజపుఁజేయి చాచి పాదపుఁబరమిచ్చిన
వేంకటేశు కృపతోడ వెలయఁదానే
తెంకినే వొడయవర్లై తిరుమంత్ర ద్వయాన
పంకమెల్లఁబో(గడిగె భాష్యకారులు" (5-104)

అని అన్నమయ్య సన్నిధి భాష్యకారులను కీర్తించెను. శాసనములలో సన్నిధి భాష్యకారుల వివరణలు కానరావు. సన్నిధి భాష్యకారుల విగ్రహమును "ఈ దివ్యదేశమున నెలకొల్ప అనుమతిమ్మ"ని అనంతాళ్వారు స్వామిని వేడుకొని, రామానుజుల అర్చారూపమును భగవంతుని దివ్యాలయము నందు ఎడమప్రక్కన ఒక మండపము నందు ప్రతిష్ఠింప జేసెనని 'వేంకటాచలేతి హాసమాల'లో చెప్పబడినది.

నృసింహస్వామి మందిరము స్వామి వారి ఆలయ ప్రాంగణమున విమాన ప్రదక్షిణ మార్గమున కలదు. శాసనములలో "అళగియ సింగర్" (చక్కని నరసింహుడని) వేంగడత్తరి (వేంకట సింహం) అని స్వామిని పేర్కొనిరి [42]. క్రీ.శ. 13వ శతాబ్దమున ఆలయ నిర్మాణము జరిగియుండువచ్చునని చరిత్రకారుల అభిప్రాయము. ఆనంద నిలయ దివ్య విమానమున కభిముఖముగా శ్రీ నృసింహదేవుని శ్రీ రామానుజులవారు ప్రతిష్ఠించిరని అనంతాళ్వారు వివరించిరి. యోగ నరసింహుని ప్రదక్షిణ మండపములోనే దక్షిణ దిక్కునగల మార్గములో 'పరిమళం అర' వున్నది. శ్రీ స్వామి వారి తిరు నామమునకైవినియోగించు పచ్చ కర్పూరమును, శుక్రవారము నాడు అభిషేక సేవలో సుగంధ ద్రవ్యములను ఈ 'పరిమళ అర'లో తయారుగ నుంచుకొందురు. స్వామి వారి 'ఊర్ధ్వ పుండ్ర సమర్పణ లోను, అభిషేక సేవలోను ఈ అర ప్రాముఖ్యమును కలిగియున్నది.

చటుల చక్రకరంబును, శార్ఙ కరంబును
అటు వరదాభయ హస్తములు
పటుతర యోగ పట్టపు బంధమును
కటితటిఁజెలఁగఁగ గడఁగీ వాఁడే
పరపగు శేషుని పడగల నీడల
అరుదగు రవిచంద్రాకముల
సిరుల గద్దెపై శ్రీ వేంకటేశుఁడు
పరిపూర్ణుడై పరఁగీ వాఁడే (2-113) అని కీర్తించెను.

శ్రీవారి హుండీ, భక్తులు వేయు కానుకలు భద్రముగా సరాసరి గంగాళమున పడునట్లే ర్పాటు చేయబడిన ఈ బుర్కా గంగాళము (కాన్వాసుతో కూడియున్న గంగాళము)ను 'కొప్పెర'

అని వ్యవహరింతురట. శ్రీవారి వక్షఃస్థలమున నెలకొని వున్న శ్రీదేవిని స్థిర లక్ష్మి గాను, హుండీయందున్న సంపద సమూహమును చరరూపిణిగాను భక్తులు భావించెదరట. అన్నమయ్య అట్లే భావించెనేమో!

"రూకలై మాడలై రువ్వలై తిరిగీ నా
దాకొని వున్నచోటఁ దానుండదదివో"
"ఒకరి రాజుఁ జేసు నొకరి బంటుగఁజేసు"
"ప్రకటించి కనకమే భ్రమయించీ జగము"
"పందెమాడినటువలెఁ బచరించు పసిఁడి"

అని చర రూపిణిగా వర్ణించి

"నిగ నిగ మనుచుండు నిక్షేపమైయుండు
తగిలి శ్రీ వేంకటేశు తరుణియై తానుండు
తెగని మాయై యుండు దిక్కుదెసయై యుండు" (అన్న అధ్యా రేకు. 92)

అని వేంకటేశు భార్యగ నిక్షేపమై నుండునని స్థిరరూప లక్ష్మిగాను అన్నమయ్య వర్ణించెను. విమాన ప్రదక్షిణ మార్గమున 'కటాహ తీర్థం'నేఁటి అన్నమాచార్య భాండారమునకు ఎదురుగా వున్నది. ఈ తీర్థము శ్రీ స్వామివారి పాదముల నుండి వచ్చు అభిషేక తీర్థము. శ్రీ స్వామి వారి పుష్కరిణి స్నానం, శ్రీనివాసుని దర్శనము, కటాహ తీర్థపానము ఈ మూడును త్రైలోక్య దుర్లభములని ప్రసిద్ధి. ఈ తీర్థము శ్రీవారి హుండీకి వెలుపల ఆనుకొని తొట్టి మాదిరిగా ఎడమ దిక్కున నున్నది. ఈ తీర్థమును స్వీకరించునపుడు అష్టాక్షరి లేదా కేశవాది నామములో లేక శ్రీ వేంకటేశుని మంత్రమో ఉచ్చరించవలెనట. స్కంద పురాణములో కటాహ తీర్థపానము బ్రహ్మహత్యాది పాపములు పోగొట్టునని వర్ణించబడినటుల తెలియవచ్చుచున్నది.

"శ్రీహరి పాద తీర్థంబే చెడని మందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు
కారమై కంటగించని కడుఁజల్లని మందు
నూరని కాచని యట్టి నున్నని మందు
కోరికతో వెలవెట్టికొనితే వల్లని మందు
వేరు వెల్లంకులు కూర్చనట్టి వెందువోని మందు (అ.చా.చ.పు. 34)
గురుతైన రోగములు గుణము చేసే మందు
దురితములు పెడఁబాపే దొడ్డమందు

నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించే మందు
నరకము సొరనట్టి నయమయిన మందు"

అని శ్రీపాద తీర్థమహిమ కీర్తించబడినది

**శ్రీ విష్వక్సేనుడు** : వైకుంఠ ప్రదక్షిణ మార్గము ప్రక్కన చిన్న మందిరము కలదు. ఆ మందిరమున దక్షిణాభిముఖముగా రెండడుగుల ఎత్తుగల శ్రీ విష్వక్సేనుల వారి శిలామూర్తి ప్రతిష్ఠింపబడినది. కూర్చొనియున్న భంగిమలో అభయ ముద్రతో శంఖచక్రము లను ధరించి ఊర్ధ్వ పుండ్రములతోనున్న వీరు స్వామివారి ప్రధాన సేనాధిపతి. "సేన ముదలియార్" అని నామాంతరము కలదు. వీరి పంచలోహ ఉత్సవ విగ్రహము తీర్థమిచ్చు మండపమున నేడు కానవచ్చును. ఆణివర ఆస్థానము, ఉగాది, దీపావళి బ్రహ్మోత్సవము లలో ప్రధాన పాత్ర వహించెదరు.

"నీవెకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీ విభుప్రతినిధివి" అనియు
పటుశిష్ట ప్రతిపాలకుండ వనగ
ఘటన నఖిలమును గాతువుగా
తళతళమెరయుచు సుదర్శనాయుధం
బలరుచు నొకచే నమరంగను
దిట్టపు సూత్రవతీపతి వసురులం
జట్టలు చీరంగఁజతురుండవు
రట్టడి వేంకట రమణుని వాకిట పట్టపు సేనాపతివటకా (33 రేకు)

విమాన ప్రదక్షిణములోని దక్షిణ దిక్కున ఘంటా మండపము ఉత్తర దిక్కు ముఖముగా నున్నది. ఆ మండపమున బ్రహ్మాది దేవతలు, సనకనందనాది మహర్షులు స్వామివారి దర్శనమునకై కనకమయ కవాటముల వద్ద వేచి ఉండెదరట. అన్నమయ్య

"కనకరత్న కవాట కాంతు లిరుగడఁగంటి
ఘనమైన దీప సంఘములు గంటి"
"అదివో శ్రీ తిరువేంకటాద్రీశుండితండని
చదికి వెండికి వచ్చె సనకాదులు"

అని బంగారు వాకిలి గూర్చి తన సంకీర్తనలో ప్రస్తుతించెను.

ఈ ఘంటామణి మంటపమున నాలుగు వరుసలుగా మొత్తము పదునారు

స్తంభములున్నవి. ఆ స్తంభములపై భూ వరాహ స్వామి, నృసింహస్వామి మున్నగు శిల్పాకృతులు చెక్కబడి యున్నవి. క్రీ.శ. 1417న ఆగస్టు 25 నాటికి చంద్రగిరి వాస్తవ్యు డైన 'అమాత్య మల్లన' మంత్రివర్యుడు నిర్మించి పూర్తిచేసెనట.

బంగారు వాకిలికి, గరుడునికి మధ్యనున్న విశాలమైన ఈ మహామణి మంటప మున నిత్యము ప్రాతఃకాలమున మూడు గంటలకు సుప్రభాత పఠనము జరుగుచున్నది. ఇచటనే స్వామివారు కొలువు తీరగ, నాటి తిథి వార, నక్షత్రాది పంచాంగ శ్రవణము ముందు రోజు నాటి ఆదాయ వ్యయములు నివేదింపబడుచున్నవి.

ఈ మండపముననే బుధవారము నాటి ఉదయం భోగ శ్రీనివాసమూర్తికి, మలయప్ప స్వామికి, విష్వక్సేనులకును సహస్ర కలశాభిషేకము జరుగును. గురువారం నాడు రెండవ గంట సమయమున 'అన్న కూటోత్సవము' జరుగును. శ్రీవారి ఆస్థాన మంటపముగా ఉపయోగపడుచున్నది.

ఈ మండపమున బంగారు వాకిలికి దక్షిణము వైపున రెండు పెద్ద గంటలు చెక్క దూలమునకు పెద్ద ఇనుప గొలుసులతో వ్రేలాడదీయబడినవి. ఇవి స్వామి నివేదన జరుగు సమయమున మ్రోగింపబడును. ఈ గంటలుండుటచే 'ఘంటా మండపమని' పేరేర్పడినది.

ఈ గంటలను తమిళమున 'మణి' అనుటచే ఈ మంటపము 'తిరుమామణి మంటపము'గా వ్యవహరించబడుచున్నది. [(43)]

బంగారు వాకిలికి ఎదురుగానున్న మందిరములో శ్రీ స్వామి వారికి అభిముఖముగా గరుత్మంతుని శిలామూర్తి ప్రతిష్ఠింపడినది. క్రీ.శ. 1512 నాటి శాసనములో ఈ మందిరము యొక్క ప్రస్తావన కలదు. ఈ ఆలయమున నెలకొనియున్న మరికొన్ని గరుడ విగ్రహము లలో 'రాములవారి మేడ'లో నున్న చిన్న పంచలోహ గరుడ విగ్రహము ముఖ్యముగా పేర్కొనదగినది. ఈ బంగారు వాకిలికి ఉభయ పార్శ్వములలో శంఖచక్ర గదాధారులై జయ విజయ ద్వార పాలకులు నిలిచియున్నారు. వీరిమూర్తుల ప్రతిష్ఠ జరిగిన కాలము ఇతమిత్థమని చూపలేము.

శ్రీ స్వామివారి సన్నిధికి అత్యంత ప్రధానమైన ద్వారము బంగారు వాకిలి. బంగారు వాకిలి ప్రవేశ మార్గములో చెక్కడపు రాతి ద్వారబంధమునకు రెండు పెద్ద చెక్క వాకిళ్ళు బిగింపబడినవి.

ఈ రాతి ద్వార బంధమునకు, వాకిళ్ళకు ప్రక్కన జయవిజయుల కటాంజలి మందిరములకు బంగారు పూతరేకు తాపబడినది. కనుకనే దీనికి 'బంగారు వాకిలి' అను సార్థక నామధేయము అనాదిగా వ్యవహారములో కలదు.

ద్వార బంధమునకు ఈ క్రింది భాగమున పై భాగమున ప్రక్కలు తీగలు, లతలు చెక్కబడినవి. పై గడపకు మధ్యన క్రిందివైపు విచ్చుకొన్న పద్మము, పై గడపకు వెలుపలి వైపు ఏనుగులచే అర్చింపబడుచున్న పద్మాసనస్థ అయిన శ్రీ మహాలక్ష్మీ దేవి ప్రతిమ మలచబడియున్నది ఈ రెండు వాకిళ్ళపై ముప్పది రెండు గళ్ళు కలవు.

మొదటి వరుసలో నున్న నాలుగు గడులలో చక్రము, శంఖము, శ్రీ వేంకటేశ్వరుడు మహావిష్ణువు కూర్చొనిన భంగిమ చెక్కబడియున్నది.

రెండవ వరుసలో వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపములు మలచ బడినవి.

మూడు నాలుగు, ఐదు వరుసలలోగల పంద్రెండు గడులలో కేశవుడు మొదలుగా దామోదరుడు వరకు గల ద్వాదశ మూర్తులను నెలకొల్పిరి.

ఇక చివరి మూడు వరుసలలో అనగా ఆరు, ఏడు, వరుసలోని ఒకటవ నాల్గవ గడులలోను వరుసగా విభవమూర్తులైన దశావతారములు చెక్కబడియున్నవి. ప్రతిదినము బంగారు వాకిలి వద్ద సంకీర్తనలు పాడి అన్నమయ్య ఆనందించుచుండెనట. అన్నమయ్య రచించిన సంకీర్తనలను గమనించినచో ఈ వాకిళ్ళపైనున్న మూర్తులను గాంచి ప్రేరణనొందెనని తోచును.

వ్యూహరూపములను కొనియాడిన సంకీర్తన, 29 రేకు

"కంటిమి దామోదర సంకర్షణ వాసుదేవ

అంటెజాలు ప్రద్యుమ్నుండా అని అనిరుద్ధుండా" యనియు, కేశవాది నామము లను గురించి

"నన్నుగావు కేశవా నారాయణ మాధవ

మన్నించు గోవింద విష్ణు మధుసూదన

సన్నెల త్రివిక్రమా వామనా శ్రీధరా

సన్నుతించె హృషీకేశ సారెకు పద్మనాభ"

"తోటి పురుషోత్తమ అధోక్షజ నారసింహమా

జంట వాయకు మచ్యుత జనార్దన" 15-69 అనియు ఆ నామముల మాహాత్మ్యమును నారాయణాయని యంటే నరకములుత్తరించితివి, శ్రీరామా అని పొందితి జీవన్ముక్తి, దూరించి గోవిందాయని తోలితి పాపములెల్ల, ధీరుండనై వళికెల్ల దిద్దికొంటి నిదిగో, దామోదరా అని తొల్లి దాటితి దుఃఖములెల్ల, వామనా అని కర్మములు నంగ ద్రొక్కితి, భూమి రమణాయని

పుట్టుగులు గెలిచితి, వేమరు నితరులకు వెరవనే నింకను, హరియాచ్యుతాయని ఆపదల నణంచితి పురుషోత్తమా యని పుణ్యములెల్ల మీరితి" అనియు "మత్స్య కూర్మ వరాహ మనుష్య సింహ వామనా యిచ్చ రామ రామ రామ హితబుద్ధి కలికి" 15-168 అని దశావతారము లను కీర్తించెను.

భక్తులకు ఈ బంగారు వాకిలి నుండి స్వామి వారి దర్శన ప్రాప్తి కలుగును. అన్నమయ్య స్వామిని వీక్షించినంతనే

"కంటినఖిలాండ కర్త నధికుని గంటి
కంటినఘములు వీడుకొంటి, నిజమూర్తిఁగంటి
మహనీయ ఘన ఫణామణుల శైలముగంటి
బహు విభవముల మంటపముల గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె గంటి
పావనంబైన పాపవినాశనము గంటి
కైవసంబగు గగన గంగ గంటి
దైవికపుఁబుణ్యతీర్థములెల్లఁ బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరిఁగంటి
పరమ యోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్య హస్తములుగంటి
తిరువేంకటాచలాధిపుఁ జూడగంటి" (XI-58)

కొండను, తీర్థములను స్వామిని 'కంటి'నని కీర్తించి పిమ్మట

"చేరి కొల్వరో యీతఁడు శ్రీ దేవుఁడు
యీ రీతిశ్రీ వేంకటాద్రి నిరవైన దేవుఁడు
అలమేలు మంగనురమందిడుకొన్న దేవుఁడు
చెలఁగి శంఖ చక్రాల చేతి దేవుఁడు
కల వరదహస్తముఁగటి హస్తపు దేవుఁడు
మలసీ శ్రీవత్స వనమాలికల దేవుఁడు
ఘనమకర కుండల కర్ణముల దేవుఁడు

కనక పీతాంబర శృంగార దేవుఁడు
ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్న దేవుఁడు
జనించెఁబాదాల గంగా సంగతైన దేవుఁడు" (XI-1) అని ఆ

స్వామి రూపమును చక్కగా మన కన్నులకు గట్టినటులు సంకీర్తన చేసెను. ఇంకను

"శ్రీ వేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
యే విధానఁదలఁచినా యిన్నిటికిఁదగును
కరిరాజుఁగాచిన చక్రము వట్టిన హస్తము
కరితుండమని చెప్పఁగా నమరును
వరములిచ్చే యట్టి వరదహస్తము కల్ప
తరుశాఖయని పోల్చదగు నీకును
జలధిఁబుట్టిన పాంచజన్య హస్తము నీకు
జలధి తరఁగయని చాటవచ్చును
బలు కాళింగునితోఁకపట్టిన కటి హస్తము
పొలుపై ఫణీంద్రుఁడని పొగడఁగదగును.
నలిన హస్తంబుల నడుమనున్న నీ యుర
మలమేలు మంగ కిరవనఁదగును
బలు శ్రీ వేంకట గిరిపై నెలకొన్న నిన్ను
నలరి శ్రీ వేంకటేశుఁడనఁదగను (2.221)

అని స్వామి వాసమునకు తగినటుల శ్రీ వేంకటేశుడనదగునని నామకరణమును గూడ చేసేను. అన్నమయ్యకు పూర్వము ఆళ్వారులు 'వేంకటాద్రి'యని కొండ మాహత్మ్యమును, స్వామిని 'ఆ కొండ దేవర'గా 'వేంగడదేవర'యని 'వేంగడతురైవర్' అనగా వేంకటమును వాసముగా గలవాడని స్వామిని సంబోధించిరి. నమ్మాళ్వారు 'వేంగడతురైవారుక్కు నమ వెన' అని స్తుతించిరి. శ్రీరామానుజాచార్యులు 'శ్రీనివాసుడని' స్వామిని వర్ణించిరి. లక్ష్మీ నివాసము గలవాడని ఆ పేరుతో కొనియాడిరి. వేంకటాచలపతి, వేంకటాలాధీశుడని, వేంకటనాథుడని కొందరు వర్ణించిరి. అన్నమయ్య "వేంకటేశు"డని పేరునిచ్చి ఆనామమునే తన సంకీర్తనలో 'ముద్ర'గా వాడెను. అనగా "రచించిన కర్త నుద్దేశించి పాఠకునకు సూచన" అని అర్థము. స్వామి వక్షస్థలమున నెలకొని యున్న లక్ష్మీ దేవిని (22-188)

"ఏమమ్మా నీ కెవ్వరీడు యిందిరాదేవి
నీ మగనికి నీవు నాడు నిధానమవు
చూపులనే కురిసేవు సొరిది బంగారు పొడి
రూపుననే కులికేవు రుచుల రాజసమెల్ల
మోముననే మెరిచేవు మోహనపు మెరుగులు
తామెర చేతుల నెత్తి దైవారేవు మహిమలు

పలుకుల(జిలికేవు పైపైనే అమృతాలు" అని అన్నమయ్య వర్ణించి మరియు "అలిమేలు మంగవు నీవాతని(గూడి తివిట్టై" అలమేలు మంగను చేర్చిపై సంకీర్తనమున వర్ణించెను. మరొక సంకీర్తనమున "సత్యభామవురముపై చల్లని కస్తూరిపూత అత్తరించేరు రుక్మిణిచే తామరపూవు" అని రుక్మిణీ, సత్యభామలను కూడా అన్నమయ్య వర్ణించెను. ఈ దేవేరులను గర్భాలయమున మనము దర్శింపవచ్చును. (30-186)

# అన్నమయ్య-సప్తగిరులు

ఈ విధముగా అనునిత్యము స్వామిని అన్నమయ్య బంగారు వాకిలి నుండి మేలుకొలుపు ఏకాంత సేవలలో తన సంకీర్తనలతో అలరింపజేసేను. అన్నమయ్య పిమ్మట స్వామి సేవా భాగ్యము వారి వంశీయులకు ప్రాప్తించినది. నేటికిని స్వామి వారి దివ్యానుగ్రహ ఫలితముగా తాళ్లపాక వంశీయులు సుప్రభాత ఏకాంత సేవలలో పాల్గొని తాంబూలాద సత్కారములను బడయుచున్నారు. వేంకటాద్రి పర్వతము, వేంకటేశుడు గత యుగములలో ప్రత్యేక నామములతో వ్యవహరింపబడినదని పురాణములు చాటుచున్నవి. దక్షిణాపథమున ముఖ్యముగా తెలుగునాడున గిరిక్షేత్రములనేకములు ప్రసిద్ధి నొందియున్నవి. భద్రాచలము, శ్రీశైలము, సింహాచలము, యాదగిరి వంటివి ప్రముఖమైనవే కాని తిరుమలగిరి అగ్రస్థానము వహించియున్నది.

శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్
అఖ్యాంత్వదీయ వసతేరనిశం వదంతి
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతం[(44)]

"స్వామీ నీ నామము శ్రీశైలమని, శేషశైలమని, గరుడాచలమని, వేంకటాద్రియని, నారాయణాద్రియని, వృషభాద్రి యని, వృషాద్రియని అనేక నామములతో పిలువబడు

చున్నది. ఓ శ్రీ వేంకటా చలపతే నీకు శుభోదయమగుగాక." అని క్రీ.శ. 12వ శతాబ్దమునకు చెందిన రమ్యజా మాతృముని రచించిన శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమున ఈ ఏడుకొండల గొప్పతనము కీర్తింపబడినది.

ఈ ఏడు కొండల నామములను కొన్నింటిని అన్నమయ్య సంకీర్తనలలో మనము గానవచ్చు. ఈ నామములను యథాతథముగా కొన్నిచోట్లను, ఆ నామము యొక్క అర్థము గోచరించునటుల కొన్ని తావులగానవచ్చును. శ్రీశైలం : శ్రీ అనగా సిరి, లక్ష్మి అని అర్థములు కలవు. శైల మనగా కొండ. వరాహపురాణము ఈ పర్వతము శ్రీప్రదమై నది కావున ఈ శైలమునకా పేరేర్పడినటులు వక్కాణంచినది.

అదియును గాక 'తిరు' అనెడి తమిళ శబ్దమునకు 'శ్రీ' అనియు 'మలై' అనెడి శబ్దమునకు కొండ 'శైలము' అని అర్థము. (45) ఈ 'తిరుమలై' అనెడి తమిళపదమే కాలక్రమమున 'తిరుమల'గా మార్పు చెందియుండవచ్చును. 'తిరుమాల్' అనెడి తమిళ శబ్దము 'విష్ణువు'ను సూచించు శబ్దము. కావున 'తిరుమాల్' వసించు కొండ 'తిరుమలై' అనెడి రూపమై, తెలుగున 'తిరుమల'గా మార్పు చెంది సామాన్య వ్యవహారములో వెంకటాద్రి స్థానమున తిరుమల శబ్దము వాడుకలోనికి వచ్చి యుండవచ్చునని తోచును.

సిరి సంపదలిచ్చు శ్రీనివాసుడు నెలవైన పర్వతము కాన దీనికి శ్రీశైలమను పేరు కలిగినదని మరికొందరి అభిప్రాయము. ఈ అర్థము స్ఫురింపజేయునట్లున్న సంకీర్తన

ఇతఁడొకఁడే సర్వేశ్వరుడు
సిత కమలాక్షుఁడు శ్రీ వేంకటేశుఁడు
పరమ యోగులకు భావనిధానము
అరయ నింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కౌగిట సౌఖ్యము
సిరుఁలొసఁగేటి యీ శ్రీ వేంకటేశుఁడు
శ్రీనగ విహార శ్రీ వేంకటేశ్వర
సోనలఁబుట్టిన సుద్దులు నివివో (9-36)

**శేషశైలము** : బ్రహ్మాండ పురాణమున శ్రీ మహావిష్ణువు తాను భూలోకమున విహరించుటకు గాను ఆది శేషువును పర్వతరూపమును ధరింపుమని ఆజ్ఞాపించినందున ఆదిశేషువు పర్వతరూపుడాయెనని కావున 'శేషశైల'మను పేరేర్పడినటులు పేర్కొనబడినది (46)

భవిష్యోత్తర పురాణమున ఆదిశేషునికి వాయుదేవునికిని మధ్య జరిగిన పందెమున వాయువు అమిత వేగముతో శేషుని పర్వతముతోపాటు విసిరివేయగా శేషుడు సువర్ణ ముఖీ నదీ ప్రాంతమున చేరెననియు శేషునిచే ఈ పర్వతము చుట్టుకొని యుండుట వలన ఈ పర్వతము శేషాద్రి నామము వహించినదని వివరించెను.[47] 56 రేకులో

భవ కమల భవ మాధవ రూప శేషాద్రి
భువన వేంకటనాథ భవరోగ వైద్య
పరగు శ్రీ వేంకటపతి తన దాసుల
నరుదుగ గాచె యనంతుఁడీతఁడు
శ్రీ వల్లభునకు నశేష కైంకర్యముల
వేంకటాద్రివైన శేషమూరితీ
శేషాచలమనేటి శ్రీ వెంకటాద్రిపై
శేషమై కోనేటి దండఁజెలఁగీని దేవుడు (11-135)

గరుడాద్రి : వరాహస్వామి ఆజ్ఞచే ఈ పర్వతమును గరుత్మంతుడు వైకుంఠము నుండి తీసికొని వచ్చుటచే ఈ పర్వతమునకు 'గరుడాద్రి' నామము స్థిరపడినటుల వరాహపురాణము వివరించుచున్నది.

కంటిమి నేఁడిదె గరుడా చలపతి
యింటి వేలుపగు యీశ్వరుఁడితఁడు. 387 రేకు (4.504)

నారాయణాద్రి : శ్రీమన్నారాయణుడు శ్రీనివాసునిగా నెలకొన్న పర్వతము కాన 'నారాయణాద్రి' నామ మేర్పడినది. వేంకటాచలము మీది పుష్కరిణిలో అంగీరస పుత్రుడైన నారాయణ స్వామి అను విప్రుడు స్నానమాచరించి సకల పాప విముక్తుడై పరమ పావనమును పొందుటచే ఆ పేరు కలిగినదని పురాణములు ఉద్ఘాటించుచున్నవి.

వృషభాద్రి : బ్రహ్మాండ పురాణమున ఈ పర్వతముపై వృషభుడను రాక్షసుడు తపస్సు చేసి విష్ణువును మెప్పించి తన పేరుతో ఈ పర్వతము పిలువబడవలెనని ప్రార్థించగా స్వామి ఆ వరము ప్రసాదించెను కాన ఈ పర్వతము వృషభాద్రిగా వ్యవహరింప బడుచున్నది.[49]

పొలమెల్లఁ దిరిగిన బోడెద్దు
గరిమతో నెవ్వరికి దగ్గర రానియెద్దు
గోవైన భూదేవిఁ గూరిమి జేకొని
లావైన వృషభాచలపుటెద్దు (3-123)

**వృషాద్రి** : "వృషోహి ధర్మో భగవాన్" అనునది భారత వచనము. కలియుగమున ధర్మ సంస్థాపనార్థం శ్రీనివాసుడుగా విష్ణువు ఈ కొండపై వెలసి యుండుటచే 'వృషాద్రి' పేరు కలిగినదని కొందరు పేర్కొనుచున్నారు.

'ధర్మం' తన అభివృద్ధి కొరకు ఈ పర్వతముపై తపస్సు చేయుటచే 'వృషాద్రి' నామమేర్పడినదని వరాహ పురాణము వివరించినది.(50)

ఒడలెత్తి నాలుగు యుగముల బడి,
బడి ధర్మదేవతై పరిగి నెద్దు
తలకొని ధర్మము తానై నిలుపుట,
కలుష విదూరుని గర్వములే
నిలిచి లోకములు నిలిపిన ఘనుఁడగు
కలియుగమున వేంకటపతివే. (3-123)

**అంజనాద్రి** : భవిష్యోత్తర పురాణములలో మతంగముని ఆజ్ఞానువర్తియై అంజనా దేవి పుత్ర సంతానము వేడి తపస్సు చేసి వాయుదేవుని వర ప్రభావముతో తేజోవంతుడు, మహాబలశాలియైన హనుమంతుని పుత్రునిగా బడసినది. ఆంజనేయుని మాత అంజనా దేవి తపమాచరించిన పర్వతము కాన 'అంజనాద్రి'గ నామము సార్థకమైనది.

ఈ పర్వతము కృతయుగమున అంజనాద్రిగను, త్రేతాయుగమున నారాయణ గిరిగాను, ద్వాపర యుగమున సింహశైలముగను కలియుగమున .వేంకటాచలముగా వ్యవహరించబడునని వరాహపురాణమున తెలుపబడినది. (51)

"అంజనాచలము మీఁద నతఁడు శ్రీ వేంకటేశుఁ
డంజనీ తనయుఁడాయె ననిలజుఁడు
తోరణములే...అంజనగిరి రాయడు వేంకట పతి -20వరేకు

కలియుగమున శ్రీనివాసుడు ప్రత్యక్ష దైవముగా కీర్తింపబడుచున్నాడు. శ్రీ వైకుంఠమును వీడి లక్ష్మీదేవిని వెదకుకొనుచు శ్రీ వేంకటాచలమును చేరిన శ్రీనివాసుడే శ్రీ వేంకటేశ్వరుడని ప్రసిద్ధుడాయెను. ఆ స్వామిని మహాత్ములనేకులు అనేక విధముల స్తుతి చేసిరి. పురాణములందు మహర్షులే వేనోళ్ళ వేంకటేశ్వర మాహాత్మ్యమును చక్కగా పొగిడి పరమపద భాగ్యమును పొందిరి. సుమారు ఎనిమిది పురాణములలో శ్రీ వేంకటేశ్వరుని వివిధ అభివర్ణనలు కలవు. (52) ఈ అభివర్ణనలతో అన్నమయ్య వర్ణనలను జోడించి చూచెదము.

# అన్నమయ్య-పురాణములలో వేంకటేశుడు

**వరాహపురాణము :** శ్రీనివాసుని దర్శనార్థము భరద్వాజ, కౌశిక, జాబాలి, కాశ్యప, గౌతమాది మహర్షులు వేంకటాచలమును చేరి అచట నున్న పుణ్యతీర్థములలో స్నాన మాచరించి వేంకట రమణుని సేవించి ఇట్లు స్తుతించిరి.

భూగోళమున అసంఖ్యాక రేణువులైనను లెక్కించవచ్చును గాని నీ పరాక్రమములను గణించతరము కాదు. నీ ముఖము నుండి బ్రాహ్మణుడు, భుజము నుండి క్షత్రియుడు, తొడల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రుడు, నోటి నుండి అగ్ని, ఇంద్రుడు, మనస్సు నుండి చంద్రుడు, నేత్రము నుండి సూర్యుడు జన్మించిరి. నీ గుణములను మానవులెవ్వరును గ్రహించలేరు, ఊహించలేరు' అని శ్రీనివాసుని విరాట్రూపము వర్ణించబడినది.

అన్నమయ్య వర్ణన :

ఈతడే యీతఁడే సుండి యెంత యెంచి చూచినా
చేతనే వరాలిచ్చే శేషాచలేశుడు
విశ్వరూపపు బ్రహ్మము విరాట్టయిన బ్రహ్మము
ఐశ్వర్య స్వరాట్ట సామ్రాట్టయిన బ్రహ్మము
శాశ్వత బ్రహ్మాండాలు శరీరమైన బ్రహ్మము
యీశ్వరుఁడై మహాత్మై యిందరిలో బ్రహ్మము 7-115 రేకు
ఆతనిఁబో పొగడేము ఆతని శరణంటిమి
ఆతఁడే సర్వజీవుల అంతర్యామి (197 రేకు)
విశ్వమెల్ల నీ విరాడ్రూపము
శాశ్వత హరి నీ శరణులము.
కన్నుల సూర్యుడు కమలాప్తుఁడు నీ
పన్నిన మోమున బ్రాహ్మణులు
వున్నతి వైశ్యులు వూరువులందును
యెన్నగ శూద్రులు యిదె పాదము (9-241)

**స్కందపురాణము :** స్కంద పురాణములో నాలుగు భాగముల నుండి మొత్తము ముప్పది అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము సంగ్రహింపబడినది. ఇందు శ్రీనివాస స్తుతులు రెండు కలవు. మొదటి 11వ అధ్యాయమున రామానుజుడను విప్రుడు 18 స్తోత్రములు చేసెను.

దేవాధి దేవుడు, శంఖ చక్రాది పంచాయుధములను ధరించినవాడు, నిత్యుడు, శుద్ధుడు భక్తార్తి హరుడు, త్రిమూర్త్యాత్మకుడు, సంసార భయ నాశకుడు, వేదాంత వేద్యుడు, వేంకటాద్రినిలయుడైన వాసుదేవునకు నమస్కారములు చేయుచున్నానని స్తుతించెను.

నీ దర్శనము వలన నేను కృతార్థుడనైతిని. నీ అనుగ్రహముచే నిన్ను యోగులు తెలుసుకొన గలుగుచున్నారని స్వరూప స్వభావములు ప్రస్తావించబడినవి.

పదమూడవ అధ్యాయమున పద్మవిభుడను ద్విజుడు వేంకటాచలము నందలి పుష్కరిణి తీరమున పండ్రెండు వత్సరములు తపస్సుచేసి ప్రత్యక్షమైన శ్రీనివాసుని కల్మష నాశనుడని, క్షీరాబ్ధి శయనుడని, దుష్ట సంహారకుడని, ప్రణతార్తి నాశకుడని, యోగేశ్వరుడైన శ్రీనివాసునకు నమస్కారములని కీర్తించెను. నామస్మరణచే పాతక విముక్తి కలుగునని చెప్పబడినది.

"ఎల్లలోకముల వారికెలిక దానె
కొల్లగ వరములిచ్చే గురుతైన దైవము
కొండల కోనలలోన కోనేటి సరిదండ
నాలుగు చేతులతోడ నవ్వుల మోముతోడ
సోలి శంక చక్రముల సొంపుతోడ
"కొండల వంటివి ఘోర పాపములు
ఖండించును హరిఘననామ జపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడే పరమ పదంబు" 370 రేకు. (9-115)
జలధిలోఁబవళించి జలనిధి బంధించి
జలధి కన్యకను సరిఁబెండ్లాడి
జలనిధిలో నిండి జలనిధి మథియించి
జలధి వెరించిన చలమరాయితఁడు (367 రేకు) (9-98)

**ఆదిత్య పురాణము** : ఈ పురాణమునందు దేవశర్మ అను బ్రాహ్మణుడు వేంకటా చలమునకు వెళ్లి శ్రీనివాసుని స్తుతించెనని తెలియుచున్నది. ఈ రెండు స్తుతులు నిడుపైనవిగ కాన్పించుచున్నవి. మొదటి స్తుతి పదునేడు శ్లోకములతోను, రెండవది ఏబది ఏడు శ్లోకములతోను కూడియున్నది. మొదటి స్తుతిలో స్వామి ప్రభావము రెండవ దానిలో విగ్రహ సౌందర్యము విపులముగా నున్నవి. "నీ గుణమును వర్ణింప ఆదిశేషునకున్ను శక్యము కాదనియు పాదసేవచేయు లక్ష్మీదేవి పాదమాహాత్మ్యమును వర్ణింపదలచి నను అది

అసాధ్యమని తలచి ఆనందాశ్చర్యమున మునిగిపోయె"ననెను. ఆయన సౌందర్యము, గుణగణములు అనిర్వచనీయములని చెప్పబడినవి.

రెండవ స్తుతిలో కుడివైపున శ్రీరూపము, ఎడమవైపున భూనీలారూపములు ఆరు నేత్రములతో తిలకించుచున్నాడనెను. నీ చరిత్రలు మానవులకూహాతీతమని అనెను. ఆ అణువు కంటే అణువుగను గొప్పదాని కంటే గొప్పగాను విశ్వవ్యాప్తి యనెను. నీ అనుగ్రహమున సకల సంపదలకు కొదవ యుండదని ఇంకను దివ్యమంగళ విగ్రహ సౌందర్యము హృదయమునకు హత్తుకొనునట్లు చెప్పబడినది.

**అన్నమయ్య :**

"అణు రేణు పరిపూర్ణమైన రూపము
అణిమాది సరి యంజనాద్రి మీఁది రూపము
వేదాంతవేత్తలెల్లా వెదికేటి రూపము
ఆదినంత్యము లేనియారూపము
పొదుగ యోగీంద్రులు భావించు రూపము
యీ దెస నిదివో కోనేటి దరి రూపము
ముంచిన బ్రహ్మాదులకు మూలమైన రూపము
కొంచని మజ్జాకు మీఁది కొనరూపము
మంచి పరబ్రహ్మయై మమ్మునేలిన రూపము
యెంచఁగ శ్రీ వేంకటాద్రి నీదే రూపము (185 రేకు)

**భవిష్యోత్తర పురాణము** : రెండు సందర్భములలో శ్రీనివాసుని స్తుతి కలదు. తొండమాన్ చక్రవర్తి శ్రీనివాసుని స్తుతించునదొకటి. స్వామిని మూల భూతుడవు, వేద వేద్యుడవని దేవతలకు యోగులకు ప్రభువుగను వర్ణింపబడెను.

భీముడు, కులాలుడును చేసిన స్తుతి రెండవది. అవి నాలుగు శ్లోకములలో నున్నవి. నీ నివాసము వైకుంఠము. లక్ష్మీదేవి పట్టమహిషి. బ్రహ్మనీ నాభి నుండి జన్మించెను. భాగీరథ జన్మ స్థానము నీ పాదములు. ఆదిశేషుడు శయ్య. గరుత్మంతుడు నీ వాహనము విరాట్పు రుషుడైన నిన్ను శరణు పొందుచున్నానని స్తుతి కలదు.

చేరి కొల్వరో యీతఁడు శ్రీ దేవుఁడు
యీ రీతి శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుఁడు 351 రేకు
నీ ఒక్కండవే సర్వాధారము నిన్నే యెరిగిన నన్నియు నెఱుఁగుట

భావించి యింతయుఁ దెలియగవలసిన బ్రహ్మవేత్తలకు నిదిదెరువు

నీయందె బ్రహ్మయు రుద్రుడు నింద్రుండు నీయందె దిక్పాలకులు

నీయందే మనువులు వసువులు రుషులు నీయందే విశాఖ్య దేవతలు

నీ యందే పురగులు యక్షరాక్షసులు నీయందే గరుఁడ గంధర్వులు

నీ యందే పితరులు సిద్ధ సాధ్యులు నీ యందే ద్వాదశాదిత్యులు

నీలోననెనదులును నగ్నియు నీలోననె సచరాచరములును

నీలోనె వేదశాస్త్రము మొదలుగా నిఖిల శబ్దమయము

నీలోనే అన్నియు నిన్నర్చించిన నిఖిల తృప్తికరము.

శ్రీలలనాధిప శ్రీ వేంకటేశ్వర శ్రీ వైష్ణవులకు నీది మతము (239 రేకు)

**పద్మపురాణము** : నాలుగు శ్రీనివాస స్తుతులు కాన్పించుచున్నవి.

రంభాది అప్సరసలచే భయపడిన శుకుడు చేసిన స్తుతియిది. లక్ష్మీదేవిచే ఆశ్రయింప బడినవాడు, షడ్గుణ పరిపూర్ణుడు శ్రీవత్స చిహ్నుడు, పరాత్పరుడు ఎఱ్ఱతామర వంటి పాదములు, వికసించిన తామరల వంటి నేత్రములు కలవాడగు శ్రీనివాసుని శరణు పొందుచున్నాననెను.

శుక యోగేంద్రుడు ఏడు శ్లోకములలో స్తుతించెను.

శ్రీనివాస సాక్షాత్కారము కోరి బ్రహ్మాదులు చేసినది నాలుగు శ్లోకములలో కలదు.

ఆనంద విమాన మధ్యము నందన శ్రీనివాసుని బ్రహ్మాదులు చేసిన స్తుతి రెండు శ్లోకములలో సంబోధనలు కానవచ్చును.

శ్రీ వేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే

పావనపు వైకుంఠ పతియు నితఁడే

భాగవతములలో చెప్పే బలరాముల తీర్థయాత్ర

నాగమోక్తమైన దైవ మాతఁడితఁడే

బాగుగా బ్రహ్మాండ పురాణ పద్ధతి యాతఁడితడే

యోగమై వామన పురాణోక్త దైవ మీతడే

వెలయు సప్త రుషులు వెదకి ప్రదక్షిణము

లలరఁజేసిన దేవుడాతఁడితడే

నెలవై కోనేటి పొంత నిత్యముఁగుమారస్వామి

కలిమిఁదపముసేసి కన్నదేవుడితఁడే

**గరుడ పురాణము** : అరుంధతి చేసిన శ్రీనివాస స్తుతి నాలుగు శ్లోకములలో కలదు. జీవులకందరకు ఇహపర భోగముల నొసఁగు సమర్థుడు నీవు గాక ఎవరున్నారు? లక్ష్మీదేవి నీ వక్షః స్థలమున నున్నది. నీ పాదములందు పుట్టిన గంగను శివుడు శిరస్సున ధరించినాడని ఆశ్రితులకు వేంకటేశుడని ఇహపరలోక సౌఖ్యమును కటాక్షించుమని ప్రార్థించెను.

"నీ మహిమది యెంత నీవు చేసే చేత లెంత
దీమసవు నీ మాయలు తెలియరాదయ్యా
నీపాద తీర్థము నెత్తి మోచె నొకఁడు
పూప కొడుకై యొకఁడు బొడ్డునఁబుట్టె
శ్రీపతికి మగఁడవు భూపతికి మగఁడవు
యీ గరుడ శ్రీ వేంకటేశుఁడవు. (213 రేకు)

**బ్రహ్మాండ పురాణము** : చోళరాజు చేసిన శ్రీనివాస స్తుతి తొమ్మిది శ్లోకములలో కలదు.

నీవు యజ్ఞ హవిస్సువు. హోతవు నీవు. అగ్ని హోత్రుడవు నీవు. నీవే యజ్ఞము. నీవే యజ్ఞ ఫలము. నీకంటే భిన్నమేదియు లేదు.

శ్రీనివాసుని తత్త్వము అగమ్యమైనదనెను
యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త వన్నిటాను
యజ్ఞాది ఫలరూపమిటునీవై వుండవే
యీ దెస నీదాసుల మయిన మమ్ము గాచుటకు
వేద మూర్తివై యిందే విచ్చేసి యుండవే (308 రేకు)

**మార్కండేయ పురాణము** : శ్రీనివాస స్తుతులు మూడు కానవచ్చుచున్నవి.

మొదటి స్తుతి ఎనిమిది శ్లోకములలో చేయబడినది.

బ్రహ్మ రుద్రాదులు పదునొకండు శ్లోకములలో స్తుతించిరి.

కుమార స్వామి ఏడు శ్లోకములలో స్తుతించెను.

లక్ష్మీ ఎవనికి భార్యయో, ఎవని వలన సృష్టి రచన ఏర్పడెనో, యోగులెవరిని ధ్యానింతురో, ఎవడు జగదీశుడో, మన్మథుని తండ్రి ఎవడో ఎవరు పాపనాశకుడో ఆ వేంకటేశ్వరుని సేవించుచున్నాననియు, కలియుగ ప్రత్యక్ష గోచరుడగు దైవమని, వేంక టాచలమున కలంకారభూతుడగు వేల్పని, ఆపద్బాంధవుడని, ఆయనను సేవించుట అదృష్టమని, నేత్రములకు సార్థక్యప్రదము స్వామి దర్శనమని వర్ణించబడినది.

అతఁడే యెక్కుడు దైవమందరి కంటె
తతి నింకాఁజెప్పి చూప దైవాలు గలవా
కడలేని జగములు గల్పించే బ్రహ్మదేవుఁ
డడరియే దేవునాభియందుఁబుట్టెను
ఎంచినాడు దేవతల నింద్రియాలఁజొక్కించే
పంచబాణుఁడే దేవుని పట్టి యిపుడు
కొంచక శ్రీ వేంకటాద్రిఁ గోరిన వరములిచ్చి
అంచలలోకము లేలీ నండనే దేవుఁడు (346 రేకు)

ఈ విధముగా అన్నమయ్య స్వామి యొక్క రూపలావణ్యా వర్ణనలే కాక స్వామి వారి మహిమలను కూడా తన సంకీర్తనలలో వ్యక్తపరిచెను. మహిమాన్విత వర్ణనలకు వివరణ లావశ్యకములు. కావున వివరణలతో అన్నమయ్య సంకీర్తనలు గమనించెదము.

## అన్నమయ్య-వేంకటాచల మాహాత్మ్యము

కురువనంబి అను కుమ్మరి ప్రతిదినము వంటకుండలు చేసి అమ్ముకొనుచు ఆ రాబడితో జీవించుచుండెను. అనుదినము ఆపనితో తీరికలేక స్వామి వారి దర్శనము లభింపక పోవుటచే కొయ్యతో శ్రీనివాసమూర్తిని తయారుచేసి పూజలొనరించుచుండెను. తొండమాన్ చక్రవర్తియు అనుదినము స్వామివారిని బంగారు పూలతో తొలిపూజ జరుపుచుండెను. ఒకనాడు చక్రవర్తి బంగారు పుష్పములతో పూజలు జరుపుచుండగా ఆ పుష్పములు పక్కకుజారి మట్టి పూవులు శ్రీవారిపాదములపై నుండుట కానవచ్చెను. చక్రవర్తి ఈ విషయమును పరిశోధించగా కుమ్మరి తానున్న స్థలముననే స్వామికి అర్పించుచున్న పుష్పములవి యని గ్రహించి ఆ కుమ్మరిని దర్శించి తనకును అట్టి యోగ్యతను కల్పించుమని స్వామిని వేడుకొనెను. కురువనంబి, చక్రవర్తి ఇరువురును స్వామిని వేడుకొనిరి. కురువ నంబి, చక్రవర్తి ఇరువురకును స్వామి సాన్నిధ్య ప్రాప్తి కలిగెను. ఈ కథ వేంకటాచల మాహాత్మ్యమున వివరించబడినది. తిరుమల ఆలయమున వేంకటాచల మాహాత్మ్యము పఠించుటచే స్ఫూర్తినిగొని ఈ సంకీర్తన గావించి యుండవచ్చును. 'కురువ నంబిగారి చేతి బంకమట్టి పువ్వులు, కొన్న నాఁడే తెలిసె మీ భోగము"లని

"కురువనంబి తిరుమల కురువ నంబి నీచరణములే కొలిచి బ్రతికె కిరీటముగల రాజు
దవ్వులామట నుండి నీవు పువ్వుల బూజించితివే అవి
చివ్వన అప్పనియడుగుఁదామెరలపై చెలఁగియప్పుడే నిలిచె

పువ్వులకు రెక్కలున్నవో లేక పుండరీకాక్షుని మహిమో
నివ్వటిల్లు నీ భక్తియో కాని నేఁడు నాతో జెప్పవే
పొంకపు దోసిటి యడగున లెస్స పొరలిన గన్నేరు బువ్వులు
కుంకుమ గంధ మాకల్వములపై కోరి వేడి నిలిచె
బంకమన్నది యెంత వాసనో లేక పారిజాతముల కెక్కుడో
వెంకటపతి కెంత వేడుకో నాకు వివరింపవే అప్పయ్య
దోసిటి లోపలఁబెట్టిన శ్రీ తులసి సేవంతి పువ్వులు
వాసిగ జగమెల్ల కుక్షిలో నిడుకొన్న వాని మేనెల్ల నిండె
వేసదారి యలమేలు మంగ శ్రీ వేంకటేశ్వరుని మహిమో నీ
దాసరితనము బలమో కాని తలఁపు నాతో జెప్పవే.'' (అన్న చ. శేషాచార్యుల వ్రాతప్రతి)

కొండనెక్కునప్పుడు తలయేరు గుండు దాటినంతనే 'కమ్మరి మండప'ముండెడిది నేడు ఆరాళ్ళు మార్పుచెంది కురువనంబి కథాశిల్పములతో మెట్లకు ప్రక్కన గోడ రాళ్లైనవి.

తొండమాన్ చక్రవర్తికి స్వామి చేసిన ఉపకారమును అన్నమయ్య కీర్తించెను. ఆ ఉపకారమేమన ఒకనాడు శత్రువుల దాడికి కలవరపడి చక్రవర్తి స్వామిని శరణుకోరెను. శరణాగత వత్సలుడైన స్వామి తన శంఖచక్రములను చక్రవర్తి కొసగి శత్రు నాశనము చేసి చక్రవర్తిననుగ్రహించిన విషయమును

"తొండమాం జక్రవర్తికి సంపద
తొలుంత నియ్యంగాఁదెలిసె మీ యీవులు''

అని అన్నమయ్య స్వామి మాహాత్మ్యమును కీర్తించెను. ఈ సంఘటనను దిలీప చక్రవర్తికి దుర్వాస మహాముని చెప్పెనని సూతుడు బ్రహ్మాండ పురాణమున వచించెను. (53)

ఒకనాడు తొండమాం చక్రవర్తి వద్దకు గొల్లభామలు వచ్చి "రాజా మేము ప్రతిదినము ఊరి నుండి మీ రాజ్యములోని ప్రజలకు పాలు వాడికగ నిచ్చెడివారము. దారిలో వేంకటాద్రిని దాటి వచ్చుమార్గమున ఒకపుట్ట కలదు. ఆ పుట్టవద్ద పాలకుండలు విరిగి ఆ పుట్టలోనికి పాలు పోవుచున్నవి. ఆ అద్భుతమును గాంచి మీకు విన్నవించుటకై వచ్చితిమి'' అని సెలవిచ్చిరి. నాటి రాత్రి చక్రవర్తి స్వప్నమున భగవత్సాక్షాత్కారమును గాంచెను. మరునాడు వారందరును కలసి పుట్ట వద్దకు పోయిరి. అట ఆ పుట్టను గొల్లవారి పాలతో అభిషేకము చేయగా ఆ పుట్టలో నుండి శ్రీనివాస భగవానుడు ప్రత్యక్షమై తాను వెలసిన అదే ప్రదేశమున తనకాలయమును నిర్మించమని చక్రవర్తిని ఆదేశించెను. బ్రహ్మాండ పురాణమున ఈ వివరములు చెప్పబడినవి (54)

"వుండి గొల్లల కావిళ్ల పాలెల్ల

వుట్టుకోఁగఁదెలిసె మీ నేమములు" -అ.చా.చ.

అని స్వామి మహిమలను వర్ణించెను.

వరాహ పురాణమున 'వసుమ' అను నాతడును అతని కొడుకు 'తండులం'ను వండి తేనెతో చేర్చి స్వామికి నిత్యము నివేదించుచుండెడివారని ఒక కథ చెప్పబడినది. ఒకనాడు తేనెను తీసికొనివచ్చుటకై వసువు అడవికి పోయి వచ్చెను. అతను తిరిగి వచ్చి కుమారుడు భోజనము చేసెనని గ్రహించి దైవ అపచారము జరిగెనని కోపించి అతనిని వధించిటకుద్యుక్తుడు కాగా స్వామి ప్రత్యక్షమై ఆతని పుత్రుడు తన భక్తుడేనని తనకు నివేదనలందించెననియు తానారగించితిననియు పలికెను.

"అండ యెరుకు వారి కొఱ్ఱి చేనియెన్ను

లారగించగాఁదెలిసె మీ రుచులు" అని వర్ణించెను. -అ.చా.చ.

అనంతార్యుడు గోపురముతోపాటు ప్రాకారము నిర్మించుచుండ దాని ప్రక్కల అన్ని వైపులకు వ్యాపించిన చంపక వృక్షము ప్రాకార నిర్మాణకవరోధమగుటచే ఆయన (అనంతార్యుడు) "ఈ కొండపై దివ్య సూరులుందురు గాన ఎవ్వరేని దివ్యసూరి సంపెంగ చెట్టుగా జనియించి యుండనోపు స్థావర జంగము లన్నియు అప్రాకృత ప్రాణులేయని పురాణములు చాటుచున్నవి"యని తలచి భగవంతుని ధ్యానించగా ఆ వృక్షము తొలగిన దని 'వేంకటాచలేతి హాసమాల' ఆరవ కటకమున వివరించబడినది. ఈ విషయమునే

దండిగా సంపంగి మాఁకుల నడిపించ

దైవరాయ తెలిసె మీ విద్యలు

యని స్వామి మాహత్మ్యమును పొగడెను. (అకారణము చేతనే ఆలయమున ఆ ప్రాకారము చంపక ప్రాకారమని సుప్రసిద్ధ మాయెను) స్వామి మాహత్మ్యముతోబాటు

"పనివడి తాళ్ళపాక అన్నమాచార్య గారి

పదములలోఁదెలిసె మీ వోజలు

యెనయ శ్రీ వేంకటనాథు యలమేల్మంగ

నెదనుంచఁగాఁ దెలిసె మీ గోప్యము

వెనుకొని పరుషవారి కెదురువోయి

వెంటరాగాఁదెలిసే మీ రాజసము

(శేషాచార్యుల వారి ప్రతి)

ఈ విధముగా అన్నమయ్య కొక్కరికేకాక తాళ్ళపాక వంశస్థులకు తిరుమల ఆలయము, స్వామి ఆలవాలమైనది.

బ్రహ్మాండ పురాణము, భవిష్యోత్తర పురాణములలో భృగుముని సత్త్వగుణ సంపన్నుడెవడో కనుగొనుటకు త్రిమూర్తులను పరీక్షించుట, విష్ణువే సత్త్వగుణుడని, ఆతనికే యజ్ఞఫలము నీయవలెనని నిశ్చయించి చెప్పుట మున్నగు వివరములను

"యెవ్వరేమి సోదించే దెవ్వరే మెరింగేరు
అవ్వల నివ్వల శ్రీహరియే దైవము
జగములోపల హరి సాత్త్విక దైవమని
భృగువే సోధించినాడు పృథివిందొల్లి
ముగ్గురు వేల్పుల మో మొరవెట్టిరితనికే
జిగిమించి దేవతలు క్షీరాబ్ధికాడనే
ధరంగాశి లోన హరి తారకబ్రహ్మమని
హరుఁడే బోధించఁజొచ్చె నందరికిని
అరుదుగ రామనామ మతని పుట్టపురాణి
గిరిసుత పార్వతి కీర్తింపందొడగె
అదిగో శ్రీ వేంకటాద్రి హరి పరతత్త్వమని
యెదుటనే బ్రహ్మ పుట్టె యితని నాభిపో
యిదిగో మన మందరిమితనినే కొల్చి
బ్రతుకుదు మిటురారో ప్రాణులార మీరు" 24వ రేకు 15-139

అని వేంకటాచల మూర్తి అవతార గాథలను సంకీర్తన గానము చేసెను.

వామన పురాణములో కుమారస్వామి వేంకటాచలమున తపస్సు చేసెనని వర్ణించిన విషయమును

ఆ మూరితియే యీ మూరితి అందు నిందు భేదము లేదు
సోమార్క నేత్రుండ విశ్వరూపములు చూచిన వారమేమును
బలిమితోడ వత్సాపహరణమున బ్రహ్మకు నీ మాయ జూపితివి
విలసిల్లంగ రణ భూమిని నర్జునకు విశ్వరూప మిటు చూపితివి.
అలరి నీ రూపు జలమధ్యంబున
చెలంగి కుమారస్వామికి నీరూపు శ్రీ వేంకటగిరిం జూపితివి
గిరిరాజ సుతనుత కేవశ నమో (2-96)

అని అన్నమయ్య కుమారస్వామి సేవించిన స్వామిగా స్వామివారి కీర్తిని నుతించెను.

## అన్నమయ్య-ఆలయమూర్తులు

తిరుమల ఆలయమున మూలమూర్తి స్వయంభువు. మూల మూర్తితో భోగములను సేవలను అందుకొను ఉత్సవ విగ్రహముల వివరణలు అన్నమయ్య సంకీర్తనలలో పరిశీలనావశ్యకములు.

తిరుమల ఆలయమున మూలవిగ్రహమునకు సమీపముగా భోగ శ్రీనివాసమూర్తి కలదు. 'తమిళమున' 'మనవాళ పెరుమాళ్' అని ఆయనకు పేరు. మనవాళన్ అనగా 'పెండ్లి కుమారుడ'ని భావము. నిత్య కల్యాణమూర్తి కావున ఆ నామమేర్పడి యుండ నోపు. ఈ విగ్రహము శంఖచక్రములతో కూడికొని యున్నది. ఈ విగ్రహము పల్లవరాణి సామవైచే క్రీ.శ. 966 సంవత్సరమున ప్రతిష్ఠింపబడినది. ఈ విషయము మొదటి ప్రాకారమున ఉత్తర దిక్కు గోడపై చెక్కించబడియున్నది. మూల మూర్తితో భోగ శ్రీనివాస మూర్తులు వెండి బంగారు కలిపిన సూత్రముతో జోడించబడియున్నారు. (జత కలుపబడి) సర్వ భోగములు ఉపచారములు ఈ భోగ శ్రీనివాసమూర్తులకే జరుగుచున్నవి. అనుదినము తిరుమంజనము ఈ మూర్తికే జరుపబడుచున్నది. భోగశ్రీనివాసమూర్తికే ఏకాంత సేవా భాగ్యము. ఈ విగ్రహమును "కౌతుకబేర"మని వ్యవహరించెదరు. ధ్రువ మూర్తికి కౌతుక బేరము కావున మూలమూర్తి యొక్క ప్రతిబింబ మూర్తియే ఈ మణవాళ పెరుమాళ్. భోగ శ్రీనివాసుని కంఠమున అలమేల్మంగ రూపము చిత్రించియున్న పదకముతో నొక సువర్ణ హారమున్నది. అన్నమయ్య తన సంకీర్తనలో

"పరచు నీ మెడ నరపణుల యుయ్యాలలో
ఉరుటు మురిపమున నూగుచును
గరికొన్న తమకాన కిందు మీదెరుగక
మరెచె మే నల మేల్మంగ నాంచారి"

అని భోగ శ్రీనివాసుని సన్నుతించెను.

**ఉగ్ర శ్రీనివాసమూర్తి** : He was originally called Venkata turaivar. The Tamil word shows that He was the resident deity in the temple perhaps even before Bhoga Srinivasa was consecrated"[55] అన్నమయ్య తన సంకీర్తనలలో ద్వాదశి నాటి ఆరాధన లందుకొను 'ఉగ్ర శ్రీనివాసమూర్తి'ని "అరుదు"గా అపురూప మూర్తిగా వర్ణించెను.

**మలయప్పస్వామి :** తిరుమల ఆలయము వెలుపల శ్రీభూదేవులతో ఉత్సవము లలో పాల్గొను ఉత్సవ మూర్తి మలయప్ప స్వామివారే. ఈ స్వామిని "మలైకునియ నిన్ర పెరుమాళ్, ఉత్సవ బేరం, సత్యబేరం, మలయప్ప" అని పేర్కొనెదరు.

"మలైకునియ నిన్ర పెరుమాళ్ "అనగా" బాగా వంగిన పర్వతమున నిలిచిన పెరుమాళ్ళు" అని భావించవచ్చును. ఈ స్వామి ప్రస్తావన క్రీ.శ. 1339 నాటి శాసనమున కానవచ్చుచున్నది. నాటి నుండి నేటివరకు అవిరామముగా ఉత్సవ ఊరేగింపులో పాల్గొని భక్తులననుగ్రహించున్నారు. వజ్ర, ముత్యాల, బంగారు కవచములను మలయప్ప స్వామి వారు కలిగియున్నారు.

"అలరచంచలమైన ఆత్మలందుండనీ
అలవాటుచేఁసి నీ వుయ్యాల
కమలకును భూపతికి కదలు కదలుకు మిమ్ము
కౌగిలింతగఁజేసె నూయ్యాల." 10 రేకు 1-67

అన్నమయ్య పై సంకీర్తనలో మలయప్ప స్వామిని దేవేరులతో వర్ణించెను.

**కొలువు శ్రీనివాసమూర్తి :** బలిబేరమని కూడా వ్యవహరించెదరు. తిరుమామణి మంటపమున ప్రతిదినము కొలువు తీరిన శ్రీనివాసునికి పంచాంగ శ్రవణము, నాటి రాబడిని గూర్చిన వివరములను వివరించెదరు. ఈ మూర్తి వెండి ఆసనము, బంగారు ఛత్రములతో కొలువు తీరును. "It is not possible to state when this custom had its beginning nor we could say at what time and how its murti was introduced into the Sanctum Sanctorum" [56].

"సురలు నీ యవసరమును చూచుకొని కొలువునకు
సరవి నాయిత్తపడి సందండించేరు" 2.436

ఈ విధముగా తిరుమల ఆలయములో పూజలను అందుకొన్న మూలమూర్తి, కౌతుక మూర్తి ఉగ్ర శ్రీనివాసమూర్తిని, కొలువు శ్రీనివాసమూర్తిని మలయప్ప స్వామి (లేక) ఉత్సవ మూర్తిని, వారికి జరుగు తిరుమంజనము, ఏకాంతసేవ, మేలుకొలుపు సేవలను గురించి తన సంకీర్తనలో వర్ణించెను.

తిరుమల ఆలయములో శ్రీనివాసమూర్తులే కాక, శ్రీవైష్ణవ, సీతా, రామలక్ష్మణ సుగ్రీవుల మున్నగు వివిధ రకముల విగ్రహములు కూడా కలవు. అన్నమయ్య సంకీర్తన లలో వారిని గురించిన వర్ణనల యొక్క వివరములు :

శ్రీకృష్ణ విగ్రహము : గర్భాలయమున నవనీత నృత్య కృష్ణుడు రుక్మిణీ సమేతుడై యున్న మూర్తి కలదు. ఈ మూర్తిని గురించిన ప్రస్తావన క్రీ.శ. 1100 శాసనమున కాన వచ్చుచున్నది. ధనుర్మాసమున 'ఏకాంతసేవ' భోగము శ్రీకృష్ణునకు జరిపించెదరు.

"వెన్న ముద్ద కృష్ణుఁడు వేవేల చేతలవాఁడు
పిన్నవాడై వున్నవాడు బిరుదైన బాలుఁడు
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి
సిరితో వెలసెనిదే చెలువపు బాలుడు. (2-234)
మిన్నక వేషాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగ నిద్ర చాలు మేలుకోవయ్యా
అలరిన శ్రీ వేంకటాద్రి మీది బాలకృష్ణ
యిల మాటలు వింటు నింక మేలుకోవయ్యా. (11-3-60)

శ్రీ సీతారామలక్ష్మణ సుగ్రీవులు : ఈ విగ్రహములను గూర్చి 'వేంకటాచలేతి హాసమాల'లో ప్రస్తావించబడినది. శ్రీ రామానుజుల వారికి తిరుమల నంబిగారు ' శ్రీ రామాయణమునకు వ్యాఖ్యానము చేయుచు 'విభీషణ శరణాగతి' ఘట్టమును పూర్తి చేసిరి. ఆ తరుణమున విశ్వంభర మహామునిచే ప్రతిష్ఠించబడిన రామాది అర్చామూర్తులను తిరుమల నంబి, రామానుజుల వారికి అప్పజెప్పిరి. ఆ మూర్తులను శ్రీ రామానుజుల వారు తిరుమల అలయమున ప్రతిష్ఠించిరని కలదు. క్రీ.శ. 1476 కాలము నాటి శాసనమున వీరి ప్రస్తావన కలదు.

శరణు శరణు రామచంద్ర నరేంద్రా
సరిమమ్ముఁగావు రామచంద్ర నరేంద్రా
పన్నుగ నలమేల్మంగపతి శ్రీ వేంకటేశ్వరు
సన్నిధి నిల్చిన రామచంద్ర నరేంద్రా (9-287 రేకు)

అంగద, హనుమంతుల రాగి విగ్రహములు 'రామర్ మేడై' అంతరాళమంటపమున కలదు. వీరి ఎదుట విష్వక్సేన, అనంత, గరుడ మూర్తులు కలవు.

"వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నినుఁజూచి శ్రీ వేంకటేశ '4-276)
అలఘు సుగ్రీవ అంగదాది కపిసేవిత
సలలిత శ్రీ వేంకట శైల నివాసా" (IX 5)

చక్రము : సుదర్శన చక్రము కూడా గర్భాలయమున ప్రతిష్ఠించబడినది. స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగింపునకు కొనిపోవుటకు పూర్వము వీరు (చక్రత్తాళ్వార్) శుద్ధిచేసి పరిసరములను పరికించి వచ్చెదరు.

"నమోనమో దానవ వినాశ చక్రమా- సమర విజయమైన సర్వేశు చక్రమా." అనియు

"మర్ద మర్ద మమబంధాని

దుర్దాంత మహాదురితాని

చతురోऽహంతే శరణంగతోऽస్మి

యితరాన్ విభజ్య యిహమాం రక్ష" (2-81)

అనియు చక్రత్తాళ్వారును స్తుతించిరి.

ఈ విధముగా అన్నమయ్య తిరుమలను, స్వామిని, అచట పరిసరములను పరికించుచు కొన్ని సంవత్సరము లచటనే నివసించెను. తల్లి వచ్చి గుర్వాజ్ఞతో అన్నమయ్యను తాళ్ళపాకకు కొనిపోయి తిరుమలమ్మ, అక్కలమ్మ అనెడి భార్యల నిద్దరనిచ్చి వివాహము చేసెను. అన్నమయ్య తాళ్లపాకలో తిరుమలలో అహోబిలములో ఇంకను అనేక పుణ్యస్థలములను దర్శించెను. గార్హస్థ్య జీవితమును గడిపెను. అన్నమయ్య పిమ్మట వారి యొక్క పుత్ర, పౌత్రులు స్వామి వారిసేవను కొనసాగించిరి. అన్నమయ్య అనేక పుణ్య స్థలములను దర్శించినను, సదా వారు మనసా వాచా కర్మణా స్వామి వారినే సర్వదా ధ్యానించెడివారు. తిరుమలేశుని విడనాడి యుండుట వారికి వ్యధను కలిగించెడిది. స్వామివారి వియోగమును భరింపలేక వేంకటేశుని "లంక విభీషణు నుంచ లక్ష్మణుని పంపినట్లు, అంకెఁసుగ్రీవుఁ గిష్కింద కంపిన యట్టు, వంకకు సంజీవి దేను వాయుజుని పంపినట్టు, వేంకటాద్రి పొంత నుండ వేగ మమ్ము పంపవే."

"ననుపు శేషాద్రి నుండనను పంపవే అని వేడుకొనెను. (9-143)

"నాయంతనే వుద్దండంబున నీ నగరు బంచి సాదించగలేను

పాయక నన్ను మన్నించి యేలుకొని ప్రకాశమౌట మేలు"

"ధరలోని రూపము నీవె దాచుకొని యుండంగను

గరుడధ్వజమె నీ గురుతు కనుపించెను నాకు

బిరుదులు వొగడె శ్రుతులచేతనె పైకెరింగితి నేను

పరగిన నీ ప్రతాప తేజమే బయలు సేసె నిన్ను"

అని ఆలయ గరుడధ్వజ ప్రాధాన్యతను వెల్లడించెను.

"శ్రీ వేంకటగిరిపై రహస్యమునంజెలంగుచు నుండగాను

భావింపనలమేల్ మంగ సంపదలె పట్టిచ్చెను నీ ప్రభావము" 74వ రేకు 15-423

అని వెంకటాద్రి అలమేల్మంగ శ్రీనివాసుల సంపదల నిలయముగా కొనియాడెను. ఇంకను 319 రేకు

"హరిరూపెరుఁగుదుమా అరసి యింతక తొల్లి
సొరిది శ్రీ వేంకటేశుఁజూచి కాక"
వైకుంఠ మెరుగుదుమా వర్ణించి యింతక తొల్లి
దీకొని శ్రీ వెంకటాద్రి దిరిగి రాక." అని 319 రేకు
మేడవంటి హరిరూపు మించైన పైఁడి గోపుర
మాడనే వాలిన పక్షులమరులు
వాడలఁగోనేటి చుట్ల వైకుంఠ నగరము
యీడ మాకుఁబొడచూపె యిహమేపో పరము
కోటి మదనుల వంటి గుడిలో చక్కనిమూర్తి
యీటులేని శ్రీ వేంకటేశుఁడితఁడు
వాటపు సొమ్ములు ముద్ర వక్షపుటలమేల్మంగ
కూటువై నన్నేలితి యెక్కువవో నా తపము (3.409)

తిరుమల పవిత్రతోబాటు, అచటనున్న వృక్షములు కల్పతరువులని, మృగములెల్ల ముక్తజనములని, పక్షులమరులని, వాడలే (వీధులు) వైకుంఠ నగరమని తన తపః ఫలముననే అలమేల్మంగ విభుడు తననేలుకొనెనని శతసహస్ర ప్రణామము లాచరించి ఈ క్రింది విధముగా స్వామిని ప్రార్థించెను. 72 రేకు 15-414

"సందేహ మెక్కడా లేదు సంతోషించుకొంటినేను
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను
నున్నగా సంకీర్తన నా నోరికిచ్చితి గనుక
నన్ను రక్షింతువే యనుచు నమ్మితినేను
పిన్న వాడే నీవు నన్నుం చేరుకొంటివి గనుక
యెన్నంగ నీ డేర్తువని యియ్యకొంటి నేను
శ్రీకాంతుండ నీ మూర్తి నా చిత్తములో నిల్పంగాను
నాకు నీవు గలవని నమ్మితి నేను

దాకొని లోకములో నీ దాసుండనిపించఁగా

యీకడ నేలితివని యెరింగితి నేను

యేవేళ శ్రీ వేంకటేశ యెదుట నే వుండగాను

పావనమై యి'న్ని'టను ప్రబలితి నేను" అని -అ.చా.చ. పుట 74

వేడుకొనెను. ఆనందనిలయుని ఎదుట సర్వవేళల

"అదివో తాళ్ళపాక అన్నమాచార్యులు

యిదె వీఁడె శ్రీ వేంకటేశు నెదుట" -అ.చా.చ. పుట 74

"శ్రీ వేంకటాద్రి మీఁద శ్రీపతి కొలువునందు

ఆవహించే తాళ్ళపాక అన్నమయ్య" 10. 192

ఇట్లు నేటికిని ఆనంద నిలయమున స్వామి కెదురుగా విమాన ప్రదక్షిణ మార్గమున స్వామివారి కృపాదృష్టిని తాను పొందుచూ మనపై నేడు అమృత రసభరిత సంకీర్తనల వర్షమును కురిపించి కృతార్థులను గావించి, అదిగో స్వామి యని చూపుచు నిల్చొని యున్నారు. తిరుమల ఆలయమునకు అన్నమయ్యకు గల అవినాభావ సంబంధమును నేటికిని మనము గాంచవచ్చును. ఈ విధముగా అన్నమయ్య ఆలయముతో విడదీయని అనుబంధమును కలిగియున్నారు. ఈ భావమునే అన్నమయ్య ఇట్లు వర్ణించి సంకీర్తనల సుమాంజలి చేసేనేమో?

"విశ్వరూపమిదివో విష్ణు రూపమిదివో

శాశ్వతులమైతిమింక జయము మాజన్మము

కొండవంటి హరి రూపు గురుతైన తిరుమల

పండిన వృక్షములే కల్పతరువులు

నిండిన మృగాదులెల్ల నిత్యము ముక్త జనము

మెండుగఁబ్రత్యక్షమాయె మేలు వో నాజన్మము రేకు 271(3-409)

# రెండవ అధ్యాయము అథస్సూచికలు

1. రామకృష్ణారావు, అడపా, 1991 "అన్నమాచార్యులు" న్యూఢిల్లీ, సాహిత్య అకాదమీ.
2. లక్ష్మి, ఏప్రిల్ 1995, ఎట్టు పునిద తిరుప్పదిగళ్ జ్ఞానభూమి మాసపత్రిక.
3. సోసుందరశర్మ, షడ్దర్శనం, ఫిబ్రవరి, 1998, వేద పురాణాలలో వేంకటేశ్వరుడు (వ్యాసం) సప్తగిరి మాసపత్రిక తిరుపతి తి.తి.దే.
4. నమ్మాళ్‌వార్ - తిరువాయ్‌మొళి.
5. రామకోటేశ్వరరావు,టి. సెప్టెంబర్ 1996, "తిరుమలకొండ" వ్యాసం, సప్తగిరి మాస పత్రిక, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానము.
6. రాధాకృష్ణ శర్మ చల్లా, 1993. తులనాత్మక సాహిత్యం, వ్యాస సంకలనం, న్యూఢిల్లీ, సాహిత్య అకాడమీ.
7. చూడండి 1 నెం.
8. Ramesan, N. 1981 The Tirumala Temple, Tirupati, T.T.D.
9. రెడ్డి, డి.సి. 1994 టి.టి.డి. శాసనాల్లో తిరుపతి, తిరుపతి, తి.తి.దే.
10. Souvenir, Golden Jubilee, 1984. Tirupati, T.T.D. The significance of Tirumala Temple N. Ramesan.
11. సుబ్బురెడ్డియార్ 1975 listed తిరువేంగడముం, తమిళ్ ఇలక్కియముం, చెన్నై రామలింగం.
12. వేణుగోపాలన్ - చోళరశు వళియిల్ సుదందిర తమిళరసు నిరవియ పుదుక్కోట్టై పేరఅశర్ తొండైమాన్ వేందర్ వెళివళి ఆరాయ్‌చి తిరువిడైమరుదూర్: తమిళ్‌చ్చుడర్.
13. ఇళంగో అడిగళ్ Photocopy 1985 శిలప్పదిగారమ్ Tanjore. Republished by Tamil University.
14. జ్ఞానసుందరం, తె. 1984 పెరియ తిరుమొళి ఉరైయుంతమిళాక్కామ్, తంజావూరు: తమిళ్ పల్‌గలై కళగమ్.
15. Ramesh, M.S. 1997, 108 Vainsavite Divya Desams. Tirupati M.K.R. Vinayak T.T.D.
16. రామకోటేశ్వరరావు, టి 1995, ఆళ్వారులు సందర్శించిన వేంగడము, సప్తగిరి మాసపత్రిక నవంబర్, తిరుపతి : తి.తి.దే.
17. వేంకట లక్ష్మీ నర్సింహాచార్యులు, పాలవంచ తిరుమల గుదిమెళ్ళ 1992 ప్రథమ ముద్రణం, ఇయత్నా, మచిలీపట్టణము : రచయిత. 521001

18. రెడ్డి డి.సి. 1994 "టి.టి.డి. శాసనాల్లో తిరుపతి" తిరుపతి : తి.తి.దే.,
19. పొయ్‌గై ఆళ్వార్-ముదల్ తిరువందాది.
20. భూదత్తాళ్వార్-ఇరన్దామ్ తిరువందాది.
21. పేయాళ్వార్-మూన్హామ్ తిరువందాది.
22. రామకోటేశ్వరరావు టి. నవంబర్, 1995. "ఆళ్వారులు సందర్శించిన వేంగడం" వ్యాసం. సప్తగిరి మాసపత్రిక, తిరుపతి తి.తి.దే.
23. Ibid.
24. కులశేఖరాళ్వార్ - పెరుమాల్ తిరుమొళి 678, 685 Ramesh, M.S. 1997, 108 vainsavaith Divyadesams, Tirupati N.K.R. Vinayak, T.T.D.
25. నరసింహాచార్య, ఎన్.సి.వి. 1987, ప్రథమ ముద్రణ : "శ్రీవేంకటాచలేతి హాసమాల" శ్రీమదనంతార్య గుంభితము. తిరుపతి : తి.తి.దే.
26. Ibid.
27. నరసింహారెడ్డి పి. 1991 ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు. తిరుపతి శ్రీనివాస పబ్లికేషన్స్.
28. చిన తిరు వేంగలనాథుడు, శ్రీ తాల్లపాక 1978 తృతీయ ముద్రణము. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము. తిరుపతి : తి.తి.దే.
29. Ibid.
30. Ibid.
31. Ibid.
32. ఆనందమూర్తి, వేటూరి, 1978, ప్రథమ ముద్రణ. తాళ్ళపాక కవుల పదకవితలు, భాషాప్రయోగ విశేషాలు. హైదరాబాద్ : శ్రీ-నివాస్.
33. Ibid.
34. Viraraghavacharya, T.K.T. 1997, 2nd edition, History of Tirupati vol. I Tirupati : T.T.D. P. 267
35. Narasimhacharya, Madabhushini, 1989, History of the cult of Narasimha in Andhra Pradesh, Hyderabad. Sri Ahobila Math.
36. బాలసుబ్రహ్మణ్యం జూలకంటి, 2000 మొదటి ప్రచురణ "హరి కొలువు" తిరుపతి : తి.తి. దేవస్థానము.

37. చూడండి 33 నెం.
38. బాలసుబ్రహ్మణ్యం జూలకంటి 2000 మొదటి ప్రచురణ "హరి కొలువు".
39. Ibid.
40. Ibid.
41. Virarahavacharya, T.K.T. 1997, 2nd ed. "History of Tirupati Vol. I"
42. Ibid.
43. Viraraghava chary, T.K.T. 1997. 2nd ed. "History of Tirupati, Vol. I Tirupati, T.T.D.
44. Setu Rameshwara Datta, K. 1980. Sri Venkateshwara sachitra Suprabhatam, Tirupati : T.T.D.
45. శారద కె. జులై 1995."సప్తగిరి నామావళి", సప్తగిరి మాసపత్రిక, తిరుపతి : తి.తి.దే.
46. Ramachandran, S.P. 1987, Sri Venkateswara Mahathmyam compiled from Brahamanda, Varaha, Vamana Padma Purana. Madras-26. : Vadapalani.
47. Sitapati, Pidatala, 1989 4th ed "Sri Venkateswara" Bombay : Bharatiya Vidya Bhavan.
48. Ramachandran, S.P. Sri Venkateswara Mahatyam compiled from Brahmanda Varaha, Vamana, Padma Purana, Madras-26 Vadapalani.
49. Ibid.
50. Ibid.
51. నారాయణస్వామి, వై. 1998, 2nd ed."తిరుప్పతి వెంకటాచలపతి మగిమైయుమ్ వరలారు" చెన్నై-17 : నర్మదాపదిప్పగమ్.
52. లలితారాణి, సి. 1995, సెప్టెంబరు. వివిధ పురాణములలో శ్రీ వేంకటేశ్వర స్తుతి (వ్యాసం) తిరుపతి. తి.తి.దే.
53. Ramachandran, S.P. చూ. 48.
54. నారాయణస్వామి, వి. 1998 2nd ed. చూ. 51.
55. Viraraghavacharya, T.K.T. 1997 Reprint : History of Tirupapi Vol. I Tirupati. T.T.D.
56. Ibid.

మూడవ అధ్యాయము

# విషయ సూచిక


| | |
|---|---|
| విష్ణువు | 106-108 |
| వేదములలో విష్ణువు ప్రశంస | 108-113 |
| బ్రాహ్మణములలో విష్ణు ప్రశంస | 113-117 |
| ఇతిహాసములలో విష్ణు ప్రశంస | 117-120 |
| పురాణములలో విష్ణు ప్రశంస | 120-122 |
| సంగం కవితలో విష్ణు ప్రశంస | 122-124 |
| దివ్య ప్రబంధములలో విష్ణు ప్రశంస | 124-125 |
| ఆచార్యులు - విష్ణు సేవ | 125-131 |
| అన్నమాచార్యులు - ఆగమములు | 131-135 |
| అన్నమాచార్యులు - విభవ (లేక) అవతారములు | 135-140 |
| అన్నమాచార్యులు - అర్చామూర్తులు | 140-160 |
| అథస్సూచికలు | 160-164 |

# అన్నమయ్య వైష్ణవము

## విష్ణువు

"విష్ణోరిదం వైష్ణవమ్' అనెడి వ్యుత్పత్తిచే 'విష్ణు ప్రధాన ఆరాధన' వైష్ణవమని వ్యవహరింనబడుచున్నది [1]

వైష్ణవమే క్రీ.పూ. సాత్త్వతమని భాగవతమని వ్యవహరింపబడెడిది. [2]

'వి' అనగా విశేషము 'ష్ణు' అనగా వ్యాపించినవాడు కావున విష్ణువని పరాశరులు, 'విష్ణుః' విక్రమణాత్ అని వ్యాసులు, విశ్ ప్రవేశ్ ధాతువు బట్టి అంతట ప్రవేశించి ఉండేవాడని సత్యసంధ తీర్థుల వారు వ్యాఖ్యానించిరి. [3]

నిరాటంక జీవన స్రవంతికి దేవుడు జీవగఱ్ఱ. ఆ జీవన ప్రదాతయైన దేవుని ఆపద్బాంధవునిగా, అనాథ రక్షకునిగా, దీన శరణ్యునిగా వివిధ తలంపులతో వివిధ రీతులలో ఆరాధించెదము.

"కొలుతురు మిము.
వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని,
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మ మనుచు
తలంతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
అలర పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుడనుచు
సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశెనములు మిము నానా విధులను తలంపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్ప బుద్ధిఁ దలచిన వారికి నల్పంబవుదవు
గరిమల మిము నే ఘనమని తలంచిన ఘన బుద్ధులకు ఘనుఁడవు"

179 రేకు -2-393

ఈ ఆరాధన నందుకొను దేవుని మరువరాదని మనసున ప్రార్థించుచు అన్నమయ్య

దేవుని మరువకు మనసా
దీవెనై కలఁడు మాకు దేవుఁడు
అరుదగు జీవుని బ్రహ్మాండ గోళములోన
తెరఁగై పుట్టించువాఁడు దేవుఁడు

బలు సంసారములోన భ్రమసి యుండిన మాకు
దెలిపి చెప్పినవాఁడు దేవుఁడు
తెలియని కర్మములు తెగని బంధాలు వాసి
తిలకించి కాచువాఁడు దేవుఁడు (4-337) (రేకు 357)

అని సృష్టికర్తయైన దేవుడు ఎట్లు రక్షించునో వివరించెను.

"తల్లియై పోషించు తండ్రియై రక్షించు
వలపు బంధుఁడై వొడలరయు
మెల్లన దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్ల విధ బంధువుఁడు యీతఁడే పో విష్ణుడు
యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధి చెప్పు
చాలు మానిసియై యంచల దిరుగు
బాలుఁడై ముద్దు చూపు ప్రాణమై లోన నుండు
యీలాగుల బంధుఁడీతఁడే పో విష్ణుఁడు
దేవుఁడై పూజగొను దృష్టి గోచరమై
శ్రీ వేంకటాద్రి మీఁద సిరులొసగు" (2-417)

దేవుడిట్లు రక్షించుచును మానవ భావనల కనుగుణముగా ఎట్టు ఫలదాత యగునో గూడ తెలిపెను.

ఏ రీతినెవ్వరు నిన్ను నెట్టు భావించినను
వారి వారి పాలికి వరదుఁడ వౌదువు
చేరికొల్చినవారికిఁ జేపట్టు గుంచమవు
కోరి నుతించిన వారి కొంగుపైడివి
మేరతో దలఁచు వారి మేటి నిధానమవు
సారపు వివేకులకు సచ్చిదానందుడవు
కావలననే వారికి కామధేనువు మరి
సేవసేసే వారికి చింతామణివి
నీవేగ తెన్ను వారికి నిఖిల రక్షకుఁడవు
వావిరి శరణు వేడే వారి భాగ్యరాశివి
నిన్నుఁబూజించే వారి నిజపరతత్త్వమవు
యిన్నిటా నీ దాసులకు నేలికవు

యెన్నఁగ శ్రీ వేంకటేశ యిహపరములుకును
పన్ని కాచుకున్న వారి ఫలదాయకుఁడవు (2-72)

ఇట్లు అన్నమయ్య స్తుతించెను. ఈ విష్ణుస్తుతి వేదకాలమున ప్రారంభమై కాలాను గుణముగా వృద్ధి చెంది పరతత్త్వ స్థానము నలంకరించెను.

"అన్నిచోట్లఁబరమాత్మ నీవు
యిన్ని రూపుల భ్రమయింతువుగా
పాలజలధి నుండి బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁబ్రయాగ నుండి
భూలోక నిధివై పురుషోత్తము నుండి
వేల సంఖ్యల రూపై విచ్చేతుగా
పుత్తర మధురలో నయోధ్య లోపల నుండి
సత్తైన నందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను
కైవల్యము నుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీ వేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా" 45 రేకు (1-278)

అని పరతత్త్వమైన విష్ణువు భూలోకోద్ధరణకై ఆలయములలో ఆరాధనలందుకొన వేంక టాద్రిపై వచ్చి నెలకొనెనని వివరించెను.

క్షీరాబ్ధి నుండి విష్ణువు బదరీ వనమున నారాయణుడై, ఉత్తర మధుర నంద వ్రజమున వాసుదేవుడై, అయోధ్య రాముడై కలియుగమున వేంకటాద్రిపై నెలకొనెను. లోకపావనుడైన విష్ణువు యొక్క క్రమ వికాసములను సునిశితముగా పరిశీలించుచు అన్నమయ్య వైష్ణవ భావములను గమనించెదము.

## వేదములలో విష్ణువు ప్రశంస

"అనంతా వై వేదాః" అని కీర్తినొందిన వేదములు భారతదేశ సనాతన ధర్మమునకు ప్రధాన ప్రప్రథమ ప్రమాణములు. ప్రప్రథమ ప్రమాణ వేదములలో "విష్ణు" ప్రశంస పరిశీలనార్హము.

ఋగ్వేదమున ఇంద్రుడు, పర్జన్యుడు, సూర్యుడు, యముడు, అగ్ని, సోముడు, వరుణుడు, మిత్రుడు, విష్ణువు, సవిత, పూషుడు, ఆదిత్యులు మున్నగు దేవతల ప్రశంస లనేకములు కలవు. ఋగ్వేదము పది మండలములుగా విభజింపబడినది. ఆ పది మండలములు ఒక్కొక్కటి కొన్ని సూక్తములుగా చెప్పబడినవి. ఒక్కొక్క 'సూక్తం' కొన్ని ఋక్కుల సముదాయము. కొన్ని సూక్తులలో ఋక్కులన్నింటికి అధి దేవత ఒక్కరే. మరికొన్ని సూక్తులలో ఋక్కులకు అధిదేవతలు విడివిడిగా వర్ణింపబడిరి. ఉదాహరణకు

'పురుష సూక్త'ంలో నున్న ఋక్కులన్నింటికిని అధిదేవత విశ్వమును సృష్టించిన పురుషుడు ఒక్కడే.

ఋగ్వేదమున గల 'విష్ణు' దేవతా స్తుతులలో విష్ణువు మూడు స్థలములలో పాదమును మోపుట తరచు చెప్పబడినది. [4] ఈ స్తుతి అతి ముఖ్య విశేషణముగా కొని యాడబడినది.

"యీతఁడే యసుర బాధలన్నియుఁబరిహరించె
నీతని మూఁడడుగులచే యీ లోకాలు
యీతఁడే అంతర్యామి యీచరాచరములకు
నీతఁడే శ్రీ వేంకటేశుఁడిహ పరసాధనము" (2-470)

బృహచ్ఛరీర = పెద్ద శరీరముగల వాడని, కుమార = బాలుడు కాని యువకుడని, ఉరుగాయ = గొప్ప గమనము గలవాడని, ఉరుక్రమ ః పెద్ద అడుగులు వేయువాడని విశేషణములు వర్ణింపబడినవి. [5]

అత్యున్నతమైన మూడవ పాదము మానవుల చూపు కసాధ్యమనియు, మూడు అడుగులలో సకల భువనము లిమిడి యున్నవని, మూడు అడుగులు వేయుటలో ధర్మమును పాటించెనని, విష్ణువు అత్యున్నత స్థితిని పండితులు స్వర్గమున కన్నువలె గాంచెదరని, తేనె యూట ఉండునని, ఆ అత్యున్నత స్థానము ప్రకాశవంతమైనదని, తన గుఱ్ఱములను (గుఱ్ఱములు రోజులుగా) నాలుగు నామములతో చక్రమును త్రిప్పు విధమున కదిలించునని అత్యున్నత పాదమే ఆయన ప్రత్యేక స్థానముగా భావించబడినది.

మానవ నివాసయోగ్యమైన భూమిని విష్ణువు ఆక్రమించెనని, మానవ జీవనమునకై లోకములను విస్తీర్ణము చేసెనని, "ఇంద్ర విష్ణువు" నామములు ద్వంద్వ సమాసము గాను, ఇరువురును చేరి వృత్రాసురుని సంహరించిరని, తొంబది తొమ్మిది పురములను నాశనము చేసిరని వివరణలు కలవు [6]

"నీ పాదమూలము నింగియు భువియు రసాతలము
నీ పాదమూలము నిఖిల జీవ పరిణామములు" 7-91

విష్ణువునకు వాహనము పక్షులకు రాజైన గరుడుడు! సుపర్ణుడు అగ్నివలె ప్రకాశించు వాడని చెప్పబడినది. విష్ణువు మాయా రూపములు ధరించువాడని ఆ రూపమును మా నుండి దాచవద్దని యుద్ధమున వివిధ అన్య రూపములనేకములు ధరించెడి మాయావిగా వర్ణనలు కలవు.

గర్భ రక్షకుడుగను, తదితర దేవతల మేలు చేయువాడు, అపకారము చేయని వాడు, దిగ్విజయుడు, భూమిని ఆకాశాదిగా భువనములను భరించు ఆధారుడనియు వర్ణింపబడెను. భూమిని పర్వతరూపముతో ధరించెనని సాయణుడు వ్యాఖ్యనిచ్చెను.(7)

ఒక సూక్తమున విష్ణువు 'గిరిక్షిత్ గిరిష్ఠా' పర్వతముపై నుండెడి వాడని విశేషణ ప్రయోగము కలదు. (8)

ఏమని తలచవచ్చు నిటువంటి నీ చిత్తము
దీమసాన నీ భావము తెలియదెవ్వరికి
రవిచంద్రగ్రహ తారకములకుఁదెరువు
వివరించనున్నదా నీవే యాధారము గాక
పవనునికి భువికి పదునాల్గు లోకముల
కవల వేరొక చోట నాధారమున్నదా
అనంత బ్రహ్మాండములకట్టే నీ రూపములకు
వెనుక ముందున్నదా నీవే యాధారముగాక
వినుతికెక్కిన శ్రీ వేంకటేశ నీకు నీవే
మనికైన యాధారము మఱి యెంచనున్నాదా (144వ రేకు)

సాయణుని వ్యాఖ్య ననుసరించి "విష్ణువు"నకు, పర్వతమునకేక రూపము వర్ణింప బడినది. ఈ భావమునే అన్నమయ్య

"కొండలనెక్కుడైన గురుతు శ్రీ వేంకటాద్రి
కొండరూపుదానే పో కోరిన మా దైవము" 10-109, 319 రేకు

ఇట్లు వర్ణించెను.

అత్యున్నతమైన మూడవ అడుగు పక్షులు ఎగిరి చేరుకొనుటకు గాని మానవులు చూచి తెలిసికొనుటకు గాని సాధ్యముకానిది.

"రెక్కలు గల పక్షికి రేసు తిమ్మటలేకాని
చక్క వైకుంతాన కెగయ సత్తువలేదు" (2-80)

ధనప్రాప్తి కొరకు విష్ణువు పూజింప బడెను [9] సిరులొసంగేటి శ్రీ వేంకటేశుడని అన్నమయ్య వర్ణించెను.

"తద్విష్ణోః పరమం పదమ్.

ఋచో అక్షరే పరమే వ్యోమాన్ యస్మిన్ దేవా"

అక్షర శబ్ద ప్రయోగము పరమాత్మ పరముగా ఋగ్వేదమున కలదు.

"అగపడు నేఁబది యక్షర పంక్తులు

నిగమ గోచరపు నీ మంత్రములే" అని అక్షర శబ్దరూపుడుగ వర్ణించెను అన్నమయ్య.

ఋగ్వేద వర్ణనల కనుగుణముగా 'విష్ణు' గొప్పతనమును నిట్లు అన్నమయ్య వర్ణించెను.

"పరమాత్ముఁడవునీవు పరంజ్యోతివి నీవు
యరవుగఁ గంటి వింటి నిదివో నీ రూపము
పెక్కు రోమకూపముల పెను బ్రహ్మండాల మోచే
వెక్కసపు నీకుఁద్ర్రివిక్రమాకృతియేమి
అక్కడ వేదశ్రుతి యత్యతిష్ఠద్దశాంగుల
మెక్కువయని పొగడీనిదివో నీ రూపము
అదె విశ్వతోముఖ యనంతమూర్తి'వని
యెందునుశ్రీ వేంకటేశ 'యేకో నారాయణ'
యిదెశ్రుతి వొగడీనిదివో నీ రూపము" రేకు 360 (4-350)

ఋగ్వేదమున 'భగ' దేవతా ప్రశంస చేయబడినది. ఈ 'భగ' శబ్దమునకు 'శ్రేయశ్శక్తి' అని అర్థము చెప్పబడినది. ఆ శక్తిగలవాడు, ఆశ్రయింపబడువాడు సాక్షాద్విష్ణువని అతడే క్రమమున భగవానుడని భావింపదొడఁగెను. ఆ విధమైన భగవదారాధనతో కూడిన మతమే భాగవత మతముగా రూపొందినది. భాగవతము వైష్ణవ మతముగా పరిణమించినది. (11)

మైత్రేయ ఉపనిషత్తునందు 'ఆహారమును' భగద్విష్ణువు'గా పేర్కొనబడినది. 'విష్ణువు' నకు 'భగవత్' విశేషణ ప్రయోగము ఇందు కానవచ్చును.

ఋగ్వేద వర్ణనల నాధారముగా గాని యజుర్వేద కాలము నాటికి 'విష్ణువు' 'పర్వతముల కధిపతి' యని నిర్ధారణ అయినది.

"విష్ణుః పర్వతానాం మరుతో గణానా
మధిపత యస్తే మాఉ వంతు (తై సం.)

యజుర్వేదము నందలి పంచమ కాండములో 'విష్ణువు' పరముడని 4వ కాండమందలి నాలుగవ ప్రశ్నాంతమున "అస్యేశానా జగతో విష్ణుపత్నీ" అని కలదు. విష్ణుపత్నియే నియంత్రియని తెలుపుచున్నది.

"సోऽ ధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః

పరమం పదమ్" అని కఠశాండిల్యోప నిషత్తులలో సత్ప్రవర్తన గల జీవుడు పరమాత్మ యైన విష్ణువు యొక్క స్థానమైన పరమపదమును పొందునని వ్యక్తీకరించబడినది (12)

ఋగ్వేదములోని అర్వాచీన సూక్తముగా చెప్పబడు 'పురుష సూక్తము' విష్ణువు నారాయణ నామ ఏకత్వ సూచన ప్రమాణముగా పండితులు పరిగణించుచున్నారు.

దేవతలు పురుషుని పశువుగా చేసి యజ్ఞముచేసిన సమయమున ఆయన శిరస్సు ఆకాశము మరియు స్వర్గముగాను, నాభి అంతరిక్షముగాను. పాదములు భూమిగా నుండి మనస్సు నుండి చంద్రుడు, కంటి నుండి సూర్యుడు, నోటి నుండి ఇంద్రుడు మరియు అగ్ని, ప్రాణము నుండి వాయువు, ముఖము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు పుట్టెనని "పురుష ఏ వేదగ్ం సర్వం యద్భూతం యచ్చభవ్యం' పుట్టినది పుట్టబోయెడిదంతయు పురుషుడని ఈ సూక్తమున సర్వవ్యాపకుడని వాచ్యముగా వివరింపబడినది.

అధర్వ వేదమునందును, ఉపనిషత్తుల యందు (ముండకోపనిషత్) ప్రపంచమే పురుషుడు అని సర్వ వ్యాపకత్వము ప్రతిపాదించబడినది.

"He is said to have (Shri, Bhudevi) and Lakshmi or Sri as His wives [13]

"హ్రీశ్చతే లక్ష్మీ శ్చపత్న్యౌ"

"జలధిదచ్చే నాఁడు సకల దేవతలుండ యెలమి నే దేవుడు జేరె నిందిరాదేవి"

అని అన్నమయ్య వర్ణించెను.

"This passage clearly states that the Supreme being has Lakshmi as His consort, by which we can conclude that He is none other than Vishnu Himself." Purusha Sukta is called the Rg. Veda Khila. (supplement of Rg. Veda) [14]

పురుషసూక్త భావానుగుణ అన్నమయ్య సంకీర్తన :

వొక్కక్క రోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు

ఉక్కు మీరి ధరించుక ఉన్నాఁడవట

నిక్కిన నీ రూపమెంతో నిన్నుఁగనుఁగొనుటెట్టు
అక్కజపు వేదముల కగోచరుడవు
యెన్నో శిరసులట యెన్నో పాదములట
కన్నులఁజూచుట యెట్టు కడగురుతందుకేది
అన్నిటా మునీంద్రుల కచింత్యుడవు
కోటి సూర్యులొక్క మాటే కూడా నుదయించినట్టు
గాటపు నీ తిరుమేని కాంతులట
పోటి దేవతలకెల్లాఁబొడవైనవాఁడవు 2.330

## బ్రాహ్మణములో విష్ణు ప్రశంస

బ్రాహ్మణ గ్రంథములలో విష్ణువు "యజ్ఞోవై విష్ణుః" అని యజ్ఞమే విష్ణువుగా కీర్తింప బడెను. "Brahmanas are prose portions which explain the Vedic mantras. They too form part of the Vedas. (15)

"The Satapatha Brahmana refers to a divinity called 'Narayana' who performed a pancaratra and became great."

శతపథ బ్రాహ్మణమున 'నారాయణ' శబ్దము ప్రప్రథమముగా కానవచ్చుచున్నది. 'Narayana is a non-vedic divinity mentioned for th first time in the passages of the Satapatha Brahmana'

నారాయణః నార+అయన అనెడి ద్విపదశబ్దము.

నార = collection of men నరులతో కూడినది.

అయన = విశ్రమించు స్థానము

వేద సాహిత్యమున 'అయన' అనగా 'మార్గ' మనెడి అర్థములో ప్రయోగింపబడినది.

"Narayana means the place where narasgo. In other words we may say that Narayana stands for the collective entity of man Nara for the individual". (16)

నరుడనగా పరమాత్మ. ఆ విధమైన ఆత్మచే పుట్టిన ఆకాశాది కార్యములు నారములు-ఆధారములు. వాటిని నివాసముగల స్వామి నారాయణుడని ఆదిశంకరుల భాష్యము.

ప్రళయ కాలములో జీవకోటికి గమ్య స్థానముగా ఒప్పునటువంటి స్వామి నారాయణుడని భావము.

"యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పివా
అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః"

కనిపించు వినిపించు ఈ జగత్తు లోపల, బయట నాయణుడు వ్యాపించియున్నాడు. నారములనగా ఉదకములు. అవి నివాస ముగా గల స్వామి నరుల ఆత్మలే నివాసముగా స్వామి నారాయణుడని పరాశరులు భావించిరి. నారః + ఆయనః = గుణములకు ఆశ్రయమైనవాడు. వేదములచే తెలిసికొన గలిగిన వాడు. నారం+అయనం = మానవులకు శరణ్యుడు, వాయువునకు ఆశ్రయ భూతుడు, ప్రళయ పయోధిశాయి, అని నారాయణ నామమునకు సత్యనాథులు వివరించిరి.[17]

భావములోన బాహ్యము నందున
గోవింద గోవింద యని కొలువవో మనసా.
హరియవతారములే యఖిల దేవతలు
హరిలో నివే బ్రహ్మాండములు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి యనవో మనసా
విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణునిఁ బొగడీ వేదములు
విష్ణు వొక్కఁడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా (3-561)

ఐతరేయ బ్రాహ్మణమున 'అగ్ని' దేవతలందరిలో తక్కువ వాడనియు 'విష్ణువు' గొప్పవాడనియు వారిరువురి నడుమ తక్కిన దేవతలు కలరని చెప్పబడినది.

కృష్ణ యజుర్వేదమున 'తత్కేశవాయ విద్మహే నారాయణాయ ధీమహీ తన్నో విష్ణుః ప్రచోదయాత్' అని విష్ణు గాయత్రి నుడవబడినది. అన్నమయ్య

"కింకదీరన దైవం కేశవాత్ప రమని
ఉంకువైన నాలో నీ వుపలివే
నమ్మిక శ్రీ వేంకటేశు నంటున నీ పాదాలే
నమ్మితి నేమియు నమ్మ నారాయణా" అని వర్ణించెను. 82 రేకు (న్యూ 2-395)

బృహదారణ్యకము, విష్ణ్వాధిక్యమును విపులముగా వర్ణించినది. స్వర్గద్వారమునకు విష్ణువు ప్రధానుడని గతించిన వారికి వాసము విష్ణుపదమని సూచించినది. "The earliest

evidence in favour of the identification of Narayana with Vishnu probably to be traced in the Bodhayana dharma sutra (5 B.C) [18]

బోధాయన ధర్మ సూత్రము గరుడుడు విష్ణువునకు 'నిత్యానపాయిని' యనగా (విడిచియుండని) విష్ణు ప్రత్యేకతను వర్ణించినది [19] దీనినే అన్నమయ్య ఇట్లు

"గరుడని నెక్కి ఘనరేవంతుడు
గరుడ కేతనము గల రథుడు
గరుడఁడే తనకును
గరిమనితఁడె ఘనగారుడము"

"Apart from these we do not have any thing to pointout the Supremacy of Vishnu in the Rg. Veda. Scholars are of the view that though there is nothing expressive of Visnu's supremacy in the Rg. Veda, What we have is enough to suggest His supremacy. Of special significance is the statement there is a spring of honey in Vishnu's highest abode, ' Honey is the another name of amrta [20]

తద్ విష్ణోః పరమపదే మధ్య ఉత్సః

"This suggests that Vishnu's place is the place of immortality which is called 'Moksha'. This is to state that Vishnu is the Supreme being because he who confers liberation can alone be the Highest Brahman." [21]

అళ్వారులు తమ పాశురములలో తేనెలూరు ప్రదేశముగా విష్ణు నివాసమును వర్ణించిరి. వేంకటాద్రి యందు 'తేనె'ను గూర్చియు వర్ణించిరి. [22]

కృష్ణ యజుర్వేద కాలము నాటికి విష్ణువు సృష్టి స్థితి లయకారకుడుగా వివరింప బడెను. అన్నమయ్య

"పరమేష్ఠి సేయు బ్రహ్మాండ సృష్టియు
హరునిలోని సంహారశక్తి
పరగఁగ నింద్రుని పరిపాలనమును
అరసిచూడ "శ్రీహరి మహిమ" 2.345 అని వర్ణించెను.

శుక్ల యజుర్వేదమున విష్ణు పారమ్యము చక్కగా విపులీకరింపబడినది.

విష్ణువు సూర్య మండల మధ్యమున వాసము చేయుచున్నాడని, భూమిని వరాహావతారముగా పైకెత్తెనని, అగ్ని, వాయు ఇతర దేవతలు 'విష్ణువు' ఆజ్ఞలను శిరసావహించెదరని వర్ణనలు కలవు.

పరగఁగ నింద్రుని పరిపాలనమును

అరసి చూడ శ్రీహరి మహిమ

యిలఁబంచ భూతములలో గుణములు

అల నవగ్రహ విహారములు

తలకొను కాలత్రయ ధర్మంబును

అలరఁగ నారాయణుని మహిమలే 2.345

అని పై వర్ణనల కనుగుణముగా అన్నమయ్య వర్ణించెను.

ఆనాటి స్థితి 'చరిత్ర'లో ఈ క్రింది విధముగా విపులీకరించబడినది.

"Vedic Aryans did not satisfy the religious spirit of all sections of the people. This lead to religious speculation of a different type and thinkers like the authors of Mundakopanishad began to question the value and efficacy of sacrifice. This philosophical speculations of this age gave rise among other religious sects like those Vardhamana of Jain, Siddhartha of Sakhya, Vasudeva of vrsnis. (all three favouring the doctrinerof Ahimsa as well as the Philosophical ideas clothed in the words of the Upanishads)

At the beginning the following of these three was meagre but their systems gradually became prominent." [23]

ఈ విధముగా ఈ కాలము నాటికి (ఉపనిషత్తుల) వేద విష్ణువు, నారాయణుడు వాసుదేవుడు ముప్పురు ఏకమైరి.

The earliest account of Vasudeva, the great teacher is found in the chandogyopanishad where he represented as the son of Devaki and pupil of Rsi Ghora Angirasa. He was a teacher of Yadava tribe, which was famous in the age of the Brahmanas : ఇందు చెప్పబడిన వాసుదేవ కృష్ణుడు క్రీ.పూ. 6వ శతాబద్దము నాటికే గొప్ప కీర్తి కలిగియుండెనని విశదమగుచున్నది. [24]

"Vishnu's supremacy is established in a few Upanishads like the Subala and the Mahanaraayana Upanishad.

"'ఏకో హవై నారాయణ ఆసీత్

న బ్రహ్మ న ఈశానః. [25]

అతఁడే యెక్కుడు దైవమందరి కంటే

తతినింకాఁజెప్పి చూప దైవాలు గలవా."

అలగజేంద్రుడు మూలమని మొరవెట్టునాఁడు
తెలియనే దేవుఁడు విచ్చేసి కాచెను. (11.92) (2.475)

తైత్తిరీయ అరణ్యక మందలి నారాయణోపనిషత్తు'నందు'నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహీ తన్నో విష్ణు ప్రచోదయాత్" అనునది విష్ణుః గాయత్రిగా పేర్కొనబడినది.

[In which Narayana, Vasudeva, Vishnu are regarded as one and the same deity] (26)

తైత్తిరీయ సంహితలో రక్షించుట, రక్షించుట యందు అతనికి గల ఆతురత గుణ విశేషమును, ఆతని పేరున యజ్ఞములు చేసిన 'ఇష్ట కామ్యములు నెరవేరునని అతని నామ మాహత్మ్యము వెల్లడించబడినవి.

"ఉన్న మంత్రాలిందు సరివొగి విచారించుకొంటే
విన్న కన్నవారి కెల్ల విష్ణు నామ మంత్రము
పరగఁ బుచ్చుకాయల బరసిపోదు మంత్రము
గరిమ ముట్టంటులేని ఘనమంత్రము
వరుస నెవ్వరు విన్నా వాఁడిచెడని మంత్రము
అరయ నిదొక్కటే ఓ హరి నామ మంత్రము
యిహముఁబరముఁ దానే యియ్యజాలిన మంత్రము
సహజమై వేదాల సార మంత్రము
బహునారదాదులెల్ల పాట పాడిన మంత్రము
విహితమయిన శ్రీ వేంకటేశు మంత్రము -136 రేకు 2-153

అని అన్నమయ్య వాక్కు.

విష్ణుపారమ్య ప్రతిపాదన వికాసమునకు వేదము పిమ్మట ఇతిహాసములు తోడ్పడి విశిష్ట స్థానము పొందినవి.

## ఇతిహాసములలో విష్ణు ప్రశంస

వాల్మీకి పుత్రకామేష్టి సందర్భమున విష్ణువు దేవతల ననుగ్రహించునప్పుడు శ్రీరాముడు జటాయువునకు మోక్షప్రదాన మొసంగినపుడు, రావణ సంహారానంతరము బ్రహ్మాదుల స్తుతియందును 'విష్ణు' ప్రాశస్త్యమును సూచించె"నని పండితులుదాహరించుచున్నారు. (27)

బాలకాండలో శివ, విష్ణువుల గొప్పతనమును గూర్చి పరశురాముడు శ్రీరామునితో వివరించు సందర్భమున

"జృంభితం తద్ ధనుః దృష్ట్వాశైవం విష్ణు పరాక్రమైః
అధికమ్మేనిరె విష్ణుం దేవాః గణాః తదా"

"It is said that when the Gods wanted to know who is stronger of the two, Vishnu by a mere 'humkara' made Siva motionless. Then all the assembled Gods and sages considered Vishnu as the Supreme."

జటాయువునకు మోక్షమొసంగిన ఘట్టము.

"అనుజానామి తే సౌమ్యాగచ్ఛా లోకాన్ అనుత్తమాన్"

"My friend, I permit you to go to upper regions to attain moksha." If Rama were an ordinarry mortal, he could not have made the above statement.

సప్తతాళ వృక్షములను నేలగూల్చుట మున్నగు సంఘటనలను విష్ణు పరతత్త్వ మను బోధించు ప్రమాణములుగా గ్రహించుచున్నారు [28]

మహాభారతమున రామాయణ గాధను ప్రస్తావన చేయుటను బట్టి ఆ కాలమునకే రామాయణ గాథ జనశ్రుతిలో చక్కని స్థానము పొందియున్నదనుట స్పష్టీకరించుచున్న దని బలరామమూర్తి గారి అభిప్రాయము. [29] అన్నమయ్య ఇట్లు కీర్తించెను.

నరుఁడా యితఁడు ఆదినారాయణుడు గాక
ధరణిఁగీరితికెక్కె దశరథ సుతుఁడు 2.497

మహాభారతమున కృష్ణ రాయబార ఘట్టము, విశ్వరూప సందర్శనము, ద్రౌపది వస్త్రాపహరణ సమయమున కృష్ణుడు "అక్షయ వస్త్ర ప్రదానము" భగవద్గీత బోధ (11.3.93), 18వ అధ్యాయమున ప్రపత్తి యోగ బోధ, విష్ణు పరతత్త్వ ప్రమాణములు.

"In the Sabhaparva is narrated the story of how Sisupala's soul enters the person of Sri Krisna in the presence of all the assembled kings" [30]

"Mahabharata generally speaks of the deity as Narayana the application of his other name 'Vishnu' being comparitively rare" [31]

The Mahabharata is of importance for the history of Vaisnavism for it is the earlier" work indicating the rise of devotional cults and giving a sectarian account of the Vaishnavaite divinities Vasudeva, Krishna, Narayana and Vishnu. Recent researchers have revealed that the great epic of India is not patchwork, or a mortely assortment of hetrogenous harmonious work having an organic unity and a conscious design" అని సువీర్ జస్వాల్ తన గ్రంథమున అనేకాభిప్రాయముల సారాంశమును వెల్లడించిరి. [32]

ఈ వివిధ అభిప్రాయములకు నిదర్శనముగా నేమో నేటి ఉత్తరప్రదేశ్‌లో నైమిశార ణ్యమున 'సూత' ఆశ్రమము నేటికిని కలదు. మహా భారతమును బోధించన ప్రదేశమిది. ఆ పక్కన గోమతీ నదీ తీరమున 'వ్యాస' ఆశ్రమమున వారు చెప్పగా 'గణపతి' అదే పనిగా వ్రాయుచున్నట్లు శిల్పమొకటి యున్నదని ఆ శిల్పము క్రీ.పూ. 1000 నాటిదని, వ్యాసుడనగా ఒక వ్యక్తి కాదని అదొక వంశమని, సూతుడు గణపతి అనగా కొందరు భారతమును చెప్పగా కొందరు గణపతులు దానిని గ్రంథస్థము చేయగా కొందరు సూతులు ఆ గాథలను గానముచేసి యుండవచ్చునని చెప్పుట కనువుగా కలదనిరి.

అశోకుని నాటి శాసనముల కంటే ఎనిమిది వందల సంవత్సరములకు పూర్వమే లిపి జ్ఞానము కలిగిన గణపతులుండెడివారని స్పష్టమగుచున్నది. ఇంకను క్రీ.పూ. 8వ శతాబ్దములో మొదటి మారుగా ఇనుమును బీహార్ గనుల నుండి వెలికి తీసెడి విద్యను భారతీయులు నేర్చిరని, శిల్పవృత్తికవసరమైన సర్వ ఆయుధ పరికరములు సమృద్ధిగా రాసాగెనని, బుద్ధ యుగము పిదప అంతట వ్యాపించెనని, వేదకాలము నుండి స్మృతి యుగము వరకు భారతదేశ సహజ చరిత్ర ఇప్పటికిని అంధకారమని వివరించిరి. మహా భారత యుద్ధము దాదాపు వాస్తవ చారిత్రక గాథ క్రీ.పూ. 1400-1200 మధ్య కాలమున జరిగినదని, ఆ యుద్ధమున ఉత్తరాదిన నున్న చంద్ర సూర్య వంశములన్నియు పాల్గొని నశించినవని పిమ్మట నాగవంశము వారు, తక్షకులు, తదితర శాఖలు పాలన చేసిరనియు వివరణలు తెలియుచున్నవి [33]

మహాభారతము వాసుదేవ మాహాత్మ్యమును చక్కగా చాటిన గ్రంథము. ఈ గ్రంథము 'నారాయణం నమస్కృత్య' అని ప్రారంభించబడినది. కృష్ణావతార మహిమ సర్వాంతర్యా మిత్వమును ఉత్కృష్ట స్థితిని ఈ కాలముననే పొందినవి. నారాయణీయ భగవద్గీత ప్రకరణ ములు శ్రీవైష్ణవమునకు పట్టుకొమ్మలై నిలిచినవి.

"Mahabharata and the Puranas usually identify Vasudeva Krishna of the Satvata family with the higher God and represent Him as the founder of the religion characterized by Bhakti and called the Bhagavatha Satvata or Viasnava dharma. [34]

కురుక్షేత్ర సంగ్రామమున పార్థునకు పార్థసారథి భగవానుడే గీతోపదేశమున స్వయముగా వెల్లడించిన విషయములు వైష్ణవులకు శిరోధార్యములు. అన్నమయ్య.

"భూమిలోను చొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల
దీమసాననే మోచేటి దేవుఁడనేను

కావించి సస్యములు గలిగించి చంద్రుడనై
తేమల బండించేటి దేవుఁడనేను
దీపనాగ్నినై జీవదేహముల యన్నములు
తీపుల నరగించేటి దేవుఁడ నేను
యేపున నిందరిలోని హృదయములోన నుందు
దీపింతుఁదలఁపు మరపై దేవుండ నేను
వేదములన్నిటి చేతా వేదాంత వేత్తలచేతా
ఆది నేనెరఁగఁ దగిన యాదేవుఁడను
శ్రీదేవితోఁగూడి శ్రీ వేంకటాద్రి మీద
పాదైన దేవుఁడను భావించ నేను" (2-438)
"పరమ పురుషుఁడీ బాలుడట
హరవిరుంచులు మొక్కే రదివోవాకిటను." (2-509)

అని వర్ణించెను.

## పురాణములలో విష్ణువు ప్రశంస

పురాణములలో శ్రీవైష్ణవులకు ప్రముఖ పురాణము విష్ణుపురాణము. పరాశరుల వారు 'శ్రీ'తో కూడిన విష్ణువు యొక్క పరతత్త్వమును విశదముగా చాటిరి.

"రాఘవత్వే అభివత్ సీతా, రుక్మిణీ కృష్ణ జన్మని
అనయేషుచ అవతారేషు(ఘ) విష్ణో ఇశా అనపాయినీ

విష్ణువు శ్రీరామునిగా అవతరించిన ఆమె సీతగాను, కృష్ణునిగా అవతరించిన రుక్మిణిగాను, విష్ణువును విడువనిదిగా 'అనపాయినీ' అని వర్ణించిరి. (35)

త్రిమూర్తులలో గొప్పవాడని విష్ణువు అవతారముగా మాత్రమే కాక శ్రీకృష్ణుడే పరతత్త్వముగా చిత్రీకరించెను.

"ఏతేచ అంశాకతాః విష్ణోః కృష్ణస్తు భగవాన్"

స్వయం కృష్ణుడే భగవానుడని వర్ణించెను.

కృష్ణ భగవానుడు జ్ఞానశక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజో గుణములతో కూడియున్నాడని వర్ణించిరి.

ధ్రువ, ప్రహ్లాద, గజేంద్రుల చరిత్ర విష్ణు పరత్వ ప్రమాణములే.

భాగవత దశమస్కంధము కృష్ణ కథ పూరణమైనది. భాగవత భక్తుల నుతులతోడి అన్నమయ్య సంకీర్తన

అతి సులభంబిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతి లేదిదియే నిత్యానందము బహు వేదంబులే యివే సాక్షి
వేసరకుమీ జీవుఁడా వెదకి వెదకి దైవమును
ఆసపాటుగా హరియున్నాడిదె అందుకు బ్రహ్లాదుఁడు సాక్షి
మోసపోకుమా జన్మమా ముంచిన యనుమానములను
సేసిన భక్తికిఁజేటులేదు యీ సేఁతకెల్ల ధ్రువుఁడే సాక్షి
మరిగి వుండుమీ వోజిహ్వా మరి శ్రీ వేంకటపతి నుతులు
అరయఁగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులె సాక్షి
తిరుగకు మీ విజ్ఞానమా ద్రిష్టపు మాయలకును లోఁగి
సరిలేదితని పాదసేవకును సనకాదుల బ్రదుకే సాక్షి (రేకు 107) (2-41)
నాలుగువేదాల బ్రహ్మావలి నెవ్వని సుతుండు
వాలిన పురాణాల వ్యాసుఁడెవ్వని దాసుడు
లీల రామాయణపు వాల్మీకి వశిష్ఠులు
ఆలకించెవ్వని గొల్చిఁరాతఁడే పొదేవుఁడు (2-404)

ఋగ్వేదము నందలి "తేనపాసి గుహ్యం నామ గోనాం" గోవులను రక్షించునని "యత్రగావో భూరి శృంగా అయాసః" పెద్ద కొమ్ములు కలిగి వేగముగా కదిలే గోవులుండునని భక్తులు ఆ స్థానమును చేరుకొనవలెనని ఆశించెరని వర్ణనలు కలవు. [36]

పై వర్ణనలను సూచన ప్రాయముగా భాగవతాది పురాణములలో గోపాలకృష్ణుని చిత్రించిరేమోనని ఊహించుట కవకాశమును కలుగజేయుచున్నది.

వాసుదేవుడు ప్రధానముగా గల వైష్ణవ మతము మొట్టమొదట ఆంధ్ర శాతవాహనుల కాలమున దక్షిణా పథమునకు వచ్చినట్లు కానవచ్చును. [37]

యజ్ఞములను గురించి వర్ణించు, నానాఘాట్ శాసనము 'వాసుదేవ'తో ప్రారంభించ బడినది. కర్మ, భక్తి మార్గముల సమన్వయమునకీ శాసనమొక ఆధారముగా వ్యవహరింప బడుచున్నది.

శాతవాహన కాలముననే తమిళ చరిత్రలోని సంగం యుగము ప్రసిద్ధి చెందినది. తమిళ వాఙ్మయ చరిత్రను బట్టి క్రీ.శ. 2వ శతాబ్దమునకు పూర్వము అమలులోనున్నట్లు

తెలియుచున్నది. ప్రేమ, శౌర్యమునకు సంబంధించిన విషయములు విశేషముగా చెప్పబడినవి. వృక్షములు, అరణ్యములు, పర్వతములను గురించిన వర్ణనలు నాటి సాహిత్యములో కానవచ్చును. తమిళ భూభాగ ప్రదేశము జల వాయువులకు సంబంధించిన స్థితిగతుల ననుసరించి నాలుగు భాగములుగా విభజింపబడినది. ఈ విధానము వైదిక కాలము నాటిదనుటకు నిదర్శనము 'తొల్ కాప్పియ' గ్రంథమున 'పొరులధికార ప్రకరణ మున' అగత్తినై భాగమున భూభాగ పరిరక్షణ దేవతలు నియమింపబడిరి, (38)

అరణ్య ప్రాంతమునకు ముల్లై ప్రదేశమునకు అధి దేవత 'మాయోన్' అనగా శ్యామ వర్ణము గల తిరుమాల్. వేదములలోని విష్ణువు "తిరుమాల్"గా వర్ణింపబడెను.

## సంగం నాటి వర్ణనలలో 'విష్ణు' వర్ణనలు

తొల్ కాప్పియమ్ (అగం సూ. 5) ముల్లై ప్రాంతమునకు అధిదేవతగా విష్ణువు (మాయోన్) పేరు నుట్టంకించెను [39]

తొల్ కాప్పియర్ అను గ్రంథకర్త పిదప సేవికలార్ అను కవి 'పెరియ పురాణ' గ్రంథమున విష్ణు మహిమలను స్తుతించెను.

'తిరుమాల్' మానవులకు మాత్రమే కాక సకల జీవరాశులను సంరక్షింపగల వాడని విశదపరచినది. 'సర్వ వ్యాపి నారాయణ' అను అర్థమున 'తిరుమాల్' శబ్దము ప్రయో గింపబడినది. [40]

ఈ లక్షణకర్త 'పులనిలై' కవితా లక్షణములను వివరించుచు ఉత్తముడైన రాజును 'తిరుమాల్'తో ఉల్లేఖించెను.

ముల్లై అరణ్య ప్రదేశపు గొల్లలు తిరుమాల్ యందు తమ భర్తలపై నున్న అనురాగమును పోలునట్టి ప్రేమను కలిగియుండెడి వారని చెప్పబడినది. [41]

పై వివరణలను బట్టి 'తాల్ కాప్పియ' లక్షణ గ్రంథ కాలము నాటికే (క్రీ.పూ. 5వ శ॥) తిరుమాల్ గాథలు ప్రఖ్యాతములనుట స్పష్టమగుచున్నది.

'నట్రినై' అనెడి ప్రాచీన తమిళ కావ్యమున విష్ణు సంబంధ వివిధ గాథలు విస్తరింప బడినవి. సర్వం విష్ణుమయం జగత్ అనెడి సూక్తి ననుసరించి విశ్వమును తిరుమాల్ గను, 'తిరుమాల్'ను విశ్వముగాను దర్శించి రచించెను. [42]

'కపిలర్' ప్రకృతి సౌందర్యమున విష్ణువును గాంచెను. 'ఉల్లోచనర్' శ్యామవర్ణము గల పర్వత సౌందర్యముగా స్వామిని కీర్తించెను. 'కాయా' అనబడు ఒకానొక పుష్ప విశే షమునను, నీలగగనము నందును, సముద్ర తరంగముల యందును 'తిరుమాల్'గాను కొనియాడెను.

'తిరుమాల్' మహిమలను కథల రూపమున కీర్తించెడి వారనుటకు 'నట్రినై' కావ్యము నుదాహరణముగా నుడువ వచ్చును. చేర రాజ్యమున తిరుమాల్ అర్చన గూర్చిన వివరణలు "పదిట్రు పాట్టు" కావ్యమున 'నక్కీరర్' అను కవి 'పురనానూర్' కావ్యమున బలరామునకు అనుజుడైన కృష్ణుడు 'కణ్ణన్' శరీరము నీలమణి కాంతివలె విలసిల్లు చున్నదనియు, అతడే తిరుమాల్‌గా సంభావింపదగిన వాడనియు అభివర్ణించెను. కృష్ణుడే విష్ణువని పేర్కొనెను.(43)

కృష్ణ మహిమలను వర్ణించుచు దేవదానవులకు యుద్ధము సంభవించిన సమయమున పగటి కాలమున కూడా చీకటి వ్యాపించుటకై అసురులు సూర్యుని కప్పివేసిరనియు అపుడు భూమండల మంతయు అంధకార బంధురమాయెనని ప్రజలు ఆ అంధకారమునకు భయభ్రాంతులైరని ఆ తరుణమున నీలవర్ణ కృష్ణుడు జగత్కల్యా ణమునకై మరియొక సూర్యుని సృషించి ప్రజలనానంద పరిచెనని వర్ణన కలదు. (44) అసురులు చేసిన కార్యమును పగలు రేయిగా జేసెనని వివరించెను.

ప్రళయ కాలమున విష్ణువు వటపత్ర శాయి రూప వర్ణన నక్కీరర్‌చే వర్ణింప బడినది.(45)
అన్నమయ్య సంకీర్తన :

"పువ్వువంటి మఱ్ఱియాకు తొట్టి పవ్వళించనేర్చె
యెవ్వరిదో కాని తొల్లి యీ బాలుఁడు
ముప్వంక వేదములను ముద్దు మాటలాడ నేర్చె
యెవ్వరు కొంత నేర్ప నేటికి వీనికి" రేకు 178 (2-387)

శేషశాయి యగు విష్ణువు ఛత్రము, ఆసనము, దీపము వక్షఃస్థలమున వరలు రమాదేవి, నిత్య సుందరముల సమన్వయము వలె సంశోభిల్లుచున్నదని, అగ్నిచే సమావృతమైన పర్వతమే తిరుమాల్‌కు పీతాంబరమని ప్రకృతిలోని వివిధ వస్తు జాలమం తయు తిరుమాల్ కలంకారప్రాయములైన భూషణ సముదాయముగా 'పరిపాడల్' కావ్యము రమణీయముగా వర్ణించినది.

'కలిత్తొగై' కావ్యమున బాలకృష్ణుని లీలలు వర్ణింపబడినవి.

"చన్ను దాగి పూతనను సగ్గుడుగాఁజప్పరించె
మిన్నుదాఁకే సుడిగాలి మెడదొక్కెను
కొండవంటి పాము నోరు కొచ్చి కొచ్చి చంపి చంపి
మెండుకొని వుక్కణంచె మేనమామను" (11.2.70)

"పత్తుపాట్టు" కావ్య సంపుటములో 'పానాట్రుపడై' కావ్యమున తిరుమాల్ నాభి

నుండి బ్రహ్మ వెడలిన మహిమను కొనియాడెను. నల్లాదనర్ కవి తిరుమాల్‌కు సంబంధించిన లీలలు తనివితీర వర్ణించెను. ప్రాచీన సాహిత్యములో విష్ణువు 'పద్మనాభుడు' గాను 'మాయోన్'ను తిరుమాల్‌గను వివిధ రీతుల ప్రశంసలందుకొనెను. తిరుమాల్ వసించుకొండ 'వేంకటాద్రి'కి 'తిరుమల' యని పేరేర్పడి యుండవచ్చని ఊహించుట కవకాశమేర్పడుచున్నది.

సంగోత్తర కాలమున వెలువడిన శిలప్పదిగారము, మణిమేఖలై గ్రంథములలో కృష్ణ సంబంధ గాథలు, కురవై కూత్తు (నాట్యము) వర్ణింపబడినవి. ఆళ్వారుల రచనలలోను ఈ విధమైన వర్ణనలను గానవచ్చును.

మానవులను విష్ణుభక్తి అనెడి అగాధ నదిలో ముంచి ఉక్కిరి బిక్కిరి చేసిన పిదప కాపాడు వారగుటచే వీరికి 'ఆళ్వార్' అనెడి బిరుదు సార్థకమైనదని పెద్దల వచనము. విష్ణు ప్రతిపాదక కావ్య సంపుటియే 'దివ్య ప్రబంధము'లుగా వ్యవహరింప బడుచున్నవి.

## దివ్య ప్రబంధములలో విష్ణు ప్రశంస

పూదత్తాళ్వార్

"జ్ఞానచ్చుడర్విళ కేత్తినేన్ నారణర్కు జ్ఞాన తమిళ్ పునిందనాన్" అని భక్తిని ప్రమిదగా చేసి జ్ఞానదీపమును వెలిగించి నారాయణుని అర్చించెను.

పొయ్‌గై ఆళ్వార్ సూర్యునే వత్తిగా చేసిన దీపముతో స్వామి నర్చించెను.

పేయాళ్వార్లు స్వామిని 'శంఖ చక్రములతోను శ్రీతో కూడిన హరిని దర్శించి 'తిరుమాలే' నిన్ను నీ పాదములను సేవించితినని స్తోత్రము చేసెను.

పొయ్‌గై ఆళ్వార్లు "విష్ణువు"ను పెరుమాన్, నారణన్, నెడుమాల్, తిరుమాల్ ఎమ్బెరుమాన్ శెఙ్గణ్‌మాల్ పామ్బణైయాన్ (శేషసాయి) వేంగడవా అని సంబోధించి ప్రశంసించిరి. ఏనమాయ్, నరసింహుని, వామనుని కీర్తించిరి. ఏనమాయ్ అనగా వరాహమని భావము.

పూదత్తాళ్వార్ పాఱ్కడలాన్ (క్షీరాబ్ధి) వేంగడమును, నీణ్డ తిరుమాలే (వామనుని) వరాగత్తు (వరాహుని) మలర్‌మగల్ తోల్‌మాలే (శ్రీదేవి భుజ ముల వ్యామోహకుడా) 'కణ్ణనే' (శ్రీకృష్ణుడా)యని విష్ణువును కీర్తించిరి.

పేయాళ్వార్లు 'తిరుమాలే' నారాయణా వేంగడత్తానే (వేంకటాధిపతీ) వామననాయ్ అరియురుపుమ్ (నరసింహుని) గోపాలా, వరాహుని, ఆలిలైయిన్ మేలాన్ (వటపత్ర శాయి) యని అనేక రీతుల విష్ణు స్తుతి చేసిరి. తిరుమళిశై 'నాన్ముగం తిరువందాది' యందు మత్స్యమై

(22) నృసింహమై (21) కృష్ణుడై (16) వామనునిగా వటపత్ర శాయిని (17) వేంగడమని (34) శ్రీధరుడని (62) వరాహమై (70) పలురీతుల విష్ణువును ప్రస్తుతించిరి.

పన్నిద్దరాళ్వారులలో నమ్మాళ్వార్లు శరీరి, మిగిలిన ఆళ్వారులందురును శరీరమని వైష్ణవులు నుడివెదరు. వైష్ణవ సంప్రదాయమునకు మూలము 'ఆళ్వారుల సూక్తు'లనుట మరువరాని విషయము. నమ్మాళ్వార్లు చతుర్వేద సారముగా నాలుగు ప్రబంధములను నిబంధించిరి.

ఋగ్వేద సారము - తిరువిరుత్తం

యజుర్వేద సారము - తిరువాశిరియమ్

అధర్వణవేదము - పెరియ తిరువందాది

సామవేద సారము - తిరువాయ్‌మొళి

ఇంకను ఈ రచనలు ఛాందోగ్యోపనిషత్తు యొక్క వివరణమని ప్రసిద్ధము. 'తిరువాయ్‌మొళి'లో వైష్ణవమత సంబంధ ప్రధాన వివరణములైన అర్థ పంచకము వివరింపబడినది. ద్వయ మంత్రార్థ వివరణము కలదు. లక్ష్మీనారాయణ సేవ చేసిన విష్ణు సాయుజ్య మందగలమని వివరణగా తెలిపెను. 'పాశు'రమనగా 'శ్రావ్యమైన స్వరము' అని అర్థము. ఇంపయిన కవితయని భావము. [46]

## ఆచార్యులు-విష్ణుసేవ

"శ్రీహరికంటే రక్షకుడు మరొకరు లేరని భగవంతుడు మానవ రూపమున భూభార నివారణకై అవతరించెను. కార్య దీక్షతో కర్మ చేయుచు 'ఫలాపేక్ష వదలి' సర్వము కృష్ణార్పణమస్తు" అని తలచి భక్తితో శ్రీకృష్ణుని శరణువేడిన అనుగ్రహపాత్రులగుదురని సర్వము అతనికి చెందినదేనని, ఇతరుల కెంతమాత్రము సంబంధము లేదని దివ్య ప్రబంధముల సారాంశముగా భావించవచ్చును.

"The next land-mark in the history of Tamil Vaisanavism is the rise of a school of philosophers known as Acaryas." [47]

శ్రీ శఠకోపముని అనుగ్రహమును పొందిన శ్రీమన్నాథమునులు ద్రావిడ వేదములైన 'నాలాయిర పాశురము'లను నాలుగు వేదముల ననుసరించి వర్గీకరించి భగవదాలయములలో క్రమపద్ధతిలో అధ్యయన మొనరించు వ్యవస్థ నేర్పరచిరి. పెరియాళ్వారుల 'తిరుప్పల్లాండు'ను ఆ వేదములకు 'ఓం'కారస్థానములుగా నిలిపి, తిరుమంగై ఆళ్వారుల

షట్ప్రబంధములను ఉపాంగములుగా జేసి, ఆ రచనలను గానయోగ్యముగా చేసి కీళై అగత్తాన్, మేలై అగత్తాన్ అనువారలకు గానరూపమున బోధించి దివ్య దేశములలో ప్రచారము చేయుడని ఆజ్ఞాపించిరి.

ఆళ్వారులలో చివరివారైన తిరుమంగై ఆళ్వార్ శ్రీరంగనాథ ఆలయమునకు ప్రాకార ములను నిర్మించి రంగనాథునికి కైంకర్యము చేసిరి. నమ్మాళ్వార్ రచించిన 'తిరువాయ్ మొళి'ని శ్రీరంగ ఆలయమున పఠించు పద్ధతిని వీరు ప్రారంభించిరని కొందరి అభిప్రాయము.

శ్రీనాథమునుల పిమ్మట వారి పౌత్రుడు యామున మునీంద్రులు తాత్త్విక తారా మండలమున నొక యుజ్జ్వలమగు ధ్రువ నక్షత్రముగా ప్రకాశించెను. (48) భగవానుడు భువన సుందరమూర్తి యని వీరు ఉద్ఘాటించిరి. శ్రీ యామునా చార్యులవారి శిష్యులే తిరుమల నంబి, తిరుమల వేంకటేశుని సేవించిన వారిలో అగ్రగణ్యులు.

శ్రీ యామునా చార్యుల పిమ్మట శ్రీరామానుజాచార్యులు శ్రీరంగ ఆలయమున మఠాధిపతిగా ఆచార్య పదవి నలంకరించినంతనే మొదట ఆలయము, పరిసరములపై దృష్టిని కేంద్రీకరించిరి. శ్రీరంగ ఆలయము నుండి ప్రారంభించి అనేక దివ్య దేశములకు యాత్రచేసి ఆలయమును, మత వ్యాప్తి కేంద్రములుగ, సమాజమున ప్రత్యేకమైన స్థానమును కల్పించిరి. వసతులనేకములను ఏర్పరచిరి. ఉత్సవాదులను జరుపుటకు అనేక విధములుగా కృషి చేసిరి.

శ్రీ రామానుజుల ఈ సేవకు ప్రధానమైన కారకుడు కంచి వరదరాజస్వామి. తిరుక్కచ్చి నంబి అను భక్తుడు కంచి వరదునకు ప్రీతిపాత్రుడు. స్వామితో నంబి సంభాషించెడి వారని వైష్ణవ సాంప్రదాయము తెలుపుచున్నది. శ్రీరామానుజుల వారు తిరుక్కచ్చి నంబితో తమ ధర్మ సందేహములను గురించి వివరించి వాటి సమాధానము లను కంచి వరదునడిగి తెలుపుమనిరి. కంచి వరదుడు రామానుజల వారి ప్రశ్నల కుత్తరువు నిట్లిచ్చెను.

"పరతత్వమైన నేనే పరబ్రహ్మను
సకల జగత్తులకు నేనే ముఖ్య కారణుఁడను
ఆత్మ పరమాత్మల భేదము స్వతఃసిద్ధము
మోక్షాసక్తులకు ప్రపత్తియే మోక్షోపాయము
నా భక్తునకు అంతిమస్మరణతో నిమిత్తము లేదు.
దేహావసానమున నేను మోక్షమొసంగెదను" (49)

మహాత్ముడు పూర్ణార్యుని ఆశ్రయింపు"మని రామానుజుల కాజ్ఞాపించెను. ఆజ్ఞానుసారము

శ్రీరామానుజులు పూర్ణార్యుని వద్ద వైష్ణవ మత దీక్షను పొందెను. శ్రీ రామానుజుల వైష్ణవమత దీక్షకు కారకుడు కాంచీ వరదుడాయెను. వైష్ణవ మత ప్రచారమునకు శ్రీరంగనాధుని ఆలయము ప్రాపకమై నిలిచెను. అన్నమయ్య సంకీర్తన రచనకు తిరుమల ఆలయము స్వామి కారణమాయెను. రామానుజుల మత దీక్షకు కాంచీపురాలయ స్వామి వరదుడు కాగా, అన్నమయ్య వైష్ణవ మత దీక్షకు తిరుమల ఆలయ స్వామి, శ్రీ వేంకటేశుడు కారకుడాయెను. వీరి పూర్వాచార్యుల కాశ్రయము శ్రీరంగం రంగనాధాలయము, శ్రీరామానుజులు, వేదాంత దేశికాచార్యుల కాశ్రయము కంచి వరదరాజాలయము కాగా అటు పిమ్మట అన్నమాచార్యుల కాశ్రయమిచ్చిన తిరుమల ఆలయము వైష్ణవ మతవ్యాప్తికి కారణమై వైష్ణవ సంప్రదాయమున "త్రిరత్నము"లుగా శోభిల్లుచున్నవి.

బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణునకిచ్చె
బ్రహ్మణ్యుఁడీ రంగపతిఁగొలువరో
కావేరీ మధ్య రంగక్షేత్రమల్లదివో
శ్రీ విమాన మదిగో శేష పర్యంక మిదే
దేవుండల్లదేవాఁడే దేవిశ్రీలక్ష్మియదే
సేవించరో నాభిం జిగురించె నజుండు
ఏడు గోటలు నవిగోయెనఁగుపూదోపులవే
కూడి దామోదరపుర గోపురమదే
తోడ వేయిగంబాల దొడ్డ మంటపమదిగో
చూడరో పసిడి మించులకంబ మదిగో
ఆళువారలు వారే యంగరంగ విభవమదే
వాలు శ్రీ వైష్ణవపు జాడలవిగో
ఆలీల శ్రీ వేంకటేశుండై వరమిచ్చీని
తాలిముల శ్రీరంగ దైవముంగొలువరో" (2-131)
"తేరు వెంట వచ్చే వరదరాజులును
నరులార సేవించరే మన కోరికలు మీర"
అని కాంచీపుర వరద రాజుని సేవింపుమని కీర్తించిరి.

**తిరుమల : వేంకటేశ్వరుడు**

పరమాత్ముడు సర్వ పరిపూర్ణుఁడు. సురలకు నరులకు చోటయి యున్నాఁడు.

"వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై
పూవులు వాసనవలెఁబొంచి యున్నాఁడు
భావించ నిరాకారమై పట్టితే సాకారమై
శ్రీ వేంకటాద్రి మీఁద శ్రీపతై యున్నాఁడు (2.232)

శ్రీరంగము నుండి శ్రీ రామానుజాచార్యులు వైష్ణవ మత వ్యాప్తికై దివ్యదేశము లనేకములు దర్శించి అచటి అర్చామూర్తులైన పెరుమాళ్ళను సేవించిరి. శ్రీవైష్ణవ అర్చన సంప్రదాయముల నేర్పరచిరి.

శ్రీ రామానుజుల గొప్పతనము వైష్ణవమత చరిత్రలో చిరస్మరణీయమైనది.

"The temple festivals, the sect makers and the methods of life afforded ample opportunities for the democratization of Vaisnavism without violating the sacred institutions of Vedic Puritanism" He gave them a place in Vaisnavism by allowing them to wear sect marks, to dress themselves, like Vaisanavas to intiate their custom and habits and to study them (Vaisnavas) Prabandham.

No Vaisanava temple is considered perfect without his image, no festival proper without the celebrations of his greatness and no ceremonious occasion is adequately solemn without the invocation of his blessings and favour. [50]

శ్రీ రామానుజులు పరమపదించిన పిదప వైష్ణవ మతములో వడగల, తెంగల అనెడి ద్విశాఖలు 14వ శతాబ్దపు చివరి భాగమున ఏర్పడినవి. శ్రీరామానుజుల పిమ్మట వేదాంత, దేశికులు, మణవాళ మహామునులు విశిష్ట స్థానము నలంకరించిరి. వేదాంత దేశికాచార్యుల వారిని వేంకటేశ్వర 'ఆలయ గంట' అవతారమని వైష్ణవులు నుడివెదరు, వీరు శతగ్రంథముల కంటె అధికముగా రచనలు చేసిరి.

వేదాంత దేశికుల పిమ్మట 'ఆదివన్ శఠకోపు'లనెడి వారు అహోబిల మఠాధిపతు లుగా అధిష్ఠించి దేశికుల వారి బోధనలను ప్రచారము చేయసాగిరి. వారు 'లక్ష్మీ నృసింహస్వామి' దాసులుగా జీవింపదొడఁగిరి. వీరి పిమ్మట ఇతరులు 'ఆదివన్ శఠకోప ఆచార్య' పదవి నలకంరించ దొడగిరి. అన్నమాచార్యులు వివాహానంతరము వేదాంత దేశిక వేంకటాచార్యుని దివ్య సంప్రదాయముననువర్తించు శఠకోపముని వద్ద సకల వేదాంత పఠనము జేసెనని తెలియుచున్నది.

శ్రీ రామానుజ సాంప్రదాయము ననుసరించి మధ్వాచార్యులు శ్రీవైష్ణవ మతమును కర్ణాటక దేశమున ప్రచారము చేసిరి.

"The great movement of Vaisanava religious devotionalism, which began to spread and regenerate the masses during the middle ages had its origin (Dasakuta) inaugrated in the Karnataka in South India in 13 A.D. by Madhvacharya." (51)

ఈ దాసకూటము వారు 'పండరీపుర విఠలుని ప్రధాన దైవముగా భావించువారే శ్రీపాదరాయలు, పురందరదాసు, కనకదాసులవారు సామాన్యులకనువుగా అన్ని వర్గముల వారి కొరకు సులభరీతిలో రచనలు చేసిరి. కాని వ్యాసరాయలు, గోపాలదాసులు బ్రాహ్మ ణులకనువైన రీతిలో రచనలనుచేసిరి. ఈ కోవలో విజయదాసు, జగన్నాథదాసు పేర్కొన దగినవారు.

దాస సాహిత్యము మధ్వాచార్య శిష్యులైన నరహరితీర్థుల వారి నుండి ప్రారంభ మైనదనవచ్చును.

శ్రీరామానుజ, మధ్వాచార్యుల మార్గముననే 'నింబార్కుడు'ను భక్తి ప్రపత్తులకే ప్రాధాన్య మొసగి శ్రీరాధాకృష్ణార్చనమే ముఖ్యముగా గైకొని వైష్ణవమత ప్రచారము చేసెను.

రాధాకృష్ణ భక్తి ప్రధానమైన వైష్ణవ సంప్రదాయము ననువర్తింపజేసిన వారిలో వల్లభాచార్యుడతి ప్రసిద్ధుడు. శ్రీ వల్లభుల 'పుష్టి మార్గ' వైష్ణవము ఉత్తర దేశమునను గుజరాత్ మధ్యదేశములలో వ్యాప్తి నొందినది.

ఉత్తర భారతమున విస్తరిల్లిన వైష్ణవ శాఖలలో చెప్పదగినది రామానంద సాంప్రదాయము. ఇది 14వ శతాబ్దమున ప్రారంభమాయెను. వీరు ప్రవచించిన రామభక్తి సాంప్రదాయము-తులసీదాసాది కవులకు ప్రోద్బలమాయెను. ఈ సంప్రదాయమున 'కబీరు' అతి ముఖ్యులు.

శ్రీకృష్ణ చైతన్య మతము విశిష్టాద్వైత సిద్ధాంతము భాగవత సాంప్రదాయము యొక్క అడుగు జాడలలో సాగిన భక్తి శాఖ. ఈ సంప్రదాయము వంగ, అస్సాం, ఓఢ దేశములలో విస్తరించెను.

మహారాష్ట్ర దేశమున 'పాండురంగ క్షేత్రము' వైష్ణవమునకు ముఖ్య రంగము. విఠోబా శ్రీకృష్ణ భగవానుని అర్చామూర్తియే. ఈ సంప్రదాయ మూలాచార్యుడు పుండరీకుడే. విఠోబా, నామదేవ మున్నగువారు 13వ శతాబ్దమునకు చెందినవారు. రామభక్తి మార్గమును ప్రబోధించిన యోగి సమర్థ రామదాసు, భక్త తుకారాం ఈ సాంప్రదాయాను వర్తులే. శ్రీరామానుజ వైష్ణవ సంప్రదాయ మీవిధముగా క్రమాభివృద్ధిచెంది కొన్ని మార్పులతో చిరకాలముగా వర్ధిల్లసాగినది.

పిఞ్బళగియ పెరుమాళ్ జీయరు ఆచార్య పరంపరాను సంధాన సంప్రదాయమును మొట్టమొదట ప్రవేశపెట్టిరి. అటు పిమ్మట 'గురు పరంపర' రచనలనేకములు వచ్చినవి. శ్రీ అన్నమాచార్యులు శ్రీ రామానుజ మతము ననుసరించగా, వారి పౌత్రులు చిన్నన్న 'అన్నమాచార్య చరిత్ర' అనెడి ఆచార్య చరిత్రను రచించి శ్రీరామానుజ మత వైశిష్ట్యమును చాటిరేమో? నని అనిపించును. ఇంకను పెద్ద మనుమడు తనకు తాత అన్నమాచార్యులే గురువులై ఉపదేశము చేసిరని ఆచార్యునిట్లు కీర్తించెను.

"తాళ్ళపాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమె శ్రీహరిఁగనే వెరవానతిచ్చితివి
గురుడవు నీవే సుమ్మీ కుమతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము చేసితి
పరమ బంధుడవైనా పరికింప నీవే సుమ్మీ
వరుసనేఁజెడకుండా వహించుకొంటివి
ధాతవు నీవే సుమ్మీ తగు శ్రీ వేంకటనాథు
నా తలఁపులో నిలిపి నమ్మఁజేసితి.
యే తలఁజూచినా నేడు గడయు నీవే
ఆతల నీతల నన్ను నాయకొని కాచితి" వని చిన తిరుమలయ్య (పెద తిరుమలా చార్యుని పెద్ద కుమారుడు) తన తాతమైన అన్నమాచార్యుని "దైవమవు నీవు, హరినిగనే మార్గమును చూపితి'వని, ఆతని మూడవ తమ్ముడైన చిన్నన్న తన తాత జీవిత చరిత్రను 'అన్నమాచార్య చరిత్ర'యని ద్విపదలో రచించి ఆచార్య సేవను గావించి ఇహలోక మున, అన్నమయ్య చరిత్రను మనకిచ్చి వన్నెకెక్కెను.

ఆంధ్ర వాఙ్మయమున శాతవాహనరాజుల నామములందే కాక (శ్రీముఖుడు, కృష్ణుడు) శాసనారంభములందు వారి విష్ణు ప్రియత్వమును కానవచ్చును. నాటి ఆలయ పూజా ప్రశంస తొలి శాతవాహనుని గాథాసప్తశతిలో కానవచ్చును. భాగవత సంప్రదాయము కూడా అచట నుండినదనుటకు ఆధారము గూడా గాథాసప్తశతియే. శాతవాహనుల పిమ్మట ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పల్లవులు పరమ భాగవతులమని విష్ణువును పూజించెడివారమని తమ శాసనములలో ప్రకటించుకొనిరి. వారి శాసనములు విష్ణుస్తుతితో ప్రారంభమగుచున్నవి. సాలంకాయనుల ఆరాధ్యదైవము చిత్రరథస్వామి. విష్ణుకుండినుల కాలము నాటి మొగల్రాజపురమున ప్రధానాలయమునకు పశ్చిమమున

లక్ష్మీ విష్ణువుల విగ్రహములు కలవు. అట్లే కృష్ణకద్దరిని గల ఉండవల్లిలో అనంత శయనున కంకితమైన పెద్ద గుహాలయము గలదు. రెండవ అంతస్తు విష్ణువు కంకితమైనది. తూర్పు చాళుక్యుల రాజు నామము 'విష్ణువర్ధన' పేరున గలదు. క్రీ.శ. 11వ శతాబ్దాంతమున తెలుగు చోళులు పేరెన్నికగన్న పరమ వైష్ణవులు. ఈ తూర్పు చాళుక్యుల పిమ్మట కాకతీయ రెడ్డిరాజులు, విజయనగర రాజులును వైష్ణవమునందు అభిమానము చూపి పోషించి ఉద్ధరించినట్లు తెలియుచున్నది.[52] బాదామి చాళుక్యుల కాలము నాటి శాసనములలో పెక్కు వైష్ణవ సంబంధ విషయములు చెప్పబడినవి.

కాకతి గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు వారి సామంతులు విష్ణ్వాలయముల కెన్నియో దానధర్మములు చేసిరి. బాదామి చాళుక్యుల కాలము నాటి శాసనములలో శ్రీవల్లభ, శ్రీపృథ్వీ వల్లభ నామములే కాక "Om Namo Narayanaya" is found in an inscription of Vikramaditya (53). శాసనములలో గల అష్టాక్షరీ మంత్రము నాడు వైష్ణవమతము ప్రబలియున్నదనుటకు తార్కాణముగా నిలిచినది. విజయనగర సామ్రాజ్య కాలమునాటికి ప్రచారమధికమై సర్వత్రా వైష్ణవము భాసిల్లినది. తాళ్లపాక వంశస్థులు శ్రీ వేంకటేశ్వరానుగ్రహ లబ్ధులై, శ్రీవైష్ణవులై, వారొనరించిన వైష్ణవ సాహిత్య సేవ ఆనాటి వైష్ణవ ప్రాబల్యమునకు ప్రమాణము.

## అన్నమాచార్యులు-ఆగమములు

ఆలయ విష్ణ్వారాధనకు ఆగమములు ప్రమాణములు. భగవత్స్వరూపము పర, వ్యూహ, విభవ, అంత్యామి, అర్చారూపమున ఐదు స్థితులు గలవని ఆగమములు తొలిసారిగా నుడివినవి. ఈ భగవత్స్వరూపమును గురించి నమ్మాళ్వార్

''శెయ్యా పరత్వమాయ్ శీరల్ వ్యూహమాయె

తుయ్య విభవమాయ్ తోండ్రి వట్రుల్'' అనెడి పాశురములో ''అర్చావతారమ్ ఎళిదెన్ట్రాన్'' అర్చావతారమతి సులభమని వర్ణించిరి.

శ్రీ వచన భూషణమున 'పిళ్ళై లోకాచార్యులు ఆవర్ణజలం పోలె పరత్వం - పార్కడల్ పోలె వ్యూహంగళ్ పెరుక్కారు పోలె విభవంగళ్ - భూగడజలంపోలె అంతర్యామిత్వము అదిలే తేంగియ మడక్కల్ పోలే 'అర్చా'వతారమనిరి. పరత్వము, ఆవరించియున్న నీటి వంటిది. వ్యూహములు పాలసముద్రము వంటివి. అంతర్యామి భూగర్భము నుండి వచ్చిన నీటి వంటిది. మడుగులోని నీటి వంటిది. అర్చావతార స్వరూపమని భగవత్స్వరూప మును. వర్ణించిరి.[54]

"The existence of Vyuha doctrine has been traced by Agarwal and Banerjeo to the begining of 2 B.C. on the authority of Patanjali Maha bhashya."

"In The Narayaniya section of Mahabharata Vishnu explains to sage Narada that Avyakta presence is unknowable and that it becomes knowable when it assumes form adding further that this happens through His emanated succession of personified elements Vasudeva, Sankarshana, Pradyumna, Aniruddha respectively kshetrajna, Jeeva, Manas, Ahamkara" గుప్తుల నాటికి ఈ వ్యూహ సిద్ధాంతముగా మార్పులేర్పడెనని చరిత్రకారుల అభిప్రాయము.

"Vyuha aspects of the Lord met in a solidatary example from kondamotu in A.P. which will prove that the concept was popular both in North and South India during the beginning of Christian era" (55) పరస్వరూపము జ్ఞాన స్వరూపమని తోచును. వాసుదేవ సంకర్షణాది నాలుగు మూర్తులుగల విష్ణువు తన దేహమును నిర్మించుకొని సృష్టి, స్థితి లయ కార్యములను చేయుచుండెనని వ్యాసుల వారు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధమూర్తుల ఏకస్వరూపమునకు 'చతుర్వ్యూహః' అని పేరేర్పడినట్లు, శంకరులు జాగ్రత్, స్వప్న, సుషుప్తి తురీయ నాలుగు విధాన వ్యూహములుగా ఎవరికి గలవో ఆ స్వామి "చతుర్వ్యూహః" అని, పరాశరులు వాసుదేవాది నాలుగు ఆత్మలుగల స్వామి "చతుర్వ్యూహః" అని సత్య సంధులు "చతుర్వ్యూహము"లను వ్యాఖ్యానించిరి (56) **వాసుదేవుడు** : Vasudeva has all the six qualities పరవాసుదేవుడని కొనియాడబడెను. "వామన గోవింద విష్ణు వాసుదేవ హరికృష్ణ.

సంకర్షణ : ప్రళయ కాలమున జీవకోటి నంతటిని తనలోనికి ఆకర్షించుకొను స్వామిని 'సంకర్షణుడ'ని వివరించిరి. హరి సంకర్షణ, జనార్దన కేశవ సంకర్షణ (11.110) ప్రద్యుమ్నుడు విశిష్టమైన సంపదగల స్వామి ప్రద్యుమ్నుడని భౌతిక ఆధ్మాత్మిక సంపదలను స్వామి అనుగ్రహించునని శంకరులు ప్రకాశింపజేసికొనెడి పరమైశ్వర్యము కల స్వామి ప్రద్యుమ్నుడని పరాశరులు, కీర్తిగల స్వామి ప్రద్యుమ్నుడని సత్య సంధులు వివరించిరి.

"వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా 2.35

ఇదియెపో ప్రద్యుమ్న యిహపరసాధనము 11.110

**అనిరుద్ధ** : ఈ స్థితిలో స్వామి నెదుర్కొను టసాధ్యమని శంకరులు, భూలోకమున వసు భాండమనెడి క్షేత్రమున జనార్దన రూపముతో విలసిల్లెడి స్వామిని అనిరుద్ధుడని పరాశరులు,

నిరోధింప సాధ్యము కానివాడు మరియు గొప్ప ప్రఖ్యాతి గలవాడని సత్య సంధులు వ్యూహ నామములకు విష్ణు సహస్ర నామములో వ్యాఖ్యానించిరి. [57] అన్నమా చార్యులిట్లు సంకీర్తన చేసిరి.

"తెంకిక ననిరుద్ధని దెచ్చినయట్లు
వాడుదేరిం(గెమ్మోవి వాసుదేవుండా
లంక సాధించి సీతను లలి(జేకొనినయట్లు
అంకెల శ్రీ వేంకటేశ అట్టె నీ దాసులమని" 2.2.7

"వాడికలాయె నీ పొందు వాసుదేవుండా
వాలు చూపులు మావి వాసుదేవుండా మమ్ము
వాలాయించితివి నీవు వాసుదేవుండా
వాలారుగోళ నొత్తకు వాసుదేవుండా నీకు
వైళమే నవ్వు వచ్చును వాసుదేవుండా
వడదీరె శ్రీ వేంకట వాసుదేవుండా యేల
వడిసేవు తరితీపు వాసుదేవుండా
వడిగొనం గూడితివి వాసుదేవుండా మన
వడు నెవ్వరికి గద్దు వాసుదేవుండా" -15.249 44వ రేకు

"పంతము దప్పదు నీకు ప్రద్యుమ్నా వొక్క
బంతిం గూడేవు సతుల ప్రద్యుమ్నా
బలబలం దెల్లవారె ప్రద్యుమ్నా యింక
బలిమి సేయవచ్చేవు ప్రద్యుమ్నా
పలచనాయె శిగ్గులు ప్రద్యుమ్నా నీ
పలు సోకలవలెనె ప్రద్యుమ్నా
పచ్చలాయ కట్టేవు ప్రద్యుమ్నా
బచ్చెన ప్రియాలు చూపి ప్రద్యుమ్నా
బచ్చు చేరలగుటల ప్రద్యుమ్నా నీ
పచ్చడ మంటించేవు ప్రద్యుమ్నా" 15.250 44వ రేకు

"అంతా నీకులోన అనిరుద్ధా మన
యంతరంగ మొక్కటాయె ననిరుద్ధా

అడ్డమాడ బలము నీకనిరుద్ధా
అడ్డేడ మీనాడు బోడి యనిరుద్ధా
అడ్డువెట్టనింక నేల యనిరుద్ధా
అడ్డిక పెంచకు మీ యనిరుద్ధా
ఆయ మెరుగడు వోయి అనిరుద్ధా
ఆయెడ నుండి వచ్చితివనిరుద్ధా
ఆయతమై కూడితిని అనిరుద్ధా
ఆయనాయె శ్రీ వేంకట అనిరుద్ధా." -15-251 44రేకు

అని చతుర్వ్యూహములను గురించి సంకీర్తనలు చేసెను. పాంచరాత్రాగమాను సారము పై వ్యూహరూపములు వర్ణింపబడినవి. "The Vaikhanasa agama evolves the five fold conception of God Vishnu as Vishnu, Purusa, Satya, Acyuta and Aniruddha. These five are equated with the five "beras" in a Vishnu temple. Vishnu is all pervading and is said to reside in the Dhruva bera, Purana, Kautuka, Satya, Utsava, Acyuta, Snapana, Aniruddha, Bali. All the five are the requisites for a true arca form of God. Thus there are five "beras" in a Vishnu temple following the Vaikhanasa form of worship."(58).

"వినయము సేసేవు విష్ణుమూరితి నాతో
వెనుకటి వాడవేకా విష్ణు మూరితి
వినవయ్య మా మాట విష్ణుమూరితి మమ్ము
వెనుకొని పట్టకుమీ విష్ణు మూరితి" -15-241
"పొలసు లాడకు నీవు పురుషోత్తమా నీ
పొల జాణతనాలు పురుషోత్తమా
పులి సువేశిని చెంత పురుషోత్తమా మేము
పులుగరసితిమింత పురుషోత్తమా." -15.252
"అసలు చెరచకుమీ యచ్యుత
ఆ సుద్దులె యీ సుద్దులు అచ్యుతా
ఆశ ముగించకు మింకనచ్యుతా
అసురుసురై చిక్కితి మచ్యుతా" 15-238-42 రేకు

అని వైఖానసాగమానుసారము భగవత్స్వరూపములను కొన్నింటిని అన్నమాచార్య

సంకీర్తనలలో మనము చూడవచ్చును. తిరుమల ఆలయమున వైఖానసాగమ విధానము అనుసరింపబడుచున్నది.

## అన్నమాచార్యులు-విష్ణువు అవతారాలు

"It may be noted that even in the Vibhava aspect, called the avataras, these four Vyuhas are corresponding to Sri Krishna (Vasudeva) Balarama his elder brother called (Sankarshana) Pradyumna (Manmatha) the son of Krishna and Rukmini and Aniruddha (Krishna's grandson) respectively. [59]

భగవంతుని యొక్క విభవ రూపములే అవతారములుగా ప్రఖ్యాతమైనవి. ఈ విభవమునకు మూలము వేదములలో మనకు కానవచ్చుచున్నది.

'అజాయమానో బహుధా విజాయతే' (one who does not have birth at all, appears or is born as several). [60]

'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' యని ఋగ్వేదములో వర్ణింపబడినది.

భాగవతము అవతార తత్త్వమునకు మూలమని భారతమున కృష్ణుడు అర్జునితో "యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" అని పలికిన పలుకులు ప్రమాణముగా నుడువుచున్నారు. ఇంకను

బ్రాహ్మణములలో విష్ణు అవతారములలో రెండింటికి బీజములున్నవని ఊహింప బడుచున్నది. ఆనాటికి విష్ణు అవతారములుగా వాటికి సంబంధంలేదు. శతపథ బ్రాహ్మణమున మానవుని ప్రళయము నుండి కాపాడిన చేప మహాభారతమున ప్రజాపతి రూపముగా నుడువబడియున్నది. పురాణ కాలము నాటికి విష్ణు అవతారముగా మారినది. అదే బ్రాహ్మణమున సంతానము పుట్టించదలచుకొన్న ప్రజాపతి ప్రాచీన జలములలో తిరుగు తాబేలుగా మారెనని యుండగ ప్రళయమున కొట్టుకొనిపోయిన అనేక వస్తువులను సంగ్రహించుటకు విష్ణువు తాబేలుగా మారెనని పురాణములు వచించుచున్నవి. [61]

"In the period before the rise of the Pallavas the avatara concept was well known in the Tamil country but the traditional list of ten avataras does not appear to have been finally evolved"[62] తిరుమళిశై తిరుమంగై నమ్మాళ్వార్ల రచనలలో పది అవతారముల ప్రశంస గానవచ్చును. పెరియ తిరుమొళి

"మీనోడు ఆమై కీడల్ అరికురాలాయ్ మున్నుమ్ ఇరామనాయ్త్తనాయ్
మిన్నుమ్ ఇరామ నాయ్ తామోదర నాయ్ కల్కియామ్ అనంతన్నై"

దశావతారములలో వర్ణింపబడిన మత్స్య కూర్మ వరాహావతారముల ప్రశంస శతపథ బ్రాహ్మణమున కానవచ్చు.

"Avatara-vada had its beginning in the Rg. Veda. The doctrine took deep roots only in the Gupta period as it is evident from the inscription belonging to the period between 4-8 A.D.[63]" The number of Avataras get crystalisd only in 8 A.D. confirmed by an inscripton found at Mamalla puram of Mamalla Narasimha where the names of 10 avataras are listed"

"A passage of the late Narayaniya section of Mahabharata mentions the four avataras of Varaha, Narasimha, Vamana & Manusha. The earliest sections of the epic do not contain any list of the incarnations.

Another passage of the same section adds to the list the names of the deified heroes Rama Bhargava and Rama Dasaratha, while in the third passage a list of the incarnations is offered by adding Hamsa, Kurma, Matsya, Kalki.

We have a reference to the incarnation of Vishnu in "Gadha Sapta sati" attributed to Hala king of Satavahanas who compiled it.

ద్రావిడ సాహిత్య 'పరిపాడల్'లో వరాహ, నరసింహ, వామన, హంస, పరశురామ అవతార ప్రశంసలు కలవు. [65]

"Although the number of primary incarnations of Vishnu appears to have been fixed quite at ten, their names vary in the list given in the early Puranas."

"Later Vaishnava literature recognised three kinds of avataras (1) పూర్ణ అవతార (2) అంశ అవతార (3) ఆవేశ అవతార.

"With the increasing popularity of incanrations, the Vyuha concept receded more into the back ground." [66]

దశావతార ప్రసక్తి గల సంకీర్తనలలో 'బుద్ధావ' తార ప్రసక్తి పరిశీలనార్హము.

వాయు బ్రహ్మండ పురాణములలో ఈ బుద్ధావతార ప్రసక్తి కానరాదు. 'వృద్ధ హరిత సంహిత' బుద్ధుని ఆరాధనను నిషేధించినది.

భాగవత పురాణమున బుద్ధుడు మగధ దేశమున అంజనకుమారుడుగా జన్మించెనని చెప్పబడినది. కుమారిల మీమాంసకుడు బుద్ధుని అవతారముగా సమ్మతించలేదు. మత్స్య పురాణమున 'బుద్ధుడు' అవతారముగా చెప్పబడెను.

పురాణములలో దశావతార వర్ణనలలో బుద్ధుని గూర్చిన అభిప్రాయభేదము లనేకములు కలవు. దశావతార వర్ణనలలో వర్ణింపబడిన బుద్ధుడు చారిత్రక గౌతమ బుద్ధుడు కాడు. ఈ బుద్ధావతారమును గురించి 'But the account of Buddha popularised by the Vaishnava priests was in no way complimentary to Him. They describe Him as cheat (Mayavi) who has brought about the ruination of asuras by mischievously diverting their attention from the righteous path of Vedic ritualism. This story became so popular that it was repeated in the Karimnagar inscription of Gangadhara (11 A.D.) the smarta minister of Kakati Rudra deva. By about the later part of the 5 A.D. Buddha became an incarnation of Vishnu. But in sculpture it appears late." (67)

విష్ణుకుండినుల కాలము నాటి ఉండవల్లియందు బాదామి చాళుక్యుల నాటికి దశావతార ఎల్లోరా గుహలలో బుద్ధావతారము పేర్కొనబడలేదు. సిరిపూర్ ఆలయ ద్వారమున మామల్లపుర శాసనములలో పది అవతారములు కలవు.

పై వివరణలకు తగిన విధముగా అన్నమాచార్యుల దశావతార సంకీర్తనలు కీర్తించబడినవి. స్వామివారి హస్తమును వర్ణించునపుడు అన్నమాచార్యులు దశావతారము లను జోడించి ఇట్లు కీర్తించెను.

"ఇందరికి అభయంబు లిచ్చు చేయి
కందువలగు మంచి బంగారు చేయి
వెలలేని వేదములు వెదకితెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి క్రింద చేర్చు చేయి
కలికియను భూకాంత కౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ల వాడి చేయి
తని ఒక్క బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసగు చేయి
మొనసి జలనిధి అంబు మొనకు దెచ్చిన చేయి
యెలయ నాగేలు ధరించిన చేయి
పురసతుల మానములు పొల్లఁచేసినఁజేయి
తురగంబు పరపెడి దొడ్డచేయి
తిరు వేంకటాచలాధీశుఁడై మోక్షంబు తెరువు

ప్రాణులకెల్లా కొలిచేటి చేయి (65 రేకు) (1-134)

దశావతార సంకీర్తనలో బుద్ధావతార ప్రశంసను అన్నమాచార్యులు గావించెను. అదియే గాక ప్రత్యేకముగను బుద్ధావతారము నిట్లు వర్ణించెను.

"రక్కసుల కాపురాలు రచ్చలకెక్క జేర్చి
పెక్కు ధర్మములు నిల్పి పెద్దవైతివి
చిక్కవాసి నన్నుం గూడి శ్రీ వేంకటాద్రి మీద
దిక్కుల నిందరి పాలి దేవరవైతివి
వాలి దిరుగునట్టి దైత్యవరుల మోహసతులనెల్ల
మూలమూలంద్రోశి ముసుగులు పాలుసేసె నితండు
వేల సంఖ్యలైన సతుల వేడుకలలరంజేసి వొంటి
నాలి మగనిం రీతి గూడి యనుభవించె నితండు." 37 రేకు 15-211

అని 'మాయావి'గా ఆతని చరిత్ర నుడవబడినది. గౌతమ బుద్ధుని చరిత్రకు ఈ బుద్ధుని వర్ణనకుగల భేదమును పై సంకీర్తనలలో మనము గానవచ్చును. అన్నమాచార్యులు "మత్స్య కూర్మవరాహ మనుష్య సింహ వామనా యిచ్చరామ రామ రామ హితబుద్ధకలికి" అని సంస్కృత శ్లోకానుసరణము దశావతారములను స్తుతించిరి. బలరామకృష్ణుల కభేద భావమును

"జలధి బంధన జలధిశయన
జల నిధి మధ్య జంతు జల
జలధి జామాత జలధి గంభీర
హలధర నమో హరి నమో" (7-157) ఈ సంకీర్తనలో సూచించెను. మత్స్య కూర్మాది అవతారముల ప్రశంసలును పరిశీలనావశ్యకములు.

వరాహ అవతార ప్రశంస ఋగ్వేదమున ప్రప్రధమముగా గానవచ్చును. తైతిరీయ సంహితలో నీటి నుండి భూమిని పైకెత్తిన వరాహము ప్రజాపతి అవతారమని చెప్పబడినది. పిమ్మట మార్పు విస్తరింపబడి వేదకాలము తరువాత రామాయణ, పురాణముల కాలము నాటికి విష్ణువు అవతారముగా పరిగణింపబడినది.

నరసింహావతారము ప్రారంభమున స్తంభరూపమున కొలువబడెను.

వామనావతారము మొట్టమొదట ఋగ్వేదమున విష్ణువు మూడుపాదముల ఆక్రమణన వర్ణనాధారముగా గ్రహింపబడినది. శతపథ బ్రాహ్మణ కాలమునాటికి యజ్ఞ

ముతో పోల్చబడెను. "This incarnation directly derived from the much earlier myth narrated in the Satapata Brahmana" (68) ఈ కథననుసరించి విష్ణువు దేవాసురుల యుద్ధమున అసురుల నుండి భూమిని గ్రహించెనని వర్ణింపబడినది.రామాయణ కాలము నాటికి ఆ అసురులకు సాంకేతికముగా బలి చక్రవర్తిగా రూపొంది భాగవత పురాణమున మరికొన్ని విశేషములతో "వామనావతారము" సంపూర్ణాకృతిని పొందినది. మత్స్య, అగ్ని పురాణములోను, విష్ణు ధర్మోత్తర, వైఖానస ఆగమ, రూపమండన శిల్ప రత్నములలో ఈ అవతార ప్రశంసలు కలవు. కంచి, తిరుక్కోలూర్ స్థలములలో ప్రత్యేక ఆలయము కలదు.

పరశురామావతార మొక ఆవేశావతారముగా పేర్కొనబడుచున్నది. పరశురాముని గూర్చిన వర్ణనలు మనకు సంగకాలము నుండి లభించుచున్నది. కాని పదునొకండవ శతాబ్దమునకు పిమ్మటనే 'శిల్పకళ'లో స్థానమును పొందెను. భాగవత పురాణము పరశు రాముని గూర్చిన కథను కొంత వర్ణించెను. రామాయణమునను 'పరశురామ' ప్రశంస కలదు.

కాళిదాసు రఘు వంశమున "రామాభి దానో హరి"యని హరితో రాముని అభేదముగా సూచించెను. రామకథ సంగకాలము నాటి రచనలలో కలదు. 'శిలప్పదికార' గ్రంథ కాలము నాటికి 'విష్ణువు' అవతారముగా మన్ననల నందుకొనసాగెను.

"Balarama is differently known also Baladeva, Balabhadra, Sankarsana and as the first he was among the Vrsni. Heroes and as Vyuha Vasudeva and finally as an avatara :

విష్ణు పురాణమున విష్ణువు యొక్క రెండు వెంట్రుకలలో ఒకటి తెలుపుగను మరొకటి నలుపుగ రూపొంది బలరామ కృష్ణావతారములుగా మారినవని చెప్పబడినది. నరసింహపురాణమున విష్ణువుయొక్క రెండు శక్తులు ఒకటి తెలుపు ఒకటి నలుపు కృష్ణ బలరామావతారములని పేర్కొనబడినది. (69) సంగకాల రచనలలో బలరాముని గూర్చిన వర్ణనలనేకములు కలవు. 'శిలప్పదిగార'మున బలరామునకొక ఆలయముండిన దని చెప్పబడినది.

క్రీస్తు శకారంభము నుండి తమిళ సాహిత్యమున కృష్ణ చరిత్ర ప్రత్యేక స్థానమును పొందెను. 'కృష్ణ' అనెడి పేరు ఋగ్వేదమున ఛాందోగ్యోపనిషత్తున చెప్పబడినది. మహా భారత కాలము నాటికి దేవకీ పుత్రుడు మానవాతీతునిగను, గీతాచార్యునిగను, పరబ్రహ్మ రూపముగా కీర్తించబడెను. ఆళ్వారులందరును కృష్ణావతారము-ను బహుదా స్తుతించి ఆనందించిరి.

కల్కి అవతారమును గూర్చిన వర్ణన పెరియ తిరుమొళి, తిరుమొళిలో మనము గానవచ్చును.

## బుద్ధావతార వర్ణన వివరాలు

"The one important or factor in the development of the Vaisnava pantheon during the Gupta period was the inclusion of Buddha into the avatara fold which cut at the very root of the Buddhist religion. The spread of these ideas in the South must have taken place shortly after the end of 4 A.D. and became popularised in the Tamil country by about the 7 A.D." (70)

"నమ్మాళ్వార్ పాశురములలో విష్ణు అవతారముగా 'బుద్ధ' చరిత్ర గాని, బుద్ధుడొక అవతారముగా గాని కానవచ్చుటలేదు" (71) కాని

"కళ్ళువేడత్తై కొణ్డు పోయ్‌ప్పురమ్ పుక్క వారుమ్ కలన్దశురరై

ఉళ్ళమ్బేదంశెయ్ దిట్టు ఉయిరుణ్డ ఉపాయంగళుమ్" (5వ పత్తు-10 లో 4)

అనెడి పాశురములో కపటవేషము గొనిపోయి త్రిపురముల చేరిన విధము, అసురులను కలసి మనసున భేదము కలుగచేసి ప్రాణములు తీసిన ఉపాయము" అని వర్ణించిన చరిత్ర, అన్నమాచార్య సంకీర్తనలోగల బుద్ధావతార వర్ణన కథ ఒకటిగా యున్నది. ఆళ్వారుల పాట బుద్ధావతారమును సూచించుచున్నదిగా వర్ణింపబడినదని తోచుచున్నది.

"The protecting character of Visnu's activities is emphasized by sayana who in commenting upon Rg. Veda furnishes us with the explanation of karmani palana. His protecting functions is indeed often recorded may be reason for avataras" (72)

బలరాముడు దశావతారములలో పేర్కొనబడెను. ఉత్తర భారతమున వాసుదేవ ఆరాధనతో చేర్చి 'సంకర్షణ' ప్రశంసలందుకొనెను. దక్షిణ భారతమున ద్రావిడ సాహిత్యమున బలరామకృష్ణ చరిత్ర, వారి లీలలు సవిస్తరముగా వర్ణంపబడినవి. కృష్ణుడు వాసుదేవుడుగా పరబ్రహ్మస్థానమును పొందియుండుటచే, దశావతారములలో ఒకడుగా పేర్కొనబడలేదు. సంకర్షణుడు దశావతారములలో బలరామ అవతారముగా ప్రశంస లందుకొని యుండవచ్చునని తోచుచున్నది.

బలరాముడు (లేక) కృష్ణునికి మారుగా బుద్ధావతారము దశావతార వర్ణనలలో స్థానము నొందెను. పదునొకండవ శతాబ్దపు శాసనములలో బుద్ధుడు విష్ణువు అవతారముగా

స్తుతింపబడెను. పదునొకండవ శతాబ్దమునకు చెందిన జయదేవుని అష్ట పదులలో బుద్ధుడు కీర్తింపబడెను.

## అన్నమాచార్యులు-అంతర్యామి

భగవంతుని అంతర్యామి స్వరూపము, ఉపాసన చేయువారి అంతరంగములకు బోధపడు విషయము, యోగి హృదయుల కర్థమగు రూపమని పెద్దల అనుభవ వచనము. నిగూఢమైనదని భావము.

"నన్ను నింతగా గడించ నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించక పోదంతర్యామి
వోడ బేరమాడే వాఁడు వొకదరి చేరిచి
కూడిన యర్థము గాచుకొనీనట
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరి చేర్చి
వోడక కాచుకోరాదా వోయంతర్యామి
చేరి పుష్పమ్మే వాఁడు చిట్లువేఁగనఁడట
వూరకే శ్రీ వేంకటేశ వోపిక తోడ
అరయ నన్నుఁబుట్టించిన వాఁడవు నా భార
మేరీతినైన మోపు మిఁక నంతర్యామి" (2-39) యని అన్నమాచార్యులు భగవదంత ర్యామి స్వరూపమును తనను కాపాడుమని వేడుకొనుచున్నారు.

అంతరంగుఁడును నర్చావతారము
నంతయు శ్రీ వేంకటేశ్వరుఁడే
చెంతల నీతని సేవకులకు మరి
దొంతి కర్మముల తొడ విఁకనేలా" 2-28) యని శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వమని తెలిపెను.

"Visnudharmottara purana states that the Gods were visible in their physical forms in the Satya, Treta, Dwapara yugas but with the advent of kali they can be seen only in images" (78)

## అన్నమాచార్యులు-అర్చామూర్తులు

'అర్చా'రూప ఆరాధన ప్రారంభమును గూర్చి భిన్నాభిప్రాయములు కలవు. అందుచే

విగ్రహారాధన అర్చారూపమున ఎప్పటి నుండి ప్రారంభమైనదని కాలమును నిర్ణయించుట కష్టతరము.

పాణిని కాలము నాటికి విగ్రహారాధన జరుగుచుండెననుటకు ప్రమాణములు గోచరించుచున్నవి. పాణిని 'విగ్రహము' శబ్దమునకు 'ప్రతికృతి' అనెడిపదమును వాడెనను చుండిరి. పతంజలి 'విగ్రహము' అనెడి పదమునకు 'అర్చ' అనెడి పదమును ప్రయోగించెను.

"The important reference to the use of icon is found in the Mahabhashya of Patanjali, who gives the word 'arca' for image."

పిమ్మట పాంచరాత్రాగమమున వైఖానసాగమమున 'అర్చా' పదము విశిష్ట స్థానమును పొందినది. ప్రాచీన సాహిత్యమున మూర్తి, విగ్రహ, బేర, తను రూప పదములు పేర్కొనబడినవి.

తమిళ శాసనములలో విగ్రహమును 'పదిమమ్' అనగా 'ప్రతిమ' అనియు భగవద్రూపమైన 'అర్చా' రూపమును 'తిరుమేని' అనియు ప్రయోగమున భిన్న పదములను చూపిరి. అర్థశాస్త్ర, మనుస్మృతి కాలమునాటికి అనగా క్రీస్తు శకారంభము నాటికి విగ్రహారాధన ఉన్నత స్థానమును పొందినదనవచ్చును. (74)

"The inscription which belongs to the first half of the first century A.D. records setting up of the stone images of the woship of the Panca Viras of the Vrsnis in a stone shrine. The word 'Pratima' and 'arca' are used in this record to denote the images." మధ్యప్రదేశ్ నందు దొరికిన విష్వక్సేనుని విగ్రహము క్రీ.పూ. మొదటి శతాబ్దము కాలము నాటిదని పేర్కొనబడినది. ఇది వైష్ణవ చిహ్నములతోను ఆయుధములతోను కూడియున్నది.

"In the Deccan, the earliest epigraphic reference to the worship of the Vaisnava deities occurs in the Nanaghat records of Naganika, the queen of the Satavahana ruler. Sri satakarni. (74)

కన్హ, విష్ణు పాలిత, లచ్చిక నామధారణలు 'విష్ణు' భగవదారాధన చిహ్నములుగా ఊహింప వీలగుచున్నది.

"ఆళ్వారాచార్యులు విగ్రహముల సాంకేతికము నెరిగినవారట. భగవత్ శక్తియైన వైష్ణవశక్తి సర్వ జీవనమునకాధారముగాన జీవము మొదట నీటిని ఆధారముగా నెలకొన్నది గాన, నారము అనగా నీరు అనెడి భావార్థమున "నారాయణ" శబ్దము సర్వజీవకోటికి మూలమైన పరమాత్మగా నిర్ణయించిరి. ఆ భావములను శ్రీరంగనాథుని విగ్రహమున గొప్ప

సాంకేతిగముగా గ్రహించబడినది. సృష్టికి మూలము నీరు గావున శ్రీరంగనాధ విగ్రహనాభి యందు కమలము ఉద్భవించినటులు, అందు బ్రహ్మ అవతరించినట్లున్న విగ్రహము వారి భావములకు స్ఫూర్తినిచ్చినవి. సర్వాంతర్యామి శక్తి అనంతము కావున కాలచక్రము సుదర్శనముగను, శక్తిస్వరూపమునకు సాంకేతికముగా పాంచజన్యము, మానవ అవగాహనకు శేషించినదై యుండుటచే భగవత్ శక్తియైన వైష్ణవశక్తిని శేషశాయిగను, ఐశ్వర్యమునకు సాంకేతికముగా లక్ష్మీసహిత రంగనాధస్వామి విగ్రహము సంపూర్ణమైన సాంకేతికముగా గ్రహింపబడి విగ్రహారాధన జ్ఞానదాయకమైనదిగా నెలకొల్పబడినదని తెలియుచున్నది.

శ్రీ వేంకటేశ్వరస్వామి చరమోపాయము అభయములకు సాంకేతికముగ గ్రహింప బడినదని, జ్ఞాన మోక్షదాయక కారకములుగ ఈ మూర్తులు స్తుతించబడినవని శ్రీ వైష్ణవుల విశ్వాసము" [75] ద్రావిడ పాశురములకు శ్రీరంగం స్ఫూర్తి కాగా అన్నమయ్య సంకీర్తనలకు శ్రీ వేంకటేశ్వర స్వామియే స్ఫూర్తిగా నిలిచెను.

ఈతండే యీతండే సుండి యెంతయెంచి చూచినా
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు
విశ్వరూపపు బ్రహ్మము విరాట్టయిన బ్రహ్మము
ఐశ్వర్య స్వరాట్టా సామ్రాట్టయిన బ్రహ్మము
శాశ్వత బ్రహ్మాండాలు శరీరమైన బ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టైయిందరిలో బ్రహ్మము
సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలుని భాస్వత్తేజము
కార్యపుటవతారాలఁగనుఁగొనే తేజము
వీర్యపుటెజ్ఞ భాగాల విష్ణు నామ తేజము
పరమ పురుషమూర్తి ప్రకృతియైన మూర్తి
గరిమతో మహదహంకార మూరితి
ధరఁబంచన్మాత్రములు తత్త్వములైన మూరితి
గరుడానంత, సేనేశ కర్తయైన మూరితి
భాగవతపు దైవము భారతములో దైవము
సాగిన పురాణ వేదశాస్త్ర దైవము
పొగులైన బ్రహ్మలను బొడ్డునఁగన్న దైవము

శ్రీ కలిగి భూపతైన శ్రీ వేంకట దైవము. (2.371)

స్వామి రూపమే కాక ఆ స్వామిని పూజించి తరించిన వారిని కూడా అన్నమయ్య స్మరించెను.

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రుల పూజించే యీ సాకారమే ప్రమాణము
సగుణంబని నినుఁగొందరు సరి నిర్గుణమని కొందరు
వగలఁగెక్కుగతిఁజదివిన కొలఁదుల వారికి వారే వాదింతురు
అగణిత స్వతంత్రుఁడవుగాన అల వాల్మీకి ఇట్టిట్టనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి ఇచ్చుటే ప్రమాణము
'సోహం'బని కొందరు 'దాసోహం'బని కొందరు
సాహస వృత్తుల రెండు దెరంగుల సకల వివేకులు భజింతురు
దేహధారియై 'దాసోహం'బని తేరిశుకుఁడు మీలోఁగలసె
సోహపు భావన సర్వ జగత్తులఁజూపినదే ప్రమాణము
ఆరు శాస్త్రములనారు మతంబుల నారుగర్మముల నైనాను
యీ రీతుల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగు భక్తులిందరును నానాగతులరసి చూచి
సారపు శ్రీ వేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము (2-412)

అని సాకారమే సాక్షాత్కార ప్రమాణముగా అన్నమయ్య శ్రీ వేంకటేశుని పరి పరి విధముల సన్నుతించెను. ఇంకను తన యొక్క పూర్వుల అనుభవమును జ్ఞప్తికి తెచ్చుకొని స్వామితో ఇట్లు విన్నవించుకొనుచున్నారు.

"దోమటి నింతెరఁగరా తొల్లిటివారు
వామదేవ వసిష్ఠ వ్యాసాదులు
తానే దైవమైతే తపమేల జపమేల
పూని సారెఁ బూజించే పూజలేల
కూను వంగి యింటింటఁగోరనేల వేడనేల
యీ నెపాన లోకమెల్లా నేలరాదా తాను
శ్రీ వేంకటేశుఁడే శేఖరపు దైవమని
సావధానుఁడితనికి శరణు జొచ్చి (2-415)

అని అర్చావతార మాహత్మ్యమును, ఆవశ్యకతను వ్యక్తపరచెను. ఈ విధముగా స్వామి గుణ గానము చేయుచు

ఇటు నినుఁదెలియఁగ నెంతటి వారము
తటుకున నాసలఁదగులుట గాక
నానా మూర్తులు నగధర నీరూపు
యే నెలవుల నిన్నెటువలె దలఁచుట
పూనిన నీ భావము పొందుగాఁజెప్పగా
వీనులు చల్లఁగా వినుటే కాక
వేవేలు గలవు నీ విహార భూములు
యే విధము నెందెందని తిరుగుట
శ్రీ వేంకటేశా నీ శృంగార మెల్లను
సేవించిముదమున, జెలగుట గాక (2.305)

అని ఆయన అనేక విధ మూర్తులను, విహార భూములైన ఆలయములను ఇట్లు ముదమున సేవించెను. సేవించిన అర్చామూర్తులను ఆలయములను సంకీర్తనలుగా రచించి గానము చేసెను. ఈ విధముగా వారి సంకీర్తన రచనకు విష్ణ్వాలయములు స్ఫూర్తి నొసగినవి.

తిరుమల - శ్రీ వేంకటేశుడు

ఇందిరకు నురము మీఁదిచ్చిన నాఁడు
విందువలె హరి యిందు విచ్చేసె నాఁడు
పరమ పదము నందు బహుదివ్యావరణాలు
హరిగరిమలు పొలువలరు నాఁడు
గరుడఁడు ననంతుఁడుఁగదిసి సేనేశుడు
హరి నిత్య సేవకులై రిందు నాఁడు
పాలజలనిధిలోనఁబవళించి హరివచ్చి
భూలోకమింతయుఁజూచి పొగడునాఁడు
పాలించి నేలయు మిన్ను బహుదివ్య దేశాలు
గాలించి కోనేటి దరి గైకొంట నాఁడు
విరజానదియుఁదాను వేంకటపతి వచ్చి

పరమపదమిదని పొలించెనాఁడు 116 రేకు -11-2-70

సాక్షాద్విష్ణువే వైకుంఠము నుండి దిగివచ్చి వేంకటేశ్వరునిగా స్వయంభువై అవతరించెనన్న అవతార గాథ ఈ సంకీర్తనమున సంపూర్ణముగా వర్ణించబడినది. అన్నమయ్య తిరుమల వేంకటేశుని కాక కడప శ్రీనివాసుని, మతంగాద్రి వేంకటేశుని, విజయనగర కోనేటి వేంకటేశుని, కోసువానిపల్లె చెంజి, పందిళ్ళపల్లి ప్రసన్న వేంకటేశుని సేవించిరి.

అన్నమయ్య కీర్తించిన వేంకటేశుడు

మతంగ పర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీ వేంకటేశ్వరుఁడున్నవాఁడు
పరిపూర్ణమగు తుంగభద్రా తలమునందు
విరివిగొన్నాఁడు శ్రీ వేంకటేశ్వరుఁడు
కనకమయములైన ఘనమైన మేడలలో
వినుతికెక్కెను శ్రీ వేంకటేశ్వరుఁడు. (10-165)

ఈ సంకీర్తనలో విజయనగర వేంకటేశ్వరుడు కీర్తింపబడెను.

కోన తిరువెంగళేశ
కోన తిరు వెంగళేశ కోడెకాఁడా
అనించీ నీ సతి నీపై అప్పటి వలపులు
బాసల-శ్రీ వేంకటేశ (29.242)
ఇదే నేఁజేసిన భాగ్యమేమి చెప్పేది
పొదిగొని వలపులె పోది సేసేవు
సేసలు వెట్టినవారు సేనా సేనలుండఁగాను
ఆసపడి నన్నుఁగూడి ఆనందించేవు
బాసల శ్రీ వేంకటేశ పొలవలె నవ్వఁగాను
రాసికెక్క నన్నే గారవించి మెచ్చేవు. (29.237)
ఏ వంక నేరిచితివో యింతేసి నీవు (29.217)

తిరుమల శ్రీనివాసుని గూర్చి వర్ణించుచు అన్నమాచార్యులు

"వాడె వేంకటేశుండనే వాడె వీడు
వాడి చుట్టుఁగైదువు వలచేతి వాడు" (20 రేకు) (1-121)

అనెడి సంకీర్తనలలో

"పామరులం దనమీది పాటలెల్లా బాడుమంటూ 20 రేకు

భూమికెల్లా నోర నూరిపోసిన వాడు" అని స్వామిని కీర్తించుచు "భూమి కెల్ల నోర నూరి పోసినవారు" ఎవరో వారిని కూడా విన్నవించెను. వారెవరో కాదు. సాక్ష్వాద్విష్ణు భక్తులైన ఆళ్వారులే ఈ సంకీర్తనలో పేర్కొనబడిన ఆళ్వారుల ప్రత్యేకతను గమనించ వలెను. వీరికి తిరుమల గోవిందరాజుని ఆలయ ప్రాంగణమున విశిష్ట స్థాన మొసగి ప్రత్యేక ఆలయములు నిర్మించిరి. వీరు తిరుమల ఆలయ వైభవములకు కారకులైన వారిలో ప్రధానులు.

"కారి మారసుతుని చక్కని మాటలకుం జొక్కి
చూరగా వేదాల గుట్టు చూపినవాడు
తీరని వేడుకతో తిరుమంగ యాళ్వారి
ఆరడి ముచ్చిమి కూటికాస పడ్డువాడు
పెరియాళు వారి బిడ్డ పిసికి పై వేసిన
విరుల దండలు మెడ వేసిన వాడు
తరుణి చేయి వేసిన దగ్గరి భుజము చాఁచి
పరవశమై చొక్క పాయలేనివాడు.
మామ కూతురలమేలుమంగ నాచారియుఁదాను
గీముగానె వెంకగిరి నుండే వాడు" (20 రేకు) (1-121)

అన్నమాచార్యుల కాలమునకు పూర్వమే వీరికి ఆలయములు ఏర్పరుపబడినవి. క్రీ.శ. 1234 గోవిందరాజాలయ ప్రాంగణముననే ప్రత్యేక సన్నిధి నేర్పాటు చేసిరి. గోవిందరాజుల వారి సన్నిధి నానుకొని ఆండాళ్ తల్లికి ఆలయము కలదు. వైఖానస బ్రహ్మోత్సవమున తిరుమొళి పఠించు ఆచారముండెడిది. క్రీ.శ. 1308 నాటి శాసనములో ఈ వివరణలు కలవు. ఆండాళ్‌ను (29.369) (31.285) అన్నమయ్య కీర్తించిరి.

నమ్మాళ్వార్‌నకు (కారిమారసుతుడు) ఆళ్వార్ తీర్థవారి వద్ద, క్రీ.శ. 1287వ సంవత్స రమునను, పెరియాళ్వార్ వారికి అలిపిరి వద్ద క్రీ.శ. 1300 పూర్వమే సన్నిధులు నిర్మించ బడినవి. పూర్వకాలమున నమ్మాళ్వార్లను తిరుచ్చక్కనూర్ నుండి తిరుమల పోవు వారికి మార్గదర్శకులుగా సూచించిరి. భక్తులు నమ్మాళ్వారు సన్నిధిని గల ఆళ్వార్ తీర్థమున స్నానమాచరించి పునీతులై పెరియాళ్వారుల ఆశీస్సులను పొంది అటు పిమ్మట తిరుమల నెక్కెడి సంప్రదాయ ముండెదిదని తెలియుచున్నది.

ఈ విధముగా తిరుపతి గోవిందరాజాలయమున ప్రతిష్ఠింపబడిన ఆళ్వారులు అన్నమాచార్యుల సంకీర్తనలో వినుతింపబడిరి. ఆళ్వారులకే కాక గోవిందరాజాలయమున

శ్రీ రామానుజాచార్యుల వారికిని ప్రత్యేక సన్నిధి గలదు. అన్నమాచార్యుల వారిచే శ్రీ రామానుజులవారి సేవ అనేక విధములుగా కొనియాడబడినది. శ్రీరామానుజులు ఆలయ ముల ననేక విధములుగా తీర్చిదిద్దిరి. తిరుపతి యందు వసతులనేకములను కల్పించిరి. శ్రీరామానుజుల వారు దర్శించి నిర్మించిన ఆలయములను గొప్పగా నెంచి 'ఆళ్వార్ పాడల్ పెట్ర తలంగళ్' అయిన 108 తిరుపతులతో చేర్చి 128 తిరుపతులుగా అన్నమాచార్యులు పేర్కొనిరేమోనని తోచుచున్నది.

"తగ నూట యిరవై యెనిమిది తిరుపతులంగల
స్థానికులును చక్రవర్తి పీఠకములను
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందగాను
మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్య తపసులున్న గృహములను
వొగి నొరంగు బెరుమాళ్లు వునికి పట్టయి వెలయు
దిగువ తిరుపతి " అ.చా.చా. పుట 7 అని నాటి తిరుపతి యొక్క శోభను ప్రస్తావించిరి.

తిరుపతి "was reputed to have as residents of sabhaiyar of over 108 learned Sri Vaishnave families"-[76] అని శాసనముల వలన మనకు తెలియు చున్నది.

శ్రీ రామానుజులవారి సన్నిధి నానుకొని గోవిందరాజాలయ ప్రాంగణమున రఘునాధునికొక ప్రత్యేక ఆలయము కలదు. తిరుపతి రఘునాథుని

"నీవెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో
రావయ్య తిరుపతి రఘురామచంద్ర" (16.07.108)

అని చిన తిరుమలాచార్యుడీ విధముగా తన సంకీర్తనలో స్పష్టముగా తెలియపరచెను.

తిరుపతి గోవిందరాజస్వామిని కొలిచితే
రక్షించే గోవిందుఁడితఁడు
యిలకు లక్ష్మికి మగఁడీ గోవిందుడితఁడు
పొంది శ్రీ వేంకటాద్రిపై పొసఁగఁదిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుఁడితఁడు
వేంకటగిరి గోవిందుఁడా

యింకా నొకరో యిద్దరో మీరు
తిరువేంకటగిరి దిగువ తిరుపతిని
పరమానందపు బహుసిరులు
అరుదుగఁబొందుచు అధికములందుచు
ఉరగశయనుఁడవో వొడయుఁడవో" 11.2.28

తిరుపతిలోని గోవిందరాజు, శ్రీరాముడు ఆళ్వారాచార్యులనే కాక హనుమంతుని గురించి సంకీర్తన లనేకములను రచించెను.

"మగటిమి గల హనుమంతరాయ
దిగువ పట్టణములోని దేవ హనుమంత
చక్కఁగాఁదోక చాచి జంగవెట్టి చేచాఁచి
అక్కజపు ప్రతాపపు హనుమంతుఁడా
రక్కసుల, దునుమాడి రాముని దేవులకు
దిక్కై వుంగరమిచ్చిన దేవ హనుమంత
కీలుగంట గంటు వేసుకొని కెరలి పిడికిలించి
ఆలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండు బెరిగి యక్షుని
తీలుపడఁగొట్టినట్టి దేవ హనుమంతుడా" (153 రేకు 2-250)

అని హనుమంతుడు తిరుపతిలోని ఎట్లు దర్శనమిచ్చుచున్నాడో వర్ణించెను.

అన్నమాచార్యులు అనేక రామాలయములను దర్శించి సంకీర్తనలతో వారిని గురించి వర్ణించెను.

**విజయనగర రాముడు**

రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య
ధాముఁడు రణరంగ భీముడు వాడే
వెలసి శ్రీ వేంకటాద్రి విజయనగరములోని
తలకొనెఁబుణ్యపాదతలుఁడు వాఁడే (2-218)
(5-217, 8, 233, 10-274, 11-176)

**ఒంటిమెట్ట రఘురాముడు**

ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని

విందువలె ఒంటిమిట్ట వీర రఘురాముని (5-302)

**గుత్తి రఘురాముడు**

సౌమిత్రి సహోదర దశరథరామా

చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా (9.210)

**వావిలిపాడు శ్రీరామచంద్రుడు**

హతరావణాయ సంయమినాథ వరదాయ

అతులితాయోధ్యాపురాధిపాయ

హితకర శ్రీ వేంకటేశ్వరాయ నమో

వితత వావాలిపాటి వీర రామాయ (2-273)

(7-39, 7, 2-178, 16.67)

**దాసరిపల్లె రాముడు**

చిక్కని మురిపెముల శ్రీరామచంద్రా

చిక్కులేదు పెద్దకొప్పు శ్రీరామచంద్ర

చిక్కె నీచే మదనుఁడు శ్రీరామచంద్ర

యీవల దాసరిపల్లె నిరవుకొని మీ

సేవకుల మమ్ము నేలే శ్రీరామచంద్ర (8-157)

**వేంకటాద్రిపై రాముడు**

శ్రీ తరుణితోఁగూడి శ్రీ వేంకటేశుఁడైనాడు

యీతడే దరిసించరో యీ రాముడు (10-144)

10-156, 11-207, 208, 220, 10.170, 280, 281

రాముడే ఆదినారాయణుఁడుగా కీర్తింపబడెను.

దిగువ తిరుపతి హనుమంతుని కాక, అన్నమయ్యచే స్తుతింపబడిన తక్కిన హనుమంత ఆలయములు :

**విజయనగర ఉగ్ర హనుమంతుడు :**

ఎక్కడ నెదురులేక యీరేడులోకములందు

వొక్కఁడే నిలిచెనమ్మ ఉగ్ర హనుమంతుఁడు

పెట్టిన సంగదండ పిడికిటి మొలచేయి

అట్టె వలచేయెత్తిన యాయితము

తొట్టిన పెంజెమటలు తోడనె బుసకొట్టుట
వుట్టి వడీఁ జూడరమ్మ ఉగ్ర హనుమంతుడు
పుట్టు గోపీనము మహాద్భుత యజ్ఞోపవీతము
గుట్టు చూపని కనకకుండలములు
పట్టపు శ్రీ వేంకటేశు బంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజయనగరపు ఉగ్ర హనుమంతుడు (10-85)

ఉగ్ర హనుమంతుడు కన్నులకు కనిపించునటులు పై రీతిని వర్ణించెను.

**కలశాపుర మనుమంతుడు :**

హనుమంతరాయ ఆంజనా తనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమ లంకాదహమన వార్ధిలంఘన
జనసుర, నుత కలశాపుర నివాస (2-347)
(5-82, 7-113, 8-148, 232, 9-13, 214, 232, 11-188, 194, 204, 211, 230.)

**మంగాంబుధి హనుమంతుడు :**

మంగాంబుధి హనుమంత నీవే కాలము
చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీరామరక్ష (11.104
11-148, 149, 163, 167)

**మతంగాద్రి పెద్ద హనుమంతుడు :**

మతంగ పర్వతమాడ మాల్యవంతుము నీడ
అతిశయిల్లిన పెద్ద హనుమంతుఁడతఁడా (11-198
2-249, 350, 11-118, 191)
ఏమని నుతింపవచ్చు నితని రూపము
భీమ విక్రముఁడితఁడు పెద్ద హనుమంతుడు

**విజయనగర పెద్ద హనుమంతుడు :**

(6-223, 9-230, 10-85, 8-138, 11-206, 214, 233 38 9-12, 2-218)

**అన్నమయ్య దర్శించిన విఠలేశుడు : పాండురంగ విఠలుడు :**

వసుధఁజూడఁబిన్నవానివలె నున్న వాఁడు
వెసనన్ని విద్యలాను వెలసె విట్ఠలుడు

పరగ నేడు నూట డెబ్బది యేడుగురి చేత
నిరవై పాడించుకొన్నాడీఁ విట్ఠలుడు
సరసనైదు లక్షలిండ్ల జవ్వనపు గొల్లెతల
మరిగించుకొన్న వాఁడు మఱి యీ విట్ఠలుడు
బత్తితోడ తన మీఁది పాటలు వాడితేను
యిత్తల మోమై తిరిగె నీ విట్ఠలుడు
హత్తి తన్నొల్లక పోఁగా నందరి మేడదేవుళ్ళ
యెత్తి పాదాలందుఁజూపె నితఁడే విట్ఠలుడు
గట్టిగాఁబుండరీకుఁడు కడువేడుకఁబెట్టిన
యిట్టిక పీఁటపై నున్నఁడీ విట్ఠలుడు
అట్టి తానే వెంకటాద్రి బాండురంగమున
యెట్టు గొల్చినా వరములిచ్చీ విట్ఠలుఁడు (రేకు 1482-217)

అన్నమయ్య ఈ సంకీర్తనమున పాండురంగ క్షేత్ర మాహత్మ్యము ననుసరించి సంపూర్ణ చరిత్రను ఇందు పొందుపరచెను.

బల్లిదపు శ్రీ వెంకటపతివై పాండురంగాన
చల్లగా నెలకొంటివి జయ విఠలేశ్వర (10-171)

**విజయనగర విఠలుడు :**

తుంగభద్రా తటమున తొంటి పరబ్రహ్మము
అంగవించి సాకారమై వున్నాఁడు
సంగడితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించే మహిమల శ్రీ విట్ఠలేశుఁడు (11.212)

**కేశవ స్వామి ఆలయములనేకములను దర్శించి రచించిన సంకీర్తనలు :**

**నల్లబెల్లి చెన్నుడు :**

నల్లఁబల్లి చెన్నుఁడు నా పాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకమరి యిన్నిటాఁబ్రసన్నుఁడు (10.168) 10.282)

**మాడు వూరు చెన్నకేశవుడు :**

చేరి యందెల మోఁతతో చెన్నకేశవా
యీరీతి మాడు వూరిలో నిట్లాడెవా

వొగి శ్రీవేంకటగిరి నుండి మూఁడువూర

నెగసెగసి గతులకిటులాడేవా 8-179

**వెలిగోడు కేశవస్వామి :**

కేవల కృష్ణావతార కేశవా

దేవదేవ లోకనాథ దివ్య దేహకేశవా

కుంకుమాంక వక్ష వెలిగోట కేశవా సర్వ

శంకాహరణ నమో జగదేక కేశవా (11.96)

**సంబుటూరు చెన్నరాయడు :**

సమ్మటూరి చెన్నుఁడా జాణఁడ వౌదువయ్య

వమ్మి యన్నిటాను చెల్లుబడి యాయ వలపు (29-554)

**మాచనవోలు - చెన్నుడు :**

జట్టి శ్రీ వేంకటేశ మాచనవోలి చెన్నుఁడవై

వొట్టుకొని మమ్మేలితి వోహో మేలయ్యా (10-78)

**తుమ్మలూరి చెన్నుడు :**

చిగురుమేని తుమ్మలూరి చెన్నుఁడా శ్రీ వేంకటేశ

తగఁబంతమిచ్చితే దక్కె మెచ్చితిఁగాక (30-179)

పైని వర్ణించిన చెన్నకేవశ ఆలయములే కాక అన్నమయ్య నైసర్గిక స్వరూపమును వివరించుచు అలమేలు మంగ సౌందర్యమును వర్ణించి నటులొనరించిన సంకీర్తనలో ఒక్కొక్క కనుమ వద్ద చెన్నకేశవ ఆలయము కలదని 12వ సంపుట పీఠికలో పేర్కొన బడినది. చరిత్రకారులీ ఆలయ వివరణలు విశదపరచగలరు.

"సొంపులనీ వదనపు సోమశిల కనుమ, యింపులెల్లఁజేకొనఁగ

నిల్లు నీపతికి" పతిఇల్లైన ఆలయ వివరణలను సంకీర్తనలలో పేర్కొనిరి.

**కృష్ణుడు**

'కృష్ణ' శబ్దము మొట్టమొదట ఛాందోగ్యోపనిషత్తున వైదిక ఋషి పేరున వ్యవహరింపబడినది. 'హరివంశము'ననే పురాణ గాథలన్నియు మొదటి మారుగా వర్ణింపబడినవి.

'కృష్ణ' అంగీరస, ఘోర దేవకి పుత్రునిగా నరనారయణ, కృష్ణ-వృష్ణి నాయకుడుగా మూడు విధములైన వివరణలు కలవని భండార్కర్ వివరించిరి.

"The development of Puranic Vaisnavism must have started sometimes in the late Upanishadic period say ie. 5, 6 B.C. and developed into a cult with philosophical basis at least by the time of Bhagavad Gita of Mahabharata (at east 3 B.C.) (77)

ఉద్ధగిరి కృష్ణుడు :

ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుఁడు
నవకపు సెలవుల నవ్వుచున్నాడు (8-235)

విజయనగర బాలకృష్ణుడు :

పడుచు జేతలు కావు బాలకృష్ణుడు (17-12)

**నరసింహస్వామి**

అన్నమయ్య నరసింహస్వామిని 'ప్రహ్లాద వరదునిగను, హిరణ్య కశ్యప వధార్హుడుగాను, లక్ష్మీ నృసింహునిగను, యోగ నరసింహునిగా, రౌద్ర నరసింహునిగా ఇంకను అనేక రూపములలో స్తుతించెను.

"The earliest reference to Narasimha is in an invocation to Him in Taittiriya Aaranyaka where He is described as possessing sharp claws and fangs" Maha Narayana Upanishad assigned by competent scholars to the 3 B.C. the Gayatri mantra of Narasimha is given" (78)

ఆళ్వారులు నరసింహస్వామిని అనేక విధముల స్తుతించిరి. పొయ్‌గై ఆళ్వారు (36) పూదత్తాళ్వార్ (84) పేయాళ్వార్ (42) తిరుమళిశై 65, 24 నమ్మాళ్వార్ పది పాశురములలోను, పెరియాళ్వార్ (6) తిరుప్పాణి (8) తిరుమంగై 'పెరియమొళి'లో పది పాటలలోను నరసింహావతారమును కొనియాడిరి.

తిరుమంగై ఆళ్వారు "అంగమ్ జ్ఞాలమ్......1-10 అహోబిలమును 'సింగవేల్ కున్ఱమ్' అని ప్రస్తుతించిరి.

నృసింహస్వామి అర్చామూర్తులు ముప్పది రెండు విధములని స్థలపురాణమున చెప్పబడినది. అవి కుంద, కోప, సింహ, దివ్య సింహ, బ్రహ్మాండ, సముద్ర, విశ్వరూప, వీరసింహ, కృతసింహ, బీభత్స రౌద్ర సింహ, ధూమ్ర సింహ, వహ్ని సింహ, వ్యాఘ్ర సింహ, బిడాల, భీమ, పాతాళ, ఆకాశ, వక్ర, చక్ర, శంఖ, సత్య, అభూత, వేగ, విదారణ, ఘోర, సిద్ధ, శాంత, యోగానంద, లక్ష్మీ, భద్ర, రాజ వరాహసింహ "Some of these forms are sculptured on the pillars of the Tirucuttumala of Simhachalam temple."

ఇందు కొన్ని మూర్తుల వర్ణనలు మనకు అన్నమయ్య సంకీర్తనలలో గానవచ్చును.

కర్నూలు జిల్లాలో గల అహోబిలమున నవ నరసింహమూర్తులను నేటికిని చూడవచ్చు. మహాభారతమున నరసింహస్వామి విష్ణువు యొక్క అవతారముగా పేర్కొనబడినది. అన్నమయ్య సంకీర్తనలో నవ నరసింహులనిట్లు పేర్కొనెను.

"నవమూర్తులైనట్టి నరసింహము వీఁడే
నవమైన శ్రీ కదిరి నరసింహము.
నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడే
నగుచున్న జ్వాలా నరసింహము
నగరముపై యోగానంద నరసింహము వీఁడే
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము
నాఁటుకొన్న బార్గవూటు నరసింహము వీఁడే
నాఁటకపు మట్టెమళ్ళ నరసింహము
నాఁటి యీ కానుగమాని నరసింహము వీఁడే
మేఁటి వరాహపు లక్ష్మీ నారసింహము
పొలసి యహోబలాన బొమ్మిరెడ్డి చెర్లలోన
వలిరేఁగిన ప్రహ్లాద నరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీ వేంకటాద్రి మీద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము (10.182)

కదిరి అనంతపురము జిల్లాలో కలదు. ఇచట నరసింహస్వామి హిరణ్యకశిపుని వధించిన కొండయని స్వయంభుమూర్తిగను కొనియాడబడుచున్నాడు. ఇచట గల ఉత్సవ మూర్తులు భృగు మునిని స్వయముగా స్వామివారను గ్రహించినటులు చెప్పెదరు. వసంత వల్లభులు, వసంత మాధవుల నామములతో స్థల పురాణములలో పేర్కొనబడిరి. అందుచే నవ నరసింహ క్షేత్రములలో ఒకటిగా అన్నమాచార్యులచే పొగడబడినది. విదారణ నరసింహ నామముతో స్వామి ఉత్సవమూర్తి వ్యవహరింపబడుచున్నాడు. (10-32) (306 రేకు)

అన్నమాచార్యులు అహోబిల నృసింహ మఠాధిపతి ఆదివన్ శఠకోపముని శిష్యులు. అన్నమాచార్యుల సంకీర్తనలలో తిరుమల ఆలయ సంబంధమైనవవి పెక్కుకలవు. వాటి పిమ్మట అహోబిల నృసింహ సంబంధ సంకీర్తన లనేకములు కలవు.

అహోబిలము ఎగువ, దిగువ అహోబిలములుగా పేర్కొనబడుచున్నది. ఎగువ

అహోబిలమునగల ఉగ్రస్తంభము ఉగ్రనరసింహుని ఆలయము పురాతనమైనది. దిగువ అహోబిలమున ప్రహ్లాద వరద ఆలయ మతి ముఖ్యమైనది.

స్వామివారు భవనాశిన తీరప్రాంతమున స్వయం వ్యక్తరూపులుగా ప్రసిద్ధికెక్కిరి. స్వామి వారిననుసరించి లక్ష్మీదేవియు కొండపైన నెలకొన్నది.

దిగువ అహోబిలమున ప్రహ్లాద వరదునికి ఎడమవైపు ఉత్సవమూర్తి పావన నృసింహ నామముతో పిలవబడుచున్నాడు. వీరికి ముందు భాగమున తిరు వీధులలో నేడు జ్వాలా నృసింహుడు పది చేతులతో శ్రీ, భూదేవులతో కొలువై యున్నాడు.

**అహోబిలమున అన్నమయ్య :**

"నవ నరసింహనమోనమో
భవనాశీ తీర అహోబల నరసింహా
సతత ప్రతాప రౌద్ర జ్వాలా నరసింహ
వితత వీర సింహ విదారణ
అతిశయ కరుణ యోగానంద నరసింహ
మతి శాంతపు కానుగమాని నారసింహ
మరలి భీభత్సపు మట్టెమళ్ళ నారసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నరసింహ
సిరుల అద్భుతపు లక్ష్మీనారసింహ
వదన భయానకపు వరాహ నారసింహ
చెదరని వైభవాల శ్రీ నరసింహ
అదన శ్రీ వేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలు రూపముల బహు నారసింహ" (92 రేకు 1-453)

ఈ సంకీర్తనలో స్వామి భక్తులకు తొమ్మిది రూపములలో దర్శనమిచ్చు చున్నాడని వర్ణించెను. అహోబల ప్రశంసగల సంకీర్తనలు 2-127, 239, 119, 3-273, 290, 4-346, 385, 384-5-13, 5-93, 9-23, 10-29, 1-13, 20-2, 217, 227 లలోను ఇంకను అనేకములు కలవు.

**విజయనగర నృసింహస్వామి :**

తుంగభద్రాతటమన తొడపై నిందిరతోడ

సింగారించుకొన్న వేల్పు సింహము వీఁడే
సంగతిగా దేవతలు జయివెట్టి కొలుఁవగా
చెంగటనే మహిమలఁజెలరేఁగీ వీఁడే
చలువ బండల మీఁద చక్కని కొండల దండ
అలరీని వీర నరహరి వీఁడే
వెలయు శంఖచక్రాల వేవేలు హస్తములతో
బలవంతుడై వున్నాఁడు పంతముతో వీఁడే
పువ్వుల తోఁటల నీడ భునేశ్వరములోన
జవ్వనపు మనుజు కేసరి
ఇవ్వల శ్రీ వేంకటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వు మోముతోడ భువనము లేలీ వీఁడే (11-217)

అన్నమయ్య విజయనగర నృసింహస్వామి రూపమును, నెలవు నతి సుందరముగా కీర్తించెను.

**శోభనగిరి నృసింహుడు :**

"యిక్కువ దెలిసి నీ వెవ్వతెను గలసితివో
దక్కి శోభన గిరీశ దగగొంటివి"

అని కీర్తించెను. మంగళగిరికి పర్యాయ పదముగా శోభనగిరిని కొందరు వాడుచున్నారు. కాని నూజువీడు తాలూకా కృష్ణా జిల్లా అగిరిపల్లి యందున్న స్వామి వ్యాఘ్ర నరసింహ స్వామి లేక శోభనాచల స్వామిని గురించినదని తోచుచున్నది. [79]

**వేదాద్రి :**

జగ్గయ్యపేట తాలూకా కృష్ణాజిల్లాలో గల వేదాద్రిలో యోగానంద నరసింహస్వామి నెలకొనియున్నాడు. ఈ క్షేత్రము పంచ నారసింహ క్షేత్రములలో ఒకటి.

వీరనరసింహ ఈ కొండకు పది కిలోమీటర్ల దూరమున గరుడాచలమున కలదు. శ్రీనాధుని కాశీఖండమన వేదాద్రి నరసింహుని పేర్కొనెను. గోదావరి, కృష్ణ ఉత్తర దక్షిణ దిక్కులలో ప్రవహించుచున్నది.

కృష్ణానదీ తీరమున స్వయం వ్యక్తమైన జ్వాలా నరసింహ కొండపైన బ్రహ్మచే ప్రతిష్ఠించబడి సాలగ్రామ నరసింహగా రూపొందెను.

యోగానంద నరసింహ, లక్ష్మీ నృసింహమూర్తులను ఋష్య శృంగముని కొండ మధ్యన

ప్రతిష్ఠించెనట. రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి, ఆళ్వారులకును సన్నిధులు గలవు.

"ఆదిమ పురుషుఁడు అహోబలమునను
వేదాద్రి గుహలో వెలసీ వాఁడే" (9-218)
"గరుడాద్రి వేదాద్రి కలిమి ఈపె
సిరులొసగీ చూడరో చింతామణి ఈపె"

**వేంకటాద్రి నరసింహుడు**

"సేవించరో జనులాల చిత్తజుగురుఁడితఁడు
కేవల దయానిధి సుగ్రీవ నారసింహుడు
వేయి చేతులతోడ వెన్నెల నవ్వులతోడ
చాయలు దేరేటి శంఖచక్రాల తోడ
ఆయితమై వున్నవాఁడు అదె సింహాసనముపై
శ్రీయుతుండై యెదుట సుగ్రీవ నారసింహుఁడు
బిరుదు పెండేల తోడ పీతాంబరముతోడ
సరిఁగిరీటాది భూషణములతో
సిరులకెల్లా నెలవై చెఁలగి శ్రీ వేంకటాద్రి
గిరిమీద వెలసెను సుగ్రీవ నారసింహుడు (10-157)
సులభుఁడీతఁడిదివో సుగ్రీవ నారసింహుడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో
వోలిఁదుంగభద్ర కాడ నుండి శ్రీ వేంకటాద్రిని
లీలతోఁబ్రహ్లాదుని కేలికైన వాఁడు (10-275)

తిరుమల ఆలయమున నెలకొనియున్న నరసింహ స్వామిని శాసనములలో 'అళగియ సింగర్' అనగా (చక్కని అందమైన) నరసింహుడనియు, వేంగడత్తరి (వేంకట సింహం) అనియు సూచించిరి. తమిళమున చెప్పబడిన చక్కని అందమైన సింహమనెడి భావమును అన్నమయ్య "సుగ్రీవ నరసింహ"మని సంకీర్తనలో పొగడెను.

ఆంధ్రదేశమున గల నవ నారసింహ మూర్తులు తొమ్మిది వివిధ ప్రాంతములలో మనము గానవచ్చును.

| | | |
|---|---|---|
| 1. | అహోబలము | రాయలసీయ |
| 2. | కదిరి | రాయలసీమ |
| 3. | పెన్నహోబిలం | రాయలసీమ |

| | | |
|---|---|---|
| 4. | కోరుకొండ | తీరప్రాంతము |
| 5. | సింహాచలము | తీరప్రాంతము |
| 6. | వేదాద్రి | తీరప్రాంతము |
| 7. | మంగళగిరి | తీరప్రాంతము |
| 8. | సింగరాయకొండ | తీరప్రాంతము |
| 9. | ధర్మపురి | తెలంగాణ |

అహోబలమును వేదాచలము, గరుడాచలము వీర క్షేత్రమని పేర్కొనెదరట. నవ నరసింహమూర్తులను అన్నమయ్య తన సంకీర్తనలలో పేర్కొనెను.

కదిరి 'నవ నరసింహక్షేత్రముగా' అన్నమయ్యచే కీర్తింపబడినది. ఇచట లక్ష్మీ, నమ్మాళ్వార్, రామానుజ, వేదాంత దేశికాచార్యుల ఉత్సవ విగ్రహములు కలవు. కదిరిలోని అర్చామూర్తి విదారణ నరిసింహమూర్తి.

పెన్నహోబిలమున లక్ష్మీనరసింహస్వామి అర్చామూర్తిగా పూజలను గైకొనుచున్నారు.

కోరుకొండ పరాశరగిరి, పారిజాతగిరి కోనగిరి, వేదాద్రి, తిరుమల, సువర్ణగిరి, ఓషధ ప్రస్తమని వ్యవహరింపబడినది. లక్ష్మీనరసింహము ఇచట గల అర్చామూర్తి.

సింహాచలమున గల అర్చామూర్తి వరాహ నరసింహము.

వేదాద్రి యందు పంచ నారసింహమూర్తులు కలవు. గరుడాచలమున వీర నరసింహ మూర్తి పూజింపబడుచున్నాడు. వేదాద్రి కొండకు పది కిలోమీటర్ల దూరమున ఉన్నది. అన్నమయ్య "పరిపూర్ణ గరుడాద్రి పంచాననమ్, పరమం సేవే పంచాననమ్" అని నుతించెను.

మంగళగిరి నరసింహస్వామి పానకాల నరసింహ స్వామిగా కొనియాడబడు చున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఇచటి అర్చామూర్తి. ఆళ్వార్లు, రాజ్యలక్ష్మి సన్నిధి కలవు.

సింగరాయకొండలో వరాహ నరసింహ, యోగ నరసింహ, ఇరువురు, అర్చామూర్తులుగా ఆరాధింపబడుచున్నారు. భవనాశీనీ తీరుడుగా పేర్కొనబడుచున్నాడు. పురాణ గాథయొకటి వినవచ్చుచున్నది.

ధర్మపురిలోని అర్చామూర్తి లక్ష్మీ నరసింహస్వామి. ఈ విధముగా కొనియాడబడు చున్న అర్చామూర్తులు వివిధ ప్రాంతములలో వివిధ రీతులలో కీర్తింపబడుచున్నారు.

అన్నమయ్య కారుణ్య నారసింహమూర్తిని (2-449) సంకీర్తనలో, ఘోరవిదారణ నారసింహుని (113-2) విజయ నారసింహ (8-154) విమల నారసింహ, 23వ రేకు 15-131

శ్రీ నరసింహ (2-496) నమామ్యహం మానవసింహం అని చెంచుల అహోబల నరసింహుని (8-151, 152) అహోబిల విదారణ సింహం (20-140) అనీ వివిధ సింహములుగ (8-239) సంకీర్తనలలో పొగడెను.

ఈ విధముగా విష్ణువు-విష్ణు అర్చామూర్తులు అన్నమయ్య కనేక రీతులలో స్ఫూర్తి నొసగిరి.

## మూడవ అధ్యాయములో అధస్సూచికలు


1. జగన్నాథాచార్యులు, వేదాంతం -వైష్ణవమతము తద్వైశిష్ట్యము(వ్యాసం) గుంటూరు: శ్రీరామానుజ కీర్తికౌముదీ గ్రంథమాల, సం ధనకుధరం వరదాచార్యులు.
2. ఆనందమూర్తి, వేటూరి, 1986 ప్రథమ ముద్రణ "వైష్ణవాంధ్ర వాఙ్మయము" హైదరాబాద్ : 6/2, ఆర్.టి. విజయనగర్ కాలని.
3. వేంకటేశ్వరశాస్త్రి, శాంతశ్రీ జంధ్యాల, శ్రీ విష్ణు సహస్ర కమలము (తెలుగు వ్యాఖ్య) తిరుపతి : తి.తి.దే.
4. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1995, ప్రథమ ముద్రణ, "వేదాలలో దేవతలు గాథలు" అంగ్ల మూలకర్త మేక్డో నెల్, హైదరాబాదు : తెలుగు విశ్వవిద్యాలయం.
5. Ibid
6. Ibid
7. Ibid
8. Ibid
9. గౌతమ్ చమన్‌లాల్, దేవ్ వాద్ కా వైజ్ఞానిక స్వరూప్-9, 'విష్ణు రహస్య : ఉత్తర ప్రదేశ్ : సంస్కృతి, సంస్థాన్.
10. Ibid
11. ఆనందమూర్తి, వేటూరి, 1986 వైష్ణవాంధ్ర వాఙ్మయము, హైదరాబాద్.
12. నరసింహాచారి, 1994, Basic concepts of Vaisnaism, Taramani : Hayagreeva, Peetham.
13. Ibid
14. Ibid
15. Ibid

16. Suvira, Jaiswal, The origin and development of Vaisnavism. 200 B.C. - 5 A.D. Delhi : Munshiram Manoharlal.
17. వేంకటేశ్వరశాస్త్రి, శాంతశ్రీ జంధ్యాల, శ్రీ విష్ణు సహస్రకమలము. (తెలుగు వ్యాఖ్య) : తిరుపతి : తి.తి.దే.
18. Ed. Haridas, Bhattacharya, 1975. The cultural heritage of India vol. IV, The religions. Calcutta; Ramakrishna mission Institute of Culture.
19. Narasimhachary, 1994. Basic concepts of Vainavism Taramani : Hayagreeva Peetham.
20. Ibid
21. Ibid
22. 'తేనార్ పూంజోలై తిరువేంగడమ్" కులశేఖరాళ్వార్, పెరియ తిరుమొళ్.
23. Ed. Haridas, Bhattacharya, 1975. The cultural heritage of India-IV The religions Calcutta : R.K.M. institure of culture. Pub. by Swami Lokeswarananda.
24. Ibid
25. Narasimachary 1994. Basic concepts of Vaisnavism Taramani : Hayagreeva Peetham.
26. See. 23.
27. నరసింహాచార్య, కిడాంబి. తిరునామముల సమగ్ర పరిశీలనము, హైదరాబాద్ : న్యూ సంతోష్‌నగర్ కాలనీ.
28. See 25.
29. బలరామమూర్తి, ఏటుకూరు, 1992, భారతీయ సంస్కృతి, హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
30. See 25, Narasimha chary, 1994 Basic concepts of Vaisnavism.
31. Suvir, Jaiswal, The orgin development of Vaisnavism.
32. Suvir, Jaiswal : The origin and development of Vaisnavism.
33. బలరామమూర్తి, ఏటుకూరు, 1992, భారతీయ సంస్కృతి, హైదరాబాద్, విశాలాంధ్ర

34. Ed. Haridas Battacharya, 1975. The cultural heritage of India, Calcutta.

35. Narasimhachary 1994 Basic concepts of Vaisnavism, Taramani.

36. అను. సుబ్రహ్మణ్యం, వి.ఎస్. వేదాలలో దేవతలు, 1995, హైదరాబాద్.

37. రామచంద్రరావు, సి.వి. కృష్ణమూర్తి, పి. 1982. దక్షిణ భారతదేశ చరిత్ర తెలుగు అకాడమి.

38. వరదాచార్యులు, ధనకుదరం : తమిళ సంగ సాహిత్యము, వైష్ణవము.

39. Ibid

40. సోమసుందరనార్, పి. 1956, పత్తు పాట్టు సం॥ 2 తిరునల్వేలి : తెన్ ఇందియ శైవ సిద్ధాంత.

41. Ibid

42. బాలసుబ్రహ్మణ్యం, ఎస్.ఆర్. 1966 తమ్మిగ పబ్డై కోయిల్‌గళ్, మద్రాసు : ముద్గల ట్రస్ట్.

43. సోమసుందర్ నార్ పి. పత్తుపాట్టు (పురమ్ 174-1-8).

44. Ibid పురమ్ 57-1-3

45. Ibid పురమ్ 57-1-3

46. నరసింహాచార్యులు, కె.టి.ఎల్ 1994 మహర్షి కవితా మాధురి, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానము.

47. Ed. Haridas Bhattacharya, 1975. The Cultural Heritage of India Vol. IV. The religions. Calcutta; R.K.M. Institute of Culture. Pub. by Swami Lokeswarananda.

48. నరసింహాచార్యులు, కె.వి.ఎల్. 1984 శ్రీ యామునాచార్య వైభవము. (వ్యాసం) శ్రీరామానుజ కీర్తి కౌముది 5వ భాగము, గుంటూరు శ్రీ రామానుజ కీర్తికౌముదీ గ్రంథమాల.

49. జమదగ్ని, 1972, రామానుజాచార్యులు, న్యూఢిల్లీ, నేషనల్ బుక్‌ట్రస్ట్

50. Ed. Haridas, Bhattacharya, 1975. The cultural heritage of India, Calcutta : Ramakrishnamission culture.

51. Ibid

52. ఆనందమూర్తి, వేటూరి. 1986. శ్రీ వైష్ణవాంధ్ర వాఙ్మయము, హైదరాబాద్ : 6/2 ఆర్.టి. విజయనగర్ కాలనీ.
53. Narasimhamurthy, A.V. Vaisnavism in Karnataka through the ages (article) 1993 Ed. Kamalakar.
54. పిళ్లై లోకాచార్యులు శ్రీ వచన భూషణము.
55. Joshi, M.C. Vaisnava Vyuha and Derivatives (articles) Ed. by Ratan Parimoo.
56. వేంకటేశ్వర శాస్త్రి శాంతశ్రీ జంధ్యాల శ్రీ విష్ణు సహస్ర కమలము, (తెలుగు వ్యాఖ్య) తిరుపతి : తి.తి.దే.
57. Ibid
58. Champaka lakshmi, R. Vaisnava Iconography.
59. Narasimhachary, 1994. Basic concepts of vaisnavism , Taramani
60. Ibid
61. సుబ్రహ్మణ్యం, వి.ఎస్. 1995, ముద్రణ. వేదాలలో దేవతలు. హైదరాబాదు, తెలుగు విశ్వవిద్యాలయం.
62. See 58.
63. Gowrishankar de Dasavatara in Bengal sculpture Ed. G. Kamalakar, 1993. Pub. by Birla archeological cultural Research Institute.
64. Jeychandran A.V. Aspects of Visnus in classical Tamil G. Kamalakar 1993.
65. Ibid
66. Narasimhacharya, M. 1989, History of the cult of Narasimha in Telengana, Hyderabad : Radha & sons.
67. Hanumantha Rao, B.S. The ninth incarnation of Vishnu Ed. G. Kamalakar, 1993
68. Champaka Lakshmi, R. Vaisnava Iconography.
69. Ibid
70. Ibid

71. Ibid

72. India J. Reprint 1993. Aspects of early Vaisnavam Delhi : Motilal Banarasi das.

73. Narasimha chary, M. చూ. 66 History of the cult of Narsimha

74. Champaka Lakshmi - See 68 Vaisnava Iconography.

75. రాఘవయ్య, తిరువాయిపాటి. 1980; ఆళ్వారుల దివ్యవైభవము : తిరుపతి : తి.తి.దే.

76. Viraraghavachary, T.K.T. 1997, Reprint History of Tirupati : T.T.D.

77. Ed. Haridas Bhattacharya, 1975. The cultural heritage of India. vol. IV The religions. Calcutta : Ramakrishna mission institute of culture.

78. Narasimha chary M. 1989, History of the cult of Narsimha in Telangana, Hyd. Radha & Sons.

79. ఆనందమూర్తి, వేటూరి, 1976 తాళ్ళపాక కవులు పదకవితలు భాషాప్రయోగ విశేషాలు, హైదరాబాద్, శ్రీనివాస్, శ్రీభారతి ఎంటర్ప్రైజెస్.

నాలుగవ అధ్యాయము

# విషయ సూచిక


| | |
|---|---|
| అన్నమయ్య సంకీర్తన | 166-167 |
| భక్తి సంగీతము | 167-168 |
| అరయర్ సంగీతము | 168 |
| భజన సంగీతము | 169-175 |
| హరికథ | 175-176 |
| యక్షగానము | 176-177 |
| భాగవత మేళ | 177-180 |
| నాట్యము | 181-187 |
| శిల్పము | 187-189 |
| అథస్సూచికలు | 189-190 |

# ఆలయము, లలితకళలు

## అన్నమయ్య సంకీర్తన

ఆలయముల ఆరాధనా క్రమములో గీత, వాద్య నృత్యకళలు ప్రాముఖ్యము కలిగియున్నవి. కామికాగమము సంగీత, నృత్య కళలను ఆలయ పూజా విధులలో ఒక భాగముగా నెంచక ఆలయ ఉత్సవములలో భగవద్దత్తమైన కళలతో భగవదారాధన, భగవత్సేవ చేయవలెనని నిర్దేశించెను. సంగీత, నృత్య కళలకు ఆలయములు కేవలము కళాపోషక స్థానములుగా కాక ముక్తిమార్గ సోపానములైనవి. భుక్తి ముక్తి కారకములైనవి. ఆత్మ పరమాత్మల కలయికకు సూత్రములై నిలిచినవి. సంగీతము మానవులకే కాక సకల జీవరాశులకు ముక్తి దాయక మార్గమేననుటకు "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అను నానుడిని ప్రమాణముగా గ్రహించవచ్చును. అన్నమాచార్యులు భగవంతుని సంగీతముతో ఆరాధించి తరించెననుటకు క్రింది సంకీర్తనమే ప్రమాణము.

"సకల వేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి నినుఁబాడి పావనుఁడైన
అకలంకుఁడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీ వేంకట నిలయ
నారదాది సనకసనందనాదుల వలె
పేరుపడి నిన్నుఁబాడి పెద్దలైనట్టి
ఆ రీతిఁదాళ్ళపాకన్నమాచార్యుల
చేరి యేలినట్టి శ్రీ వేంకట నిలయ
సామవేద గాన సప్తస్వరములను
బాముతో నీ సతి నిన్నుఁబాడినయట్టి
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీ వేంకట నిలయ (2-24)

అని తాళ్లపాకన్నమాచార్యులు వేదములను సంకీర్తన రూపములో గానము చేసిరని, ఆయన నారదాది సనకసనందనాదులవలే గాయకుడని, సామవేదగాన సప్త స్వరములతో స్వామిని, ఆయన సతిని పాడి మెప్పించెనని పై సంకీర్తనచే తేటతెల్లమగుచున్నది. సంగీత విద్వాంసుని

గాను పొగడెను. అన్నమాచార్యులే స్వయముగా స్వామి వారితో

"ఒక్క సంకీర్తన చాలు వొద్దికై మము రక్షించగ" యనియు

"నేమనఁబాడే వాఁడను నేరము లెంచకుమీ"

శ్రీ మాధవ నేనీదాసుడ" నని వేడుకొనెను.

ఇంకను

"పావనము గావో జిహ్వ్రబదుకవో జీవుఁడా

వేవేల కితని నింక వేమారునుఁబాడి

హరినామములే పాడి అతని పట్టపురాణి

ఇరవై మించినయట్టి యిందిరఁబాడి

సరినిరువంకలాను శంకచక్రములఁబాడి

వరద కటి హస్తాలు వరుసతోఁబాడి

ఆది పురుషునిఁబాడి అట్టె భూమి సతి బాఁడి

పాదములఁబాడి నాభి పద్మములఁబాడి

మోదపు బ్రహ్మాండాలు మోచే వుదరముఁబాడి

ఆదరానఁ గంబు కంఠ మంకెతోఁబాడి

శ్రీ వేంకేశుఁబాడి శిరసు తులశిఁబాడి

శ్రీవత్సముతోడురముఁజెలంగి పాడి

లావుల మకర కుండలాకర్ణములు పాడి

ఆ వటించి యితని సర్వాంగములుఁబాడి" -(7-125)

జిహ్వతో స్వామిని పాడి పావనము కమ్మని ఉపదేశించెను.

## భక్తి సంగీతము

తిరుమల తిరుపతి, భద్రాచలము, తిరువనంతపురం, శ్రీరంగము మున్నగు ఆలయములలో జరుపు ఉత్సవము లనేక కవులకు స్ఫోరకమై సంకీర్తనలుగా రూపొందినవి. ఆలయ ఉత్సవములు కన్నుల పండువుగను, వీనుల విందుగా భక్తుల హృదయము నలంకరించినవి. అలరింపబడిన హృదయము నుండి ఆనందోద్వేగముతో అమృత రసధారలుగా సంకీర్తనలు వెల్లివిరిసినవి. అవి భక్తి సంగీత సాహిత్యముకు జీవాధారమైనది.

హృదయము నలంకరించినవి. అలరింపబడిన హృదయము నుండి ఆనందోద్వేగముతో అమృత రసధారలుగా సంకీర్తనలు వెల్లివిరిసినవి. అవి భక్తి సంగీత సాహిత్యముకు జీవాధారమైనది.

సంగీతమును "శుద్ధ సంగీతము", "భక్తి సంగీతము" అని రెండు విధములుగా మనము గ్రహించవచ్చును. మనోధర్మ సంగీతమైన రాగాలాపన మున్నగునవి శుద్ధమైన సంగీతమనియు, భక్తి భావముతో కూడిన సాహిత్యమును గీతముగా ఆలాపించిన భక్తి సంగీతమని నుడువవచ్చును. భక్తి సంగీతమును ఆంగ్లమున "Sacred Music" అని వ్యవహరింతురు.[1]

## అరయర్ సంగీతము

భక్తి సంగీతమున "స్తోత్ర సంగీతమును ప్రథమ దశగా మనము గ్రహించవచ్చును. 'వైష్ణవ' ఆలయములలో జరుపబడు వేద పారాయణ గోష్ఠి స్తోత్ర సంగీతమనకు చెందినదని నుడువవచ్చును. ఈ స్తోత్ర సంగీతము 'అరయర్ సేవ' అని కొనియాడ బడుచున్నది. దక్షిణదేశ వైష్ణవాలయములలో నాలాయిర దివ్య ప్రబంధములలోని కొన్ని పాశురములను 'అరయర్' లనెడివారు. సాంప్రదాయ రీతిలో అభినయించుచు దివ్య సూక్తులను గానము చేసెదరు. 'అరయర్'లను గూర్చిన వివరణలలో 'తిరు వేంగడత్తరయర్' తిరుమలై కునియ నిన్ఱ అరయర్' అని ఆ స్వామి పేరు వ్యవహ రింపబడుటచే తిరుమలలో ఈ సేవ జరుపబడెడిదని ఊహించుట కవకాశమును కల్పించినది.[2] ఈ సేవ ఆలయములలో మాత్రమే జరుగుచుండెడిది. ఆలయము లలో మేల్కొలుపు సేవలో వీరు పాడెడివారనియు, 'ప్రణయ కలహ ఉత్సవమున' పాల్గొనెడి వారనియు 'పళ్ళిపాడల్' అనెడి పాటలను పాడెడివారని విశదమగుచున్నది. ఈ సేవను 'తిరుమల' ఆలయమన మన అన్నామాచార్యులు కొనసాగించిరేమోనని తోచుచున్నది. అరయర్‌లు దివ్య ప్రబంధ గానము చేసి ఆది స్వామిని ఆనందపరచెడి వారట. మన అన్నమాచార్యులు ద్రావిడాగమ సార్వభౌమునిగా సంకీర్తనలు రచించి, పాడి, స్వామిని ఆనందపరచెనేమోనని తోచును. ఇంకను మేల్కొలుపు సేవలో తిరుమల ఆలయమున తాళ్ళపాకవారు పాల్గొని భగవత్సేవ చేయుచున్నారు. వారు ప్రబంధగాన వేళలో ప్రత్యేక వేషమును ధరించెడి వారట. ఇంకను అరయర్‌లు తలపై కిరీటము వలె టోపిని ధరించి, జాలరా (వాద్యం) వేసి పాడెడివారట. అన్నమయ్య రూపమును చూచినచో 'అరయర్'ల రూపమును పోలిన రూపమును గానవచ్చును. తంబురను మీటుచూ పాడెడి వారేమోనని తోచును. అరయర్‌లు కృష్ణలీలలను అభినయించుచూ నాట్యమాడగా

అన్నమాచార్యులు 'కృష్ణ లీల'లను నాట్యమున కనువుగా సంకీర్తన చేసి స్వామిని మెప్పించిరి. వైష్ణవాలయములలో జరుపబడిన 'అరయర్' సేవ అన్నమయ్యకు స్ఫూర్తినిచ్చినదేమోనని ఊహింప వీలగుచున్నది.

## భజన సంగీతము

ఆలయములలో 'స్తోత్ర' సంగీతముతో ప్రారంభమైన సంగీతారాధన పదునైదవ శతాబ్దము నాటికి కొంత వృద్ధి చెంది భజన పద్ధతిగా ఖ్యాతిని పొందినది. ఆలయము లలో 'భజన' ఏకాదశి మున్నగు పర్వదినముల యందును, ఉత్సవ సమయము లందును స్త్రీ, పురుష వయోభేదము లేక జనుల నాకట్టుకొని భగవత్సేవా భాగ్యమును పొందినది. బ్రహ్మోత్సవ సమయములలో నవసంధి సమయమున రాగతాళస్వర వాద్య నృత్యములతో భగవదారాధన చేయవలెనని కామికాగమముచే నిర్దేశింపబడినది. అన్నమయ్య స్వామితో

"దేవర చిత్తం దివ్య నిధి దేవనిర్మిత విధీయవధానం
అతివలు నాట్యంబాడేదమని వున్నతి మెరయుచునున్నారిదివో
ప్రతినలతో రంభయు మేనకయును ధృతి కరుణాంబుధీయవధానం
గాన విద్యాతమకంబున వినుమని కానుకలివెసుర కాంతలవి" (5-19)

గాన విద్య, నాట్య కళలను కానుకలుగా గొనుమని వర్ణించెను.

నమ్మాళ్వార్లు కలిదోషమును నివారించుటకు తప్పక భగవంతుని కీర్తించుచు పాడి ఆడవలెనని మరియు భగవద్గుణ గానము చేసిన వారికి మంగళా శాసనములు చేసిరి. (5వ పత్తు పాలిక పాలిక) భక్తులెల్లరను 'వారీర్ రండి అని పిలిచిరి, మాధవుని రాగములతో పాడి ఆడి' భక్తిని వ్యాపింపచేయచున్నారని, గీతము ప్రదర్శించుచున్నా రనియు అందుచే కలియుగ క్రూర చేతసుల పాపము తొలగిపోయి యమునికి పని లేదని వర్ణించిరి. అదే విధముగా అన్నమయ్య కలిదోషము మాన్పుటకు సంకీర్తన మెంతో తోడ్పడునని

"సంకీర్తనమే సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె!" అనియు
"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు -66 రేకు 1-363
జాలెల్ల నణగించు సంకీర్తనం" అని వర్ణించిరి. అన్నమయ్య నాడు పదం అనెడి మాటను పాటకు పర్యాయ పదముగా వాడెనని పలువురి అభిప్రాయం. భగవత్పరముగా రచింపబడిన ఈ రచనలు సంకీర్తనలుగా గాన యోగ్యమైనవి.

ఈ విధముగా భక్తి సంగీతము, నాట్య సంగీతము, హరికథా సంగీతము, నాటక

సంగీతము, యక్షగానము, నృత్య నాటక సంగీతముగా పేర్కొనబడెను.[3] ఈ సంగీత మును గాంధర్వ వేదమని పెద్దలు నుడివెదరు. ఈ భక్తి సంగీతము వేదగానముతో ప్రారంభమైనది. సామగానము అవరోహణ క్రమమున గరిసనిదప స్వరములతో కూడి నది. అన్నమయ్య ఈ రీతిలో పాడెడివారని చిన్నన్న సంకీర్తనచే మనకు తెలియుచున్నది.

నమ్మాళ్వారు "ఆడి ఆడి అగంకరైన్పు ఇకై
పాడిపాడి కణ్ణీర్ మల్కి ఎంగుమ్
నాడి నాడి నరసింగ వెన్రు
పాడివాడుమ్ ఇవ్వణుదులె (2-4-1)
కండోమ్ కండోమ్ కండోమ్
కణ్ణుక్కినియానై కండోమ్
పణ్‌తాన్ పాడి నిన్రారాడిల్
పరన్ద తిరుగిన్రా నవే [4]

అని సంగీతమును జతచేర్చి భగవంతుని ఆరాధించి తరించమని వర్ణించెను. ఆండాళ్

"తూయో మాయ్ వన్దు నామ్
తూమలర్ తూవి తొళుదు
వాయ్‌నాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క
ఓజ్గీ ఉలకళన్ద ఉత్తమన్ పేర్‌పాడి
మనత్తుక్కి నియాన్లై పాడవుమ్ నీ వాయ్ తిరవాయ్" [5]

అనగా భగవంతుని కీర్తించుటకు నోరువిప్పి గొంతు విప్పి గానము చేయుమని నోటితో పాడి మనమున ధ్యానించి శుచిగా పుష్పములతో పూజింపుమని విన్నవించెను.

కులశేఖరాళ్వారులు "తొండర్ తాన్‌గాళ్ కుళామ్ కుళమిత్తి పుగళ్‌కల్‌పలవుమ్ పాడి" భగవంతుని గుణగానమును చేయుమని భక్తులనుద్బోధించుచున్నారు.

పెరియాళ్వార్లు కృష్ణుని మధుర సంగీతమునకు చర, అచర జీవులాకర్షింపబడిరని విశ్వమంతా సంగీతముచే మంత్రముగ్ధులైరని విన్నవించిరి[6]

ఈ విధముగా ఆళ్వారులు భగవత్సేవ యందు సంగీతమున కధిక ప్రాధాన్యము నొసగిరి. భగవంతుని మహిమను స్తోత్రముగానే కాక పాడి తరించమని భాగవతులకుప దేశించిరి. కృష్ణుని సంగీతమునకు విశ్వమే ఆధీనమైనదని ప్రశంసించిరి.

ఆంధ్రదేశమున వచన రచనకు భజన సంకీర్తన పద్ధతులకు ప్రథమాచార్యుడు

శ్రీకృష్ణమాచార్యులని నుడువచ్చును. కృష్ణమాచార్యులు ఈ భజనకనువైన వచన సంకీర్తనలను ధ్యాన సంకీర్తనములని, నామ సంకీర్తనములని, వేదాంత సంకీర్తనములని విభజించుకొనిరట.

సింహాచల ఆలయము నాశ్రయించుకొనియే కృష్ణమాచార్యుని వచన సంకీర్తన సంప్రదాయము వర్థిల్లినది. సింహాచల లక్ష్మీనరసింహాలయమున సంకీర్తనము చేయువారును, నట్టువసానులును పలువురా దినములలో నియుక్తులగుచుండినటులు శాసనముల వలన తెలియుచున్నది. నట్టువసానులతోబాటు సంగీత విద్వాంసులుండి నట్లు ఆలయ శాసనములచే విదితమగుచున్నది. తిరుమల వేంకటేశుని సన్నిధిని కృష్ణమాచార్యులు గానము చేసిరనుటకు "బతకమాకన్నల జోలపాడగా నా(డెల్ల(బసి బిడ్డనైతి - నా కృష్ణమాచార్య నధ్మాత్మ వినుతి-రా(క

గొన్నాళ్ళు విరక్తుండనైతి జగతి నీ

శృంగార సంకీర్తనముల కగపడి మంచి

ప్రాయపు వాడనైతి''నని స్వామివారే పలికిన పంక్తులు ప్రమాణములుగా చెప్పబడుచున్నవి.

కృష్ణమాచార్యులు నృసింహనామాలు, రామనామాలు రామనామ కీర్తనలు రచించిరి (7)

అతి సామాన్య విధమునకు చెందినదీ దివ్యనామ కీర్తన. ఈ నామావళి సమూ హముగా పాడుటకనువుగా నుండును. చరణములన్నింటి నొకే జతిగగానము చేయటకు వీలుగా ఒకే 'ధాతు'వు ఉండును. ఒక్కొక్కమారు పల్లవి చరణములు ఒకే రీతిగా నుండును. (8)

**నృసింహ నామాలు**

"శ్రీకరంజ భూరుహాఖ్య(జెలగి వెలయు శ్రీ నృసింహా

భీకరావతార ధీరపృథుల వక్ష శ్రీనృసింహ" అని

**రామనామాలు**

దశరథాత్మజ రామా రామా

ధన్య చరిత్రా రామా రామా

**అన్నమాచార్యుల రామనామాలు :**

"ఎంత నుతియింతు రామ రామ యిట్టినీ ప్రతాపము రామ రామ

పంతాన సముద్రము రామ రామ బంధించవచ్చునా రామ రామ

బలు సంజీవని కొండ రామ రామ బంటుచేఁదెప్పించితివి రామ రామ

కొలఁది లేనివాలిని రామ రామ ఒక్క కోటనేసితివట రామరామ

వెలయ నెక్కుపెట్టి రామ రామ హరువిల్లు విరిచితివట రామ రామ

పెలుచు భూమిజను రామ రామ పెండ్లాడితివట రామరామ

అని రామ కథతో రామనామాలను రచించిరి.

ఇంకను కృష్ణమాచార్యులు రామ నామ మహిమను "శ్రీమదఖిల రహస్య మంత్ర విశేష దామము రామనామము సామవేద విధూతశాస్త్ర విచార నామము రామ నామము" (383 రేకు) (4-485)అని కొనియాడగా అన్నమాచార్యులు

"సోదించిరిదియె హరినామం

అరిది వేద శాస్త్రార్థ సంగ్రహము అరయఁగ నొకటే హరినామం

దురిత హరము భవదుఃఖ నాశనము అరిభయంకరము హరినామం

సకల పుణ్యఫలసార విహారము అకలంకము శ్రీహరి నామం" (11-39) అని వర్ణించెను.

భజన పద్ధతిలో పూర్వ ఉత్తర భాగములని రెండు రకములున్నవి. పూర్వభాగము 'నామావళి'తో ప్రారంభమై 'తోడయ మంగళం' సాగిన పిమ్మట గురు కీర్తన, అష్టపది, తరంగంలతో స్వామిని కీర్తింతురు. విఘ్నేశ్వర, విష్వక్సేన, ఆంజనేయ, సరస్వతి, పార్వతీ పరమేశ్వరుల స్తుతి చేసెదరు. ఉపచార కీర్తనలు గానము చేసిన పిమ్మట ఇష్టదేవతా స్తుతి చేసెదరు. పూర్వ భాగము పై విధముగా ముగియును.

ఈ రీతిని పాడు భజన పద్ధతికి అన్నమయ్య మనుమడైన చిన్నన్న దక్షిణాదిన ప్రారంభ పురుషుడనిరి. ప్రతి ఆలయమున 'భజన' గోష్ఠిని ఏర్పరచిగని ప్రతీతి. త్యాగరాజు కాలము నాటికి ఉత్సవ సంప్రదాయ కీర్తనలతో 'భజన' పద్ధతి విశిష్ట స్థానము నొందినది.

పూర్వ భాగమున పాడు 'నామావళి అన్నమాచార్య రచనలలో పెక్కులు గలవు. 'నామావళి' అత్యంత సులభమైనది. సంస్కృతమున 'నామావళు'లు అనేకములు కలవు. ఇది సామూహికారాధన పద్ధతికి చెందినది.

గోవిందనామ సంకీర్తనం - గోవింద గోవింద (దీనిని పుండరీకమందురు)

మాధవ కేశవ మధుసూదన విష్ణు

శ్రీధరా వదనభం చింతయామియూయం

పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య

హరి సంకర్షణ యధోక్షజ

నరసింహ హృషీకేశ నగధర త్రివిక్రమ
శరణాగత రక్ష జయజయ సేవే
విహిత విజ్ఞాన శ్రీ వేంకటేశ శుభకరం
అహమీతహ తద దాస్యమనిశం భజామి (11-35)
"గోవింద హరి గోవిందగునిసియాడుదంబిటురారో" (9-109)
"గోవింద నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవల నీవల నోరఁగుమ్మలుగా నాడుద మీతని బాడుదము"

అని రచించుటచే నాడు ఆలయములలో భజనలు జరిగెడివని తోచును. ఆ ప్రేరణతో ఈ రచనలు చేసియుండనోపు.

"కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁబాడెదనేను" (11-124)
శ్రీ వేంకటేశుఁడవు నీ దేవులలమేలు మంగ
నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని" అని పాడి స్వామికి సేవచేసెను.

'నామావళి' పిమ్మట 'తోడయమంగళం'తో భజన సాగును. 'తోడయ మంగళ' సంకీర్తనలు అన్నమయ్య వారి వంశస్థులచే రచింపబడినది.

| | | |
|---|---|---|
| జయజానకీ రమణ | నాట (రాగం) | ఝంపె (తాళం) |
| శరణు శరణు | ఆరభి (రాగం) | మిశ్రచాపు (తాళం) |
| మురహరనగధర | మధ్యమావతి (రాగం) | ఆది (తాళం) |
| దేవేశగణారాధిత | సావేరి (రాగం) | రూపక (తాళం) |
| మాధవభవతుతే | పంతురావళి (రాగం) | ఆది (తాళం) |

ఈ ఐదు సంకీర్తనలను 'తోడయ మంగళం' అని వ్యవహరింతురు. ఇక ఉత్తర భాగము దివ్యనామ సంకీర్తన, భాగవత ఘట్టములు, అభంగము, అష్టపది పిమ్మట డోలోత్సవము, వివిధ రీతులలో నలుగు, సోబనం, ఆరతితో కూడికొని మరుదినము సుప్రభాత సేవతో ఈ ఉత్సవము సంపూర్ణమగును.

భజన సంప్రదాయ పద్ధతి దక్షిణాదిన ఆళ్వార్ల, నాయనమార్లచే ప్రారంభింపబడిన దనవచ్చు. జ్ఞాన భక్తులైన ఆళ్వారులు భక్తి శరణాగతులతో ముక్తిని సాధించవచ్చునని ప్రచారము చేసిరి. ఆలయములలో వారి రచనలు గానము చేయబడుటచే 'భజన' సాంప్రదాయమునకు మూల పురుషులైరి. నాయనమార్లు, ఆళ్వారులు అవిరామముగా ఆలయములను సందర్శించి తమ రచనలను ఆయా ఆలయ అర్చామూర్తులకే అంకితము గావించుటచే

ఆ స్థలములు పుణ్య స్థలములుగా పరిగణింపబడినవి. పిమ్మట అచార్యులచే ఆ గానము పరిరక్షింపబడి ఉత్తర భారతము చేరి 'భజన' పద్ధతిగా రూపొంది రామానంద మున్నగు వారిచే వ్యాపించబడినది.

పురాణ కథలతో కూర్చిన ఒకానొక సంగీత రూపకము ద్వారా వైష్ణవ మతము సర్వుల కందుబాటుగా శ్రీ రామానుజాచార్యులు ప్రచారము గావించిరి. మొట్టమొదట 'భజన' పశ్చిమ దిశగాపోయి పిమ్మట ఉత్తరదిశ చేరి భారతదేశము మొత్తము చక్కగా అభివృద్ధి చెందినది. హరిదాసులు గ్రామ గ్రామము వాడవాడల తిరిగి సంగీత రూపకములో తమ లక్ష్యములను జనబాహుళ్యమున కందించిరి. పురందర దాసుని దేవర నామాలు, అదేవిధముగా 'పాండురంగ' ప్రశంసాత్మక తుకారాం 'అభంగము'లు 'భజన'లో విశేషాదరణ పొందినవి. 'గుజరాత్'లోని నరసింహ మెహతా, రాజస్థాన్ లోని 'మీరాబాయ్' 'పంజాబ్'లోన గురునానక్" మున్నగు వారు భక్తి సంగీతమును ప్రచారము చేసిన వారిలో ప్రముఖులు. మీరా యొక్క 'కృష్ణ భక్తి' అనెడి సంగీత సముద్రమున యావద్భారతదేశము ఓలలాడినది. ఈ భజన సంప్రదాయమును వ్యాపింప జేసిన సూర్‌దాస్, తులసీదాస్ భజన రచయితలకు మార్గదర్శకులైరి. వారిలో రామానుజ సిద్ధాంత ప్రవర్తకులైన రామానందులవారతి ముఖ్యులు. భారతదేశ తూర్పు భాగమున చైతన్యుల వారిచే సంగీత, నాట్యకళలు కృష్ణభక్తి నినుమడింప జేసినవి.

ఈ విధముగా ఆళ్వారుల, నాయనమార్లచే ప్రారంభింపబడిన 'భజన' సంగీతము క్రీ.శ. 15వ శతాబ్దము నాటికి చక్కగా రూపొందినది. నేటి భజన సంప్రదాయమునకు ఆంధ్రదేశమున తాళ్ళపాక వారిచే చక్కని బాట వేయబడి ప్రారంభింపబడినదేమో? మరియు ప్రాచీన కాలమునాటి 'భజన' సాంప్రదాయమునకు నేటి భజన పద్ధతికని వారధిగా వీరే నిలిచిరని అనుటలో సంశయింప పనిలేదు. వివిధ సంగీతయుక్త రచనలను గావించిన వారిలో తాళ్ళపాక వారు మిక్కిలి ప్రముఖులు.

అన్నమయ్యచే రచింపబడిన కొన్ని రామభక్తి సంకీర్తనలు భద్రాచల రామదాసునికి మార్గదర్శకమై శ్రీ త్యాగరాజుల కాలము నాటికి చక్కని స్థితిని పొందినది. భక్తి, భజన విడదీయరాని అనుబంధముగా పెనవేసుకొని పోయినది. భజన పద్ధతిలోని అన్ని అంశములకు తగిన విధముగా త్యాగరాజు అనేక రచనలు చేసిరి. త్యాగరాజు ప్రహ్లాద భక్త విజయమునకు అన్నమయ్య సంకీర్తనలు మార్గదర్శకములేమోనని అనిపించును.

'గీత గోవిందము' రాధాకృష్ణ ప్రణయ లీలలు కృష్ణభక్తికి ఆధారమైనది. నారాయణ తీర్థుల వారిచే అది కొనసాగింపబడి భజన సంగీతము తీర్చిదిద్దబడినది. (9)

ఆలయములలో నాడు 'హరికథలు' కూడా జరుగుచెండెడివని తోచును. అన్న మయ్య హరికథా శ్రవణమునిట్లు కీర్తించెను.

"కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథా శ్రవణం
అచింత్యమద్భుత మానందం
ప్రచుర దివ్యం పావనం
సుచరిత్ర శ్రుతి శోభితం
అచలంబిదివో హరికీర్తనం" (2-464)

## హరికథ

హరికథలో కథాకాలక్షేపము, నాటకము, హాస్యము ముఖ్యమైనవి. ఆంధ్రదేశమున కథా సంవిధానము రెండురకములని పేర్కొనవచ్చును. పురాణ ప్రవచనము, హరికథ. హరికథ యక్షగానము నుండి ఏర్పడినదని కొందరి అభిప్రాయము. మరి కొందరు 'భజన' యొక్క శాఖగాను భావించుచున్నారు. సంగీతముతో జతకూడిన పురాణ ప్రవచనమే హరికథగా రూపొందియుండవచ్చును.

"It is beleived that Andhra Harikathas were primarily devoted to Bhajana and they steeped into the foundation received in the sphere of Bhajana" (10)

ప్రారంభ దశలో యక్షగానము, హరికథ కలిసి యుండెడివి. హరికథా కాలక్షేప మున కథకునకు సంగీతజ్ఞుడు సహాయకారుడు. కథను వచనమున, పద్యముతో పాడి వినిపించెడివారు. వారిని 'హరిదాసు'లనెడివారు. భాగవతులు పద్యములు, చూర్ణికలను ద్విపదలను కథ మధ్యమున జోడించెడివాడు. అన్నమయ్య

"సేయరో మనుజులార చింతహరి నింకనైన
రోయిరో మీ భుజియించు రుచుల మీద
మెచ్చరో మనుజులారా మీరే హరికథలు
పుచ్చరో మీ మదిలోని పోరులెల్లను
కొచ్చిరో మనుజులారా కోరికలెల్లను మీకు
నిచ్చి శుభములు యివి యెల్ల కాలము
కనరో వేంకటపతిం గున్నులుఁదనియంగ

వినరో యీతని స్తుతి వీనులు నింప"

"వినరో భాగ్యము విష్ణుకథ

వెనుబలమిదివో విష్ణుకథ" (9-66)

ఈ రచనలను చూచిన అన్నమయ్య స్వయముగా హరికథా గానము చేసెడి వారని తోచును. ఆలయములలో జరిగెడి హరికథ ఇట్లనేక విధములుగా వారి రచన లకు కారణములుగా తోచును.

అన్నమాచార్య సంకీర్తనలు వివిధ కళల యొక్క సంబంధ వర్ణనలతో నిండి యున్నది. ఉత్సవ సమయములలో ఆలయములలో ప్రదర్శింపబడు ఈ కళా ప్రదర్శ నలను గూర్చి సోమన రచనలలో కొన్ని వర్ణనలు గలవు. ఏలలు పాడెడివారని, చిందుల నాడెడువారని, భారతాది కథలఁజీవమరుగుల నారంగ బొమ్మల నాడించువారని, గంధర్వ యక్ష విద్యాధరాదులై పాడి ఆడెడి వారనియు బయలాటలు, తోలుబొమ్మలాటలు, దాసరుల చిందుల, ఉత్సవములందు యక్ష భూమికలను ధరించి, నృత్య గానములను ప్రదర్శించెడివారని తెలిపెను.[11] ఈ ప్రదర్శనలు భక్తకవులలో అధ్యాత్మిక చింతనలతో పాటు భగవదారాధన రీతిలో సంకీర్తనలుగా రూపొందుటకు కారణములైనవి.

## యక్షగానము

యక్షగానము ఒక విధమగు ప్రత్యేక గానశైలి అని ప్రాచీన కాలముననే గుర్తింపబడి నటులు తెలియుచున్నది. శ్రీనాధుడు ప్రథమముగా యక్షగానమనెడి పదము నుపయోగించెను. చిన్నన్న తాళ బహుళములు, నవరసాలంకృతములునైన పలు విధములగు పదములలో కూడినవి యక్షగానములని వివరించెను. యక్షగానము ప్రథమ దశలో పాట సంపుటీకరణముగను, పిమ్మట గానమాపకథాఖ్యానముగను వృద్ధి పొందినది. క్రీడాభిరామము జక్కులపురంధ్రి పాటలో (15వ శ॥ము) రామాయణ గానము చేయ బడినది.[12] అన్నమాచార్య సంకీర్తనలలో రామాయణము గానము చేయుట కనువగు రీతిని కథాఖ్యాన రీతిని వర్ణింపబడినది. స్త్రీ గాని, పురుషుడు గాని వీటిని గేయరూపమున హావ భావములతో చదివి పాడి వినిపించుచుండిరట.

"చెప్పితే నాశ్చర్యము చేసిన చేఁతలితడు

ముప్పిరి మనుజ వేషమునఁబుట్టె నీతఁడు

రాముఁడుదయించె దశరథునికిఁదమ్ములతో

గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞము గాచె హరుని విల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁబెండ్లి యాడెను
మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపి వాలిని యా సుగ్రీవునిఁబెంచె
జడధి బంధించెను నరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁబట్టము గట్టెను
సీతాదేవితో నయోధ్య సింహాసనం బెక్కె
పోతరించి కుశలవ పుత్రులుఁగాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీ వేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాంచెను (1-182)

ఈ విధములైన సంకీర్తనము యక్షగానము, గేయ నాటకములకు మార్గదర్శక ములై వృద్ధి చెందినవి.

యక్షగానములోని దరువులలోను, శృంగార కీర్తనలలోను పురుష పాత్రలకు గ్రాంథికమును స్త్రీ పాత్రలకు మృదువైన గ్రామ్య భాషను, చెంచులు, ఎరుకులు మున్నగు ఆటవిక పాత్రలకు సహజమైన మిశ్రితములైన యాస భాషను వాడెదరు. (13)

"మేడలక్కి నిన్ను చూచి, కూడేననే యాసతోడ
వాడు దేరి ఉస్సురంటిరా (ఓ) వేంకటేశ
యాడ నుంటీవిందాకానురా.
పిక్కటిల్లు చన్నులపై, చొక్కపు నీ వుంగరము
గక్కననే నద్దుకొందురా వేంకటేశ
లక్కవలె ముద్రలంటెరా

అని అన్నమయ్య ఏల పాటను రచించెను. ఈ విధముగా యక్షగానములకు దరువుల కనువైన రీతిలో సంకీర్తనము చేసెను.

## భాగవతమేళ

'భాగవతమేళ' మనెడి సంగీత నాటకములు ఆలయములలో జరుగుచుండెడివి. నేటికిని కొన్ని ఆలయములలో 'లక్ష్మీనృసింహస్వామి జయంతి' భాగవతమేళ ఉత్సవము నేర్పాటు చేసెదరు (14) ప్రహ్లాద కథ ఇందు ఎక్కువ ప్రధానమగుటచే ఆ నాటకమునే

వేసెదరు. ఆ నాటక మధ్యన పాటలు పాడెదరు. యుద్ధము, సంహార సన్నివేశములను నటింపక శ్రావ్యముగా పాట రూపమున పాడెడివారట. అనేకాలయములను దర్శించిన అన్నమయ్య ఈ భాగవతమేళమును గాంచి పరవశుడై యుండవచ్చును. శ్రీ నరసింహ జయంతి ఉత్సవమును హిరణ్యకశిపుని వధను శ్రీ నరసింహావతారకథను అన్నమయ్య అనేక సంకీర్తనలలో వర్ణించెను. ఈ సంకీర్తనల తీరును చూచినప్పుడు మనకా సన్నివే శములు కన్నులకు కట్టినట్లు వర్ణించిన తీరు అత్యద్భుతముగా తోచుచున్నది.

అహోబలేశ్వరుడు అఖిలవందితుడు
మహినితని గొలిచి మనుడిక జనులు (4-306)

అని స్వామి మహిమను కొనియాడెను.

నరులార నేఁడువో నారసింహ జయంతి
సురలకు నానందమై శుభము లొసఁగెను.
సంధించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార
మందు సంధ్యా కాలమున నౌభలేశుఁడు
పొందుగాఁగంభములోనఁబొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁజించెఁగనక కశిపుని
నరమృగ రూపము నానా హస్తములతో
గరిమఁబ్రహ్లాదునిఁగాచి రక్షించీ నిలిచె (11-14)
కాంచనపు గద్దె మీఁద గక్కనఁగొలువై యుండి
మించుగ నిందిరఁదొడమీఁద బెట్టుక (11-14)

అని నారసింహ జయంతి ఉత్సవమును వివరించెను. మరియు

"వినరయ్య నరసింహ విజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసంగును" (11-218)

అని నరసింహ విజయమును జనులను వినుమని ఆయువు, సంపదలు పొందెదరని ఫలితమును వివరించెను. ఇంకను నరసింహావతారమును

"అటమీఁదట బ్రహ్మాండం బదరుచు
కుటిల భయంకర ఘోషముతో
చిటచిట చిటమని పెట పెట పెటమని
పట పట మనుచును బగిలెఁగంబము

కులగిరులదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తలడిల్లి
గలఁగెను జగములు కంపించె జగములు
ప్రళయ కాలగతిఁ బాటిల్లె నపుడు
ఘననారసింహుఁడదె కంబము నందు వెడలె
కనుపట్టె నదిగో చక్ర జ్వాలలు
మునుకొని వెడలెఁగార్ముక ముక్త శరములు
కనక కశిపునకుఁగలఁగె గుండియలు" అని గుండియ లెట్లు గూల్చెనో పాఠకులకు వర్ణించి చూపెను.

'హిరణ్యకశిపుని' వధను అన్నమయ్య
తొడికి పట్టి విష్ణుండు తొడమీఁద నిడుకొని
కడుపు చించెను వాని గర్వమడంగ
వెడలెఁజిల్లున వాని వేఁడి నెత్తురు నింగికి
పొడి పొడి యాయ శత్రు భూషణము లెల్లను
నెళనెళన విరిచె నిక్కివాని యెముకలు
పెళ పెళ నారిచి పెచ్చు పెరిగె హరి
జళిపించి పేగులు జంధ్యాలుగా వేసుకొనె
తళుకుఁగోరలు తళతళమని మెరిచె
పెటలించి నరములు పెరికి కుప్పలు వేసి
గుట గుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కలు వారఁజెండి
కుటిల దానవుఁజూచి ఖోయని యార్చెను
తెంచి శిరోజములు దిక్కులకు వాని
పంచ ప్రాణములు గొనెఁబరమాత్ముడు
అంచెల నీరీతిని ప్రహ్లాదుని పగనీఁగె
మించి దేవతలు మితిమీరి జయవెట్టిరి" (రేకు 388) (4-513) అని సంగీత నాటక రీతిలో వర్ణించెను. (11-3-19, 3-288, 1-210, 4-390) (చాణూర సంహారమును కూడ (11.3.82) అన్నమయ్య వర్ణించెను.) హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని పెట్టిన బాధలను

సంకీర్తన చేసి స్వామి రక్షించిన తీరును కొనియాడెను.

'రామ రావణ' యుద్ధ ఘట్టమును అన్నమయ్య ఇట్లు రచించెను. 27 రేకు

"అనుచు రావణుసేనలటు భ్రమయుచు వీగె
యినకుల చంద్ర నేడిదిగో నీ మహిమ
దదదద దదదద దశరథ తనయా
కదిశి తింగకకక కావలె
అదే వచ్చె బాణాలు హానాథ హానాథ
పదపదపదపద పారరోప పుంజులు
మమమమ్మ మమమమ్మ మన్నించుడు కపులారా
సమరాన చచచచ్చ చావకండా
మెమెమెమ్మె మెమెమెమ్మె....
మొమొమొమ్మొ మొమొమొమ్మొ మ్రొక్కేము మీకు
తెతెతెత్తె తెతెతెత్తె తెరువేది లంకకు
తతతత్త తలమని దాగుదురు
గతియైన వేంకటగిరి రఘునాథ
సతమై మమ్మింకనేలు జయజయ నీకు" 15-158

భక్తి సంగీతమున జయదేవుని అష్టపదు లతిముఖ్యమైనవి. సంగీతమునకే గాక నాట్యము ఇందు జతపరచబడినది.

"The Gita Govinda which provided the inspiration for the development of the classical opera and dance drama few centuries later.

నేటికిని జగన్నాధ ఆలయమున ప్రాతఃకాల పూజకు జయదేవుని అష్టపదులు ఉదయ సంధ్యా సమయమున గానము చేయుదురు. నేటికిని ఈ ఆచారము కొనసాగుతున్నది.

"Jayadeva himself song the hymns in the temple, while his wife Padmavathi danced to them" (15)

ఈ విధముగా సంగీత నాట్యములు ఆలయములలో చక్కని స్థానమును కలిగి యుండెను. కేరళ రాష్ట్రమున గురువాయూర్ ఆలయమున నేటికిని గర్భాలయమున కెదురుగా అష్టపదుల సోపానమార్గ మనెడి పద్ధతిలో పాడుచున్నారు. అన్నమాచార్య వంశస్థులు నేటికిని

తిరుమల ఆలయమున "మేల్కొలుపు, ఏకాంతసేవ" వేళలలో పాటలను పాడి భగవత్సేవ చేయుచున్నారు.

## నాట్యము

తాళ్ళపాక వారే స్వర సాహిత్యములతో కూడిన తమ సంకీర్తనలను శిలాశాసనములలలో చెక్కించి ఆలయ ప్రాకార కుడ్యములలో నిలిపిరట. సరిగమాది స్వరవిన్యాసముతో వారి రచనలు కొన్ని ఆలయ చంపక ప్రదక్షిణోపక్రమమున శిలాశాసన రూపములో నున్నవట. [16] ఇట్లు ఆలయములు కళానిలయమై కళా కేంద్రములుగా వర్ధిల్లెను. తిరుమల తిరుపతి ఆలయ ఉత్సవములలో ఊరేగింపునకు పూర్వము తిరువీధి సానులు నాట్యమాడి గానము చేసెడివారని శాసనములో వివరణలు కలవు. ఇట్లు ఉత్సవములు సంగీత, నాట్యములతో రంజిల్లుచుండెను. వీరు అష్టపది, తరంగం, దేవర నామ కీర్తనలకు నాట్యమాడెదరు.

నానా వాద్యాలతో నట్టువలు గడించఁగా
సానపట్టి మంచి మంచి పాత్రలాడఁగా
పన్నిన తెరమఱఁగు బహురూపమెల్లాను
కన్నదాఁకానే కానికడఁజవుకే అని ఉత్సవ వేడుకలను సమయానుసారము అనేక విధములుగా అన్నమయ్య రచించెను. ఉత్సవములను గూర్చి వర్ణించు సంకీర్తనలలో అవి ఎట్లు జరుపబడెడివో తెలిపెను.

"ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు
వేడుక వసంతములు వెల్లి విరియాయని (8-12)
అడరో పాడరో ఆనందించరో
వేడుక మొక్కరో విజ్ఞానులు (8-280) అనెడి మాటలచే ఆలయములో ఉత్సవములు హర్షాతిశయముగ జరుపబడెడివని స్పష్టమగుచున్నది.

వృత్తమున కనువగు రీతిని మృదంగ కాహళ ధ్వనులు, పాదాంత చరణాంత ధ్రువములగు సంకీర్తనలను అన్నమయ్య రచించిరి.

తాళమెత్తరే తత్తతత తత్తత
నేలబడి నేడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం
తిత్తితిత్తి తిత్తితి భింభింభింభింబింభింభిం
తుత్తుతుత్తు తుత్తుత్తు (1.3.54)

తుత్తుతూ

తిడిం తిడిం, ఢమం ఢమం

దదదద దదదద

ధణం ధణం భంభంభం

ధిం ధిం యాడుదు దిట్టలై అని నృత్తమునకు తగినట్లు రచించినట్లు తోచుచున్నది.

రాగభావముతో కూడిన 'కృష్ణలీల' లను

"గోరగోరితే నీరై కొడలెల్లఁదెగఁబారె

మారుకొంటే బయిటనే మడుగులై నిలిచె

చేరి యడుగు వెట్టితే శిలకఁబ్రాణము వచ్చె

కూరిమిఁగావలె నంటే కొండ గొడుగాయెను

కొంగు జారినంతలోనే కూలెను త్రిపురములు

కంగి గమనించితేనే కలిదోషములు మానె

రంగుగ నీ శరణంటే రక్షించితి దాసులను

ముంగిట శ్రీ వేంకటేశ మూలమవు నీవు" (2-156)

ఈ విధముగా వివిధ సందర్భముల కనువుగా సంకీర్తనలు చేయుటకీ ఉత్సవములు చక్కని స్ఫూర్తి నొసగినవని తోచుచున్నది. అన్నమయ్య ఉత్సవములలో సంగీత నాట్యముల ప్రశంసలను కూడా తన సంకీర్తనలో వెల్లడించెను.

"ఆటలు బాటలు నవె అచ్చరలేములు వారే

చాటవనలమేల్మంగ సంగడి నదె" (8.274) అని గరుడోత్సవమును

ఉవిదలంపు మిగుల నూయల పాటలు

పాట మధుముదమున బాడెననలులు" అని ఊయల వేళను.

ఆటలు బాటలు వింటానలమేల్మంగయు దాను 6-122

రథోత్సవమును

ఆడేరు పాడేరు అచ్చరలెల్ల (17-304)

నృత్య భంగిమతో కూడిన ఆటలు పాటలుండెడివన్ని

దివ్య దుందుభులు మ్రోగె

పాడిరి శోభనాన అదె భారతియు గిరిజయు

ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల (8-21)

అమరంగ నెల్లాను ఆరతులియ్యగాను (20-110)

అంగనలీరె యారతులు (25.246)

శోభనమే శోభనమే (3.18) 24.53 27.417

అనెడి వర్ణనలతో కల్యాణోత్సవమును ధనుర్మాస వేళలో 'గొబ్బి పాటలు పాడెడి వారిని

"కొలని దోపరికి గొబ్బిళ్ళో"

దేవదుందుభులు మ్రోయదేవతలు గొలువగ

అంగరంగ వైభవా నమరకామినులాడు

సంగీత తాళవాద్య చతురతుల తలపై మెరయ

తెప్పోత్సవము జరిగెడిదని

"వివిధ పుష్పములతో వేద ఘోషములతో

అవల దిరువాముడియు నంగనల యాటతో

కవి వంది నుతులతో కమ్మ బూజలతోడ

నవధరించీ" బుష్ప యాగంబు

వర్ణించిన సంకీర్తనలను నృత్యమునకుదాహరణముగా గైకొనవచ్చును. అన్నమయ్య వర్ణించిన బాలకృష్ణ

"ఇట్టి ముద్దులాడి బాలుఁడేడ వాఁడు-వాని

బట్టి తెచ్చి పొట్ట నిండఁబాలు వోయరే

గామిడై వారి తెంచి కాఁగెడి వెన్నలలోన

చేమపూవు కడియాల చేయిపెట్టి

ముచ్చువలె వచ్చి తన ముంగిమురువుల చేయి

తచ్చెడి పెరుగులోన తగఁబెట్టి

ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చిపెట్టెలోని

చెప్పరాని ఉంగరాల చేయిపెట్టి" (11.2.20) వర్ణనలతో కూడిన సంకీర్తన

ఉత్సవ సమయములలో నాట్య ప్రదర్శనలు ఆలయములలో నిర్వహింపబడు చుండెను. ఆ నాట్య ప్రదర్శనకు వీలుగా పౌరాణిక గాథలతో కూడిన సంకీర్తనలైన దశావతార వర్ణనలనేకములను అన్నమయ్య వివిధ రీతులుగా వర్ణించెను.

హరి నీ ప్రతాపమున కడ్డమేదీ లోకమున

సరివేరీ నీకు మరి సర్వేశ్వరా

నీవు నీళ్ళు నమిలితే నిండెను వేదములు
యీవల, దలెత్తితేనె యింద్ర పదవులు మించె
మోవమూ(తి గిలిపితే మూడు లోకాలు నిలిచె
మోవి(లూర నవ్వితేనే ముగిసి రసురులు
పూని విహరించివచ్చి పొందుగా నుయ్యాలలూగి
కోనేటి దరి మెరసీ గోడ తిరునాళ్ళు (24.281)
వరుసతో విణ్ణాప జివ్వారు తాళము లొత్తుచు
పొరిపొరి ద్రావిడాన బొగడగాను
అడుగడుగుకు విడేలందు కొంటా సంకీర్తన
లెడయక భాగవతుతెచ్చి పాడగా (24-281)
ఆటలపాటల వారు అండనే వినిపించగ
పాటించి యారగింపులు పైపై చేయగా" అని (20-241)

కోడై తిరునాళ్ళను

దేవతలు మునులు(చెందిన నారదాదులు
ఆవలను( బాడేరు ఆకసము నందు (9.254)
తుంబురు నారదాదులు దొరకొని పాడేరు
అంబర వీథి నాడేరు యచ్చరలందరు గూడి (10-292)
జోజోయని మీరు జోలపాడరో
సాజపు జయంతి నేడే సఫలమిందరికి (9.172)

అని కృష్ణాష్టమిని వర్ణించెను. ఆలయములలో జరుపబడిన ఉత్సవములను పై విధముగా వర్ణించెను.

'వసంతోత్సవ' సమయములలో శృంగార ప్రియులు పరిమళ ద్రవ్యములను చల్లునపుడు గాని, వెన్నెల రాత్రులందు స్త్రీలు వీణమీటుచూ గాని 'జాజర పాటలు' పాడెడివారని తెలియుచున్నది. ఈ ఉత్సవ పాటలు, కోలాట నృత్యము అన్నమయ్య కెంతో స్ఫూర్తి నిచ్చెను.

"మొల్లలు దురుముల ముడిచిన బరవున
మొల్లపు సరసపు మురిపెమునా
జల్లన(బుప్పొడి జార(గ బతిపై
చల్లే రతివలు జాజర" (3.343) ఇట్లు స్త్రీలు వేడుకతో పుప్పొడి, గంధపు పొడి తమ

ప్రియులమేనిపై చిమ్ముచు ఆడుకొను పాటలకు, అన్నమయ్య సంకీర్తనలలోని 'జాజర' పాటల రచనలకు ఈ వసంతోత్సవమే కారణమేమో?

"వేడుక వసంతము వేళనిదే
వాడవాడల వెంట వనితలాడేరు
కేలుగేలు జుట్టుపట్టి కెందామర మోము లెత్తి
కోలగోల దాకజేసి గుంపువాయక
చాలుకాని యిద్దరేసి జంటలై సతులు గూడి
పాలిండ్లు గదలగ బరువైన తురుముల
మేలిమి పిరుదులతో మెరయుచు మురియుచు
కోలల బెడమరలి కోలాట మాడేరు" అనియు
"పదతాళ గతులకు పడతులెల్ల
కదిశాందురు మోముల కన్నుల దేలించిచూచే."

అని వర్ణించుటచే కోలాటము కేవలము ఆటగా కాక నృత్య ప్రదర్శనగా చేసెడివారని ఆ ప్రదర్శనల స్ఫోరక ప్రమాణమే ఈ రచనలని ఊహింప వీలగుచున్నది.

ఆలయములో జరుపబడు తిరునాళ్ళలో సామాన్య ప్రజల వినోదార్థము చిందు, దేశి నాట్య పద్ధతులు, ఏర్పరుపబడెడివేమోనని తోచును. అన్నమయ్య

ఎందరి వలపించెనో యింటనింట
చిందుల పాటలు వింట సిరుల చేకొంట
చిందులకు నాడేటి సీమంతినీమణులు
చెలగి యిరుగడ గొలువగాని" అని వర్ణించుటచే ఉత్సవములలో వనితలు 'చిందులాట' ఆడెడివారని తెలియుచున్నది. వినతాశిరోరత్నమైన అలమేలు మంగమ్మ నాట్యముతో స్వామి నెటుల మైమరిపింపజేసి ఆయన మెచ్చగా ఆడినదో అన్నమయ్య వర్ణించెను.

"అలరులు గురియఁగ నాడెనదే
అలకలఁగులుకుల నలమేలు మంగ
అరవి సొబగుల నతివలు మెచ్చగ
అరతెరమరగున నాడెనదే
వరుసగా పూర్వదువాళపు తిరుపుల

హరిఁగరగింపుచు నలమేలు మంగ

మట్టపు మలపుల మట్టెల కెలపుల

తట్టెడి నడపుల దాటినదే

పెట్టిన వజ్రపు పెండెపు దళుకులు

అట్టిట్టు చిమ్ముచు నలమేలు మంగ

చిందుల పాటల శిరిపొలయాటల

అందెల మ్రోతల నాడెనదే

కందువ తిరువేంకటపతి మెచ్చఁగ

అందపు తిరుపుల నలమేలు మంగ (12.24)

అన్నమయ్యకు గల నాట్య ప్రావీణ్యత విదితమగుచున్నది. మరియొక సంకీర్తనలో అన్నమయ్య ఉత్సవములలో గాంచిన వివిధ నాట్యరీతులతో జగదేకపతిని జగదంబ ఎట్లు మెప్పించినదో వివరించెను.

ఉపచరించఁగ రాదా వువిద గడునలసె

నెపమున వురుటెల్ల నెరపీ నీ మీఁదను

నలినాక్షి గరిడితో నంటునఁగేళి సేసె

నలువంక నీకు నభినయము చూపీని

తెరమరఁగున వచ్చి దేవి శుద్ధాంగములను

సరవినాడి చూపులు సళుపుచును

తిరువుగొని కమ్మటి తీగెచేతులటు చాచి

పదములఁజిందు జక్కిణి బహుతాళ మానములు

నిదె నాట్యమున నిన్ను నింతి మెప్పించె (30-555)

పలుమారు నీయెదుట, బాడెనాడె పాటలు

తలయూచి మెచ్చితివి దానికి నీవు 22.466

అని వివిధ నాట్య ప్రదర్శనలతో భగవంతుని మెప్పించిన రీతిని వెల్లడించెను.

ఇంకను స్వామితో "బాలకిగాని యింతి ప్రౌఢగాదు ఆకె! చేల కొంగంటుచును మచ్చిక సేయవయ్యా! అనియు స్వామిరాక చూడక ఆమె పాడి, ఆడి ఆయనను చూచి సిగ్గు పడినదని "ఇంతితోడ సుతిగూడి తోప చూపి చూపి ఇట్టె తోడు ఆడవయ్య" అని స్వామిని జతగా నాట్యమాడుమనియు ప్రార్థించెను.

జగదంబ నాట్యమునే కాక ఆమె సంగీతమును "మిక్కిలి మేలుది అలమేలు మంగ,

కొచ్చి కొచ్చి యాలపించి కూరిమితో బాడగాను, అని "గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా' అని, లక్ష్మి 'కిన్నెర' వాయించుచు పాడినదని, తాళమొత్తి పాట పాడి తనలోనే నవ్వినదని, "కిన్నెరను దొక్కిపట్టి తంత్రులు మీటెనని కట్టడి గోళ్ళ కత్తుల బోనునఁ బెట్టుచు శ్రుతులే బిగియించీని" అని తంత్రులను సరిచేసి శ్రుతులు బిగియించి చక్కటి మధురమైన సంగీతమును పాడినదని వర్ణించుటచే అన్నమయ్య యొక్క 'సంగీత' జ్ఞానము వెల్లడియైనది. ఆలపించుటయే కాక 'వాద్య' ములతో గల పరిచయ జ్ఞానము విదితమగుచున్నది. అన్నమయ్య సంగీత జ్ఞానము ఈ సంకీర్తనమున గానవచ్చు.

రతి నీ పలుకులకు రామనడపులకు
గతిగూడఁగడమ రాగము సేయుమీ
పిల్లఁగోవిరవములు బెరయించఁగానదే
గొల్లెతల మట్లెలకుఁగూడె సుతి
పల్లవపుఁబదముల పాటలు వాడుచుఁ
గల్లగాదు కడమ రాగము సేయుమి
ముందు నీ సంకపు రవమునకు గోపికలెల్ల
కుందణపు టందెలకుఁగూడె సుతి
పెనఁగే నీ వూరుపులు పెరుగమ్మే కాంతల
కొనగోరి తఁకులకుఁగూడె సుతి
చెనకితి విందరిని శ్రీ వేంకటేశ్వర
కనుచొక్కి కడమరాగము సేయుమీ" (30.114)

శ్రుతిలయలతో కూడిన మధుర సంగీతము రాగాలాపన గూర్చి చక్కని ఊహతో అన్నమయ్య ఈ సంకీర్తనను కూర్చెనని తోచును.

## శిల్పము

ఆలయములు సుందరశిల్ప కళామతల్లికి పుట్టినిల్లు. సామాన్య మానవులు ఆలయ శిల్ప సౌందర్యమును గాంచి అప్రతిభులు కాగా భక్త కవుల రచనలచే ఆ శిల్పములు జీవమును పొంది సజీవములుగా మార్పు చెందుచున్నవి. సజీవమొందిన శిల్పములు సంగీత నాట్యములతో కవుల వాక్కుచే పామరజనుల హృదయముల నాకర్షించుచున్నవి. తిరుమల వేంకటేశుని ఆలయ స్నపన మండప స్తంభముపై చెక్కబడిన రామాంజనేయ సంవాద

శిల్పము భక్తిరస హృదయులైన అన్నమచార్యులచే జీవము నొంది క్రింది విధముగా సంకీర్తన రూపములలో సంభాషించుకొనిరని తోచును.

"పవనజ యేవనెపడఁతి మరేమనె
అవనిజ నిను నేమనుమనెను
రవికులేంద్ర భారము ప్రాణంబనె
ఇవల నెట్లు ధరించేననె
ఇంకానేమనె యింతి మరేమనె
కొంకక యేమని కొసరుమనె
బొంకుల దేహము పోదిది వేగనె
చింకవేఁట యిటు చేసెననె
నను నేమనె ప్రాణము మనకొకటనె
తనకు నావలె తాపమనె
మనుకులేశ ప్రేమపు మనకూటమి
ఘన వెంకటగిరిఁగంటిననె (4-97)"
ఇదె శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె (26.229)

అన్నమయ్య నిత్యారాధన లందుకొను స్వామివారి విగ్రహము ఒక మారు కానరాక పోగా

"ఇందిరారమణుఁదెచ్చి యియ్యరో మా కిటువలె
పొంది యీతనిఁబూజింపఁ బొద్దాయ నిపుడు" -అన్న అధ్యా 373

అని అంజనీ తనయుని, ఖగరాజు గరుడుని, ప్రహ్లాదుని, అర్జునుని, శ్రీ వేంకటాద్రివైన శేషమూరితిని తెచ్చి ఈయమని ప్రార్థించుచు, తిరుమల దేవాలయ పాత కళ్యాణమంటపములోని కార్తవీర్యార్జనుని కూడ

"కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీ వేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే"

అని వేడుకొనెనేమోనని భావింప వీలగుచున్నది. కృష్ణుని రాసక్రీడను వర్ణించిన సంకీర్తనము మరొకటి

వాఁడే వాఁడే అల్లరివాఁడదివో
నాఁడు నాఁడు యమునా నదిలోన
కాంతలు వలయపు కంకణ రవముల

నంతంత కోలాటమాడఁగాను (25.343)

ఈ నృత్యమును శిల్పముననును మనము గానవచ్చును.

తిరుమల ఆలయ గోపుర శిఖరమున మకర తోరణములతో నరసింహ స్వామి, వరాహస్వామి, అనంతుడు, వైకుంఠనాధుడు మున్నగు ప్రధాన శిల్పమూర్తులు నాలుగు దిక్కుల ప్రకాశమును విరజిల్లుచున్నవి. బహుశః అన్నమయ్య ఈ నరసింహ స్వామి మూర్తిని ఇట్లు వర్ణించెనేమో! (7 సం. 55) 160 రేకు

"జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాద వరద
శ్రీవనితా సంశ్రిత వామాంక
భావజకోటి ప్రతిమాన
శ్రీ వేంకటగిరి శిఖర నివాస

పావన చరిత ప్రహ్లాద వరదా"యని శ్రీ వేంకగిరి శిఖర నివాసునిగా ప్రస్తుతించి నరసింహస్వామిని ప్రహ్లాద వరదునిగను వర్ణించెను.

ఈ విధముగా ఆలయము, సంగీత, నృత్య శిల్ప కళలు అన్నమయ్యకెంతో స్ఫూర్తినిచ్చెను.

## నాల్గవ అధ్యాయము - అధస్సూచికలు

1. Sambamoorthy, P. 1960, History of Indian Music, Madras : The Indian Music Publishing House
2. వెంకటరామన్, ఎస్, 1985, అరయర్ సేవై Tirupati : T.T.D.
3. See. No. 1 Samba Murthy, P. 1960. History of Indian Music
4. నమ్మాళ్వారు, తిరువాయ్ మొళి, 2వ పత్తు-4.
5. ఆండాళ్ - తిరుప్పావై.
6. Krishna murthy, H. 1998 Deities, Dance and Music article, Bhavanis Journal, Mumbai, Bharatiya Vidya Bhavan.
7. ఆనందమూర్తి, వేటూరి, 1974 తాళ్లపాక కవుల పదకవితలు వివిధ సాహితీ ప్రక్రియలు, హైదరాబాద్ : శ్రీనివాస్.
8. See No. 1
9. Hariharan Gouri Kuppuswamy, 1989. An anthology of Indian Music

Delhi : Sandeep Prakasam.

10. Ibid

11. నాగయ్య, జి. 1955 తెలుగు సాహిత్య సమీక్ష తిరుపతి పరిశోధక ప్రచురణలు 2వ సంపుటము.

12. Ibid

13. Ibid

14. Samba murthi, P. 1960, History of Indian Music, Madras : The Indian Musci publishing house.

15. Samba murthi P. 1960 History of Indian Music Madras : The Indian Music Publishing House.

16. తాళ్ళపాక అన్నమాచార్య జయంతి ఉత్సవ సంచిక P-3 సం॥ రాజగోపాలరాజు పి.యస్ - 1978.

ఐదవ అధ్యాయము

# విషయ సూచిక


| | |
|---|---|
| ఆలయము - అర్చన | 192-194 |
| షోడశోపచారములు | 194-195 |
| ఆలయములో నిత్యారాధన | 195-197 |
| గురువార విశేషము | 202-203 |
| శుక్రవార తిరుమంజనము | 203-206 |
| తిరుపతి ఆలయములో కొలువు, ఏకాంతసేవ | 206 |
| శ్రవణ నక్షత్రోత్సవము | 206-207 |
| శ్రీకృష్ణ జన్మాష్టమి | 207-211 |
| ఉట్ల ఉత్సవము | 212 |
| శ్రీరామనవమి | 212-213 |
| అధ్యయన ఉత్సవము | 214-215 |
| ఏకాదశి, ద్వాదశి ఉత్సవము | 215-217 |
| ప్రణయ కలహ ఉత్సవము | 217-218 |
| ధనుర్మాసోత్సవము | 218-220 |
| శ్రీ మలయప్ప ఆస్థానము | 220-221 |
| బ్రహ్మోత్సవము | 222-225 |
| కళ్యాణోత్సవము | 225-227 |
| కోడై తిరునాళ్ళు, తెప్పోత్సవము | 227-228 |
| పార్వేట | 228-229 |
| ఉత్సవ తిరుమంజనము | 229-230 |
| చక్రత్తాళ్వార్ | 231-232 |
| రథోత్సవము | 232-233 |
| ఫలోత్సము | 233-234 |
| ఇతర కవులు | 234-238 |
| అథస్సూచికలు | 238-240 |

# ఆలయము ఆరాధనోత్సవములు

ఆలయములు ఆరాధనకు, ఉపాసనకు భగవత్సాక్షాత్కారమునకు కూడలి స్థలములు. వైదిక కాలమున మానవుడు దేవ, పితృ, భూత, మనుష్య, బ్రహ్మ అనెడి పంచ మహాయజ్ఞములను నిర్వర్తించుచుండెడివాడు. నాటి పంచ మహాయజ్ఞములకు ప్రతీకలుగా ఆలయములలో ధృవ, కౌతుక, స్నపన, ఉత్సవ, బలి పంచ బేరములు ప్రతిష్ఠించబడుచున్నవి. "పరిగి నీ ముందరను పంచబేరములుండగా" (1-130) సంకీర్తనలో వర్ణించిరి.

ఆలయములలో సూర్యోదయము మొదలు సూర్యాస్తమయము వరకు జరుగు ఆరాధన పద్ధతులను క్రమపద్ధతిలో నిర్దేశించు శాస్త్రమే ఆగమశాస్త్రము. ఆలయము నొక మహిమాన్విత శక్తి నిలయముగా తీర్చి దిద్దునదీ ఆగమశాస్త్రమే. విగ్రహమున భగవచ్ఛక్తిని నిలుపుటకు మంత్ర, తంత్ర యంత్రములు సాధనములు.

వైఖానస, పాంచరాత్రము లనెడివి రెండు వైష్ణవ ఆగమములు. విఖనస మునిచే వ్రాయబడిన కల్ప సూత్రము వైఖానస ఆగమమునకు మూలభూతము, భృగు, మరీచి, అత్రి, కశ్యప మహర్షులు వైఖానసాగమ మూలగ్రంథ కర్తలు, వైఖానసాగమము జ్ఞాన, యోగ, క్రియ చరిత మార్గములలో ప్రతిపాదించబడినవి. విష్ణువును మంత్రార్చనతో సేవించిన యెడల మోక్షప్రాప్తికి దోహదము నిచ్చునని పండితుల వచనము [1] ఈ ఆరాధన (1) మానస పూజ (2) హోమపూజ (3) బేరపూజ అని మూడు విధములు.

హృదయ మధ్యమందు నారాయణునికి మానస పూజ.

"ఇంతకంటే నేమి సేసే మిదే మా మానస పూజ
సంతతము నీవు తొల్లే సర్వ సంపన్నుఁడవు 2.272

యాగక్రియ జరిపినచో అది హోమపూజ. ఈ రెండు పూజలను అమూర్తార్చన మనియెదరు.

ఏమిటి వాఁడఁగాను యిఁక నేను నా
సొమపు గర్మము నీకే సమర్పయామి 11-166

అన్నమయ్య తనను, తన కర్మమును యాగభావనతో భగవదర్పణ చేసెను.

# ఆలయము-అర్చన

చక్కని స్వరూపముగల 'విష్ణువు' విగ్రహమును అర్చించిన యెడల అది 'బింబార్చన' మనబడును. ఈ బింబార్చన రెండు విధములు.

ఆలయార్చా గృహార్చా చేత్యుభయం శ్రుతి చోదితమ్ [2]

(1) ఆలయార్చన (2) గృహార్చన

"అన్నిటా నీవే వుందునందువు గాన
యిన్ని నీవు పుట్టించిన వివి నీ సొమ్ములే
నిలిచిన రూపులెల్లా నీ గుళ్ళు గాదలఁతు
మెలఁగేటి చైతన్యము మిమ్ముగా దలఁతు" (రేకు 167) (2-324)

స్వామి సర్వాంతర్యామి కావున నిలిచిన రూపులన్నింటిని 'ఆలయములు'గను చైతన్యమును భగవంతునిగా భావించి పూజించెదనని 'అర్చన'ను కొనియాడెను.

"ఇతరులకు నిను నెరుఁగదరమా
ఆగమోక్త ప్రకారాభిగమ్యులు మహా
యోగు లెరుగుదురు నీవుండేటి యునికి" -41 రేకు (1-252)

"వావిరి ముమ్మారు వలగొని వచ్చితి
నీ వారమైతిమి నిలిచితి మిపుడు" 167 రేకు అని ఆలయమును ముమ్మారు ప్రదక్షిణము చేసి స్వామివార మైతిమని ఆలయ పవిత్రతను అన్నమయ్య వివరించెను.

ఆలయమున ఏకోపచారము నుండి అష్టోత్తర శత ఉపచారముల వరకు ఆయా సందర్భములను బట్టి ఉపచారములు ఆచరింపవలయునని ఆగమములచే నిర్ణయించ బడినవి. భగవదనుగ్రహము కొరకు చేయు కృత్యములే ఉపచారములు. ఉపచార మునకు విగ్రహమని భోగమని పర్యాయ పదములు చెప్పబడినవి[3] ఉపచారములు షోడశోపచారములు, ద్వాత్రింశద్యుపచారములు చతుష్షష్ట్యుపచారములు ఆగమశాస్త్ర ప్రమాణములు. ఉపచారములతో కూడిన అర్చన ఆరు విధములు. (1) మంత్రాసనము (2) స్నానాసనము (3) అలంకారాసనము (4) భోజ్యాసనము (5) యాత్రాసనము (6) పర్యంకాసనము.

ఆగమశాస్త్ర ప్రమాణములైన షోడశోపచారములు నిత్యారాధనగా భావించవచ్చు. విశేష దినములలోను, ఉత్సవ దినములందును ద్వాత్రింశ, చతుష్షష్ట్యుపచారములతో ఆరాధనలు ఆలయములో జరుపబడును. నిత్యారాధన, విశేషారాధన ఉత్సవ ఆరాధనా విశేషములు అన్నమయ్య సంకీర్తన రచనలు కొన్నింటికి స్ఫూర్తి నొసగినవి. అన్నమా చార్యుల జీవితమును పరిశీలించిన ఆలయములతో వారికి గల అవినాభావ సంబంధము కొంత అవగాహన మగును. అన్నమాచార్యుల కొన్ని సంకీర్తనల స్ఫూర్తికి కారణమైన ఆలయ ఆరాధన ఉత్సవముల విశేషముల కొన్నింటిని ఈ ప్రకరణమున చూచెదము.

"షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి
అలరు విశ్వాత్మున కావాహన మిదె పర్వ
నిలయున కాసనము నెమ్మినిదె
అలగంగాజనకున కర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదె
వర పీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధ పుష్పధూపములు
తిరమిదె కోటి సూర్య తేజునకు దినము
అమృత మధునకు నదివో నైవేద్యము
గమించంద్ర నేత్రునకుఁగప్రవిడెము
అమరిన శ్రీ వేంకటాద్రి మీఁది దేవునికి
తమితో బ్రదక్షిణాలు దండములు నివివో" (రేకు 133) (2-134) ఇట్లు శ్రీ వేంకటాద్రి మీది దేవునకు దినము షోడశోపచారములతో ఆరాధన జరుగుచున్నదని 'తమితో ప్రదక్షిణాలు' తడి వస్త్రములతో చేయు అంగప్రదక్షిణమును గురించి 'దండములు' అనగా సాష్టాంగ దండప్రణామములను భక్తులు చేసెడివారని ఈ సంకీర్తనలో మనకు తెలియజేసెను. తిరుమల ఆలయమున అనుదినము జరిగెడి ఆరాధన స్ఫూర్తి ఫలితమే ఈ సంకీర్తనయని తోచుచున్నది.

## షోడశోపచారములు

షోచశోపచారముల వివరణను కొంత పరిశీలించుట ఆవశ్యకము [4]

(1) ఆసనం : సింహాసనమును కల్పించుటయే ఆసనం

(2) స్నానం : గంగాజలం (లేక) పాలతో (లేక) పెరుగుతో స్వామివారికి అభిషేకము జరిపించుట.

(3) స్నానాంతరము, వస్త్రాద్యలంకారము, తిలకధారణ, ఆభరణములు మున్న గునవి.

(4) పాద్యం : పాదములను కడుగు ఉపచారము.

(5) ఆచమనం : నీటిని భగవంతునకు దానముచేయుట.

(6) పుష్పం : పుష్పమును స్వామికి సమర్పించుట

(7) గంధం : నాభికిపై భాగమున శరీరమంతటా గంధలేపనము

(8) ధూపం : పరిమళమునకై స్వామి వాసస్థానమున సువాసనలతో చేయు ఉపచారము.

(9) దీపం : లోపల, వెలుపల జ్యోతి స్వరూపము, మహాదీపమని ప్రఖ్యాతి చెందినది.

(10) అర్ఘ్యం : శీతలోపచారము.

(11) ఆచమనం :

(12) హవిః : అన్నమని భావము నైవేద్యము.

(13) పానీయం : అన్న నివేదన పిమ్మట పవిత్రమైన శుద్ధోదకము సమర్పించుట

(14) ఆచమనం :

(15) ముఖావాసం, ప్రదక్షిణం, భోజనానంతరము తాంబూల సమర్పణ - ముఖవాస ఉపచారము.

భగవదనుగ్రహమునకై ప్రదక్షిణ మాచరించుట మున్నగు పదహారు ఉపచార ములు పై సంకీర్తనలో పేర్కొనబడినవి.

ఆరు రకములైన అర్చన విధానములో ఈ షోడశోపచారములు జరుపబడును [5] మంత్రాసనలో ఆవాహన, స్నానాసనమున అభిషేకము, అలంకారాసనమున పుష్ప వస్త్ర ఆభరణములతో అలంకరణ, భోజ్యాసనమున అన్నము నివేదన యాత్రాసనమున బలివేయుట పర్యంకాసనమున శయనింపజేయుట మున్నగునవి నిత్యారాధన కార్యములు.

వైఖాసన గ్రంథము యజ్ఞకర్మకు విగ్రహారాధనకు గల పోలికలు పరిశీలించి విగ్రహారాధనను యజ్ఞముగా భావించి యజ్ఞవిధికి గల అంశమును దేవాలయారాధనలో పొందుపరచినది. ఈ గ్రంథములో యజ్ఞకర్మ నుండి దేవాలయ పూజాదశ పరిణామక్రమము స్పష్టముగా వివరించబడినది. ఆలయములలో భగవదర్చన ఆరు కాలములలో చేయవలయునని ఆగమశాస్త్రము నిర్దేశించుచున్నది. ఈ విధమైన 'అర్చన' విధానము అన్నమయ్య కనేక రీతుల ఎట్లు స్ఫూర్తి నిచ్చినవో గమనించెదము.

## ఆలయములో నిత్యారాధన

సామాన్యముగా ఆలయములలో ఆరాధన 'మేల్కొలుపు'తో ప్రారంభమగును. తమిళములో ఈ ఆరాధనను 'తిరుప్పళ్లి ఎళుచ్చి' అని వ్యవహరింతురు. సాధారణముగా విష్ణ్వాలయములో శ్రీ తొండరడిపొడి ఆళ్వార్లు రచించిన పాశురములను పాడెదరు. మధ్య

యుగము నందు అనగా ఆళ్వార్లు, నాయనమార్ల కాలమున ఈ సేవ భగవత్సేవగా కొనియాడబడినది. తిరుమలయందు స్వామికి అన్నమయ్య 'మేల్కొలుపు' పాటలనేక రీతులలో సమయానుసారము రచించిరి. తొండరడిప్పొడి ఆళ్వార్లు 'అరంగత్తమా పళ్ళిఎళుందరుళాయే' అనగా 'రంగనాథా నిదురలెమ్ము' అని పది పాటలతో మేల్కొ లుపు పాడగా అన్నమయ్య

మేదినీ జీవులఁగావ మేలుకోవయ్యా
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
నెగడిన పరంజ్యోతి నిద్రమేలుకోవయ్యా
మినుకు శశివర్ణుండ మేలుకోవయ్యా
జనక యాశ్రిత పారిజాత మేలుకోవయ్యా
మెరయు దోషారహిత మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్య భోగములు భోగించ

నిరతి శ్రీవేంకటేశ నేఁడు మేలుకోవయ్యా" 11.3.163 అని స్వామికి మేలుకొలపు పాడెను.

మూలమూర్తి తిరుమల ఆలయమున స్వయంభువగుటచే కౌతుకమూర్తియైన భోగ శ్రీనివాసమూర్తిని సూత్రములచే (వెండి) జోడింపబడినది.[6]

"మేలుకొనవే భూలలనాధిప భోగిశయన" అనెడి సంకీర్తన భోగ శ్రీనివాస స్వామి నుద్దేశించి పాడినదిగా తోచును.

తిరుమలలో స్వామి వారికి "సుప్రభాత పఠన" తెల్లవారు జామున రెండున్నర గంటలకు బ్రాహ్మీ ముహూర్తమున జరుగును. మేల్కొలిపెడి ఈ ఆచారము మొదట రాజులకు చెందినదిగా చరిత్రలో మనకు కానవచ్చుచున్నది. "తుయిలెళునిలై" అనగా "మేల్కొలుపుట" అని అర్థము. శయన మందున్న శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని వారి సన్ని ధానము నుండి నిదుర మేల్కొలిపి శ్రీవారి సన్నిధానము వారి స్వస్థానమందు వేంచేపు చేసెదరు. తెరవేయగా అర్చక స్వామి శ్రీ స్వామివారికి వెన్న, పాలు, పంచ దార నివేదన చేసెదరు.[7] అన్నమయ్య

"ఏ పొద్దు చూచినా దేవుడిట్లానె యారగించు
రూపులతోఁబదివేలు రుచులైనట్లుండెను
పలు జలధుల వంటి పైఁడి వెండి గిన్నెలు
వెలిగొండలంతలేసి వెన్నముద్దలు
బలసిన చిలుపాలు పంచదారగుప్పఁగాను

అలరు వెన్నెల రసమందించె నట్లుండెను" అని వర్ణించెను. (9-10)

కర్పూర లవంగ జాజీ క్రముకాది చూర్ణముతో కూడిన సుగంధి ముఖ వాసమును సమర్పించి నీరాజనము చేసెదరు. పిమ్మట మంగళాశాసన పఠనము. అటు పిమ్మట సువర్ణ ద్వారము తలుపులు తెరువబడును. అప్పుడు శ్రీ స్వామివారికి కర్పూర హారతి ఇవ్వబడును. స్వామి వారిని దర్శించవచ్చును. ఈ దర్శనమును ' విశ్వరూప దర్శనమని వ్యవహరింతురు. ఈ వేళ 'బ్రహ్మతీర్థ'మను పేరుతో తీర్థమును భక్తులకు వినియోగము చేసెదరు. ఆలయమున రాత్రి పూజానంతరము బ్రహ్మాది దేవతలు పూజచేసి తీర్థ స్వీకారము చేయగ మిగిలిన శ్రీవారి తీర్థము 'బ్రహ్మతీర్థము'గా వ్యవహరింపబడుచున్నది. పిమ్మట వైఖానస శాస్త్రానుసారము శ్రీ కౌతుక మూర్తియైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని చతుష్కోణాలంకృతమగు రజతమయ పీఠమునందు వేంచేపు చేసి పురుష సూక్తముతో అభిషేకమును (తిరుమంజనము) ప్రారంభించెదరు.[8]

## తిరుమంజనము

వేదవేత్తలైన శ్రీవైష్ణవ స్వాములు పురుష సూక్తమును పఠించుచుండగా అభిషేక మును పూర్తి చేసెదరు. పిమ్మట శ్రీవారికి వస్త్రాభరణ పుండ్రాదులు సమర్పించి శ్రీవారి సన్నిధానమున వేంచేపు చేసెదరు. తరువాత శ్రీవారి స్వయం వ్యక్త స్వామి వారి "సువర్ణ పాద తొడుగులను స్నానపీఠము నందుంచి అభిషేకము చేసి శ్రీవారి పాదాబ్జముల యందు సమర్పింతురు.

"మలసేటి వినయపు మాటలు వేదమంత్రాలు
వెలసె మజ్జన వేళ వింతలాయలె మీకు" 25.292

పురుషసూక్త పఠనము తిరుమంజనవేళలో జరిగెడిదని అన్నమయ్య తెలియజెప్పను. నిత్యమీ విధముగా అభిషేకము జరుగును.

"యెన్నోశిరసులట యెన్నో పాదములట
యెన్నరాని చేతులట యిట్టి నీ మూర్తి"

అదే విధమైన భావములను వ్యక్తపరచి అన్నమయ్య సంకీర్తనలు చేయుటకు కారణమని తోచును.

ప్రతిరోజు "తోమాలసేవ"కు ముందుగ భోగ శ్రీనివాసమూర్తికిని, శుక్రవారమునాడు మూలమూర్తికిని, ఉత్సవములలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికిని అభిషేకము జరుగును. ఈ విధమైన వివిధ మూర్తులకు జరుగు తిరుమంజనము అన్నమయ్య సంకీర్తనలలో

మనము గాంచవచ్చును.

"మదనజనకునికి మజ్జనవేళ
పదివేలు భోగముల పరగీనదె
వున్నతి వేదఘోషాల నుర్వీ ధరుని మీఁద
పన్నీటి కాలువలు పారీనదె
అలమేలు మంగపురమందు నెలకొని యట్టె
సలిగె గృపారసము చల్లీనదె" 8-1-63.

పై సంకీర్తనలో 'అమేలుమంగపుర మందున్నదని సూచింపడినది కాన ఈ తిరుమంజనము కౌతుక మూర్తికి జరిగెడిదని తెలియుచున్నది. అన్నమయ్య "నీ గొప్ప పురము నెట్టన శ్రీ వేంకటేశ నీవు నన్నుఁగూడియట్టె కట్టుకొంటి వాపె పదకము నీ మెడను" 29-215 యని కౌతుకమూర్తి వురమున అలమేలు మంగ పదకము'ను మూలమూర్తి మెడలో అలమేలుమంగ తాళి కలదని వివరించెను.

తిరుమంజనమును గురించి వ్రాసిన సంకీర్తనలలో "అలమేలు మంగ" వురము నందున్న కౌతుక మూర్తియని, మెడలో తాళిగా నున్నచో మూలమూర్తియని మనకు అన్నమయ్య వ్యక్తపరచెను.

"అప్పఁడైవాలరాయఁడాది మూలమీతఁడు
యిప్పుడిట్టి మహిమల నెక్కుడాయ నీతఁడు
చేకొని తొలితొలుతే చేసిన పన్నీరు కాపు
తెప్పలుగా గుప్పినట్టి తెల్లని కప్పురకాపు
పొందుగ నంతటి మీఁదఁబూసిన పునుగు కాపు
అలది శ్రీ వేంకటేశ్వరుకదెయలమేలుమంగ
చెంది యరతఁగట్టంగా శ్రీవిభుఁడై నిలిచె" 2-50

ఈ సంకీర్తన మూలమూర్తికి జరిగిన అభిషేకమును గూర్చినది కాన అలమేలు మంగ అరత కట్టగా శ్రీవిభుడై నిలిచెనని వర్ణించెను.

ప్రతిదినము శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రెండు మార్లు తోమాలసేవ ఘనముగా జరుగును. ఈ సేవ తిరుమంజనము పిమ్మట జరుగును.

# తోమాల సేవ

ఉదయము, సాయంత్రము ఈ సేవ జరుగును. అలంకారాసనములోని పుష్ప మాలాలంకరణ 'తోమాలసేవ' పేరుతో సాగుచున్నది. పూవులను మాలగా చేయుట అనగా 'తొడుత్తమాల' తమిళ శబ్దము 'తోమాలసేవ'గా రూపొందినది. 'తోమాలసేవ'అను పేరుతో వైభవముగా సాయంత్రము కూడా జరుగును. జియ్యంగార్లు ఆలవట్టము(పట్టు విసరె)తో విసరుచు దివ్యప్రబంధమును గానము చేయుచుందురు. అర్చకస్వామి ఉప చారములను పూర్తిచేసి అలంకారాసనములో తోమాలసేవ ప్రారంభము చేయుచు,[9]

"మందరధరునకు మజ్జన వేళా" (2 రేకు) (1-12) అనెడి సంకీర్తనలో

అమరాధిపులిడుఁడాల వట్టములు
కమలజ పట్టుము కాళాంజి
జమలి చామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు
వేదఘోషణము విడువక సేయుఁడు

ఆది మునులు నిత్యాధికులు" అని వర్ణించెను. ఆలవట్టములు విసరుట, విడువక చేయు వేద ఘోషణములు 'తోమాలసేవ' సూచకమేమో!

**శ్రీవారి కొలువు :**

కొలువు శ్రీనివాసమూర్తి సువర్ణ ద్వారమునకు ముందుగల 'ఆస్థాన మంటపము' నందు అమర్చిన సింహాసనమునకు సువర్ణ ఛత్రము, వింజామరలతో వేంచేసి సింహా సనము నధిష్ఠించెదరు. అర్చకస్వామి శ్రీవారికి రాజోపచారములను చేసెదరు. అద్దం, చామరము, గొడుగు, వ్యజము, అశ్వము, నాట్యము, గానము వాద్యము, వైష్ణవ మంత్రోచ్చారణలు రాజోపచారములు, చతుర్వేదములను ఉపనిషత్తుల, పురాణేతి హాసములను బ్రహ్మసూత్రములను శ్రీవారికి వినిపించెదరు. అటు పిమ్మట ఆనాటి తిథి వార నక్షత్ర యోగకరణములను గ్రహసంచార విశేషములతో ఉత్సవాది విశేషము లను వినిపించెదరు. పిమ్మట నివేదనము, హారతి జరుగును. కొలువుమూర్తి మహారాజ మర్యాదలతో స్వస్థానమునకు వేంచేయుదురు. ఈ కొలువులోనే అనుదినము 'నిత్యాన్న దాన పథకం దాతలపేర్లు స్వామి వారికి వినిపింతురు.'

సూర్యోదయమునకు పూర్వము కొలువు స్నపన మండపము నందు, సూర్యోదయమైన పిమ్మట, కొలువు, బంగారు వాకిలి ముందున్న ఘంటా మండపము నందు జరుపబడును.

ఘనంగా మండపము దాటి రాని ఈ కొలువు మూర్తిని అందరు దర్శింప వీలుకాదు. [10] ఈ దర్బార్‌లో బంగారు సింహాసనముపై కొలువైన శ్రీనివాసమూర్తి దర్పమును గాంచిన అన్నమయ్య

"తమి తోడఁగనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పెనదే విచ్చేయవే
హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతమగు వాకిటను నిలిచినాఁడు
సురులు నీ యవసరము చూచుకొని కొలువునకు
సరది నాఇత్తపడి సందడించేరు." (2-436) అని వర్ణించెను.

పిదప శ్రీ స్వామివారికి సహస్ర నామార్చనము జరుగును. అనంతరము భోజ్యా సనము ప్రారంభమగును. అటు పిమ్మట యాగశాల యందు హోమము జరుగును. స్వామికి అన్నమును నివేదన చేయుట హవిః ఉపచారము ఇది శుద్ధ, మౌద్గిక, పాయస, కృసర, గాల్వ, యావకములని ఆరు విధములు[11] స్వామికి అనేకరకములైన పదార్థము లను నివేదించెదరు.

"కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుదెరఁగులైన అప్పములగములు
నెలకొన్న నేతులు నిరంతపు చక్కెరలు
గిలుకొట్టుచును నారంగించవయ్యా
పెక్కువగు సైఁదంప పిండింటల మీఁద
పిక్కటిలు మెరుఁగుఁబొడి బెల్లములును
వొక్కటిగాఁ గలపుకొని వొలుపుఁబప్పుల తోడ
కడుమధురమైన మీఁగడపెరుగులను మంచి
అడియాల వూరుఁగాయల రుచులతో
బడిబడిగా నవకంపుఁబళ్లెరంబుల తోడ
కడు నారగించు వేంకట గిరీంద్ర" 1-138

పైన చెప్పిన వివిధ పదార్థముల నైవేద్యముతో "నవకంపుఁబళ్ళెరంబుల తోడ" అని అన్నమయ్య వర్ణించెను. స్వామి ఒక మారు ఆరగించిన పళ్ళెమును మరల ఉపయోగించరు. మరల మరల భోజనమునకు కొత్త కొత్త పళ్ళెముల నుపయోగించెదరు. ఆ పళ్లెములు

'మట్టికుండలు'. ఒక మారారగించనంతనే మరల మరొక దానిలో ఆరగించుటచే "నవకంపు పళ్ళెరము"లని అన్నమయ్య వర్ణించెను. "తోమని పళ్ళాలవాడు" అని మరొక సంకీర్తనలో వర్ణించెను.

భోజ్యాసనమయిన పిమ్మట యాత్రాసనం. అనగా పరివారదేవతలకు బలి ప్రదా నము జరుగును. అర్చకస్వామి విమాన ప్రదక్షిణము గావించి గరుడ, విష్వక్సేనాదులకు బలి నర్పించును. ఆ ఉపచారము నేమో అన్నమయ్య ఇట్లు వర్ణించెను.

"చండప్రచండాది జయవిజయులన్
అండఁబూజించి హరికటుగదా పూజ" 11-2-9.

అనెడి సంకీర్తనలో జయవిజయులతో సమస్త పరివారదేవతలను అనగా విష్వక్సేనా నంతగరుడపాద సంవాహినులను శంఖచక్రాది ఆయుధములను పూజించి, కిరీట కుండలహార కౌస్తుభ పీతాంబరాదులతో వేంకటేశుని పూజించు 'తిరువారాధన' క్రమ మును వివరించి 'యివిదం దళిగలు పెట్టుఁడిది గదా పూజ' అని వర్ణించెను. ఈ సంకీర్తనలో సత్సంప్రదాయ శిష్టాచార యుక్తమైన 'తిరువారాధన' క్రమము తెలుప బడినది. నిత్యము శిష్టాచార సంపన్నులీ రీతిని ఈ సంకీర్తనను పరిశీలించిన పూజా విధానముతో బాటు 'బలి' సమర్పించు పరివార దేవతా క్రమమును తెలియజేసే నేమో! నని తోచును. బలికి పిమ్మట "శాత్తుమొర" సేవ అనిన తిరుప్పావైలోని చివరి రెండు పాటలు పాడి శ్రీవారిని సేవించుకొనుట. ప్రాతః కాలారాధనము ఈ విధముగా సాగును.(12)

మాధ్యాహ్ని కారాధనము సంకల్పముతో ప్రారంభమై, ఉపచారములతో అష్టోత్తర శతనామావళి జరగి మధ్యాహ్నిక నివేదన జరుగును. పిమ్మట శ్రీ భూదేవులతో మలయప్ప స్వామి వారు కల్యాణోత్సవమునకై మంటపమునకు వేంచేసి సాయంకాలము వరకు భక్తులకు దర్శనమిచ్చెదరు.

సాయంసమయమున అర్చకస్వామి ఉపచారములయినంతనే 'తోమాల సేవ' దివ్య ప్రబంధగానముతోను, మంత్రపుష్పము, నక్షత్ర హారతి పిమ్మట నివేదన జరుగును. "అరిది యప్పాలు నన్నాలారగించువేళ"యని నివేదనలను అన్నమయ్య తన సంకీర్తనలలో అక్కడక్కడ తెలిపెను.

తదుపరి గర్భాలయమునకు ముందు వెండి గొలుసులతో బంగారు మంచమును అందు పట్టుపరుపులు, పట్టు దిండ్లు, పట్టు శాటీలు మున్నగు శయన పరికరముల నేర్పాటు చేసెదరు. శ్రీ భోగ శ్రీనివాస స్వామిని సువర్ణశయనాసనములో వేంచేపు చేసె దరు. బహు

విధములగు ఫలములు, ద్రాక్ష, శక్కర, క్షీరము, కలకండ మొదలగు వాటిని, తాంబూలమును శ్రీవారి సన్నిధానమున నుంచెదరు.[13] శ్రీవారికి ఏకాంత సేవను అన్నమయ్య ఇట్లు వర్ణించెను.

"బయ్యెన బంగారు తూగుటుయ్యాల మంచము మీద
పయ్యెద చెరగు జీర బవ్వళించు (12-58)
నిచ్చఁబండుగలు సేసీ నెలఁత ఇదివో నేఁడు
విన్ననైన తరితీపు విందుల కజ్జాయముతో
వాఁగేటి పూర్వుల మోఁత వాద్యాలతో" (30-145)

ఏకాంత సేవలో పాలు, ఫలాలు, చక్కెర, మున్నగు వాటితో చేసిన దానిని అనగ 'కజ్జాయము'[14]ను నివేదించెదరని, పై సంకీర్తనలో అన్నమయ్య తెలిపెను.

## గురువార విశేషము : పూలంగి

ప్రతి గురువారము శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నిత్య కైంకర్యములో 'అన్నకూటోత్సవము' అనెడి విశేషము జరుగును. ఈ విశేషమును 'తిరుప్పావడ' సేవ యని వ్యవహరింతురు.

ఆరు మూటలు పరిమాణము గల తండులముతో తయారు చేయబడిన అన్న ప్రసాదమును గంగాళములతో తెచ్చి తెర మధ్య భాగమున శ్రీవారి దృష్టి ప్రసారము కలుగునట్లు అన్నరాశిని చేయుదురు. మామూలు ప్రసాదములు, విశేష ప్రసాదములను శ్రీవారి దృష్టి ప్రసరించునటులు చేసెదరు.

"మేరు మందారాల వలె మెరయునిడ్డెనలు
సూరియ చంద్రుల వంటి చుట్టుఁబళ్ళేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను"

లడ్డు, వడ, అప్పం, దోసె జిలేబి ప్రసాదములను సూర్యచంద్రుల వంటి చుట్టు పళ్ళేరములని, రాజాన్నలే బోరన చుక్కలు రాసి పోసినటులుండెను అని అన్నకూటోత్సవము నిట్లు అన్నమయ్య సూచించెనేమో.

గురువారము నాటి సాయంత్రము మామూలు పరదాను తీసివేసి బంగారు వాకిలి వద్ద పూలంగి పరదాను, అనగా మధ్య భాగమున శ్రీవారి ప్రతిమతో అతి రమణీయముగా తయారింపబడిన 'వెల్వట్టు' పరదాను కట్టెదరు. ఏకాంతముగా శ్రీ స్వామి వారికి పుష్పాలంకారమును చేసెదరు. వివిధములై విచిత్రములై, రమణీయములై యున్న పుష్ప మాలికలతో శ్రీవారి వస్త్రరూపముగను, ఉత్తరీయ రూపముగను ఆభరణ రూపముగను,

కిరీట శంఖ, చక్ర రూపముగను అలంకరించి 'సూర్య కఠారి' అను ఖడ్గమును శ్రీస్వామివారి వామ హస్తము నందుంచి పుష్పమాలలతో అలంకరించెదరు. పూలంగి సమర్పణానంతరము కర్పూరహారతి చేసెదరు.[15] ఈ 'పూలంగిసేవ' నేమో అన్నమయ్య ఇట్లు కీర్తించెను.

"కంటిఁగంటి నిలువు చక్కని మేని దండలును
నంటుఁజూపులను జూచే నవ్వుమోము దేవుని
కనకపు, బాదములు గజ్జెలు నందెలును
ఘన పీతాంబరముపై కట్టు కటారి
మొనపి యొడ్డాణపు మొగపుల మొలనూలు
ఒనర నాభీకమల ముదర బంధములు
గరిమ వరదహస్త కటి హస్తములును
సరసనెత్తిన శంఖచక్ర హస్తములు
ఉరములపై కౌస్తుభ మొప్పగు హారములు"-శేషాచార్య వ్రాతప్రతి

మరియు

"దేవతలు సేవించఁగా దివ్య దుందుభులు మ్రోయ
శ్రీ వల్లభుని భావము చెలులెల్లఁజూడరే"

అనెడి సంకీర్తనలో (29.376)

"తలకొన నంతటాఁబూదండలు వేసి
చెలరేఁగి యారగించి శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువై వున్న భావము కొమ్మలెల్లఁజూడరే" అని తల నుండి కొనవరకు పూదండలని 'పూలంగి'ని గూర్చి వర్ణించినట్లున్నది.

తిరుమళిశై ఆళ్వారు 'వెణ్మల్లికైయుం నిఱైత్తుక్కొండు' అని వర్ణించిరి. అనగ తెల్లని మల్లెపూవులతో నింపబడిన స్వామి అని అర్థము చెప్పుకొనగా 'పూలంగి సేవ' నాడు జరుగుచెండెడిదని తెలియుచున్నది. శిలప్పదిగార గ్రంథమున గల వర్ణనలో "పోలమ్పూవాడైయిల్ పొలిత్తు తోన్ఱియ శెంగణ్ నెడియోన్" అని కలదు. తెలుగున చెప్పబడు 'పూలంగి' పదమునకు యదాతథమైన తమిళ పదమే ఈ 'పూవాడై' అనునది.

## మూలమూర్తి శుక్రవార తిరుమంజనం

ప్రతి శుక్రవారం సుప్రభాతానంతరము పునుగు, జువ్వాది మున్నగు సుగంధ ద్రవ్యములతో కూడిన మంగళాభిషేకము దివ్యసాలగ్రామ శిలామూర్తికి ఘనముగా

జరుపబడును. ఈ శుక్రవార అభిషేక సమయమున మాత్రమే వక్షఃస్థల లక్ష్మితో ఆవిర్భవించిన స్వయంవ్యక్త మూర్తిని ఆభరణాలంకరణలు లేకుండా యథాతథముగా భక్తులు దర్శించవచ్చును. స్వామి వక్షఃస్థలముపై కొలువైవున్న "ద్విభుజ వ్యూహ లక్ష్మి"ని కూడా ఈ అభిషేక సమయముననే సందర్శించవచ్చును.[16] శుక్రవారము నాటి మహోత్సవమును

"నిండు సింగారముతోడ నిలువుగోణము గట్టి
అండఁబన్నీటి మజ్జన మవధరించి
దండిగా శిరసున తడి సూడులు చుట్టుక
వుండెడి దేవుని భావమువిదలు చూడరే" -363 రేకు. అని ఈ సంకీర్తనలో పన్నీటి స్నానానంతరము అర్చకులు శిరస్సుకొక వస్త్రమును రమణీయముగా ధరింప జేయుటను వర్ణించెను.

కప్పురకాపు మేన కలయగ మెత్తిమెత్తి
చిప్పిలఁదట్టు పుణుఁగు చికిలిసేసి" అని కపుర పునుగు కాపులను, అటు పిమ్మట, "చొప్పుగా నవరత్నాల సొమ్ములు మేనఁజాతి ఇప్పుడున్న హరిభావ మింతులెల్లఁజూడరే" యని ఇరువది నాల్గు మూర సరిగ పట్టంచుతో ధోవతిని గట్టి పంౘ్రెండు మూరల ఉత్తరీయమును పల్లెవాటుగ వేసి రత్న కిరీటము, వైకుంఠ హస్తము కర్ణపత్రములు మకరకంటి సువర్ణ పీతాంబర ధారణ విశేషములను పై సంకీర్తనలో వివరించి స్వామిని

"చూచిన వారికెల్ల శోభనమై వుందువు
తాచిన శ్రీ వేంకటేశ దైవమై వుందువు
నాలుగు చేతుల తోడ నలినీవు నిలుచుంటే
చాలి కొమ్ముల కల్పవృక్షము వలె నుందువు
మేలిమి పీతాంబరాన మెరసి నీవుంటేను
వాలిన బంగారు రాశివలె నుందువు
జమళి పాదములతో సరినీవు నిలుచుంటే
అమరి యిహపరములందినట్టె వుందువు
తమి నీల వర్ణముతో దగనీవు నిలుచుంటే
గమిఁగనక వరుష కాలమేఘ మౌదువు" 27-446

అని స్వామి సౌందర్యమును వర్ణించెను. మరొక సంకీర్తనలో "సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణము గట్టి కంటి శుక్రవారమ"ని "పుష్పమాలాలంకరణ తొలగింపు" జరుగునని పిమ్మట

శుక్రవారము కోణము కట్టి అభిషేకము జరుగునని చెప్పెను. అది ఏ రీతిని చేయుదురో అన్నమయ్య

"పచ్చకప్పురమె నూరి పసిఁడి గిన్నెల నుంచి తెచ్చి నింపాదిగ నలఁది

తట్టపునుఁగె కూరిచి చట్ట చేరిచి నిప్పు పట్టి కరగించి వెండిపళ్లాల నించి

దట్టముగా మేను నిండ పట్టించి దిద్ది బిట్టువేడుక మురియు చుండే స్వామిని"

(శేషాచార్యుల వ్రాతప్రతి) అని సంకీర్తనలో వివరించెను.

శుక్రవారమునాటి దర్శనమును 'నిజపాద' సేవ యని వ్యవహరింతురు. ఈ ఒక్క రోజు మాత్రమే స్వామివారి నిజపాదములను (బంగారు తొడుగు లేకుండా) దర్శించవచ్చు. ఆ దర్శనమును గూర్చి "జమళిపదములతో సరి నీవు నిలుచుంటే" అని ప్రత్యేకముగా అన్నమయ్య తెలిపెను. శుక్రవారము నాటి అభిషేక తరుణమున ఆ పాదములను చూచి ఆనంద పరవశుడై 31 రేకు

"బ్రహ్మ కడిగిన పాదము

బ్రహ్మము తానే నీ పాదము" అని పాదమాహాత్మ్యమును సంకీర్తనగా కొనియాడెనని తోచును.

శుక్రవార తిరుమంజనోత్సవమున శ్రీహరి వక్షఃస్థలమున సువర్ణ ప్రతిరూపముగా వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ తాయారుల వారికి గర్భాలయమున సమంత్రకముగా పరిమళ ముతో హరిద్రతో అభిషేకము జరుగును. శ్రీవైష్ణవ స్వాములు ఆలయ అధికారులు కులశేఖరపడి ముందు భాగమున నిలిచియుందురు. అర్చక స్వామి సువర్ణ శంఖముతో 'హరిః ఓమ్ హిరణ్య వర్ణాం హరిణీం' ఇత్యాదిగా శ్రీ సూక్తమును పఠించుచుండగా స్వాములు అభిషేకము చేయుదురు. "శ్రీసూక్త" విషయ వివరణలతో అన్నమయ్య రచించిన

"జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి

ప్రియురాలివైహరికి, బెరసితి వమ్మా

పాల జలనిధిలోని పసనైన మీఁగడ

మేలిమి తామరలోని మించు వాసన

నీలవర్ణురముపై నిండిన నిధానమవై

ఏలేవు లోకములు మమ్మేల వమ్మా,

కందువ బ్రహ్మలగాచె కల్పవల్లివో

ఉందానవు మాయింటనే వుండవమ్మా.

పదియారు వన్నెలతో బంగారు ప్రతిమ

చెదరని వేదముల చిగురుబోడి -25.520

సంకీర్తన యిది, 'హిరణ్య గర్భిణి'ని బంగారు ప్రతిమగా వివరించెను.

దశావతారముల నన్వయించి తిరుమంజన ఉత్సవమును అన్నమయ్య ఎట్లు వర్ణించిరో చూసి తీరవవలసినదే.

'పొంచి మచ్చమైన నాటి పొలుసు కంపులు వాయ

సంచుల బన్నీట మజ్జన మార్చరే

అంచెగూర్మ వరాహములైనట్టి సొగటు దీర

మంచి గప్పుర ధూళి మెత్తరే మేనను

నరసింహపు గదయ నాటి వామనపు జిడ్డు

పరశురాముని గబ్బు పచ్చ వీడను

పరిమళము గట్టిన బంగారు గిన్నె దెచ్చి

పొరి దిరుమేన దట్టు పునుగిట్టె నించెరే

గొల్ల ముంజరాచ జిడ్డు కోరి బుద్ధుడైన సిగ్గు

చొల్లు గుబ్బపు నూగురొచ్చులు మనున

ఇల్లిదే శ్రీ వేంకటేశుడీరూపై నున్నవాడు" అని మెల్లపూదండల సొమ్ము లెక్కించరే అని అనంతర 'తోమాల సేవ'ను కూడా సూచించెను.

## తిరుపతి ఆలయములో కొలువు, ఏకాంతసేవ

ఈ విధముగా తిరుమల ఆలయ నిత్య ఆరాధనా విధానము అన్నమయ్య సంకీర్తనల కనేక విధములుగా ఆలంబనములైనవి. మరియు తిరుపతి గోవిందరాజాలయ మున జరుపబడిన కొలువు, అహోబల ప్రహ్లాద వరదుని కొలువు కూడా అన్నమయ్య అనేక రీతుల వర్ణించెను.

## గోవిందరాజు కొలువు

కొలువు విరిసె నిదే గోవిందుఁడు పొద్దు వోయ

వెలువట నుక్కళాలు వేగుదాఁకా నుండరో

యీ పొద్దుకుఁబోయి రారో యింద్రాది దేవతలు

శ్రీపతి పవ్వళించెను శేషుని మీఁద

తీపులఁబ్రసాద మీరో దేవమునులకు నెల్ల
వైపుగఁదెల్ల వారఁగ వత్తురు గాని
పాళెల పట్టకుఁబోరో బ్రహ్మరుద్రాదు లిందరు
పాల సముద్రాన హరి పవ్వళించెను
వేళగాదు లోనికిట్టె విచ్చేసె హరిద్వార
పాలకులు వాకిళ్లఁము బదిలము సుండో
గీత మొయ్యనే పాడరో కిన్నర కింపురుషులు
యీతల శ్రీ వేంకటేశుఁడెక్కెను మేడ
యీత నెడ నెడ నూడిగ కాండ్లు నిలువరో
రాతి రెప్పుడైనా మిమ్ము రమ్మను నో యతఁడు 9.236

ఈ సంకీర్తనలో సేనలకై నుంచబడిన కావలి గూర్చి, సేనలను బ్రహ్మరుద్రాదులను తీసికని పొండని, వేళగాని వేళలో సేవించవచ్చిన ద్వారపాలకులు కలరని హెచ్చరించుచు, రాతిరి సమయమున అవసరవేళలలో పిలుపు వచ్చిన ఊడిగ కాండ్లు వెళ్లవలెని వారిఁ జాగ్రత్తగా నిలువుమని వర్ణించెను.

అహోబల ఆలయమున జరిగెడి కొలువు కాబోలు
వాడెవో ప్రహ్లాద వరదుడు
వాఁడెవో భక్త వత్సలుడు
నానాదేవతల తోడ నారదాదుల తోడ
గానములు వినుకొంటూ గద్దెపై నుండి
నవ్వుల మోముతోడ నరసింహరూపుతోడ
జవ్వని తొడమీద సరసమాడ
పువ్వుల దండలు యిరుబుజాలపై వేసుకొని
ఉవ్విళ్ళుఁగొలువై వున్నాఁడు దేవుఁడు అని" 11.2.29
అన్నమయ్యపై విధముగా వర్ణించెను.
అన్నమయ్య గోవిందరాజాలయమున జరుగు ఏకాంతసేవ కాబోలు ఇట్టు వర్ణించెను.
వోడక చెలులు పాదాలొత్తగా
మేడలోన బవళించి మెత్తని పరుపుమీద
కోడె సేతలు సేసెని గోవిందరాజు (25.122)

కప్పురము చల్లి, గంధమలది, పన్నీరు నింపుడని ఈ సంకీర్తనలో ఏకాంతసేవ వేళలో గావించెడి స్వామి కార్యములను తెలిపెను.

## శ్రవణ నక్షత్రోత్సవము

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అవతార నక్షత్రము "శ్రవణ" నక్షత్రము గాన ప్రతి శ్రవణ నక్షత్రము నందును ఉత్సవము జరుగును. ఈ శ్రవణా నక్షత్రమునాడు ఉదయము శ్రీవారికి తోమాలసేవానంతరము శ్రీ మలయప్ప స్వామివారికి పట్టమహిషులగు శ్రీ, భూదేవుల (ఉభయ నాంచారుల) వారికి తిరుమంజనము ఏకాంతమున జరుగును. దేవులతో స్వామివారి తిరుమంజనమునేమో అన్నమయ్య ఇట్లు వర్ణించెను [17]

"కంటిమయ్య నీ చేఁతలు కన్నుల పండుగగాను
పెంటలైన ప్రియములే ప్రియము నీకు
మంతన మాడేటి వేళ మజ్జన మాడేటివేళ
ఇంతితోడి సరసము లింపులు నీకు
అంతలోఁగప్పురకాపు అవధరించేటి వేళ
సంతతము వసంతము చవులు నీకు
సొలసి నవ్వేటివేళ సొమ్ములిడుకునే వేళ
విందుల మోవి యీవులు వేడుక నీకు
అలమేల్మంగ కూటమి అనువు నీకు
యెలమి శ్రీ వేంకటేశ ఇద్దరుఁబెండ్లాడే వేళ
కొలువులోని మొక్కులు కొసరు నీకు"

మాధ్యాహ్నికారాధన తరువాత శ్రీ మలయప్ప స్వామి వారు పట్టమహిషులతో భక్తజన ప్రార్థనా పరిపూర్తికై కల్యాణ మంటపమునకు వేంచేసెదరు. అన్నమయ్య ఆ విషయమునే 'ఇద్దరు పెండ్లాడే వేళ కొలువులోని మొక్కులు కొసరు నీకు' అని తెలియపరచిరేమో? ననిపించుచున్నది.

ఈ విధముగా మానవ జీవనమున పూర్వుల యొక్క అనుభూతులు, మరపురాని అనుభవములు, పుణ్య పురుషుల జీవనము, వారి విశ్వాసములు ప్రముఖ పాత్రను కలిగి అవి చిరస్మరణీయములై ఆలయములలో "ఉత్సవము"లుగా సర్వుల కానందము చేకూర్చు విధమున ఆనందదాయకములై హర్షోల్లాసముతో జరిపెడి విధాన మేర్పడి యుండవచ్చును. తిథి, వార, నక్షత్రములలో శుభ సమయముగా భావింపబడు

దినములు పుణ్యదినములుగా నేర్పడి 'ఉత్సవములు'గా జరిపి దినదినాభివృద్ధి చెందినవేమో?

ఈ విధమైన ఉత్సవముల ప్రాదుర్భావము కొంత, వేదకాలమున అల్పరీతిలో కానవచ్చును. సంవత్సరమున ఫాల్గుణ మాసము సర్వదేవతలకు శ్రేష్ఠముగను, వరుణునకు ఆషాఢమాసము, కార్తీక మాసములో వివిధ పూజలకనుగుణముగా వివిధ రీతిలో ఉత్సవములు జరుపుకొనెడివారని తెలియుచున్నది. కొంతకాలము పిమ్మట సూర్యగ్రహ గతికనుగుణముగా అనగా సూర్యుడు మేషరాశి నుండి మారునపుడు మకరరాశి ప్రవేశమును, విశేష దినములుగా భావించెడివారట. మరికొంత కాలమునకు చంద్రమానానుసారము ప్రతి ఒక్క తిథి ప్రత్యేక దైవమునకు విశేషముగా తలచిరి. విష్ణు పురాణమున ఈ వివరణలను కానవచ్చును. ఇట్లు పండుగ దినము లధికమైనవి.

విష్ణువునకు జన్మాష్టమి, రామనవమి, ఆషాఢ, కార్తీక, భాద్రపద ఏకాదశి విశేష తిథులుగాను 'ఉత్సవములు' జరుపుకొనుట కనువుగా భావించబడినవి. విశేష ఉత్సవముగా భావింపబడు రథోత్సవము ఒరిస్సా బెంగాల్ స్థలములలో అత్యద్భుతముగా జరుపబడుచున్నది. కార్తీక, మాఘ, వైశాఖ నెలలలో పుణ్య తీర్థస్నానము, దీపోత్సవము విశేషముగా జరుపబడజొచ్చినవి. ఉత్సవములలో భగవంతుని ఊరేగింపు చేయుట ఒక ఆచారముగా ఏర్పడినది. తమిళ సాహిత్యమున 'పెరుంకదై' (బృహత్కథ)లో ఉత్సవములలో జరిగెడు 'హరికథల' సూచనలు కలవు. నాటకములు మున్నగునవి ఆలయములలో జరిగెడివని జీవక చింతామణి పెరుంకదై గ్రంథములలో చెప్పబడినవి.[18] ఇవి అన్నమయ్యా సంకీర్తనలకెట్లు స్ఫూర్తి నిచ్చెనో చూడగలము.

## శ్రీకృష్ణ జన్మాష్టమి

ప్రతినెల శ్రీకృష్ణ జన్మ నక్షత్రమైన "రోహిణి" నాడు సుప్రభాతసేవానంతరము వెండిమూర్తుల కేకాంతమున తిరుమంజనము జరుగును. ఆ సాయంత్రము ఆలయము వెలుపలనున్న ఊయల మంటపములో శ్రీకృష్ణస్వామికి ఊయలసేవ జరుగును. పిదప తిరుమల పురవీధులలో ఊరేగింపు జరుగును.

శ్రావణ మాసములో కృష్ణాష్టమి నాటి రాత్రి శ్రీవారి ఆలయమున తోమాలసేవ జరుగును. శ్రీకృష్ణుని, శ్రీదేవి భూదేవులతో ఉగ్ర శ్రీనివాసమూర్తికి అభిషేకము జరు గును. పిమ్మట శ్రీనివాస స్వామి ఆనంద నిలయములోనికి వేంచేసెదరు. ఈ ఆరా ధనను 'ద్వాదశ తిరువారాధన' అని పిలిచెదరు. పూర్వము పండ్రెడుమార్లు ద్వాదశాక్షర మంత్రమైన ఓం నమో భగవతే వాసుదేవాయ సంపుటీకరించుచు అభిషేక నివేదనలను చేసెడివారట. కాని

నేడు ఒకమారు అభిషేక నివేదన జరిగినను ఆనాటి ఆరాధనను మాత్రము 'ద్వాదశారాధన'గానే వ్యవహరింతురు.[19]

శ్రీకృష్ణాష్టమి 'ద్వాదశారాధన' కాబోలు అన్నమయ్య

"సాజపు జయంతి నేడే సఫలమిందరికి

షోడశోపచారములఁజొక్కించి శ్రీవేంకటేశుఁ

బాడరో ధర్మము నిల్పె భారమణఁచె

ఆడనే పాండవుల, గాచెనని యర్ఘ్యమియ్యరో" 10.172 నని వర్ణించెను.

ముద్దులు గారే మోమునను

వొద్దికనేమైన నొసగరె చెలులు

చెక్కుల వెంటాఁజెమటలు గారీ

యెక్కడ నాడెనొ యిందాఁకా

చక్కఁగృష్ణునికి జలకము సేయరె

సరుగున శైత్యోపచారము సేయరె

యిరువుగ నుయ్యల నిడరే చెలులు

చుట్టుకొన్న జడ చొల్లెము జారెను

వుట్టులు గొట్టెనో వుదుటునను 30.588

అని సంకీర్తనలో కృష్ణునికి జరిగెడి సేవా విశేషములను వెల్లడించెను. జన్మాష్టమినాడు జరిగెడె కృష్ణ అభిషేకము, శైత్యోపచారము ఊయలలో వేయుట, ఉట్టికొట్టుట మున్నగు వానిని వివరించెను. ఊయలలో నున్న బాలకృష్ణుని కాబోలు అన్నమయ్య "జోజోయని మీరు జోలపాడరో సాజపు జయతి నేడే సఫలమిందరికి" (280 రేకు 9-172)

"ఉయ్యాల బాలు నూచెదరు కడునొయ్య నొయ్యనూచు

బాలయవ్వనలు పసిఁడి వుయ్యాల

బాలుని వద్దంబాడేరు

లాలి లాలి ళాలి లాలెమ్మనుచు

చల్లుఁ జూపుల జవరాండ్రురే

పల్లె బాలునింబాడేరు." అని వర్ణించెను.

బంగారు వాకిలి వద్ద మండపమున శ్రీకృష్ణస్వామిని శయనించిన భంగిమలో అలంకరించెదరు. ఈ సందర్భమున జియ్యంగార్లు దివ్య ప్రబంధమును పారాయణము

చేసెదరు. పిదప ఉదా: (305 రేకు) అటుకులు, చక్కిలాలు, ఆనవాలు నురుగు వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు నివేదనలు జరుగును. అటు పిమ్మట శ్రీకృష్ణునిపై అక్షతారోపణ చేసెదరు. ఈ సందర్భమున కృష్ణావతార ఘట్టమును పండితులు చదువుచూ పురాణ శ్రవణము గావించెదరు.

దేవుని బూజించితిమి తేరో నైవేద్యాలు

కైవసమై కృష్ణునికి గంపల కొలదులు" ప్రసాద వినియోగము

పిమ్మట శ్రీకృష్ణుడు లోనికి వెళ్లెదరు (20)

ఈ పురాణ శ్రవణ ఫలితముగా అన్నమాచార్యులనేక కృష్ణావతార ఘట్టములను గూర్చిన సంకీర్తనలు చేసి యుండవచ్చుననిపించుచున్నది.

"నేడు కృష్ణుడు జనియించె నేడే శ్రీ జయంతి"

"మంతనాన నాడేరమ్మ మధురలో యాసుద్దులు

వింతలాయ వినరమ్మ వీనుల పండుగలు (25.256)

ఈ విధముగా అనేక సంకీర్తనలు కలవు.

రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో

రీతిగాదు హరినెచ్చరిక సేయరే

పైపైఁబొద్దు విడచీ పంకజములు విరిసె

గోపగోవిందుని మేలుకొనుమనరే

దీపముల దెల్లఁబారె తిమిరమంతయు జారె

శ్రీ పురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే

కలువలు ముకుళించీ కలివింక లెలుగించీ

నెలఁతలు దేవదేవు నిద్రదేల్పరే

కావిరింతయు విరిసె కడు సంధ్యకుఁబొద్దాయ

శ్రీ వేంకటేశుని విచ్చేయమనరే 10-130

ఈ సంకీర్తనలో శయన వేషముననున్న కృష్ణుని హెచ్చరించి మేలుకొలిపి శ్రీ వేంకటేశుని సంధ్యకు పొద్దాయెనని విచ్చేయుమని సూచించిరేమో కావున కృష్ణాష్టమి సందర్భముగా రచించిరని తోచుచున్నది.

## ఉట్ల ఉత్సవము

మరునాడు ఉట్ల ఉత్సవము మహా వైభవముగా జరుగును. ఆ ఉత్సవములో మలయప్పస్వామి, శ్రీకృష్ణుడు పాల్గొనెదరు.

పైకొని చూడరో వుట్ల పండుగ నేడు
కొట్టేటీ వుట్లును కోలల సాములును
వెట్టినవ్వు లేడవే వీది వీదులా
తిట్టరాదు పట్టరాదు దిమ్మరీఁడెకోదపట్టి
ఆసల శ్రీ వేంకటేశుడంతటా కలయఁగొని
సేసే నుట్ల పండుగ చెల్లుబడిగాను (10.180)

కృష్ణుడు వేంకటేశుడు ఇరువురు వీధులలో ఉట్ల పండుగ నెట్ల జరుపుకొన్నారో వర్ణించెను. పదునారు స్థలములలో నివేదన, హారతులతో తిరు వీధుల ఉత్సవము జరుగును.

గోవిందరాజస్వామి ఆలయమున ఏకాదశినాటి రోజు చిన్న వీధి ఉట్ల ఉత్సవము, ద్వాదశి రోజు పెద్ద వీధి ఉట్ల ఉత్సవము జరుగును[21]

భామలు చూడరే తిరుపతి గోవిందుడు వాడే
అట్టుగాపై బిల్ల గొట్లాడుచున్నారు 20.456
కూడి పట్టుబట్టిగొట్టీ గోవిందుడు 27.137
కొట్టీనుట్లదె గోవిందుడంతలో 8.162

అన్నమయ్య తిరుపతి గోవిందరాజు ఉట్ల ఉత్సవమును గూర్చి అనేక సంకీర్తనలు చేసిరి. ప్రతి నెల రోహిణి నక్షత్రము నాడు శ్రీకృష్ణస్వామి వారికి రుక్మిణీ తాయారుల వారితో సహా విశేష వస్త్ర రత్నాభరణములతో పుష్పమాలికలతో అలంకారము జరుగును. చతుర్వీధులలో ఊరేగింపు జరుగును.

## శ్రీరామ నవమి ఉత్సవము

ప్రతి సంవత్సరము చైత్ర శుద్ధ నవమి శుభదినమున శ్రీరామస్వామి వారికి ఆస్థానము జరుగును. ఆ దినమున సాయంకాలము శ్రీరామ స్వామివారికి చతుర్వీథులలో సర్వపరివారములతో మంగళవాద్యములతో హనుమద్వాహన ఉత్సవము జరుగును.

"ఓ పవనాత్మజ ఓ ఘనుడ బాపు బాపనఁగబరగితిగా
ఓ హనుమంతుడవు దయాచల నిర్వాహక నిజ సర్వప్రబల

దేహము మోచిన తెగువకునిటువలె సాహసమిటువలెం జాటితిగా
యాదేహముతో నిన్నిలోకములు నీ దేహమెక్క నిలిచితిగా"

ఈ సంకీర్తనము "సర్వ ప్రబలదేహము మోచిన తెగువకు, ఇన్ని లోకములు నీదేహమెక్క నిలిచితిగా" అని వర్ణించుటచే 'హనుమంత వాహన' ప్రసక్తి చేసెనేమోనని తోచుచున్నది.

శ్రీరామ చక్రవర్తి స్వామివారు, సీతా మహాదేవి, శ్రీ లక్ష్మణస్వామివారు ఆస్థానముకై వేంచేయుదురు. ఆ స్థాన మంటపము ఆనందపారవశ్యము కలగజేయగా శ్రీరామాయణమును పౌరాణికులు సంప్రదాయానుసారము శ్రీరామజనన ఘట్టము నుండి మనోహరముగా పురాణ కాలక్షేపము చేయదురు.[22] పురాణ కాలక్షేప ఘట్టములను జోడించి అన్నమయ్య

"రామ కొలువు" నిట్లు కీర్తించెనేమో
అవధారు రఘుపతీ యందరిని చిత్తగించు
యివలనిండె గొలువిదే నదే సముఖా 9-203 రేకు 285.

"జయజయరామా సమర విజయ రామా
భయహర నిజభక్త పారీణ రామా
జలధి బంధించిన సౌమిత్రి రామా
సెలవిల్లు విరిచిన శ్రీ సీతారామా
అల సుగ్రీవు నేలిన అయోధ్య రామా
కలిగి యజ్ఞముగాచే కౌసల్యారామా." (9-11)

ఈ విధముగా ఆస్థాన సేవకు 'జయజయ' ఘోషణలతో మంగళా శానము చేసి అవతార కథను జోడించి సంకీర్తన రూపమున గానము చేసెనేమో. రామావతార కథను కూడా అనేక సంకీర్తనలుగా రచించెను.

"ఇతఁడే పరబ్రహ్మమిదియె రామకథ
శతకోటి విస్తరము సర్వపుణ్య ఫలము
ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁబెండ్లాడె
అరణ్యవాసుల కెల్ల నభయమిచ్చె" (రేకు 389) (4-519)

## శ్రీరామపట్టాభిషేకాస్థానోత్సవము

ప్రతి సంవత్సరము చైత్ర శుద్ధ దశమి శుభవారమున శ్రీరామ చక్రవర్తికి పట్టాభిషేక మహోత్సవమున ఆస్థానము జరుగును. బంగారు వాకిలి ముందుగల ఆస్థాన మండపములో

సుగ్రీవుడు, అంగదుడు, ఆంజనేయస్వామి వేంచేయుదురు. శ్రీమద్రా మాయణములోని శ్రీరామపట్టాభిషేక సన్నివేశమను పురాణ కాలక్షేపము చేయుదురు. శ్రీరామచక్రవర్తి యొక్క పట్టాభిషేక మహోత్సవము వైభవముగా కొనియాడబడును.[23] శ్రీరామచక్రవర్తి వారు వేంచేయుటను హెచ్చరిక చేయుచున్నారు.

"చిత్త అవధారు జియ్య పరాకెచ్చరిక
హత్తి అనుకలిచ్చేరు అదె రాజరాజు
రామ రఘుకుల వీర రాజీవలోచన కోమల శ్యామలవర్ణ
వామదేవాది మునులవల సుగ్రీవుడు వాడె కొలువు వేళ
వేమారును వానరవీరులు మొక్కేరు
దేవ సీతాసమేత ధీరలోక నాయక
సేవించనీ భరతుని జేకొను శత్రఘ్నుని
సౌమిత్రి యీవంక విభీషణుడు నావలివంక
నీ మహిమలెల్ల మెచ్చి నీకు విన్నివించేరు." (4-472)

ఈ సంకీర్తనమున అచట వేంచేసియున్న సుగ్రీవుని, ఆంజనేయునే కాక 'పురాణ కాలక్షేపము'న అతిశ్రావ్యముగా చెప్పిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవముతో జోడించి మనకందించెను.

ఈ విధముగా (18.52.9-203) సంకీర్తనలలో ఈ మహోత్సవమును గురించిన వర్ణనలను మనము గాన వచ్చును. నారదుడు పాడగా రంభాదులాడేరని సీతా రాములతో కూడిన శ్రీ వేంకటాద్రి స్వామిని

"కుందువ కౌసల్యా గర్భరత్నాకర

చెందిన శ్రీ వేంకటాద్రి శ్రీనివాసా"యని సంబోధించెను. తిరుమల ఆలయములో స్నపన మంటపములలో శ్రీరామచంద్ర పట్టాభిషేక సన్నివేశము మనము గాంచవచ్చును. ఆ సన్నివేశ శిల్పసౌందర్యము కూడా ప్రేరణనిచ్చి యుండవచ్చు.

## అధ్యయన ఉత్సవము

ఈ ఉత్సవము వైష్ణవాలయములన్నింటి యందును విశేషముగా జరుపబడు చున్నది. తిరుమంగై ఆళ్వారు వేదపఠనతో ద్రావిడ దివ్య ప్రబంధ పారాయణమును ఆలయములలో పది దినములు జరుపవలెననియు శాసించిరి. కొంతకాలము పిమ్మట కొనసాగించబడలేదు. ఆటు పిమ్మట నాథమునులీ ఉత్సవమును జరుపుటను మరల ప్రారంభించిరి. వారి మనమలైన ఆళవందారు (యామునాచార్యులు) ఆ ఉత్సవము నటులనే కొనసాగించిరి.

ఈ అధ్యయన ఉత్సవమును మార్గశిర మాసమున శ్రీరామాను జులవారి ఆజ్ఞచే శ్రీకురుక్కైపిరాన్ పిళ్లాన్ ఇరువది ఒక్కదినములు జరుపుటను ప్రారంభించిరి. (24) ఆ సమయమున నాలాయిర దివ్య ప్రబంధము, వేద పఠనతో చేర్చి చేయవలెనను పద్ధతి నేర్పాటు చేసిరి. తిరుపతి యందు క్రీ.శ. 1253 సంవత్సరమున ప్రబంధ పఠనను గూర్చిన విషయము ప్రశంసింపబడినది. క్రీ.శ. 1360న తిరుమల ఆలయ ద్వారమున ద్రావిడ వేద పఠనను గూర్చిన విషయము తెలుపబడినది. క్రీ.శ. 1446 శతాబ్దము నాటి శాసనమున బ్రహ్మోత్సవ పది దినములలో ఆలయ మంటపమున ఉత్సవమూర్తుల ఎదుట ఈ పఠన జరిగెడిదని తెలియవచ్చినది.[25]

క్రీ.శ. 1390 నాటి శాసనములో తిరుమల ఆలయమున తిరుప్పావై పఠనమును గూర్చి వివరణ కలదు. అదే శాసనమున తిరుపతి గోవిందరాజాలయమున ఈ ఉత్స వము జరుగుచెండెడిదని తెలియవచ్చినది. 'తిరువధ్యయన' శబ్ద ప్రయోగము క్రీ.శ. 1468 నాటి శాసనమున కానవచ్చును. వైకుంఠ ఏకాదశికి పూర్వమునను పరమునను దివ్య ప్రబంధ అధ్యయన ఉత్సవము జరుగును.

## వైకుంఠ ఏకాదశి, తిరుద్వాదశి : ఉత్థాన ఏకాదశి

తిరుద్వాదశి, కైశిక ద్వాదశి అనెడి రెండు ఉత్సవములు తిరుమల ఆలయమున విశేషముగను ప్రత్యేకముగను జరుపబడుచున్న ఉత్సవములు, ఈ రెండు ఉత్సవములు కూడ 'వెంకటతురైవర్' అనబడు ఉగ్ర శ్రీనివాసమూర్తి నుద్దేశించి చేయ బడుచున్న అనాది ఉత్సవము.

మార్గశిర మాసమున వచ్చు ఏకాదశి ముక్కోటి ఏకాదశిగా విశిష్ట స్థానమును కలిగి యున్నది. ముక్కోటి ఏకాదశినాడు ఆస్థానము, ఆరాధన జరుగును. ఈ దినమున అరుణోదయమునకే వైకుంఠద్వారము తెరువబడును.[26] వైకుంఠ వాకిలి తెరువ బడుట ఆలయ ఆరాధనలో విశేషాంశము.

ఉత్థాన ఏకాదశి ప్రబోధోత్సవమనియు వ్యవహరింపబడుచున్నది. శయనించిన విష్ణువును మేల్కొలుపు పాడుట ముఖ్యాంశము. క్రీ.శ. 1308 నాటి శాసనమున ఈ ఉత్సవ ప్రశంసగానవచ్చును. ఈ రెండు "ఏకాదశి" విశేషములను ఒకే సంకీర్తనలో మనకు సూచించెనేమో? ననిపించుచున్నది.

వారధిశయనవొ వట పత్రపరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే

ఘనయోగి హృదయపు కమలాలు వికసించె
నొనర విజ్ఞాన సూర్యోదయమాయె
మును జీవ పరమాత్మల జక్కువలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవె
కలుషముల నేటి చీకట్లెల్లఁబెడఁబాసె
నలువంక వేదకీరనాదము మ్రోసె
అలరియతల ధర్మల నేటి చుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతి మోము జూడవే
అపురూప శ్రీ వేంకటాద్రీశ మేలుకొని
నిపుణుడ యిందిరయు నీవు మమ్ముఁగావవే (రేకు 380) (4-465)

అని శ్రీ భూదేవులతో ఉగ్ర శ్రీనివాసమూర్తిని అపురూప వేంకటాద్రీశునిగా సూచించెను. "వాకిలి తెరువవే"

"జీవ పరమాత్మ జక్కువలు" వైకుంఠ ఏకాదశి సూచక మేమో?

శయన విష్ణువును, వారధి శయనుని కన్నులు తెరువమని

చెప్పుటచే ఉత్థాన ఏకాదశి సూచకముగామనము గ్రహించ వచ్చును.

కార్తీక ద్వాదశి రోజున సుప్రభాత సేవానంతరము తోమాలసేవ, పిమ్మట ప్రదక్షిణ ఊరేగింపులు జరుగును. "భోగిశయనమును బుసకొట్టెడిని యోగనిద్ర పాయును మేల్కొనవే" అని మేల్కొలుపు పాడెను.

ఏకాదశి నాటి సేవలో శ్రీనివాసమూర్తి వేగుదాక విన్నపములను చిత్తగించి భక్తులపై కృపారసము జల్లి జల్లి అలిసిపోయెనని స్వామికి పాదముల నొత్తుమని ఊయల నూపుమని, దోమతెరను కప్పి నిద్దురించమని అన్నమయ్య ప్రార్థించిరి.

"నిద్దిరించీ, బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీరమణునికి నొత్తరే పాదములు
యోగీంద్ర వరదుని నూఁచరే వుయ్యాలను
నొక యింత కాలము కన్నులఁదిప్పఁగప్పరే దోమతెర
కరుణించఁదలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకల లోకారాధ్యుడాయె మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు" (1-139) (23 రేకు)

అన్నమాచార్యుల హృదయము స్వామివారికై ఎట్టు ద్రవించి తపించెనో కదా? "అరుదుగా"అని ఉగ్ర శ్రీనివాసమూర్తిని సూచించి సకల లోకారాధ్యుడాయెనని వివరించెను. ఆలవట్టాలు (విసనుర్ర) విసరుమని స్వామి వారికి జరుగు తోమాల సేవను సూచించెను. తోమాల సేవానంతరము శ్రీదేవి భూదేవి సహిత ఉగ్ర శ్రీనివాస మూర్తికి అభిషేకాదులు జరిగిన పిమ్మట పట్టు వస్త్రములు, ఆభరణములు, పుష్పముల అలం కరణ జరుగును. పిదప స్వాముల వారు ఛత్ర చామర బాజాభజంత్రీలు మున్నగు సార్వభౌమోచిత సత్కారములతో ఆలయము వెలుపలికి వచ్చి ఆలయ మహా ప్రద క్షిణమున ఊరేగింపబడెదరు. ఉత్సవమునకు పిమ్మట సూర్యోదయము కాక మునుపే స్వస్థానమునకు మరలివచ్చెదరు.[27] ద్వాదశి తిరువీధుల ఉత్సవము నిట్లు వర్ణించిరేమో!

లెండో లెండో మాటాలించరో మీరు
కొండల రాయనినే పేర్కొన్నది జాలి
మితిమీరే జీఁకట్లు మేటి తలవోరులాల
జతనము జతనము జాలో జాలి
యితవరులాల వాయించే వాద్యాలకంటే
నతిఘోషముల తోడ ననరో జాలి
గాములు వారెడి పొద్దు కావలి కాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమసపు పారివార దివె పుంజులుచేఁబట్టి
యేమరక మీలో మీరు యియ్యరో జాలి
కారు కమ్మెనడురేయి గడచెఁగట్టికవార
సారె సారెఁబలుకరో జాలో జాలి (10.166)

అరుణోదయమునకుచాల పూర్వమే ఈ ఊరేగింపు జరుగునని "మితిమీరే చీకట్లు" అని సూచించెను. పారివారదివె పుంజులు చేపట్టి యేమరక యుండుమని హెచ్చరించు చున్నారు. నడిరేయి ఉత్సవమనేమో "జాలో జాలి"అని అన్నమయ్య వర్ణించిరి.

## ప్రణయ కలహ ఉత్సవము

వైకుంఠ ఏకాదశికి పూర్వము పది దినములు జరుగు ఉత్సవమును 'పగల్ పత్తు' అనియు పరమున జరుగు ఉత్సవమును రాపత్తు అనియు వ్యవహరింతురు. ఈ రాపత్తు ఉత్సవము పది దినములు జరుగును. ఆరవ దినమునందు శ్రీ భూదేవులకు శ్రీ స్వామివారికి

మాధ్యాహ్నిక ఆరాధన జరిగిన పిదప శ్రీ మలయప్ప స్వామివారు మహా ప్రదక్షిణముగా సకల పరివారములతో ఏకాంగి మఠమునకు ముందు భాగము నకు వేంచేయుదురు. పౌరాణికులు పురాణము చదివెదరు. జియ్యంగార్లు దేవేరుల వద్ద నుండి శ్రీ మలయప్ప స్వామి వారి మీదుగా శ్రీ స్వామి వారి వెనుకకు మూడు పూలచెండ్లు వేసెదర. పిమ్మట స్వామివారు వెనుకకు ముందుకు జరిగి కొంచెము దూరము వెళ్లెదరు. తరువాత ప్రబంధ పారాయణము సంగీతములతో స్వామివారు మరల వేంచేయుదురు. ఈ విధముగా మూడు పర్యాయములు జరుగును. పిమ్మట శ్రీ భూదేవులు స్వామివారు పుష్పమాలికలను మార్చుకొనెదరు. [28] 'అరయర్' సేవ వారీ ఉత్సవ సమయమున నమ్మాళ్వార్ల పాశురములను పాడి స్వామి, దేవుల ప్రణయ కలహ ఉత్సవమును వైష్ణవ ఆలయములలో వైభవముగా జరిపెదరు. తిరుమలలో ఈ ఉత్సవము అన్నమాచార్యుల అనేక సంకీర్తనలకు కారణమైనదేమో!

"ఎంతకెంత పెంచేవే యెందాఁకాను
కాంతులకుఁబతులకుఁగలదే కదా" యని 27.206
ప్రణయ కలహము పతీపత్నులకు కలదే కదాయని
"కోపాన సాధించవచ్చెనా?" "వేడుకతో నిన్ను జూజాన ఓడించెగాక నీతోడిరటు వాడా?" అనియు "శ్రీ వేంకటేశుడెనసె నిన్నింతలోనె" అని వెంటనే స్వామి వారు ఏలుకొనెదరని సర్ది చెప్పుచు సంకీర్తన చేసెను.

"మాఁటలాడవయ్య ఇఁక మగువ నీవు వొక్కటే
ఆఁట దానికిదే చల్లనారెఁగోపము 27.211
ఊరకే కోపగించకు వోహో నీవు
కారణము లేని వాదు కాంతకు లేదు." 27.180

ఈ సంకీర్తనలోని భావము ఉత్సవ స్ఫూర్తి ఏమోనిని తోచును. మరొక సంకీర్తనలో పురుష విరహమును గూర్చిన వర్ణనను గాంచిన అన్నమయ్యపై ఈ ఉత్సవ ప్రభావ మెంతగా నున్నదో ననిపించును.

## ధనుర్మాసోత్సవము

దక్షిణాయనము నుండి ఉత్తరాయణ పుణ్యకాలమునకు జీవులను చేర్చెడి పుణ్య కాలము 'దక్షిణము' మృత్యు స్థానము దక్షిణ దిక్కున కలదు. భగవంతునివైపు అనగా ఉత్తరాయణము వైపు పయనింపజేసెడిదే ఈ ధనుర్మాసము[29] ఈ ధనుర్మాసమున (మార్గశిర

మాసము) తిరుమలాలయమున సుప్రభాత పఠనకు బదులుగా 'తిరుప్పావై' పఠించెదరు.

ఆండాళ్, తిరుప్పావైలో పూర్ణచంద్రునిచే ఒప్పుచున్న మంచిదినము నందు తీర్థ మాడవలెనని 'నాట్కాలే నీరాడి' అనియు చేయదగని కృత్యములైన వాటిని 'నెయ్యి ణ్ణోం పాలుణ్ణోం" అనియు, "తూయోమాయ్‌వన్దు నామ్ తూమలర్ తూవితొళుదు, వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క." శుచిగాను, సువాసనలు వెదజల్లు పూలను సమర్పించి అంజలి చేసి వాక్కుతో స్వామి గుణములను కీర్తించవలెననియు విధులను తెలియజేసినది.(30) అదే విధముగా అన్నమయ్య సకల జీవకోటి ఉద్ధారణ నుద్దేశించి మార్గశిర మాస విధులను విన్నవించెను.

"ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయ మలర భజింపరో మీ
రిటు ధనుర్మాస విధులన్." అని సంకీర్తనలో వివరించిరి.

గోదాదేవి శ్రీవిల్లి పుత్తుర్ వటపత్రశాయియైన స్వామిని "ఉమ్బర్ కోమానే ఉఱఙ్గాదు ఎళున్దిరాయ్" అని "నందకుమారా లేవుము" ఓ శ్రీ కృష్ణా మేల్కొనుమని పాడగా ఆ పాటలతో చిన్ని కృష్ణుని తిరుమల ఆలయమున మేల్కొలిపెదరు. అను నిత్యము ఆ పాటల ప్రభావ ఫలితమేమో అదే భావములతో కూడినట్లు అన్నమయ్య ఇట్లు ధనుర్మాస కృష్ణుని మేల్కొలిపెను.

"మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా
సన్న నీ యోగ నిద్ర చాలు మేలుకోవయ్యా
అలరిన శ్రీ వేంకటాద్రి మీఁది బాలకృష్ణ
యిల మా మాటల వింటివిఁక మేలుకోవయ్యా" (11.3.60)

పిమ్మట ఆలయమున జరిగెడి ఆరాధననిట్లు వివరించిరి.

పులుఁగా బచ్చళ్ళు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాస వేళయునిదే
బలసి సంకీర్తనపరులు పాడేరిదే
జలజాక్షు లేచ జలకమాడవయ్యా" (9-195) 234 రేకు అని జలక మాడిన పిమ్మట
"తోడనే గంధాక్షతలు ధూపదీపాలివిగో
కూడిన విప్రుల వేదఘోషణలివే
వాడుదేరఁబూజించవలెఁగమ్మపువ్వులివె

వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా" 234 రేకు అని కృష్ణస్వామికి జరిగెడి ఉపచారములను వర్ణించెను. కొలువునకు విచ్చేయుమని ఆహ్వానించెను. "చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాముడిదె."

ధనుర్మాసమున బాలకృష్ణుని ఏకాంతసేవ వేళలో కాబోలు కృష్ణుని పవ్వళింపుమని ఇట్లు వర్ణించెను.

"నాటకపు నిన్ను జూచి నవ్వు వచ్చీని
యేటికి వచ్చితి నేను యేమి సేసేవు
నిద్దిరించవలె నంటా నీకురుల దువ్వితేను
వొద్ద బందుమని యేల వాడి వట్టేవు
అది నీ పదాలు పాడి అట్టే నిన్ను జోకొట్టితే
కొద్దిమీర వలపులు గుప్పళించేవు"

పెరియాళ్వారు శ్రీకృష్ణుని జననమున కానంద పారవశ్యము చెందుచూ పది పాటలలో నిదిరించుచున్న బాలకృష్ణుని ఊయల పాటలు పాడిరి. అవియే జోలపాటలుగా అభివృద్ధి చెందినవి. కులశేఖరాళ్వారు 'రాఘవాతాలేలో' అని రామునికి జోలపాట పాడిరి.

ఆలయమున ధనుర్మాస ఉత్సవ సందర్భమున స్వామివారి నైవేద్యములనిట్లు వర్ణించెను.

"వేఁకువ తిరుపళిచ్చి విష్ణునికిఁ జేయరో
ఆఁకటి కొదగినట్టి ఆరగింపులు
పట్టపు దేవుళ్ళుఁదాను బంతిసాగివున్న వాఁడు
అట్టే సేయరోపులుగ మారగింపులు
నెట్టన శ్రీ వేంకటాద్రి నిలయుఁడారగించీని
మట్టులేక వడ్డించరో మంచి యారగింపులు" (9-9)

తిరుప్పళ్ళెళుచ్చి అనెడి పదముచే ప్రాతఃకాల నైవేద్యమని స్పష్టమగుచున్నది. ధనుర్మాస కాలమున 'విష్ణువు' అని సూచించుటచే తిరు ద్వాదశి నాటి నైవేద్య వర్ణనేమోనని తలచవచ్చు.

## శ్రీ మలయప్ప స్వామి వారి ఆస్థానం

ఉగాది, దక్షిణాయన పుణ్యకాలమైన కర్కాటక సంక్రాంతినాడు ఆణివార ఆస్థానం (జులై 16) దీపావళినాడు బంగారు వాకిలికి ముందట శ్రీ మలయప్పస్వామి వారికి ఆస్థాన సేవలు జరుపబడును. శ్రీ మలయప్పస్వామి, శ్రీ, భూదేవుల సమేతముగా సర్వశోభాయ

మానముగా అలంకరించుకొని బంగారు వాకిలి ముందున్న గంటా మండ పములో వేంచేయుదురు. పిదప నివేదనాదులు జరిగిన పిమ్మట శ్రీ స్వామి వారికి అర్చకస్వాములు పంచాంగ శ్రవణము వైభవముగా చేయించెదరు. ఉగాది నాడైనచో సంవత్సర ఫలితములు, లాభ నష్టములు, ఆదాయ వ్యయములు స్వామివారికి నివేదించెదరు. అటు పిమ్మట అక్షతారోపణ, కర్పూర హారతులు జరుగును.

ఆణివర ఆస్థానము నాడు శ్రీమలయప్పస్వామి వారికి శ్రీ, భూదేవులకు, విష్వక్సే నులవారికి తిరుమంజనము జరుగును. ఆస్థాన మంటపమునకు వేంచేయుదురు.అతి మనోహరముగా అలంకారము సమర్పింపబడును. పెద్ద, చిన్న జియ్యంగార్లు, ఏకాం గులు, ఆచార్య పురుషులు వెంటరాగా మంగళ వాద్యములు, శ్వేత ఛత్రములు, చామర ములు మున్నగు మర్యాదలతో శ్రీస్వామివారి ప్రసాదములనుంచెదరు. శ్రీవార్లకు ఆర గింపు రెండవ గంట సన్నిధిలోను ఆస్థానములోను జరుగును. శ్రీవారికి నూతనవస్త్రము లను మంగళవాద్య శ్వేతఛత్రములతో సమర్పించెదరు. వైభవముగా వస్త్ర సమర్పణ జరుగును. వసంతోత్సవము నందును, సాయంకాలము అభిషేకము, అలంకారము ఆస్థాన ఉత్సవమిట్లు జరుగును. కైశిక ద్వాదశినాటి ఆస్థాన ఉత్సవము అంగరంగ వైభవముగా జరుగును[31] ఇట్లు అతి మనోహరముగా, వైభవముగా జరుగు ఆస్థాన ఉత్సవమును అన్నమయ్య ఇట్లు వర్ణించెను.

"తిరుమజ్జనపు వేళ దేవునికి నిదివో 13.473
పరగ నారదాదులు పాడరో యిందరును
చింతదీర వేంచేసి సింహాసనమున నుండి దంతధావనాది కృత్యములు చేసి
సంతసాన నంటరో సంపంగి నూనెనుఁదెచ్చి కాంతలు గంధపు టటికలి పెట్టరో
పంచామృతముల తోడ పన్నీట మజ్జనమాడె కాంచనాంబరాలుగట్టె కస్తూరి పూసె
నించుకొనె సొమ్ములెల్లా నిలువు దండలు చాతెపొంచి ధూపదీపతాంబూలము నొసగరో
పాదుకలు వాహనాలు బహుఛత్ర చామరాలు ఆదరించె శంఖ కాహళాది వాద్యాలు
వేద పారాయణాలతో వెసఁజూచెఁగపిలను గాదెల లెక్కల నడిగె గడేరాలు వినెను
అంగరంగ వైభవాల కరుళపాడులు వెట్టె అంగపు నిత్యదానాదులన్నియు జేసె
చెంగట నలమేల్మంగ శ్రీ వేంకటేశుఁడి గూడి ముంగిట పారుపత్యమ్ములు చేసీని"

అని నాటి వైభవమును తన సంకీర్తనలో యథాతథముగా వర్ణించి మనకందించెను.

# బ్రహ్మోత్సవము

తిరుమల ఆలయమున బ్రహ్మోత్సవము రెండు దినముల ఉత్సవముగా ప్రారంభమై పదమూడు దినములుగా వృద్ధి చెందినదని, అట్లే వాహనముల సంఖ్యయు అభివృద్ధి చెందినదని శాసనములచే వెల్లడియగుచున్నది. క్రీ.శ. 966 శతాబ్దమునాటి పల్లవరాణి సామవై శాసనమున పది దినముల బ్రహ్మోత్సవ ప్రశంస మనము గాన వచ్చును.[32] అన్నమాచార్యుల కాలమున బ్రహ్మోత్సవమెట్లు జరుపబడినదో సంకీర్తన రూపములో మనకు వివరించెను.

బ్రహ్మోత్సవములే కాక దేవుడు బయలుదేరుట మొదలు ఊరేగింపు ముగియు వరకు గల అన్ని సన్నివేశములలోను భగవంతుని కీర్తించు రచనలు దేవుని మహిమలతో ఉత్సవ వివరణలను పేర్కొనుట పూర్వకాలము నందలి జానపదరీతులలో (రచనలలో) లేక మౌలికమైన పాటలలో మనకు కానవచ్చును. ఉత్సవ సంబంధ ఆటపాటలతో రూపొందిన కావ్యమే "ఉలా" అని పేరొందినది. అనేక క్షేత్రములలోని అధిదైవతముల మీద "ఉలా" ప్రబంధములు రచింపబడినవి.[33] అన్నమయ్య సంకీర్తనలను క్రోడీకరించిన యెడల 'ఆలయ ఉత్సవ ఉలా కావ్య' మొకటి చక్కగా రూపొందును.

బ్రహ్మోత్సవములో ఉత్సవమునకై ఆహ్వానించు కార్యక్రమము తిరుమల ఆలయములో ప్రత్యేకతను కలిగియున్నది. గర్భగుడిలో జరుగు ఈ కార్యక్రమము బహు కొద్దిమంది దర్శన భాగ్యమునకు వీలగును. కారణము గర్భగుడి చిన్నదిగా నుండుటచే అందరు దర్శించుటకు వీలుకాదు.[33] ఈ కార్యమును అన్నమయ్య అత్యద్భుతముగా శుభప్రాయముగా చక్కగా వర్ణించెను. బ్రహ్మోత్సవమునకు కాక కల్యాణోత్సవమునకు ఆహ్వానించునట్లు కళ్యాణప్రదముగా రచించెను. కళ్యాణోత్సవము ఆనాడు బ్రహ్మోత్సవములో ఒక భాగమే కదా?

"దేవ దుందుభులు నలుదిక్కులందు
తావులనే వేవేలు ధ్వను లియ్యంగాను
వేంకటాద్రి దేవుఁడదే వేడుకతోఁ బెండ్లాడీ
లంకెల నిప్పుడే కమలాదేవిని
కొంకక ముప్పదిమూఁడు కోట్లు దేవతలాల
వుంకువ విచ్చేయరో మహోత్సవ వేళ
వనజనాభుఁడు నిత్యవైభవానఁజేకొనె
అనయము నిదివో యాది లక్ష్మిని

మునులాల ఋషులాల ముంచిన భూసురులాల
సొనిసీ యందరుఁగూడి సుమూహూర్త మనరో
సురకన్యలాల భూసుర నాగకన్యలాల
నిరతి శ్రీ వేంటక నిలయుని నీకెను
యిరవుగ దీవించి యందరునుఁబాడరో" (30.30) అనియు
"కావించి భేరులు మ్రోసెగరుడధ్వజం బెక్క
మొదలి తిరునాళ్ళకు మొక్కేము నేఁడు" అనియు వర్ణించెను.

గరుడ ధ్వజారోహణము నాడు వివాహ మహోత్సవ ప్రారంభమని శాసనముల లోను చెప్పబడినది. అన్నమయ్య సంకీర్తనలలో మనమీ సూచనను కానవచ్చును.

"తిరుకొడి యెక్కెనదె దేవుని కల్యాణానకు
గరుడ పటము పైడి కంబమందును"

ప్రతి శుభ కార్యమునకు ఉత్సవమునకు నాందిగ జరిగెడి వైదిక ప్రక్రియ అంకురార్పణము[34] ధ్వజారోహణ పూర్వము నాటి సాయంత్రము శ్రీ స్వామి వారి సేనాధి పతియైన శ్రీ విష్వక్సేనులవారి ఆధ్వర్యమున అంకురార్పణ జరుగును. విష్వక్సేనులవారి ఆధ్వర్యములో మృత్సంగ్రహణ యాత్ర జరుగును. శ్రీవారి ఆలయమునకు నైఋతి మూలలోనున్న వసంతోత్సవ మండపమునకు శ్రీ విష్వక్సేనుల వారు శ్రీ సుదర్శన అనంత గరుడులతో కలిసి ఛత్ర చామర బాజా భజంత్రీలతో వేదపారాయణలతో ఊరేగింపు వెళ్లెదరు. వసంత మండపములో మృత్సంగ్రహణ (పుట్టమన్ను) కార్యక్రమము జరుగును. గొడ్డలి, పార మున్నగు ఆయుధ పూజ పుట్టకు పూజ జరిగి మట్టిని సేకరించిన విష్వక్సేనుల, వారి ఊరేగింపు ప్రదక్షిణముగా మహా ప్రదక్షిణ మార్గములో ఆలయ ప్రవేశముతో ముగియును. పిమ్మట నవధాన్యముల బీజావాహం జరుగును. బ్రహ్మోత్సవములు జరుగు పది దినముల అనంతర గరుడ విష్వక్సేనాదులు అంకురార్పణ మంటపమున కొలువు తీరి యుందురు. ఈ ఉత్సవము జ్యేష్ఠాభిషేకమునకు పూర్వము, పవిత్రోత్సవములకు పుష్పయాగమునకు ముందు రోజు విష్వక్సేనుల వారి మృత్సంగ్రహణ యాత్ర జరుగును. ఈ ఉత్సవమునేమో అన్న మయ్య ఇట్లు వర్ణించెను.

అదె వచ్చెనిదె వచ్చె నచ్యుతుసేనాపతి
పది దిక్కులకు నిట్టెపారరో యసురలు
గరుడధ్వజంబదె ఘన శంఖరవమదె

సరుసనే విష్ణుదేవ చక్రమదె
మురవైరి పంపులవె ముందలి సేనలవె
తెల్లని గొడుగులవె దేవ దుందుభులునవె
యెల్లదేవతల రథాలింతటానవె
వెండిపైఁడి గదెలవె వెంజామరములవె 2.79

బ్రహ్మోత్సవములలో వివిధ వాహనములపై స్వామివారు మాడవీధులలో ఊరేగింప బడెదరు. శాసనములలో మనకు వాహనముల ప్రసక్తి కానరాదు. అన్నమయ్యతన కాలమున స్వామి వారి వాహనముల ఊరేగింపునిట్లు వివరించెను.

తిరు వీధుల మెరకీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను
తిరుదండెలపై నేగీ దేవుడిదే తొలినాడు (13-192)
అదిగో స్వామివారు తిరుదండెలపై తొలినాడేగు చున్నాడని తెలిపి .
సిరుల రెండవ నాడు శేషుని మీద
మురిపేన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద
పొరి నాలుగోనాడు పువ్వు గోవిలలోను
గక్కున నయిదవ నాడు గరుడిని మీదను
యెక్కెను ఆరవనాడు యేనుగు మీదను
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువదేరును గుఱ్ఱమెనిమిదో నాడు
కనకపుటందలము కదిపి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
యెనసి శ్రీవేంకటేశు డింత యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను (13.192)
అని విశదముగా వర్ణించెను.

అన్నమయ్య కాలములో వర్షాకాలమున అనగా పురట్టాశి మాసమున ఈ ఉత్స వము జరిగెడిది (9.94, 11-3-134)

శేషవాహనము బ్రహ్మోత్సవముననను, కళ్యాణోత్సవముననను పేర్కొనబడినది. అవిగాక గరుడవాహనము, 11-70, 9-234, 9-246, 8-274, సూర్యప్రభ వాహనము 30-197, తురగ వాహనము 11.2.30, 1-2-210 పల్లకీ వాహనము 30.197, 15.189. గజవాహనములు

కూడా ప్రస్తావింపబడినవి. 13.58.997. రథోత్సవమును గూర్చి అనేక సంకీర్తనలలో వివరించిరి. కల్యాణ ఉత్సవము, వసంతోత్సవమున పల్లకీ వాహనమున నూరేగించెదరు. కల్యాణో త్సవమున గజ వాహనమున ఊరేగింపు జరుగును.

కల్పవృక్ష వాహనమునాడు శ్రీకృష్ణ రుక్మిణీ సత్యభామల వేషమున స్వామి వారి ఊరేగింపు జరుగును. "కదలని నడిగడ్డ కల్పజంబుల పదిలమైన నీడ బంగారు చవికెలో పొదిగొనఁబూచిన పున్నాగతరులలో" అనెడి సంకీర్తన ఈ వాహన సూచకమై ఉండవచ్చును.

శాసనములలో పదునొకండవ రోజు "విడైయాత్ర అనగా 'వీడ్కోలు'గ పేర్కొనబడి నది [35]

భోగీంద్రులును మీరుఁ

బోయి రండు

వేగిన మీఁదటి విభవములకు

హరుఁడపోయిర అజుడనీవునుంబోయి 70 రేకు (1-368)

తిరిగిరామీఁదటి తిరునాళ్ళకు" వీడ్కోలు యాత్రను పైవిధముగా వర్ణించెను.

## కల్యాణోత్సవము

పూర్వము శ్రీ మలయప్ప స్వామి వారికి విశేష పర్వదినములలో బ్రహ్మోత్సవము లలో కల్యాణ ఉత్సవము జరిగెడిది. తాళ్ళపాక అన్నమాచార్యులు తిరుమలలో నిత్య కల్యాణమును ఏర్పాటు చేసిరి. పదునైదవ శతాబ్దమున వారేర్పరచిన నిత్య కల్యాణ ఉత్సవము నేటికిని నిర్విఘ్నముగా సాగుచున్నది. వారే కన్యాదాతగా నిత్య కళ్యాణ ఉత్సవమును ప్రారంభించిరి. కల్యాణోత్సవము జరిగెడి విధానమును

"ముంచి హోమములు సేసి మునులు సంభ్రమమున

అంచెల గడియ కుడుకట్టె పెట్టిరి

పెంచముగఁదెరవేసి పెండ్లిపీఁటవెట్టిరదె

మించఁబేరంటాండ్లు నర్మిలిఁబాడరో

యీవేళ దలఁబాలు ఇట్టే పోసిరి

వేవేలకుఁగప్పురపు విడేలియ్యరో"-31-432 అని కళ్యాణ మహోత్సవమును వర్ణించెను.

కల్యాణోత్సవ సందర్భమున తూగుమంచముపై

దేవేరులతో స్వామి వారు నూగుటను

"జమళిఁగల్యాణము సరసుఁడాడె నేడు

తూగు మంచము మీఁద దొయ్యలు లిద్దరిఁ
గౌగలించుకొంటాఁగరఁగిని" (25.569)
ఇట్లు వర్ణించెను.
కల్యాణము జరిగిన పిదప తేరుమీద
"ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తలనేగివచ్చిని యిందిరా నాథుడు(306 రేకు) (1-31)

"దేవ దుందుభులతోడ దివ్యులతోడ యీ వేళ శ్రీహరి తేరుయేఁగీ వీథులను" అని అతి వైభవముగా వర్ణించిరి. (9-221) (288 రేకు)

ఊరేగింపు, అరతులెత్తుట, విందులారగించుట, ఇందు వర్ణితములు.

"తెరవఁబెండ్లియాడి తేరు మీఁద నేఁగిరాగా
చిరు చెమటలు గారె జెక్కులమీద
ఆసతో వాడలనెల్లా నారతు లెత్తించుకోగా
పోసరించి మోముల గొబ్బున మించె గళలును
వెలయ నిండ్ల నెల్లా విందులారగించఁగాను" 25.114
అని వర్ణించెను.

కల్యాణోత్సవమున ఆండాళ్ రచించిన నాచ్చియార్ తిరుమొళిలోని వారణమాయి రమ్‌తో ప్రారంభమగు పాశురములను పాడెదరు. ఆ పాశురముల భావమును అన్నమయ్య ఈ సంకీర్తనలో

"కాంతుని నేగలలోన కౌగలించినట్లాయె
నంతలోనే పులకించి నట్లాయె
చెంతల నా చెక్కులెల్ల చెమరించినట్లాయె
వింతలెల్లా యేనగంటి విభుడెందున్నాడో"నని (శృం.సం. 30.210) వర్ణించెను.

కల్యాణోత్సవమున పల్లకీ వాహనము నెక్కించు సందర్భముననేమో

"అందలముపై నెక్కించరే" అని ఆ సన్నివేశము నీ సంకీర్తనలో అతి సహజముగా వర్ణించిరి.

కల్యాణోత్సవ సందర్భమున శోభన పాటలను "సోబన పాడేము మేము సుదతులము, యీ బుద్ధులు మీకు జెల్లు నిద్దరికి నయ్యా" 27.40 అని సంకీర్తనలలో వర్ణించిరి.

తిరుపతి గోవిందరాజస్వామి కళ్యాణము కాబోలు " అండనె శ్రీవేంకటేశు అదె

గోవిందరాజవై జమళి పెండ్లికొడుకవు నైతివి" 13.183 అనియు బహుశః చెంచు వనితలకు స్వామికి వివాహమును 31.190లో వర్ణించిరని తోచును.

పై విధముగా కల్యాణమహోత్సవము, బ్రహ్మోత్సవములనేక విధములుగా స్ఫూర్తి నొసగి అనేక సంకీర్తనలకు కారణమైనవని తెలియుచున్నది.

**వసంతోత్సవము**

చైత్ర మాస పున్నమినాడు సీతారామ లక్ష్మణులకు వసంతోత్సవము జరుగును. వార్షిక వసంతోత్సవములో చివరి రోజు అనగా మూడవరోజు పున్నమినాడు శ్రీభూదే వులతో మలయప్ప స్వామితో రుక్మిణీ శ్రీకృష్ణులు, సీతారామలక్ష్మణులు పాల్గొనెదరు. కోడై తిరునాళ్లకు సంధానముగా జరుపబడెడిది. ఈ ఉత్సవమున చందనము ప్రత్యేక స్థానమును కలిగియున్నది. చైత్రమాస శుద్ధ త్రయోదశి, చతుర్దశి పూర్ణిమలతో సంవత్స రమున కొక్కమారు జరుగును.

"ఇద్దరి వసంతము లీడేరను
వుద్దండాలు మాని ఇంక నూరకుండ రాదా
చలము చెల్లితేఁజాలు సరుగఁ బన్నీటను
చలువగా వసంతము చల్లవయ్యా -25-121 సంకీర్తనలో ఈ ఉత్సవములు వర్ణింపబడినవి.

తిరుపతిలో వసంతోత్సవమున "వరుసతో సొసముఖా వసంత పూర్ణిమ నేడు లలితపు గోవిందుడు లక్ష్మి మండలమందున్న వలరాజదివో కొలువగ వచ్చెను." అని వర్ణించెను.

## కోడై తిరునాళ్ళు తెప్పోత్సవం

వేసవి కాలమున జరిగెడి ఈ ఉత్సవమును అన్నమయ్య "శ్రీ వేంకటేశ్వరుడు శ్రీ యలమేల్మంగతోడ కోవిదుడై విహరించీ కోడతిరునాళ్ళు. కుప్పలుగా భోగించీఁగోడ తిరునాళ్ళు" అని 20.240, 24.24 సంకీర్తనలోను వర్ణించెను.

"ఒప్పుగ శ్రీ వేంకటాద్రి నున్నతిగోనేటిలోన
తెప్పరిల్లె నేట నేట తెప్ప తిరునాళ్ళు
పూవుల తెప్పల మీద పొలతులు నీవు నెక్కి
అని తెప్పోత్సవములను 2.143, 2.47 వర్ణించెను. "చిప్పిల నహోబలాన శ్రీ వేంకటాద్రి మీద తెప్పలదేలేటి యట్టి దేవ సింహమా" 7.129 అనెడి అహోబలాన జరిగెడి తెప్పో త్సవమును వర్ణించెనేమో!

27.96 "వసంతము లాడరయ్యా కులుకు నవ్వులే తలకొన్న తెప్పలు కిలకిల నవ్వి జలకేలి సేయరయ్య" అని వర్ణించెను.

తిరుమలలో జరుగు నిత్య వసంతోత్సవమును కాబోలు అన్నమయ్య

"వనితకు బతికిదె వసంతము

దిన దినము నమరె తిరుమల మీద

జవ్వాది వసంతము చతురుడు గైకొనె

పువ్వుల వసంతము పొలతికిదె

రవ్వగా బండ్లపై రాసులు వోసుక

నవ్వుతావేటు లాడేరు నడిమ చింతాడ" అనితిరుమల ఆలయమున నడిమి చింతాడ నిత్య వసంతోత్సవమును వర్ణించెను.

## పార్వేట ఉత్సవము

ప్రతి సంవత్సరము విజయదశమి దినమునందు పార్వేట ఉత్సవము జరుగును. శ్రీవారికి మాధ్యాహ్నికారాధన పిమ్మట విశేషాభరణములతో అలంకారము జరిగి పరి నారముతో తాళ్ళపాక వారి పార్వేట మండపమునకు వేంచేయుదురు.

"విజయపుటమ్ము వేసె వేంకటేశుఁడు

విజయదశమిని శ్రీ వేంకటేశుడు" అని 9.183

సంకీర్తలో వర్ణించెను.

ప్రతి సంవత్సరము సంక్రాంతి మరునాడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారు పంచా యుధములు ధరించి పారువేట మండపమునకు వెళ్లెదరు. ఈ విధముగా స్వామివారి పార్వేట ఉత్సవము రెండుమార్లు జరుగును. పంచాయుధములతో స్వామిని రథములో విజయ శంఖము పట్టి విష్ణుడై సంచరించెడి వర్ణన బహుశః నాటి స్వామి వారి వర్ణనేమో?

వీథుల వీథుల నెల్లా విష్ణుఁడు సంచరించీని

పొదిమాని కన్నగత్తె పొండు మీర సురులు

"తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముడు వాఁడె

సారమైన శంఖచక్రశార్ఙ్గాయుధములవే" అని స్వామిని పంచాయుధములు ధరించిన ధనుర్ధారిగ వర్ణించెను. మరియు "విజయ శంఖము వట్టెవీఁడె శ్రీ వేంకటేశుడు" అని విజయ శంఖమను గూర్చియు చెప్పుటచే పార్వేటకై ఏగెడు స్వామి వర్ణన ఏమోనని తోచుచున్నది. మరొక సంకీర్తనలో 'అశ్వారోహుడైన స్వామిని పంచాయుధములతో వర్ణించిన వర్ణన కలదు.

"పదిలముగా నిరువంకఁ బసిఁడి పింజలయంప
పొదల తరకసము లొరపులు నెరపఁగా
గదయు శంఖంబు చక్రము ధనుఃఖడ్గములు
పదివేలు సూర్య బింబములైనవపుడు" (11-2-35) పార్వేట ఉత్సవమున అశ్వ వాహన మనివార్యము. పార్వేట మండపమున నివేదనలు జరుగును. "నా కొరకుఁగా వేంకటేశు డారగించె"నని (11-2-56) తళిగారాధన గూర్చి సూచించిరేమో?

## శ్రీ మలయప్ప స్వామికి దేవులతో ఉత్సవ తిరుమంజనం :

వసంతోత్సవములోనో, బ్రహ్మోత్సవములోనో, పుష్ప యాగములోనో మలయప్ప స్వామి దేవుల తిరుమంజమునిట్లు వర్ణించిరి.

"తోడు గూడితిరిద్దరు సొంపగు జాణలెమీరు
తోడి నీళ్ళాడరయ్య దొరకె మీ కిపుడు
చెలియ గుబ్బల మీది చెమట పన్నీరు కాపు
కలకలమను నవ్వు కప్పురకాపు
కాంతమేని తావి యట కటి చందనపు కాపు
ఇయ్యలమేల్మంగ కాంతులెత్తే తిరువంది కాపు
ఇయ్యెడ శ్రీ వేంకటేశ యెనసితి రిద్దరును
వొయ్యనే మజ్జన వేల దొరవాయ నీకు" 25.292

అన్నమయ్య దేవులతో స్వామికి చందన, తిరువందికాపులను వర్ణించుటచే ఉత్సవ వేళలో జరిగెడి తిరుమంజనమును సూచించుచున్నట్లనిపించుచున్నది.

## కోయిలాళ్వార్ తిరుమంజనము

బ్రహ్మోత్సవ ప్రారంభమున గర్భగృహమున జరిగెడి పవిత్ర ఉత్సవమిది. ఈ ఉత్సవమున మూలమూర్తి తక్క తక్కిన మూర్తులన్నింటిని ప్రక్కనే ఉన్న మంటపములో వేంచేపు చేసెదరు. పిమ్మట మూలమూర్తి కొక గుడారము కప్పబడును. పిమ్మట గర్భాలయమునకు కుంకుమ, కర్పూర, చందనాదులచే లేపనము తయారు చేసి వానితో శుద్ధి చేసెదరు. అటు పిమ్మట మూల మూర్తికి భోగ శ్రీనివాస మూర్తికి, తిరుమంజనము జరుగును.

"బంగారు మేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁద మీఁద సేయరే చెలులు

తట్టుపుణుగుల నూనె తగనిండా నంటుకొని
గట్టిగాఁగస్తూరి యట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జన మాడెనిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు"
కప్పురపు గందవొడి నిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి మడిచెను గొజ్జింగ లెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడమీరే తలకొని చెలులు
అలమేలుమంగ నురమందు నిట్లెనుంచుకొని
తులసి దండలు మోఁచె నిలువునను
చెలరేగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాఁడు మోహాలు గుప్పరే చెలులు" (29.330)

ఈ సంకీర్తనలో "తలంటుకొని, తిరుమేన సొమ్మలెల్లా నిడుకొని"యని వర్ణించుటచే "బంగారు మేడలలోనని వర్ణించుటచే గర్భాలయములోని తిరుమంజనోత్సవమున గూర్చి ఏమో అన్నమయ్య ఇట్లు సూచించెను. ఇంకను "అలమేలుమంగ పుర మందుంచుకొని తులసి దండల"ను గూర్చి వర్ణించుటచే బహుశః పవిత్రోత్సవ సమయమున జరుగు తిరుమంజనమును గూర్చి ఏమోనని ఊహింప వీలుగానున్నది.

## పవిత్రోత్సవము

క్రీ.శ. 1464 నాటి శాసనములో ఈ ఉత్సవమును గూర్చిన ప్రశంస కలదు. శ్రావణ మాసములో ఐదు దినముల ఉత్సవముగా వెల్లడించబడినది. వైదిక సంబంధముతో కూడిన ఉత్సవము. పవిత్రోత్సవము అనగా పట్టుతో పూసలుగా అమర్చబడిన మాలలను ప్రతిష్ఠించి శ్రీ స్వామివారికి, వారి పరివార దేవతలకు సమర్పణము చేయు ఉత్సవము. శ్రీ స్వామివారి ఉత్సవములో ఏర్పడు దోషములు ఈ ఉత్సవముతో తొలగిపోవును.

## పుష్పయాగ ఉత్సవము

కార్తీకమాస శ్రవణా నక్షత్రమునాడు బ్రహ్మోత్సవముల కనుసంధానముగా ఈ ఉత్సవము జరిపెడివారని తెలియుచున్నది. అన్నమయ్య సంకీర్తనలో రెండు సంకీర్తనలు మాత్రమే కానవచ్చుచున్నవి. ఈ ఉత్సవమెట్లు జరుపబడినదో ఈ సంకీర్తనలలో వివరించిరి.

"సకల లోకేశ్వరుడు సరుస జేకొనువాడు

అకలంకముగా బుష్పయాగంబు" 30.209

"కలువ రేకుల వంటి ఘనమైన కనుల

పొలతుల చూపులె నీ పుష్పయాగము" 13.60

అనెడి సంకీర్తనలో 'పుష్పయాగ'నామ ప్రశంస మాత్రమే కానవచ్చును. ఈ సంకీర్తన మధుర భక్తిపరముగా వర్ణింపబడినది.

## శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారు ఉత్సవము

తిరుమల శ్రీవారి ఆనందనిలయములో శ్రీ సుదర్శన భగవానుడు పంచలోహ ఉత్సవమూర్తిగా వేంచేసి యున్నారు. శ్రీ సుదర్శన భగవానునికి సంవత్సరములో నాలుగుమార్లు శ్రీ స్వామి పుష్కరిణిలో చక్రస్నానము జరుగును. బ్రహ్మోత్సవముననను, రథసప్తమినాడు, అనంత పద్మనాభ చతుర్దశి రోజున, వైకుంఠ ద్వాదశినాడు నాలుగు మార్లు జరుగును. శ్రీ సుదర్శనము శ్రీ వేంకటేశ్వర స్వామివారి దక్షిణ కరముననను, ఉత్సవ మూర్తిగను, జ్యోతి స్వరూపముగా దర్శనము నిచ్చుచున్నారు. (36)

"నమో నమో దానవ వినాశ చక్రమా, రవిచంద్రకోటి తేజ

రాసియైన చక్రమా, శ్రీ వేంకటేశు దక్షిణ కరచక్రమా

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా." 8.282

పై సంకీర్తనలో అన్నమయ్య దక్షిణకర చక్రము, ఉత్సవ మూర్తిని వర్ణించెను.

బ్రహ్మోత్సవములలో ప్రతి దినము ఉదయము సాయంత్రము శ్రీ సుదర్శన ఉత్సవ మూర్తి పల్లకీలో పురవీధులలో నేగి స్వామి వారి రాకను సూచించెదరు. పదవ రోజు ఉత్సవమున శ్రీభూదేవులతో స్వామివారు, సుదర్శనాళ్వారు పల్లకీలో ఊరేగి శ్రీవరాహ స్వామి ఆలయ ప్రాంగణమును చేరెదరు. అచట శ్రీ స్వామివారితోపాటు శ్రీ సుదర్శనా ళ్వారుకు స్నపన తిరుమంజనము జరుగును. ఇదే విధముగా రథసప్తమి, అనంత పద్మనాభ చతుర్దశి రోజున, వైకుంఠ ద్వాదశినాడు జరుగును. శ్రీ సుదర్శన ఊరేగింపును

"వెడలె వెడలెనదె వీథుల వీథుల

తొడికి దైత్యులను౹దుంచ౹గను" 2.515 అని అన్నమయ్య వర్ణించెను.

"మర్దమర్ద మమ బంధాని" అనెడి సంకీర్తనలో "హరినవ్య కరాంకా" అని స్వామి వారికి శ్రీరామానుజులవారు శంఖచక్రముల నిడినట్లుచెప్పెడి విషయమును సూచించిరి.

"శ్రీ వేంకటేశ ప్రయుక్త సతత పరాక్రమ జయంకర" అని శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి చేతిలోని ప్రయోగ చక్రమును సూచించిరేమో?

"మొక్కెద మిదివో మూఁడు మూర్తులును
వొక్కరూపమై వొనరేఁ జక్రము" 2-516

ఈ సంకీర్తనలో అన్నమయ్య సుదర్శనాళ్వారుకు జరిగెడి ఆరాధననిట్లు తెలియజేసెను.

"మెండుగఁ గంసుని మెదడు గందముగ
హిరణ్యకశిపు పెనురక్తపు అంచనర్ఘ్య పాద్యమ్ములును
మధుకైటభ ప్రాణవాయువుల అలరిన నైవేద్యంబులను"

వైకుంఠ ద్వాదశినాడు జరిగెడి చక్రస్నానమో లేక బ్రహ్మోత్సవములలో జరుగు అవబృథస్నాన విషయమునో (లేక) ముక్కోటి నాటి ముక్కోటి తీర్థ ఉత్సవమునో అన్నమయ్య ఇట్లు వర్ణించెను.

ముక్కోటి నాడు మూడుకోట్ల యేబది లక్షల పుణ్యతీర్థములు పుష్కరిణీ సాన్నిధ్యమును చేరును గాన ఆ దినమున అరుణోదయ కాలమున స్వామి పుష్కరిణీ స్నానమాచరించిన మానవులకు మూడుకోట్ల యేబది లక్షల పుణ్యతీర్థ స్నాన ఫలము లభించునని పురాణములు వచించుచున్నవి. ఈ పుష్కరిణీ స్నానము నేమో తిరు ద్వాదశి నాటి విశేషమును ఇట్లు అన్నమయ్య వర్ణించెను.

"అనుచు లోకములెల్లనదె జయవెట్టెరు
నినుఁగొల్చితిఁగావవే నీరజాక్షుడా
అదివో కోనేటిలోన నదివో సర్వతీర్థములు
అదివో పైఁడి మేడల హరి నగరు
పొదిలి పరుషలెల్లా పొదిగి సేవించేరు
యిదివో వరము లిచ్చె నిందిరానాథుడు
గుదిగొనెఁ బుణ్యము కోట్ల సంఖ్యలు చేరె
యిదివో నిత్యశూరులు ఆళువారులు
నిదుల శేషాచలము నిక్కి పైపైఁబొడచూపె" (2.111)

## రథోత్సవము

బ్రహ్మోత్సవములలో రథోత్సవము ప్రధానమైనది. ఈ రథోత్సవము బ్రహ్మోత్సవ మునవే కాక కళ్యాణోత్సవము, రథ సప్తమి మున్నగు ఉత్సవములలో మహా వైభవముగా జరుగును.

బ్రహ్మోత్సవ సమయమున జరగెడి రథోత్సవమునేమో అన్నమయ్య

"దిక్కులెల్లా సాధించి దేవ దుందుభులు మ్రోయ

అదివో హరి తేరు అదె గరుడధ్వజము

యేడేడు దప్పకుండాను యేఁగి సేవించరో" 9.212 అను సంకీర్తనలో వర్ణించెను.

కల్యాణోత్సవ సందర్భమున నేమో "అలయేగు బెండ్లి కల్యాణ రథము" అని సంకీర్తనలో వర్ణించెను.

రథసప్తమి దినమున శ్రీ మలయప్ప స్వామి వాహన మండపమున సూర్యప్రభ వాహనము నధిష్ఠించి అలంకార భూషితులై సర్వ పరివారములతో వేంచేయుదురు. సప్తగిరి నాథుడగు శ్రీ మలయప్ప స్వామి వారు రథసప్తమి దినమున సప్త వాహనోత్సవము లతో చతుర్వీధులలో ఉత్సవమును జరుపుకొందురు. బహుశః అన్నమయ్య గరుడ, శేషవాహనములతోడి తేరు ఉత్సవ వర్ణన సంకీర్తనలు ఈనాటి ఉత్సవమునే సూచించు చున్నవి. ఈ విషయమై ఇంకను పరిశోధనలు జరుగవలసి యున్నదేమోనని తోచుచున్నది.

"కోనేటి దరులఁగనుఁగొనరో మూడు దేరులు
నానా దేవతలార నరులార మీరు"
"తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుఁడు
వేంకటేశుఁడెక్కెనదె వేరొక్క తేరు
లంకెలై శ్రీ భూసతులు లలి నొక్క తేరెక్కిరి" (9.228)

అని వర్ణించుటచే బహుశః తెప్పోత్సవమునకై కోనేటి దండకు విచ్చేయు స్వామిని దేవులను శ్రీకృష్ణుని వర్ణించిరేమోనని ఊహింపవీలగుచున్నది.

## ఫలోత్సవము

ఫలముల ఉత్సవమిది "It is really a festival of fruits. The offering of large quantities of fruits, wild as well as cultivated ones, to the deity and their free distribution to the members of the congregation"(37)

అన్నమాచార్యులీ ఉత్సవమును తిరుమంజనముతో చేర్చి ఈ విధముగా ఇట్లు తెలిపెనేమో? ఈ ఉత్సవ సమయమున తిరమంజనము పుష్పమంటపములో జరుగు నట. 25.88.

"పన్నీట మజ్జనమార్చి పావడలఁదడి వొత్తి
తిన్నని కపురపు ధూళి తిరుమేన నెల్లామెత్తి

గట్టిగా సొమ్ములు వెట్టి కడు సింగారాలు వేసి
బలిమి నానాజాతి పండ్లు నైవేద్యమిచ్చి" అని అన్నమయ్య వర్ణించెను.

## ఇతర కవులు

ప్రతి ఉగాది నుండి తరువాతి నలుబది దినముల పాటు జరుగు నిత్యోత్సవ ములో, కొంతదూరము కేవలము అన్నమయ్య పాటలనాలకించుచు కొంతదూరము తిరుమల పుర వీథులలో శ్రీస్వామివారి (శ్రీనివాసుడు) ఊరేగింపు జరుగుచున్నది. నేటికిని శ్రీ భూదేవి సమేతముగా మలయప్ప స్వామి అన్నమయ్య కీర్తనలను వినెడి వేడుకను మనము గాంచవచ్చును.

ఈ విధముగా అన్నమయ్యకు వేంకటాద్రి, తిరుమల ఆలయము, స్వామి వేంక టేశ్వరుడు, విష్ణువు, పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములు, సంగీతము,. నాట్యము, శిల్పకళ, ఆరాధనోత్సవములు వివిధ రకములుగా ప్రేరణను కలిగించెను. అదే విధముగా తక్కిన భక్త కవులకెట్లు స్ఫూర్తినిచ్చినదో కదా!

అన్నమయ్యకు పూర్వము ద్రావిడ సాహిత్యములో తొండరడిప్పొడి ఆళ్వారుల 'తిరుమాల' గ్రంథ రచనకు శ్రీరంగము-శ్రీరంగనాథుడు స్ఫూర్తినిచ్చిరని తోచును. 'తిరుమాల గ్రంథములోని (19) పాశురములో పడమటి దిక్కువ శిరస్సు నుంచి, తూర్పు దిక్కున పాదమును జాపి, ఉత్తర దిక్కునున్న వారికి పృష్ఠ భాగమును చూపి దక్షిణ దిక్కున లంకపై దృష్టి సారించుచు శేషశయ్యపై శయనించియున్న రంగనాథుని వర్ణించిరి. (2)వ పాటలో 'పచ్చమామలై పోలె' మరకతమణివంటి దేహకాంతి కలవాడని భక్తుల నుజ్జీవింప దలచి శ్రీరంగాది క్షేత్రములు నిర్మించెననియు, (10)వ పాటలో తుమ్మెదల ఝుంకారముతో, నెమళ్ళ నాట్యములతో కోకిల ధ్వనులతో ఆరామములతో అలంకరింపడిన శ్రీరంగమని (14) ఉద్యానవనములు, పుష్ప ఫలభరితములుగ కను విందు కలుగజేయుచున్నవని (32, 38) కావేరిచే పరివృతమైన రంగనాథా, అనియు, (40) సప్త ప్రాకార పరివృత శ్రీరంగమున అశ్రిత రక్షా నిమిత్తమై శయనించిన రంగానాథాయని ఈ ఆళ్వార్లు కీర్తించిరి. అటులనే తిరుప్పాణి ఆళ్వారును 'అమలనాద పిరాన్ అనెడి స్తోత్ర గ్రంథమున తిరుమల శ్రీరంగ క్షేత్రములలో నెలకొన్న స్వామిని వేనోళ్ళ కీర్తించిరి.

అన్నమయ్య సమకాలికునిగా కీర్తింపబడుచున్న పురందరదాసు దాస సాహిత్య ములో విశిష్ట స్థానము నలంకరించిరి. పురందరదాసు సాహిత్యమునకు, అనేక కీర్తనలకు ఆలయము అర్చామూర్తులు కారకములైనవిగా తోచును. తిరుమల వేంకటేశ్వరుని గూర్చి వేంకటాచల

నిలయం వైకుంఠ పురవాసం' అనెడి కీర్తన 'కూసుకండెన్మా' అనెడి కీర్తనలో వడ్డీకాసులవాడై 'శేషగిరి' మీద నెలకొనెనని, గోవులను కాచి 'జగన్నాథ'మున నివసించుచున్నాడని, పాలు పెరుగు కడవలను పగులగొట్టి 'ఉడిపి'లో నున్నాడని, మంగళ రేఖలతో రూపుదిద్దుకొన్న పురందర విఠలుడని, తిరుమల, జగన్నాథము, ఉడిపి, పండరీపురములను వర్ణించిరి. పురందరదాసు కర్ణాటక రాష్ట్రము మరియు అనేక స్థలములను సందర్శించి అచటి ఆలయ దేవతలను వివిధ కీర్తనలలో వివరించిరి. ఆలయ దేవతలనే కాక ఉత్సవములకు సంబంధించిన కీర్తనలనేకములను రచించిరి. భవిష్యోత్తర పురాణాంతర్గత శ్రీ వేంకటాచల మాహాత్మ్యము నందలి స్వామి శ్రీనివాసుడు వేటకు పోవునపుడు అలంకరణ సందర్భమును డెబ్బది చరణములలో పాడిరి. "నోడు నోడు వేంకటేశ అప్ప వేంకటేశ తాను బేటి యాడిద స్వామి, బేటి యాడిద...అప్ప వేంకటేశ తాను ఒప్పదింద‌లే స్వామి గరిగె బందనె" అని వర్ణించిరి. తిరుమలలో 'పార్వేట' ఉత్సవముగా జరుపుదురు. వేంకటేశ్వరుని తిరు వేంగళప్ప శ్రీ పురందర విఠలరాయ జగదాళిగె నీను మోహనరూప కాణో" అని పాడిరి. మరియు "అదద్దెల్లా ఒళితే ఆయితునమ్మ శ్రీధరన సేవెగె సాధన సంపత్తాయితు" అని పాడుచూ తీర్థములపైనను శ్రుతి, స్మృతి, పురాణ రహస్యములను నాలుగు లక్షల ఇరువది వేల కీర్తనలను కన్నడములో రచించిన పరమ భాగవతులు. 'ఏతయ్య బెళగాయితు' ఉప్పవాదిశయ్య హరియే' అని 'మేల్కొలుపు' గీతముల నాలపించిరి. 'మలగయ్య జలజనాభ మాణిక్య మంటపదొళు' అని స్వామిని శయనింపుమని 'ఏకాంతసేవ'ని వర్ణించిరి. 'లాలి లాలి నమ్మ హరియెలాలి' అని జోలకూడా పాడిరి. "ఏను మేళవి తంగి తిమ్మయ్య పాదవను కండె సర్వాభరణదింద పురందర విఠల కూడినదే" అని స్వామి దివ్య మంగళ విగ్రహమును కనులారా చూచి ధన్యుడనైతినని పాడిరి.

అన్నమయ్య శృంగార సంకీర్తనముల స్ఫూర్తిచే క్షేత్రయ్య పదరచన మువ్వగోపాలుని కంకితముగా రచించబడినది. "క్షేత్రయ్య అనేది పదరచన చేస్తూ క్షేత్రాటనము చేసినందువల్ల వచ్చిన ప్రజ్ఞానామమని అతని అసలు పేరు మొవ్వ వరదయ్య అనీ శ్రీ విస్సా అప్పారావుగారు పరిశోధనల ద్వారా వెల్లడి అయింది. "క్షేత్రయ్య పదునెనిమిది పుణ్యక్షేత్రములను దర్శించి అచటి వేల్పుల కంకితములుగా పదములు రచించెను. తాను విజయము చేసిన రాజాస్థానములను, రచించిన పదముల సంఖ్యను "వేడుకతో నడచుకొన్న విటరాయడే" పదములో తెలియజేసెను. క్షేత్రయ్య మహాదేవపట్టణములోని ఆదివరాహ, శ్వేత వరాహస్వామిని, చిదంబర తిల్ల గోవిందరాజస్వామిని, కడప వేంకటేశుని, కంచి వరదుని,

వేద నారాయణుని, హేమకూట హేమాద్రి స్వామిని, యదుగిరి స్వామిని, ఇనపురి వేల్పుని, తిరుమల వేంకటేశుని, తిరువళ్లూరు వీర రాఘ వుని, శ్రీరంగము శ్రీరంగనాధుని, మధుర సుందరేశుని, సత్యపురి వాసుదేవుని, పాల గిరి చెన్నుని, శ్రీశైల మల్లికార్జునుని, చక్రపురి నిలయుని, కోవళ్లూరు మువ్వగోపాలుని, కదిరి కందదేవుని గురించి పదములను రచించి మువ్వగోపాలునితో అభేదమును పాటించెను.

ఇక భక్త రామదాసు భద్రాచల రామదాసుగా ప్రఖ్యాతి కెక్కిరి. భద్రాచలము, రామదాసుల అనుబంధము విభజింపలేనిది. రామదాసు జీవితమంతయు భద్రాచల మునకే అంకితముగావించ బడినది. రామదాసుగారి భద్రాచల కైంకర్యమును వారి కీర్తనలలోనే మనము గాంచవచ్చును. రామదాసునకు భద్రాచలము, భద్రాచల రాముడే జీవిత సర్వస్వమనుటలో ఇసుమంతయు అతిశయోక్తి లేదు. "చుట్టు ప్రాకారములు సొంపుగ జేయిస్తి రామచంద్రా ఆ ప్రాకారమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా" అనెడి కీర్తనలో గోపుర మంటపాలు, భరతునకు పచ్చల పతకము, శత్రుఘ్నునకు మొలత్రాడు, వాహనములు తాను చేయించెనని వివరించిరి. "నూట యెనిమిది తిరుపతు లెలమి తిరుగ పనిలేదన్నా" అని తారక మంత్రము దొరికెనని ఆనందించిన భక్తాగ్రగణ్యుడు రామదాసు.

"ఇదిగో భద్రాద్రి గౌతమి అదిగో చూడండి
ముదముతో సీతా ముదిత లక్ష్మణులు కలిసి కొలువ రఘుపతి యుండెడి
చారు స్వర్ణ ప్రాకార గోపుర ద్వారములతో సుందరమై యుండెడి
అనుపమానమై యతి సుందరమై తనరు చక్రము ధగధగ మెరసెడి
కలియుగమందున నిలవైకుంఠము నలరుచున్నది సమముగా మ్రొక్కెడి
పొన్నల పొగడల పూపొదరిండ్లను చెన్ను మీరగను శృంగారమగు
శ్రీకరముగా రామదాసుని ప్రాకటముగ బ్రోచే ప్రభు వాసము" అను

కీర్తన రామదాసు భక్తికి, ఆలయము స్వామి వర్ణనకు మచ్చుతునక. "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు ప్రక్క తోడుగా భగవంతుడు మన చక్రధారియై" కీర్తనలో దశావతారములను వర్ణించెను. 'కలియుగ వైకుంఠము భద్రాచల నిలయము సేవిం తము' అనెడి కీర్తనలో కాంచన సౌధములు, దూలములు, స్తంభములు, ద్వారములు, వాకిళ్ళు, గోపురములు, దేవళములు రత్న మంటపములు, పురవీథులు, కోనేరులు, నదులు, గోదావరి స్నానముతో పరివారములు ప్రేమతో గొలువగాను ప్రేమచే భద్రాద్రి రామదాసుని నేలు స్వామి కోదండరాముని వాసము" అని భద్రాద్రి స్వామిని ఆ ఆలయ నిర్మాణము నంతటిని కన్నులకు కట్టినట్లు వర్ణించెను.

సంగీత త్రిమూర్తులుగా కొనియాడబడు త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి ముగ్గురు సంగీత భక్త కవులకును ఆలయములు ప్రేరణను కల్గించెను. త్యాగరాజస్వామి, అన్నమయ్య పుష్కరిణి వర్ణించినట్లు కావేరిని "సారి వెడలిన యీ కావేరిని జూడరే"యని కావేరీ తీర్థమును కీర్తించిరి. శ్రీరంగనాధుని "ఓ రంగశాయీ బిలిచితే ఓ యనుచు రారాదా" యనియు, తిరుమల వేంకటేశుని "వేంకటేశా నిను సేవింప" అనెడి కీర్తనలోను "తెరతీయగరాదా నాలోని... తిరుపతి వేంకటరమణ" అనియు, "వరదరాజ నిన్నే కోరివచ్చితిరా" యనెడి కీర్తనలో కంచి వరదుని, వరద నవనీతాశ అని మరియొక కీర్తనలోను, ఘటికాచల నరసింహుని "నరసింహ నన్ను బ్రోవవే" శ్రీ నరసింహమాంపాహి" అనియు ఘటికాచల ఆంజనేయుని "పాహిరామదూత" అనియు, సువర్ణముఖీ నదీతీర విష్ణువును "నీవే గాని నన్నెవరు గాతురా" అనియు, తిరువల్లికేణి పార్థసారథిని "స్వారి వెడలిన పార్థసారథినిగనరే' యని, తిరువట్టియూర్ శివుని ఐదు పాటలలోను, కొవ్వూరు సుందరేశుని ఐదుపాటలలోను కీర్తించిరి.

ముత్తుస్వామి దీక్షితులు వేంకటేశుని "శేషాచల నాయకం భజామి" అని కీర్తించిరి. శ్రీ కాళహస్తీశ్వరునిపై శ్రీ కాళహస్తీశ అనియు "కంజదళాయతాక్షి కామాక్షి" అని కంచి కామాక్షిని, "ఏకామ్ర నాథం భజేహం" అని ఏకామ్రేశ్వరుని కీర్తించిరి. "వరదరాజ ముపాస్మహే" అన కంచి వరదుని "ఆనంద నటన ప్రకాశం" అని చిదంబర నాధుని "శివకామేశ్వరీం" అని జగదంబను, 'గోవిందరాజ ముపాస్మహే" అని తిల్ల గోవింద రాజుని "గోవిందరాజేన' అని మరొక కీర్తనలోను, మయూర స్థల అభయాంబికను తిరువాయూర్ త్యాగరాజస్వామిని, ఆ దేవిని, గణపతిని, ఆలయ దేవతలను ఇంకను దక్షిణాదిని పలు క్షేత్రములను దర్శించి పలు రకముల కీర్తనలను వారు చేసిరి. అనేక ఆలయములు, దేవతలు అనేక కీర్తనలకు స్ఫూర్తి నిచ్చినవి. ఇదే విధముగా ఆలయము లలో జరిగెడి ఉత్సవములు ఈ భక్త కవులకు ప్రేరణనిచ్చినవి.

త్యాగరాజు రచించిన 'శ్రీరంగం పంచరత్నము'లో మూలమూర్తి ముత్తంగి సేవను 'ముత్యాల సరములు యురమున గనవచ్చితి త్యాగరాజు' అనియు, "తేజినెక్కి బాగ తెరపున రాగ" అని అశ్వవాహనమున 'వినరాదా నా మనవి' కీర్తనలోను, శ్రీ వెలయు చిత్త వీధిలో వేడ్కగరాగా సేవనుకని సురులు విరులచే ప్రేమను పూజించగా త్యాగరాజు చూడగా వైభోగరంగా'యని స్వామి ఊరేగింపును వర్ణించిరి. కంచి గరుడ సేవను 'త్యాగరాజనుత గరుడ సేవ జూచి' అని వర్ణించిరి. తిరువయ్యూరులో జరిగెడి సప్తస్థాన మనెడి ఉత్సవ

వేళలో 'చింతిస్తున్నాడే యముడు' అని ఉత్సవ విశేషమును పొగడెను. ముత్తుస్వామి దీక్షితుల 'శ్రీ వేంకటగిరీశ మాలోకయే' వినాయకతురగారూఢం' అని గజవాహనోత్సవమును, శంఖచక్ర గదాపాణి...కీర్తనలో' గరుడ వాహన విచక్షణమని గరుడ వాహనమును వర్ణించిరి.

భద్రాచల రామదాసు గారు రచించిన దాశరథీ శతకమును దేవాలయములోని ఏకంతసేవ సందర్భమున చదివిరట. ఇంకను చతుర్వింశతి నామ ప్రతిపాదిక చూర్ణికను శ్రీరామ పరముగా రామాయణ సంగ్రహముగా రచించెను. హెచ్చరిక జేయుచు స్వామి వారి సేవను వర్ణించిరి. జోలపాటను పాడిరి. ఇదే విధముగా తిరువనంతపురములోని పద్మనాభ ఆలయమునకు 'స్వాతి తిరనాళ్' చక్రవర్తి అనేక విధములుగా సేవ చేసిరి. వారే స్వయముగా అనేక కీర్తనలను మలయాళ భాషలోను, సంస్కృతము నందును, మణి ప్రవాళమున, రచించిరి. 'పళ్ళియు వర్తల్' అనెడి కీర్తనలో స్వామిని మేల్కొలిపెను. 'జయ జయ రమారమణ సాధు విభతం' ఆలయ 'బలి'ని గూర్చి, వివిధ అలంకారము లతో శోభిల్లు ఆనందపురము నాడు జరుగు వివిధ వినోద వేడుకల బ్రహ్మోత్సవ కోలాహలము 'పంకజలోచన' కీర్తనలోను, 'పంచసాయక జనక' నీలాంబరి రాగ కీర్తనలో సింహవాహనమును గూర్చి, ఆనాటి సంగీతవాద్య గోష్ఠి నీరాజనము గూర్చి, 'పంకజా క్షణం రమేశం' తోడి రాగమున శేషవాహనము శ్వేతఛత్రము వర్ణింపడినవి. 'కనకమయ మయిదు' హుసేని 'కమలవాహన'లో అప్సరసల నాట్యము, ఆందోళిక వాహన ఆనంద భైరవిలోను వర్ణించిరి. 'సినుందు లేశన్' (కురుంజిరాగం) అంచంపన కులవిల్లు మొన్ను గరుడవాహనము గూర్చి మీనాది దశావతార ప్రశంసయు గావించెను. ''ఇందిరాపతి విళంగుం ఇంద్ర వాహనత్తిల్''అని ఇంద్రవాహనమును, 'శిబికైయిల్ ఎత్తుందరుళీదున్ను ళనోకవాహనమును 'నీలపురి కత్తలలలే' ఎనిమిదవ నాటి ఉత్సవమును, 'శరదిందు సమముఖ'లో పార్వేట ఉత్సవము మరరకుండల ఆభరణములు 'సరసిజనాభనినె' (సౌరాష్ట్రం)లో నాగశయనము, అవభృధస్నానము వర్ణింపబడినవి.

ఈ విధముగా అన్నమయ్య సంకీర్తనల కనేక విధములుగా ఆలయము స్ఫూర్తి నిచ్చుటయే కాక అనేక భక్తు కవులకు అన్నమయ్యకు గొప్ప స్థానము కలగుజేసినది. మార్గదర్శకుడుగా సాహిత్యమున గొప్ప స్థానము కలుగజేసినది.

## ఐదవ అధ్యాయము -అథసూచికలు

1. వేదాన్తం, విష్ణు భట్టాచార్యులు, 1998. వైఖానస ఆగమ స్వరూపము (వ్యాసం) గుంటూరు : వేదాన్త నిలయ పబ్లికేషన్స్.

2. Ibid

3. వేదాన్త, విష్ణు భట్టాచార్యులు - 1988 వివిధ ఉపచారములు వాటి అంతరార్థము (వ్యాసం), గుంటూరు : వేదాన్త నిలయం.
4. Ibid
5. Ibid
6. Veeraghava charay, T.K.T. Reprint : 1999. History of Tirupati vol. I Tirupati : T.T.D.
7. Veeraghava charay, T.K.T. 1982. History of Tirupati Tirupati : T.T.D.
8. వేదాన్తం జగన్నాథాచార్యులు, 1999 శ్రీ వేంకటేశ్వర వైభవము తిరుపతి : తి.తి. దేవస్థానము.
9. Ibid
10. బాలసుబ్రహ్మణ్యం జూలకంటి, 2000, మరికొలువు, తిరుపతి తి.తి. దేవస్థానము
11. See. 3 వేదాన్తం, విష్ణుభట్టాచార్యులు 1988
12. కీ॥శే॥ వేదాన్తం జగన్నాథాచార్యులు, శ్రీ వేంకటేశ్వర వైభవము
13. Veeraghava chary, T.K.T. 1982. History of Tirupati, Tirupati : T.T.D.
14. హరికొలువు :
15. See. 12
16. బాలసుబ్రహ్మణ్యం, జూలకంటి 'హరికొలువు' టి.టి.డి.
17. వేదాన్తం జగన్నాథాచార్యులు, శ్రీ వేంకటేశ్వర వైభవము, తి.తి.దే.
18. Ed. Haridas Bhattacharya, 1975. The Cultural Heritage of India Vol IV. The religions Calcutta R.K.M. Institute of Culture Pub. by Lokeswarananda.
19. బాలసుబ్రహ్మణ్యం, జూలకంటి : హరికొలువు : తి.తి.దేవస్థానము
20. Ibid
21. వేదాన్తం జగన్నాథాచార్యులు శ్రీ వేంకటేశ్వర వైభవము టి.టి.డి.
22. Ibid
23. Ibid
24. Veeraghava charya, T.K.T. Sep. 1982. History of Tirupati : T.T.D.
25. Ibid
26. వేదాన్తం జగన్నాథాచార్యులు, శ్రీవేంకటేశ్వర వైభవము టి.టి.డి.

27. Ibid
28. Ibid
29. సప్తగిరి (మాసపత్రిక) డిసెంబర్, 1992, శ్రీమతి పరవస్తు కమలా సుందర్ 'తిరుప్పావై' (వ్యాసం).
30. ఆండాళ్ 'తిరుప్పావై' గ్రంథములోనిది.
31. వేదాన్తం జగన్నాథాచార్యులు, శ్రీ వేంకటేశ్వర వైభవము.
32. Veeraghava charya, T.K.T. 1982, Historyof Tirupati, T.T.D.
33. Ibid
34. Ibid
35. Ibid
36. Ibid
37. Ibid
38. Veeraghav charya T.K.T. 1982 History of Tirupati T.T.D.

# ఉపయుక్త గ్రంథ సూచిక

## విషయ సూచిక


| | |
|---|---|
| తెలుగు గ్రంథములు | 548 |
| తమిళ గ్రంథములు | 556 |
| Books in English | 560 |


### సంక్షిప్తపదసూచిక

తి.తి.దే. : తిరుమల తిరుపతి దేవస్థానము

T.T.D. : Tirumala Tirupati Devasthanam


1. అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి శ్రీనివాసాచార్యులు, ఉదయగిరి (పరిష్కర్తలు) 1951 అధ్యాత్మ సంకీర్తనలు అన్నమాచార్య విరచితములు : సం. 2, 7 తిరుపతి తి.తి.దే.
2. అనంత కృష్ణశర్మ, రాళ్ళపల్లి (పరిష్కర్త), 1955, అధ్యాత్మిక సంకీర్తనలు అన్నమచార్య విరచితములు సం॥ తిరుపతి : తి.తి.దే. సం॥ 8, 9, 10-1952.
3. అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి, రామసుబ్బ శర్మ శ్రీ గౌరిపెద్ది (పరిష్కర్తలు) 1975 శృంగార సంకీర్తనలు అన్నమాచార్య విరచితములు, తిరుపతి : తితిదే సం॥ 13-1960, 14, 1961. 19, 20-1965

4. అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి కృష్ణమూర్తి నేదునూరి (స్వరపరచినవారు) 1976. తాళ్ళపాక అన్నమయ్య పాటలు తిరుపతి.
5. కృష్ణమాచార్య, వాడవల్లి, 1998, శ్రీ వైఖానస శాస్త్రే వైఖానసో పాఖ్యానము, తిరుపతి: తి.తి.దే.
6. కృష్ణమాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల, 1994, ఆళ్వారుల చరిత్రము, సీతానగరం : శ్రీరామానుజవాణి.
7. కేశవాచార్య, నంబూరి, 1922, ఆచార్య సూక్తి ముక్తావళి మద్రాసు : ఆర్ వేంకటేశ్వర కం.
8. కొండమాచార్యులు, మురివర్తి, 1986, అమృతసారము తిరుపతి : త్యాగరాజు ప్రింటర్స్.
9. గోవిందరాజు, చిత్రాజు, 1987 అన్నమయ్య సంకీర్తలలో ఉత్సవ విశేషాలు, రామ సముద్రం : శ్రీనివాస్
10. గంగప్ప, ఎస్. 1983, తెలుగులో పదకవిత, గుంటూరు శశీ ప్రచురణలు
11. గంగప్ప, ఎస్. 1974, క్షేత్రయ్య పద సాహత్యం, హైదరాబాద్ : శశీ ప్రచురణలు
12. గోపాలాచార్య 1985 శ్రీరామానుజుల సమగ్ర చరిత్రము, గుంటూరు వాసు దాశ్రమము.
13. గంగప్ప, ఎస్ 1993 సాహిత్యాను శీలన, గుంటూరు : శశీ ప్రచురణలు
14. గంగప్ప, ఎస్. 1992, ప్రముఖ వాగ్గేయకారులు, గుంటూరు : శశీ ప్రచురణలు
15. చెన్నారెడ్డి (సం.) అన్నమయ్య పాటలు సం॥ 2 అనంత కృష్ణ శర్మగారిచే స్వరపరచ బడినవి.
16. జయదేవ 1985, గీత గోవింద కావ్యము, మద్రాసు : బాలసరస్వతి
17. జనార్ధనసూరి 1999 దేవాలయాలు, హైదరాబాద్ : ప్రజ్ఞాన ప్రచురణలు
18. జగన్నాధాచార్యులు, వేదాంతం, 1999, శ్రీ వేంకటేశ్వర వైభవము తిరుపతి : తి.తి.దే.
19. జయంతి రామయ్య, పంతులు 1961, శాసన పద్యమంజరి, సం॥ 1, కాకినాడ, ఆంధ్ర సాహిత్య పరిషత్తు.
20. దేశికాచార్యులు, వేదాంతం (సం) 1998, ఆలయ సంస్కృతి (వ్యాస సంపుటి) గుంటూరు జిల్లా : వేదాంత నిలయ పబ్లికేషన్స్
21. నరసింహరావు, భావరాజు, 1985, శ్రీ త్యాగరాజు కీర్తనలు, మచిలీపట్టణం : త్రివేణి పబ్లికేషన్స్.
22. నరసింహాచార్య, పి.టి.వి.జి.యల్. 1994, నిత్యపారాయణ పాశురాలు, తిరుపతి: తి.తి.దే.

23. నరసింహాచార్యులు, ఎస్.సి.వి. అను 1998, తిరుమల సమయాచారములు, తిరుపతి: తి.తి.దే.

24. నారాయణాచార్యులు, పుట్టపర్తి, 1975, వాగ్గేయకారుల పదకృతి సాహిత్యము, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సంగీత నాట్యకళా అకాడమి.

25. పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకట, నృసింహచార్యులు, 1985, ఆండాళ్ నాచ్చియార్ తిరుమొళి ప్రథమ దశకము, మచిలీపట్టణము.

26. పార్థసారథి, టివిస్. 1978, ముత్తు స్వామి దీక్షితులు కీర్తనలు, మచిలీపట్టణం, త్రివేణీ పబ్లికేషన్స్.

27. ప్రభాకరశాస్త్రి వేటూరి 1993 వేటూరి వారి పీఠికలు, హైదరాబాద్, మణి మంజరి పబ్లికేషన్స్.

28. ప్రేమ నందకుమార్, 1994, తిరుమళై ఆళ్వారు, తిరుపతి : తి.తి.దే.

29. ఎం. బాలకృష్ణ ప్రసాద్ శ్రీ గరిమెళ్ళ (స్వరకర్త) 1999. అన్నమయ్య నృసింహ సంకీర్తనం. తిరుపతి : తి.తి.దే.

30. మునిరత్నం, తె. 1992, అన్నమయ్య, ఆళ్వారులు తులనాత్మక పరిశీలన ప్రథమ భాగము, తిరుపతి : కల్పనా పబ్లికేషన్స్

31. రామమూర్తి, ధూళిపాల, 1992, అష్టాదశపురాణం, రాజమండ్రి, గొల్లపూడి వీర స్వామి అండ్ సన్.

32. రాజగోపాలరాజు (సం) 1978. తాళ్ళపాక అన్నమాచార్య జయంతి ఉత్సవ సంచిక తిరుపతి : తి.తి.దే.

33. రామసుబ్బ శర్మ, గౌరి పెద్ది (పరిష్కర్త) 1977, శృంగార సంకీర్తనలు అన్నమాచార్య విరచితములు సం. 25, 27-1979, 29-1980, 30-1983 తిరుపతి : తి.తి.దే.

34. రాధాకృష్ణ, బూదరాజు (సం) 1983 తెలుగు మాండలికాలు హైదరాబాద్ : శైలజ

35. రామకృష్ణ, నటరాజు 1968. దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర హైదరాబాద్, విశాలాంధ్ర.

36. రంగనాథాచార్యులు, కె.కె. 1983, తెలుగులో తొలి సమాజ కవులు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్

37. లీలావతి, పొన్నా, 1980 అన్నమాచార్య సంకీర్తనలలోని జానపద గేయ ఫణితులు పొన్న పబ్లికేషన్స్.

38. లీలావతమ్మ, పొన్న, 1993, అన్నమయ్య పదకవితా వైజయంతి, పానకం : పొన్న

పబ్లికేషన్స్.

39. వాణి, కేసర్ల, 1997 అన్నమాచార్య జీవిత చరిత్రము తిరుపతి : తి.తి.దే.

40. విద్యావతి, ఏ. 1979, తాళ్ళపాక కవుల సాహిత్య సేవ మచిలీపట్టణం : విజయ ప్రెస్.

41. వెంకట రమణయ్య, నేలటూరి, 1969, శ్రీ పల్లవులు, చాళుక్యులు, మద్రాసు : వేదం వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.

42. వేదవ్యాస 1997, రామానుజ వైభవము సం.1, 2, రాజమండ్రి, శారదా బుక్‌హౌస్.

43. వేదవ్యాస, 1997, శ్రీ వేంకటేశ్వర వైభవము, హైదరాబాద్.

44. వేంకట రంగ రామానుజాచార్యులు, 1991 శరణాగతి గద్యమ్ శ్రీ రామానుజా చార్యులు, తాపేశ్వరం : మెహర్ చైతన్య నికేతన్ ట్రస్ట్.

45. వేంకట కృష్ణమాచార్యులు (వ్యాఖ్య) 1991, ముకుందమాల.

46. శంకరయ్య, జంధ్యాల, 1984, తెలుగు కవులు, భక్తి తత్త్వం విజయవాడ : స్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్.

47. శ్యామసుందరి, ముత్యం 1996, అన్నమాచార్యుని మధుర కీర్తనలు, రాజమండ్రి: గొల్లపూడి వీరస్వామి అండ్ సన్స్

48. శేషాచార్యులు వి.టి. 1985, దేవాలయాలు తత్త్వవేత్తలు తిరుపతి : తి.తిదే.

49. శివప్రసాద్, ముదిగొండ, 1987, శ్రీపాద రచన, హైదరాబాద్ అన్నమాచార్య ట్రస్ట్.

50. శ్రీరామమూర్తి, వెలమకన్ని, 1983, అన్నమయ్య, రామచంద్రాపురం క్షేత్ర సాహితి.

51. శ్రీనివాసులు, కామిశెట్టి, అన్నమయ్య, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయము

52. శ్రీనివాసులు కామిశెట్టి 1988. తెలుగు వైతాళికులు.

53. శ్రీనివాస్, తిరునగరి, 1995 ఆచార్య సూక్తి ముక్తావళి పరిశీలన. తిరుపతి : తి.తి.దే.

54. సర్వోత్తమన్, కె. 1982, అన్నమయ్య శ్రీపాదరాయలు తిరుపతి : కె. వెంకటరావు.

55. సుగుణ, ఎన్. 1986 అన్నమాచార్యుల సంకీర్తనలు, స్త్రీ సంబంధిత పాటలు, హైదరాబాద్ : రచయిత స్వయం పబ్లికేషన్స్.

56. సుబ్బారావు, నారమంచి, వాగ్గేయకారులు సంగీత మహర్షులు, తెనాలి : శివశ్రీ పబ్లిషర్స్.

57. సోమశేఖర శర్మ, మల్లంపల్లి 1959 ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము సం. 3 మద్రాసు, తెలుగు భాషా సమితి.

58. సంగమేశం, ముట్నూరి, 1981 అన్నమాచార్య సాహితీ కౌముది, తిరుపతి : తి.తి.దే.

59. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 1993 జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్,

డిసెంబర్ నెలలు.

60. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1998 'అదిగో అల్లదిగో శ్రీహరివాసము' మైల వరపు శ్రీనివాసరావు
61. సప్తగిరి మాసపత్రిక, తిరుపతి : తి.తి.దే. 1993 నుండి 2000 వరకు.
62. భక్తి నివేదన వేదాంత మాసపత్రిక, సీతానగరం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## తమిళ గ్రంథములు

1. అరుణాచలం, 1970 తమిళ ఇలక్కియ వరలారు ప్రతి 13 మాయూరమ్. తంజై జిల్లా : గాంధీ విద్యాలయం.
2. అనంతరామయ్యర్. ఇ.వై. 1984 తమిళ "కలితొగై మూలమునంచ్చినార్ కి నియర్ ఉరై" తంజావూరు, తమిళ పల్గళై కళగమ్.
3. ఇళం పూరణర్ ఉరై, 1977 తొల్ కాప్పియమ్ పొరుళదిగారమ్, తిరునల్వేలి : తెన్ ఇందియ శైవ సిద్ధాంతనూల్ పదిప్పు కళగమ్.
4. కణ్ణన్ సామి, ఆర్. 1987 ఆళవార్‌గల్ వైభవం, చెన్నై : రాజగోపాలన్.
5. కణ్ణన్ సామి, ఆర్ 1988, శ్రీ రామానుజ వైభవం, చెన్నై.
6. గోవిందరాజ ముదలియార్, 1946 తొల్ కాప్పియసూత్ర వృద్ధి, తిరునల్వేలి తెన్ ఇందియ శైవ శిద్ధాంతకళగమ్.
7. దండపాణి, ప. 1993 ద్రావిడ ఇశై. చెన్నై : అబ్రహం పండితర్ మన్రమ్.
8. తి. దురైసామి, పిళ్ళై, 1966 నట్రినైమూలముం విళుక్కురై మద్రాసు : అరుణా పబ్లికేషన్స్.
9. దండాయుదమ్, ఇరా 1978, సంగ ఇలక్కియమ్, చెన్నై తమిళ పుత్తగాలయం.
10. నరసింహన్, జి. 1 Ed. 1994, పత్తుపాట్టు సమయంగళ్, తిరుపతి : తి.తి.దే.
11. నచ్చినార్ కినియార్ ఉరై, 1958 తొల్ కాప్పియపొరుళదిగారమ్ (అగత్తినైయల్ పుఱత్తిణయిల్) తిరునల్వేలి తెన్ ఇందియ శైవ సిద్ధాంత కళగమ్.
12. నారాయణ సామి అయ్యర్ ఎట్టుతొగైయిల్ ఒన్రాగియ నట్రినైనానూఱు మూలముం ఉరైయిం. తన ఇందియ శైవ సిద్ధాంత నూర్ పదిప్పుకళగుమ్.
13. నాగరాజన్, ఏ.ఎస్. శ్రీనివాసన్, వి 1986 108 శ్రీ వైష్ణవ దివ్యదేశ వైభవ పురాణ అభిమాన తలంగళ్, పబ్లిషర్, వేంకటరాఘవాచారి.
14. పళనియప్ప పిళ్ళై, టి.పి. 1992 తిరువేంగడ తల పురాణం, తిరుపతి, తి.తి.దే.
15. పెరియ కరుప్పన్, ఇరామ 2.1979 సంగ ఇలక్కియ ఒప్పీడు, మదురై : మీనాక్షి

పుత్తగ నిలయమ్.

16. రాజమాణిక్కనార్, మా. 1st Ed. 1970 పత్తు పాట్టు ఆరాయ్చ్చి ( A critical study in Pattupattu) Madras విశ్వవిద్యాలయం.

17. రాఘవయ్యంగార్, ఆర్ 2nd Ed. 1958. పెరుంపానాట్రుపడై, అణ్ణామలై : పల్గళైకళగ పబ్లికేషన్స్.

18. రాఘవయ్యంగార్ రా. 1958 కురుంతొగై విళక్కం అణ్ణామలై : పల్గలైకళగమ్.

19. రాజగోపాల అయ్యంగార్ టి. 1963 తిరుప్పావై ఉరై, మద్రాసు : భక్తాకార్యాల యము.

20. వయ్యాపురి పిళ్లై 2nd Ed. 1967 సంగ ఇలక్కియం ఇరుప్పగుదిగల్, చెన్నై : పారి నిలయం.

21. వరదరాజన్, ము. 1992, తమిళ ఇలక్కియ వరలారు పుదుఢిల్లీ, సాహిత్య అకాడమి.

22. వరదరాజన్, ము. 1979. పళంతమిళ ఇలక్కియత్తిల్ ఇయర్కై, చెన్నై : పారి నిలయమ్.

23. శాండిల్యన్, 1986 శ్రీ రామానుజర్, చెన్నై : వానదిపదిప్పగమ్.

24. శివబాలన్, ఎస్.కె. 1999. తమిళ ఇశై మరబు vol. 1 చెన్నై ఇశైకుయిల్

25. సంజీవి, న 1973 సంగ ఇలక్కియ ఆరాయ్చ్చి చెన్నై పల్గళైకళగమ్.

26. సామినాథ అయ్యర్, 1949 ఎట్టుతొగైయిల్ ఐంగురునూరు దక్షిణాత్య కలానిధి పబ్లికేషన్స్.

27. సామినాథ అయ్యర్ 1980 పదిట్రుపాట్టు మూలం దాక్షిణాత్య కళానిధి పబ్లికేషన్స్

28. సుబ్బరామన్, 1985, క్షేత్రాడనం భారదం.

29. సుబ్బురెడ్డియార్, 1985 వైణవ ఉరై వళమ్ చెన్నై : వేంగడం పబ్లికేషన్స్

30. సేతు పిళ్ళై, అర్.పి. Ed. 1971, తిరువాయ్మొళి సం. 3, 4, 5, 6, 7, 8, చెన్నై : పురుషోత్తమ నాయుడు.

31. సోమసుందరనార్ Ed. reprint 1960. శిఱుపానాట్రుపడై, మద్రాసు : అప్పర్ అచ్చగమ్.

32. జ్ఞాన సుందరం 1984. పెరియ తిరుమొళి తమిళాక్కం తంజావూరు : తమిళ్ పల్గలై కళగమ్.

# BOOKS IN ENGISH


1. Appanna charya, K. 1984. "Kesava and other forms" Tirupati : T.T.D.
2. Bhatt, G.P. 1990, Padmapurana, Delhi : Motilal Publishers.
3. Balasubramanya, S.R. 1966. Early Chola art part-3. Poona : Asia Publishing House.
4. Chakraborthy, Ramakanta, 1985, Vaisnavism in Bengal, Calcutta : Sanskrit Pusthak Bhandar.
5. Daheja, Vidya, 1988. Slaves of the Lord. the path of the Tamil saints. Delhi : Munshiram Manoharlal publishers.
6. Daheja, Vidya, 1990. Andal and her path of love. Albany : State University, of New York Press.
7. Dutt, M.N. 1978. Visnupuranam. Delhi : Ess Ess Publishers.
8. Amaresh Datta Ed. 1967, Encyclopaedia of Indian Literature vol. I New Delhi : Sahitya Akademy.
9. Gowri Lakshmi, Baji, 1995 Sree Padmanabha Swami temple, Mumbai, Bharatiya Vidya Bhavan.
10. Gonda, J. Reprint 1993. Aspects of early Vaisnavism Delhi : Motilal Banarasi dass.
11. Govinda Rao, B. 1987. Hinduism and other world religions, Tirupati : T.T.D.
12. George, K.M. Oct. 1985. Comparative Indian Literature, Delhi : Sahitya Akademy.
13. Goswamy, A. 1956, Indian temple sculpture art under Calukyas, Pallavas. Govt of India Lalit kala Akademy.
14. Hazra R.C. 1987, Studies in the Puranic records on Hindu rites and customs : Delhi : Motilal Banarasi dass.
15. Kuppuswami, T. 1992, Carnatic Music and the Tamils. Delhi : Kaliya Publishers.
16. Krishnamacharya swami, U.V.T.A. 1991. Sri Vaisnava Sampradaya in Tmilnadu Titupati T.T.D.
17. Karina schomes, McLord, W.W. Ed. 1987. The Sants Delhi : Motilal Banarasi dass.
18. Krishna Kumari, M. 1990 Social cultural life in medieval Andhra. New Delhi, Discovery Publishing House.

19. Krishna, Sarma, 1987 Bhakti and Bhakti movement Delhi : Munshiram Manoharlal Publishers.
20. Kramma risch, stella 1976. The Hindu temple. vol. 1, 2, Delhi : Motial Banarasi dass.
21. Loilson, H.H. 1961. Visnu Purana a system of Hindu mythology tradition, Clacutta : Purti Pustak.
22. Munshi, K.M. Diwakar, R.R. 1966, Alwars of South India. Mumbai Bharatiya Vidya Bhavan.
23. Neela Kanta sastry K.A. 1992. Development of religion in South India, New Delhi, Munshiram Manoharlal Publishers.
24. Prabhat Mukharjee, 1981. The history of medieval Vaisnavism in Orissa. New Delhi : Asian Educational services.
25. Prasada Maheswar, 1989. Some aspects of Varaha Katha in Epics and Puranas, Delhi : Oriental Publishers.
26. Pande, Susmita, 1982. Birth of Bhakti in Indian religions and art New Delhi, Books and Books.
27. Ranga Ramanuja, Iyyengar, 1972. History of South Indian Carnatic Music, Madras : Published by author.
28. Ramaiah, J. 1989, Temples of South India, Delhi : Concept publishing House.
29. Ratnaswamy, S. 1979. The ancient Tamils and their Literature, Cidambaram, : Sri Velan Press.
30. Ramarao, M. 1982, Temples of Tirumala Tirupati and Tirucanur, Tirupati, T.T.D.
31. Ramarao, M. 1977. Select Andhra temples. Hyderabad : The Govt. of A.P.
32. Ramanuja Tata Chariar A. 1985, Eternal Relevance of Vedas. Tirupati : T.T.D.
33. Raghavan, A.S. 1985. Visistadvaita Tirupati : T.T.D.
34. Ramesh, M.S. 1993, 108 Vaishnavite Divyadesam vol. I to VI Tirupati: T.T.D.
35. Remesan N. 1981. The Tirumala Temple Tirupati : T.T.D.
36. Rajagopala Aiyar, T.R. 1982. Purusasukktam, Tirupati : T.T.D.
37. Stein Burton 1978. South Indian temples on analytical reconsideration Delhi : Vikas Publishers.

38. Surya Kumari A. 1988. The temples in Andhra Pradesh, Delhi, Gian Publishing House.

39. Sastri, Rajanda shina, 1963. Origin, development of the ritualssns ancestors worship n India, Calcutta : Calutta oriental publishers.

40. Swami Krishnananda, 1992. Spiritual import of religious festivals, Uttar Pradesh : Divine life Society.

41. Shulman, David Dean, 1980. Tamil temple myths. New Jersey : University Press.

42. Sambamurthy, P. 1959, Dictionary of South Indian Music and Musicians vol. 1, 2, 3 Madras, Indian Publishing.

43. Sitaramaiah, V. 1971, Re. 1981 Purandaradasa, New Delhi : National Book Trust.

44. Venkata Ranga Aiyar, T.C. 1968. Muthuswami Dikshitar, New Delhi, National Book Trust.

45. Williams M. worship in ancient India New Delhi, Sree pubications.

46. Bhavan's Journal, Bombay Bharatiya Vidya Bhavan. 1994, 1995, 1996, 1997, 1996, 1999, 2000, August 15, Dec. 15, March 31, April 30, Aug. 31, May 5.

# THESES

1. Indira devi, N.C. 1981, From Tallapaka composers to Purandaradasa, studies in the music of the period. Delhi : University of Delhi, Faculty of Music and fine Arts.

2. Indira devi, N.C. 1986, Facets of Bhakti as illustrated by Annamacharya and Tyagaraja, Delhi : Faculty of Music fine arts.

3. Mini, N. 1999. The ritualistic music and dance of the temple of Kerala with special reference to the temples praised by Swati Tirunal in his compositions - Delhi : Faculty of music and fine arts.

4. Usha Krishnamurthy, 1995. A comparison of the Music, Lyric, Philosohy of Annamacharya and Purandaradasa, Delhi : Faculty of Music and fine arts.

9. Uma, K.1980 Music in some of the leading temples of Kerala, Tamilnadu. (Dessertation) Delhi : University of Delhi Faculty of music and Fine arts.

Souvenir, Golden Jubilee, 1984, Tirupati : T.T.D.

